# ముస్లిం నియమావళి

## (ఇస్లాం ప్రధాన సూత్రములు)

## ప్రతి ఇంట్లో ఉండవలసిన పుస్తకము



కూర్పు & ప్రచురణ కర్త

**ముహమ్మద్ అక్బర్ అలి**

# Muslim Niyamavali

*Compiled by :* ***Md. Akbar Ali***

First Edition August 2009 to **14th** Edition: June 2015, 37,000
**15th** Edition 180 Pages January 2016 3000 Copies

**PRICE : RS.30=00**

*All rights reserved with the Publisher*

***Donor / Distributors Address***

**Publisher : Md. Akbar Ali,** B.Com.,
Asst. Director (Retd.) Welfare of the Disabled & Senior Citizens Dept.
Flat No.301, Royal Eden Apartment, First Lancer Road, Masab Tank, HYD - 500028.
**Cell , Whatsapp -08801427788, 09959929115.**

***DTP & Printing Supervision :*** **Al- Baseer Grphics,** Hyd.Cell: **9441055065**

**శ్రేయోభిలాషులకు మనవి**

ఈ పుస్తకాన్ని కనీసం 200 కాపీలు లేదా ఆ పైన ఎన్ని కాపీలైనా తమ పేర ముద్రించి దైవమార్గంలో పుణ్యసమర్పణ కొరకు పంచిపెట్టాలని కోరుతున్న శ్రేయోభిలాషులు సంప్రదించగలరు.

**ముహమ్మద్ అక్బర్ అలి**
**Cell : 08801427788**
**Email : akbar.syeda@gmail.com**

# అల్లాహ్

## "సకల లోకాలను సృష్టించిన ఆ సృష్టికర్త పేరు అల్లాహ్'

### ఇది అరబీ పదమా?

వాస్తవానికి మూసా (అ) వారి మాతృభాషయైన హెబ్రూలో కూడా ఆ పేరు "అల్లాహ్'. ఈసా (అ) వారి మాతృభాషయైన అరమాయిక్ భాషలో కూడా ఆ పేరు "అల్లాహ్'. మూడు భాషలలోనూ అల్లాహ్ అనే పదానికి మూలం 3 అక్షరాలు. అరబీ - (అలిఫ్, లామ్, హ) అరమాయిక్ - (అలెఫ్, లామెద్, హే) హెబ్రూ - (అలెఫ్, లామెద్, హే).

పురాతన సెమిటిక్ భాషలలో కూడా సకల లోకాలను సృష్టించిన సృష్టి కర్త పేరు అల్లాహ్. లిపిలో తేడా ఉండవచ్చు గాని పలకడం (ఉఛ్ఛారణ) ఒకటే. "ఆరాధ్యుడు' అనే పదానికి అరబీ, అరమాయిక్, హెబ్రూ భాషల మూడింటిలోనూ ఇలాహ్ అని పిలుస్తారు. అరబీ గ్రామర్ ప్రకారం "అల్ + ఇలాహ్' = "అల్ ఇలాహ్' అవుతుందేగాని, ఆ పదాల కలయిక "అల్లాహ్' అనే పదానికి సమానం కాదు. ఇది ఒక ప్రత్యేక పదం. "అల్లాహ్' అనే పదం అసమాన (Unique) పదం. మరి అల్లాహ్ ఎలా ఉంటారు?

**అల్లాహ్ ఒక్కడు. అల్లాహ్ ఎవరికి తండ్రి కాడు. అల్లాహ్ ఎవరికీ జన్మించనూ లేదు. ఎవరి సహాయం అవసరం లేనివాడు. అల్లాహ్‌ను పోలినదేదీ ఈ విశ్వంలో లేదు.** అల్లాహ్‌ను పోలినదేదీ ఈ విశ్వంలో లేనప్పుడు ఇలా వుంటారని ఊహించడం సాధ్యం కాదు. "దేవుడు' అనే తెలుగు పదానికి దేవుళ్ళు అను బహువచన పదం ఉంది. అల్లాహ్ అనే పదానికి బహువచన పదంగాని, స్త్రీ లింగ పదంగాని లేదు. గాలి, నీరు, నింగి (ఆకాశం), నేల, వేడి, వెలుగు నిచ్చు సూర్యుడు అందరికీ ఒకటే. వీటిని సృష్టించిన సృష్టి కర్త కూడా ఒక్కడే! సర్వాన్ని సృష్టించిన వానికి పేరు మార్చుకోవలసిన అవసరం ఎంత మాత్రం లేదు. సృష్టి మొదలు నుండి అంతం వరకు స్వర్గంలోనూ ఒకటే పేరు. ఆ పేరే "అల్లాహ్'. అల్లాహ్ ఆరాధ్యుడు.

# నా మాట

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

కరుణామయుడు దయార్ధహృదయుడగు అల్లాహ్ స్తోత్రముతో

నా ప్రియ పాఠకులారా మీరు కొన్ని అనివార్య కారణాంతరాలవల్ల, ఉర్దూ భాష చదువుట, వ్రాయుట నేర్చుకోలేక తదనంతరము ఇస్లాం ముఖ్య సూత్రములు, అల్లాహ్, రసూల్ ఆజ్ఞలు తెలుసుకొనే అవకాశము లేక ఈమాన్, నమాజ్, రోజా, జకాత్, హజ్, ఆఖిరత్, జన్నత్, దోజఖ్, షరియత్ ఆదేశాలు అంటే ఏమిటో తెలియని వారున్నారు.

కావున నేను తెలుగు భాషలో ప్రచురించిన ఈ పుస్తకము ద్వారా తెలిపిన ఇస్లాం సిద్ధాంతములను తమ నిత్య జీవితములో ఇముడ్చుకొని ఇహపరలోక సోపానాలు అల్లాహ్ దయతో పొందుదురుగాక! మీరు అర్థం చేసుకొని ఆచరించుటలో ఏ విధమైన సందేహములు కలిగినా వెంటనే మన మత గురువులైన మౌల్వీల వద్దకు వెళ్ళి మీ సందేహాలు తీర్చుకోండి. ఈ పుస్తకమును **విశ్వ సృష్టికర్త అయిన అల్లాహ్‌కు అంకితము చేయబడింది.**

1) మా ప్రభూ! మేము చేసిన ఈ కృషిని స్వీకరించు, నిస్సందేహంగా నీవు అన్నీ వినేవాడవు. సర్వం తెలిసినవాడవు (ది.ఖు. 2:127).

2) ఓ ప్రభూ! నాకు మరింత జ్ఞానాన్ని ప్రసాదించు (ది.ఖు. 20:114)

3) దైవ ప్రవక్తలు ప్రతి జాతిలోను, ప్రతి ప్రాంతంలోను జన్మించారని, ఆయా జాతుల ప్రాంతాల ప్రజలు సులభంగా, స్పష్టంగా అర్థం చేసుకునేందుకు గాను వారు మాట్లాడు భాషలోనే దైవ సందేశాన్ని అందజేసే వారని, అన్ని భాషలను అల్లాహ్‌యే మన సౌలభ్యం కొరకు సృష్టించారని దివ్య ఖుర్ఆన్‌లో పేర్కొనబడింది (ది.ఖు. 14:4).

4) ప్రవక్తల పితామహుడు ఇబ్రాహీమ్ ఖలీలుల్లా (అ.స.) మరియు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅస) గారి జీవిత చరిత్రలో కొన్ని ముఖ్య సంఘటనలు చేర్చడమైనది.

ఈ పుస్తకం ముద్రణ సమయంలో హాఫిజ్ ఎస్.ఎమ్. రసూల్ షర్ఫీ గారు, అల్‌హాజ్ జనాబ్ ముహమ్మద్ నిజాం మొహియుద్దీన్ గారు ప్రయోజనకరంగా తీర్చి దిద్దటంలో ఈ పుస్తకాన్ని అధ్యయనం చేసి తగు సూచనలిచ్చి నాకు తోడ్పడినందులకు నిండుహృదయంతో కృతజ్ఞతలు తెలియజేయుచున్నాను. "ఖుర్ఆన్ - హదీసుల" వెలుగులో సంకలనం చేసి ప్రచురించుటమైనది. **ఈ పుస్తకంపై మీ అభిప్రాయాలను ఉత్తరాల ద్వారానే ఆహ్వానిస్తున్నాను.**

**- ముహమ్మద్ అక్బర్ అలి**

# విషయ సూచిక


**1. ఇస్లాం, ముస్లిం - ఈమాన్ పునాదులు** 9

తౌహీద్ (ఏకదైవారాధనా) భావం-9, ఈమాన్ ముజ్‌మల్-11, ఈమాన్ ముఫస్సల్-11, ముస్లిం ఆరు విశ్వాసాలు-12, ముస్లిం విశ్వాస ప్రమాణములు -కల్మాలు-15,

**2. అల్లాహ్‌యే సృష్టికర్త, ఆరాధ్య దైవము** 18

విశ్వసృష్టిలో అల్లాహ్ అద్భుత నియమావళి-19, అనేక దేవుళ్ళను పూజించుట షిర్క్-21.

**3. పరిశుభ్రత** 22

తహారత్-22, వుజూ-23, గుసుల్ (స్నానము)-25, తయమ్ముమ్-26,

**4. నమాజ్ - ఆరాధన (సలాత్) ఇస్లాం 2వ విధి** 28

అజాన్ (ప్రార్ధన పిలుపు)-28, ఇఖామత్-30, నమాజ్ వేళలు-31, నమాజ్ చదవకూడని వేళలు-31, ఐదు పూటల నమాజ్‌లోని రకాతులు-32, రకాతుల నిర్వచనము-32, నమాజ్ యొక్క ప్రాముఖ్యత-34, నమాజ్‌లో ఆచరించు కొన్ని నియమాలు-36, నమాజ్ చేయు పద్ధతి -37, సజ్దాసహు-41, సజ్దా సహు చేయు విధానము-42, జమాత్ నమాజ్ (సామూహిక ప్రార్ధన) చేయు విధానము-42, నమాజ్‌లో స్త్రీలు గమనించ వలసిన విషయములు-43, నమాజ్ ముసాఫిర్ (ఖస్ర్) ప్రయాణీకుని నమాజ్ -43, నమాజె ఖస్ర్ రకాతుల నిబంధనలు-44

**5. నమాజ్‌లో చదువవలసిన సూరాలు, తస్బీహ్‌లు, దుఆలు** **45**

సూరాలు-45, అత్తహియ్యాత్- 53, దరూదె ఇబ్రాహీం-54, నమాజులో పఠించు దుఆ-55, వితర్ నమాజులో చదవవలసిన దుఆ ఏ ఖునూత్-55, ఆయతుల్ కుర్సి-56, దరూదె షరీఫ్-57, నమాజ్ తర్వాత జపించు కొన్ని తస్బీహ్‌లు, దుఆలు-58,

**6. జుమేకి నమాజ్ (జుమా ప్రార్ధన) శుక్రవారం శుభఘడియ** **61-63**
**జుమా ప్రార్ధనలలో- ఈద్ ప్రార్ధనలలో తేడా**

7. **పండుగ నమాజ్‌లు** 64

ఈదుల్ ఫిత్ర్‌కి నమాజ్ (రమ్‌జాన్ పండుగ నమాజ్)- 64, ఈదుల్ అజ్‌హా నమాజ్ (బక్రీద్ పండుగ నమాజ్) -65, ఖుర్బానీ ప్రాముఖ్యత చేయు విధానము, దుఆలు-66

8. **జకాత్ (ధర్మము) - ఇస్లాం మూడవ విధి** 69-70

9. **రోజా -ఇస్లాం నాల్గవ విధి (రమ్‌జాన్ నెల ఉపవాసములు)** 71-74

10. **హజ్ ఐదవ విధి** 75-79

మక్కా యాత్ర, బలిదానం, కాబా నిర్మాణం -75

11. **కొన్ని ప్రత్యేక నఫిల్ నమాజ్‌లు** 80-86

12. **జనాజా - అంత్యక్రియలు** 87-91

అంత్యక్రియలలో పాటించవలసిన నియమాలు-87, నమాజె జనాజా మరియు దుఆలు-88, దఫన్ కర్నేకా తరీఖా (సమాధి చేయు విధానము)- 90, పుణ్య సమర్పణ (ఈసాలె సవాబ్)- 90, సవాలె మున్‌కిర్, నకీర్-91

13. **హలాల్ - హరామ్, జిబహ్ చేయు పద్ధతి** 92

14. **షరీయత్ ఆదేశాలు మరియు సిద్ధాంతాలు** 93-110

15. **ముస్లిములు ఆచరించవలసిన కొన్ని నియమాలు** 111

16. **చారిత్రక విషయములు** 113-117

అఖీఖా-113, నూరానీ రాతె (పవిత్ర రాత్రులు)- 115, పవిత్ర నామములు - వాటిని ఉద్దేశించు విధము-116

17. **దివ్య ఖుర్‌ఆన్** 118

18. **ప్రవక్తల పితామహుడు ఇబ్రాహీమ్ ఖలీలుల్లాహ్ (అ.స.) జీవిత చరిత్ర** 121

19. **అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స.అ.స) చరిత్ర మరియు జీవితములోని కొన్ని ముఖ్య సంఘటనలు** 134

# వుజూ చేయు విధానము







1) చేతులు మణికట్లు వరకు 3 సార్లు కడుగవలెను.
2) వేళ్ళ మధ్యలో వేళ్ళు వేసి శుభ్రపరచవలెను.
3) చేతిలో నీళ్ళు తీసుకొని 3 సార్లు పుక్కిలించాలి
4) 3 సార్లు ముక్కులోనికి నీరు పీల్చుకొని శుభ్రపరుచవలెను.
5) ఎడమ చేతితో ముక్కును చీదవలయును.
6) 3 సార్లు ముఖము కడుగవలెను.
7) గడ్డపు వెంఢ్రుకలలోనికి నీటిని పోనిచ్చి కడగాలి.
8) కుడిచేతిని మోచేయితో సహా 3 సార్లు కడుగవలెను.
9) తల మసహ్ (నిమురుట) తడి చేతులతో చేయాలి.
10) రెండు చేతులను తల ముందు భాగం నుంచి ప్రారంభించి తల వెంట్రుకల అంతం వరకు శుభ్రం చేయాలి.
11) చేతులు తిప్పి మెడ వెనుక భాగంపై రుద్దాలి.
12) చూపుడు వేళ్ళతో చెవుల లోపలి భాగాలను, బొటనవేలితో వెలుపలి భాగాలను మసహ్ చేయాలి.
13) కుడి పాదమును, తర్వాత ఎడమ పాదమును చీల మండలతో సహా 3 సార్లు కడుగవలెను.

# నమాజ్ చేయు పద్ధతి




1) అల్లాహు అక్బర్ అంటూ రెండు చేతులను చెవుల వరకు ఎత్తాలి.
2) ఎడమ చేతిపై కుడి చెయ్యివేసి బొడ్డు క్రింద ఉంచి రకాతు కట్టాలి.
3) సమాంతరంగా వంగి చేతులను మోకాళ్ళపై ఉంచాలి.
4) నిటారుగా నిలుచుని ఖౌమా చేయాలి.
5) రెండు చేతులు, ముక్కు, నుదుటిని నేలపై ఆనించి సజ్దా చేయాలి.
6) కుడిచేయి కుడి తొడపై , ఎడమ చేయి ఎడమ తొడపై పెట్టి జల్సా చేయాలి.
7) కుడిచేయి కుడి తొడపై , ఎడమ చేయి ఎడమ తొడపై పెట్టి ఖియాం చేయాలి.
8) అత్తహియ్యాత్ లా ఇలా ఇల్లాహ్ చదువుతున్నప్పుడు చూపుడు వేలిని పైకెత్తాలి.

# స్త్రీల నమాజ్




1) రెండు పాదాలను దగ్గరగా ఉంచి ఖిబ్లా వైపునకు తిరిగి నిలబడవలెను.
2) చేతులను భుజాల వరకు ఎత్తి అరచేయి ఖిబ్లా వైపుకు, బొటన వేలు భుజము వరుసలో ఉంచవలెను.
3) చేతులను భుజాల వరకు ఎత్తి అల్లాహు అక్బర్ అంటూ చేతులను వక్షస్థలం మీద కట్టుకోవలెను
4) సమాంతరంగా వంగి చేతి వేళ్ళను దగ్గరగా చేసి మోకాళ్ళపై ఉంచాలి.
5) రుకూలో నుంచి లేచి నిలబడవలెను.
6) రెండు చేతుల మధ్య నుదుటిని నేలపై ఆనించి సజ్దా చేయాలి.
7) కుడిచేయి కుడి తొడపై , ఎడమ చేయి ఎడమ తొడపై పెట్టి జల్సా చేయాలి.
8) బొమ్మలో చూపినట్లుగా కుడిపాదం ఎడమపాదం ఉంచి పిరుదులపై కూర్చోవలెను.

## 1వ అధ్యాయము

# ఇస్లాం , ముస్లిం - ఈమాన్ పునాదులు

సర్వలోకాల సృష్టికర్త, సకల రక్షకుడు, పోషకుడయిన అల్లాహ్ యొక్క ఆజ్ఞలు, పవిత్ర గ్రంథం ఖుర్ఆన్ ద్వారా ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ప్రజలకు చూపిన సన్మార్గము, వారు బోధించిన హితోపదేశాలే ఇస్లాం. ఇస్లాం సిద్ధాంతాలను హృదయపూర్వకంగా విశ్వసించి, అమలు చేసిన ప్రతి మానవుడు ముస్లిం. ఖుర్ఆన్‌కు పూర్వం కూడా అల్లాహ్ మిమ్మల్ని ముస్లిములుగా నామకరణం చేశాడు. మరి ఖుర్ఆన్‌లో కూడా మీ పేరు ముస్లిమే. (ది.ఖు.22:78) ఈ సందేశం ఈ సన్మార్గం ఏ ఒక్క తెగకి, జాతికి మాత్రమే చెందినవి కావు. ఇది సర్వమానవులు ఆచరించవలసిన శుభసందేశం. మానవులను అల్లాహ్ ఒకే స్త్రీపురుష జంట నుండి పుట్టించాడు. అల్లాహ్(సు.తా) యొక్క ఆదేశములతో ఉనికిలోకి వచ్చిన ఆదిమానవుడు ఆదం(అ.స) మరియు హవ్వా(అ.స) సంతానమే ఈ మానవజాతి. తరువాత వారి పరస్పర పరిచయం కోసం, వారిని విభిన్న జాతులుగా, తెగలుగా చేశారు. కుల, గోత్రాలకు మతములతో ఏమీ సంబంధంలేదు. మానవుడు దీని సారాంశాన్ని గుర్తించి, స్వేచ్ఛగా, సహృద యంతో వీటి సూత్రాలను, విధులను యదార్థమని విశ్వసించుటయే ఈమాన్. భయభక్తులు గలవారే అల్లాహ్ దృష్టిలో గౌరవనీయులు. (దివ్యఖుర్ఆన్ 49:13)

## తౌహీద్ (ఏక దైవారాధనా) భావం

దేవుడు ఒక్కడే... అయనే(అల్లాహ్(సు.తా)) విశ్వప్రభువు.... సృష్టికర్త..... సర్వలోక పరిపోషకుడు........ ఆయనే ఆరాధనలకు అసలైన అర్హుడు.... అనే విషయాల మీద తిరుగులేని విశ్వాసాన్ని కలిగివుండటమే తౌహీద్.

> **"మీ ఆరాధనలకు అర్హుడైన దేవుడు ఒక్కడే. ఆయన (అల్లాహ్ (సు.తా)) తప్ప ఆరాధనకు అర్హుడైన వాడు మరొకడు లేడు. ఆయన అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు." (దివ్యఖుర్ఆన్ 2 : 163)**

### తౌహీద్ మూడు రకాలు

'దేవుడు ఒక్కడే' అనే మాటలో మూడు అర్థాలు ఇమిడి ఉన్నాయి:

1) **తౌహీదె రుబూబియ్యత్:-** అనగా విశ్వమంతటికీ ప్రభువు ఒక్కడేననీ, సర్వాన్ని సృష్టించినవాడు, దాని అధిపతి, సర్వవ్యవహారాలను నడిపించేవాడు మరియు పోషకుడు కేవలం ఆయన మాత్రమేనని విశ్వసించటం. (ది.ఖు.7:54) బహుదైవా రాధకులు కూడాఈ విషయాన్ని నమ్ముతారు. కాని వారు ఆ ఏకైక ప్రభువుతో పాటు మరికొందరు దేవుళ్లను కూడా నిలబెడ్తారు. ఇది ధర్మ విరుద్ధం.

2) **తౌహీదె ఉలూహియ్యత్:-** అనగా అన్ని రకాల ఆరాధనలకు అర్హుడు కేవలం అల్లాహ్ మాత్రమే. ఆయన మీద ప్రీతితోగాని లేక ఆయన పట్ల భీతితోగాని చేసే ప్రతి పనీ ఒక ఆరాధనగానే పరిగణించబడుతుంది. కనుక దేవుడు ఒక్కడే నని విశ్వసించే వారందరూ తమ ఆరాధనలన్నింటిని కేవలం అల్లాహ్ కోసం మాత్రమే ప్రత్యేకించుకోవాలి. (ది.ఖు. 4 : 36)

3. **తౌహీదె అస్మా వస్సిఫాత్:-** అనగా నామాలు మరియు గుణ విశేషాల విషయంలో దేవుని ఏకత్వం. ఖుర్ఆన్, హదీసుల్లో వివరించబడిన అల్లాహ్ పేర్లను, గుణవిశేషాలను ఎలాంటి మార్పులు, చేర్పులు లేకుండా విశ్వసించాలి. అల్లాహ్‌ను తప్ప మరెవరినీ ఈ గుణవిశేషాలతో సంబోధించ రాదు. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త వివరించిన పేర్లు మరియు గుణవిశేషాలతో తప్ప మరి వేటితోనూ అల్లాహ్‌ను సంబోధించరాదు.

అల్లాహ్ తన ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ద్వారా తన దివ్యగ్రంథము ఖుర్ఆన్‌లో ఈ క్రింది ఉదహరించిన 5 విధులు ప్రతి ముస్లింను ఆచరించ వలసిందిగా ఆజ్ఞాపించెను. వీటిని 'అహ్‌కామె ఇలాహీ' అంటారు.

1. ఈమాన్ (విశ్వాసము) 2. నమాజ్ 3. రోజా 4. జకాత్ 5. హజ్.

మన దేశంలో మారుమూల పల్లెలలో నివసించు ముస్లిములు, పవిత్ర మక్కా, మదీనాలో పూర్వ ఆచారపరాయణులు, ఇంగ్లాండ్, అమెరికా, జర్మనీ, రష్యా, చైనా మొదలగు పాశ్చాత్య దేశాలలో నవ నాగరికతలో మునిగితేలుతున్న ప్రపంచ ముస్లింలు అందరూ ఒకటే. అందరికీ ఒకే అఖాయిద్, ఒకే ఈమాన్, ఒక్కడే అల్లాహ్, ఒక్కడే రసూల్, ఒకటే ఆఖరి పవిత్ర గ్రంథము 'ఖుర్ఆన్', ఒకే యాత్రా స్థలము మక్కా, ఒకే ఖిబ్లా, ఒకే కాబా. అందరి ప్రార్థనలు అరబ్బీలోనే. చక్కటి ప్రవర్తన, క్రమశిక్షణకు అలవడిన అందరికీ నమాజ్, రకాతులు, నమాజ్ వేళలు ఒకటే. జకాత్, రోజా, హజ్ విధులు, నిబంధనలు, ఆచరణ, ఆరాధన

అందరికీ ఒకటే. అందరి ప్రార్థనలు సిరాతల్ ముస్తఖీమ్ కొరకే. అనగా ఓ అల్లాహ్ మా అందరిని సరియైన బాట మీద నడుపు "సత్ప్రర్తన, సన్మార్గం వైపు తీసుకుపో. చెడు మార్గము నుండి రక్షించు" ఇదే అందరి ప్రార్థన.

# 1. ఈమానె ముజ్మల్

**ఆమంతు బిల్లాహి, కమా హువ,**

**బి అస్మాఇహీ, వసిఫాతిహీ వ ఖబిల్‌తు,**

**జమీఅ అహ్కామిహీ**

**ఇఖ్‌రారుం బిల్లిసాని, తస్‌దీఖుం బిల్ ఖల్బి.**

**ఉర్దూ తర్జుమా:** మై ఈమాన్‌లాయా అల్లాహ్‌పర్, జైసాకె, వొ అప్నే నామో ఔర్ అప్నే సిఫా అతోఁ కె సాథ్‌హై. ఔర్ మైనె ఉస్కే సబ్ అహ్కాంకు ఖుబూల్‌కియా. జబాన్‌సె ఇఖ్‌రార్‌హై ఔర్ దిల్‌సె యఖీన్‌హై.

**తెలుగు అనువాదం:** నేను అల్లాహ్‌ను విశ్వసించినాను. ఏ విధంగానయితే అల్లాహ్ తన పేరు మరియు గుణగణములతో ఉన్నాడో మరియు నేను అల్లాహ్ యొక్క సమస్త ఆజ్ఞలను స్వీకరించినాను. మనస్ఫూర్తిగా ఆమోదిస్తున్నాను. హృదయ పూర్వకంగా విశ్వసించుచున్నాను.

## 2. ఈమానె ముఫస్సల్

ముస్లిం తప్పనిసరిగా ఈ ఆరు విషయాలను విశ్వసించాలి. అదే ఈమానె ముఫస్సల్

**అమంతు బిల్లాహి, వ మలాఇకతిహీ,**

**వ కుతుబిహీ వ రుసులిహీ**

**వల్ యౌమిల్ ఆఖిరి, వల్ ఖద్రిఖైరిహీ**

**వ షర్రిహీ, మినల్లాహి, తఆలా,**

**వల్‌బఅసి బఅదల్ మౌత్.**

ఉర్దూ తర్జుమా: ఈమాన్ లాయా మై అల్లాహ్ పర్ ఔర్ వుస్కే ఫరిస్తోంపర్, ఔర్ వుస్కే కితాబోఁపర్, ఔర్ వుస్కే రసూలోపర్, ఔర్ ఖయామత్ కె దిన్‌పర్, కె, అచ్ఛా ఔర్‌బురా తఖ్‌దీర్ అల్లాహ్‌కె తరఫ్ సె హోతీహై, ఔర్ మౌత్ కె బాద్ ఫిర్ ఉఠాయా జానేపర్.

తెలుగు: అల్లాహ్‌ను, అల్లాహ్ యొక్క దూతలను, అల్లాహ్‌చే పంపబడ్డ పవిత్ర గ్రంథాలను, అల్లాహ్ యొక్క పవిత్ర ప్రవక్తలను, ప్రళయ దినమును,

దాని తీర్పును, అల్లాహ్ ద్వారా జరిగే ప్రతీ చెడు, మంచి కార్యము 'తఖ్‌దీర్' అనగా విధిపైన మరియు చనిపోయిన తర్వాత మరల పరలోకంలో బ్రతికించబడునున్న విషయాలను విశ్వసించితిని.

## ముస్లిం ఆరు విశ్వాసాలు

**1. అల్లాహ్‌ను విశ్వసించుట**

దేవుడు ఉన్నాడన్న సంగతి అందరికి తెలుసు. ఈ విషయం బాహాటంగా ప్రతి ముస్లిం విశ్వసించాలి. మరియు అల్లాహ్ ఒక్కడే. అతనికి మరెవ్వరూ సాటిలేరు. అల్లాహ్ తప్ప మరెవ్వరూ ఆరాధనకు అర్హులు కారు. దైవత్వంలో అల్లాహ్‌తోపాటు మరెవ్వరినీ భాగస్వాములుగా ఆమోదించరాదు. అల్లాహ్ సర్వశక్తిమంతుడు, అతీతుడు, శాశ్వితుడు, సర్వలోకాల సృష్టికర్త, రక్షకుడు, సకల జీవరాసుల పోషకుడు, ఆయనను పోలినది ఏదీ లేదు. (దివ్యఖుర్‌ఆన్ 42 : 11)

**2. దైవదూతల (అనగా ఫరిష్తాల)ను విశ్వసించుట**

వీరు అల్లాహ్ యొక్క ఆజ్ఞలను పాటించుటకు అల్లాహ్‌చే నియమించబడ్డవారు. వీరు మానవులు కారు, మానవ శరీరము లేదు, వీరికి మానవుల వలె కోరికలు, అవసరములుండవు. వీరు మానవుల కంటికి కనబడని వెలుగు (నూర్)తో అల్లాహ్‌చే సృష్టించబడినారు. అల్లాహ్‌నే ఆరాధిస్తూ, స్మరిస్తూ ఆజ్ఞలను నెరవేర్చుచుందురు. వారికి అనేక రెక్కలుంటాయని ఆ రెక్కల సంఖ్య వేరు వేరుగా వుంటాయి. వారిలో ముఖ్యులు.

**(1). హజ్రత్ జిబ్రయీల్ (అ.స.):** సందేశ దూత. అల్లాహ్ వద్ద నుండి ప్రవక్తలకు 'వహీ' దైవ సందేశం తెచ్చువారు. కొన్ని సమయములందు అల్లాహ్ ఆజ్ఞతో ప్రవక్తల విజయానికి, శత్రువులను శిక్షించటానికి నియమించబడినారు. వహీ పరంపర ఆపివేయబడినందువలన ఇప్పుడు కేవలం సంవత్సరంలో ఒక్కసారి మాత్రం భూ మండలంపై షబ్రెఖద్ర్ రాత్రి అల్లాహ్ ఆదేశంతో ప్రతి వ్యవహారానికి సంబంధించిన ఆ సంవత్సరపు శాసనాలను తీసుకొని వచ్చిఉదయం వరకు దైవదూతలతో శాంతిని నిర్దేశిస్తూ ఉంటారు. (దివ్యఖుర్‌ఆన్ 97)

**(2). హజ్రత్ మీకాయిల్ (అ.స):** వర్షదూత. అల్లాహ్ కృపవల్ల వర్షం కురిపించి యావత్ ప్రపంచమునకు సకల సంపదలు, జీవనోపాధి కలుగజేయుదురు. అల్లాహ్ ఆజ్ఞతో ఈయన పర్యవేక్షణలో అనేక మంది దూతలు నదులు, తటాకాలను నీటితో నింపుటకు మరియు మబ్బులను నియం

త్రించుటకు నియమింపబడినారు.

**(3). హజ్రత్ ఇజ్రాయీల్ (అ.స.):** మృత్యుదూత. అల్లాహ్ ఆజ్ఞ ప్రకారం పాపుల ప్రాణము కఠినంగాను, సజ్జనుల ప్రాణము సులభంగాను తీయువారు.

**(4). హజ్రత్ కిరామన్ కాతిబీన్ :** వీరిద్దరూ ఫరిష్తాలు. మానవుడు చేయు మంచి, చెడు కార్యములు వ్రాయుటకై వీరు నియమింపబడినవారు. వీరిద్దరు జంట దూతలు. ఫజ్ర్ మరియు అసర్ వేళల్లో మారుతూ ఉంటారు. మనిషి ఫజ్ర్ మరియు అసర్ నమాజులు చేశారో లేదో అల్లాహ్‌కు తెలియజేస్తారు. మరియు వీరు మనకు భద్రతను కలిగిస్తారు. అయితే మనం వీరి సహాయత పొందుటకు ఎల్లప్పుడూ వజూ కలిగి ఉండాలి.

**(5). హజ్రత్ మున్‌కిర్ & నకీర్:** ఈ ఫరిష్తాలు మనలను సమాధి చేసిన తదుపరి ప్రశ్నించుటకు నియమించబడినారు

ఖియామత్‌నాడు వీరిచే అల్లాహ్ ఎదుట మన యవ్వనము, ధనార్జన, వినియోగముల గురించి ఈ క్రింది విధంగా ప్రశ్నింపబడుదుము.

ఎ) నీ యవ్వనము ఎట్లు గడిపితివి (బి) నీవు నీ ధనమును ఎట్లు సంపాదించితివి (సి) నీవు నీ ధనమును ఎట్లు ఖర్చుచేసితివి.

**(6). హజ్రత్ ఇస్రాఫీల్ (అ.స) :** శంఖం ఊదు దూత. అంతిమ దినమునాడు అల్లాహ్ ఆజ్ఞచే వీరు శంఖము ఊదుదురు. లోకములు తల్లడిల్లును, ప్రళయము సంభవించును, ప్రపంచం అంతమొందును. (ది.ఖు. 69 : 13-16)

వీరు మరలా రెండవసారి శంఖము ఊదుదురు. ఆదిమానవులు మొదలు కలియుగాంతము వరకు మరణించిన జనులందరూ అల్లాహ్ కృపచే మరలా బ్రతికింపబడుదురు. అప్పుడు అల్లాహ్ ఎదుట మరియొక ప్రపంచము ఉద్భవించబడును. అక్కడ వారు, భూలోకములో తాము చేసిన పనులకు లెక్కచెప్పుకొని కర్మఫలములు అనుభవింతురు. అల్లాహ్ కృపవల్ల సజ్జనులు స్వర్గానికి, దుర్మార్గులు నరకానికి పంపబడి అక్కడ వారు శాశ్వతంగా ఉందురు.

**(7). హజ్రత్ మాలిక్** : నరకలోకపు ద్వారపాలకులు; **రిజ్వాన్** : స్వర్గలోకపు ద్వారపాల కులుగా నియమించబడినారు.

**(8). హజ్రత్ హారూత్ మారూత్** : మానవాకారంలో బాబిలోనియ నగరంలో ప్రజలను పరిరక్షించడానికి పంపబడ్డవారు. (ఖుర్‌ఆన్ 2 : 102-103)

### 3. దైవగ్రంథాలను విశ్వసించుట

అల్లాహ్ వాక్కు 'వహీ' అనగా దైవసందేశం ద్వారా వెల్లడైన పవిత్ర ఖుర్ఆన్నూ, అల్లాహ్‌చే పంపబడ్డ ఇతర పవిత్ర గ్రంథములన్నిటినీ విశ్వసించవలెను. అనగా సయీుఫాలు- ఇబ్రాహీం (అ.స.), తౌరాత్-మూసా (అ.స.), జబూర్- దావూద్ (అ.స.); ఇన్జీల్ (బైబిలు)-ఈసా (అ.స.).

అనగా మీరు ఇలా ప్రకటించండి మేము అల్లాహ్‌ను విశ్వసించాము. మాపై అవతరింపజేయబడిన దానినీ, ఇబ్రహీం, ఇస్మాయీల్, ఇస్హాఖ్, యాఖూబ్ మరియు వారి సంతతిపై అవతరింపజేయబడిన దానినీ, మూసా, దావూద్ ఈసా ప్రవక్తలకు వారి ప్రభువు తరపున ఒసగబడిన దానిని కూడా మేము విశ్వసించాము. మేము వారిలో ఎవరి మధ్య కూడా ఎలాంటి వివక్ష (విచ క్షణ)ను పాటించము. మేము అల్లాహ్‌కే విధేయులము.* (ది.ఖు.2.136)

✦ ఈమాన్ అంటే - ప్రవక్తలందరిపై అల్లాహ్ తరపున అవతరింప జేయబడిన దానినీ లేక వారికి ఒసగబడిన దానినీ విశ్వసించాలి. ఏ ఒక్క దైవప్రవక్తను గానీ, దైవగ్రంథాన్ని గానీ తిరస్కరించకూడదు. ఏదో ఒక గ్రంథాన్నీ, ఎవరో ఒక ప్రవక్తను విశ్వసించటం, మిగిలిన గ్రంథాలను లేక ప్రవక్తలను విశ్వసించ నిరాకరించటం అంటే ప్రవక్తల మధ్య భేదాన్ని పాటించటమే. ఈ భేద భావాన్ని ఇస్లాం సమ్మతించదు. కాకపోతే ఇప్పుడు విశ్వసించి,ఆచరించవలసినది ఖుర్ఆన్ ప్రకారమే. వెనుకటి గ్రంథాలలో వున్న విషయాలను అవలంబించ కూడదు. ఎందుకంటే ఇప్పుడవి అసలు సిసలు స్థితిలో లేవు. అవి మార్పులు చేర్పులకు లోనయ్యాయి. దివ్య ఖుర్ఆన్ అవతరించిన తరువాత వాటిలోని (పురాతన గ్రంథాలలోని) ఆదేశాలు, ఉపదేశాలన్నీ వాటంతటవే రద్దయిపోయినవి

### 4. దైవప్రవక్తలను విశ్వసించుట

ఆదం (అ.స) మొదలు కడపటి ప్రవక్త ముహమ్మద్ (సఅస.) వరకు అల్లాహ్‌చే పంపబడ్డ 1,24,000 ప్రవక్తలందరినీ విశ్వసించవలెను.

### 5. ప్రళయదినం (ఖియామత్), పరలోకం / తీర్పుదినమును విశ్వసించుట

ఈ ప్రపంచం ఒక రోజున అంతమగునని, తర్వాత పరలోకంలో మరో ప్రపంచం అల్లాహ్ ద్వారా ఉనికిలోనికి వస్తుందని, అప్పుడు అది మానవులు మొదలు అంత్య మానవుల వరకు చనిపోయిన వారందరూ మరల బ్రతికింపబడుతారని, వారందరూ అక్కడ హాజరై తమ జీవితాలలో విశ్వసించిన సిద్ధాంతాలు, అవలంబించిన ధర్మములు, చేసిన పనులకు

అల్లాహ్ ఎదుట సంజాయిషీ ఇచ్చుకోవలసి ఉంటుందనియు, భూలోకంలో వారు చేసిన మంచి చెడు కార్యములకు వారు అక్కడ తమ ప్రతిఫలం అనుభవింతురని విశ్వసించవలెను. విశ్వాసులుగా, సజ్జనులుగా నిర్ణయింప బడిన వారు స్వర్గానికి, అవిశ్వాసులు, పాపులుగా ఎంచబడిన వారు నరకానికి పంపబడి వారు అక్కడ శాశ్వతంగా ఉంటారని దృఢంగా విశ్వసించవలెను.

## 6. విధి (తఖ్దీర్) వ్రాతపై విశ్వాసం

అనంతకాలం వరకూ జరగబోయే విషయాలన్నింటిని అల్లాహ్ ముందు గానే రాసిపెట్టాడు. దాని గురించిన జ్ఞానం అల్లాహ్‌కు తప్ప మరెవరికీ లేదు. ఏది జరిగినా ఆయన వ్రాసి ఉంచిన జ్ఞానానికనుగుణంగానే జరుగుతుంది. దీనినే "తఖ్దీర్" లేక ఖదర్ (విధివ్రాత) అని అంటారు. ఆ విధివ్రాతకనుగుణం గానే మానవులకు మంచీ చెడులు జరుగుతుంటాయి. ఉదాహరణకు ఆనంద ఐశ్వర్యాలు, సిరిసంపదలు కలగటం, పంటల్లో అధిక దిగుబడులు రావటం లాంటి వాటిని విధివ్రాత వల్ల కలిగిన మేళ్లుగానూ, దీనికి విరుద్ధంగా జరిగితే విధివ్రాత వల్ల కలిగిన నష్టాలు గానూ ప్రజలు భావిస్తారు. అయితే ఈ మేలు లేక కీడు అనేది మన వ్యవహారికమేగాని అల్లాహ్ ఏది చేసినా అందులో దైవలీల, వివేచనాలు దాగి ఉంటాయి. ప్రపంచంలో ప్రతి మానవుని ప్రతి కదలిక, ఆఖరికి చెట్టు నుంచి ఒక ఆకు రాలటం కూడా దైవనిర్ణయం (ఖదర్) ప్రకారమే జరుగు తుంది. ఈ కనీవిని ఎరుగని దైవిక జ్ఞానమును, ఖుర్‌ఆన్‌లో ఉదాహరించిన విషయములన్నీ యదార్థమని విశ్వసించవలెను. ఈ విధి రాత ప్రకారమే మంచి, చెడులు జరుగుతాయి. అయితే తెలుసుకోవలసిన విషయం ఏమంటే అల్లాహ్ మానవులకు మంచి చెడుల మధ్య విచక్షణా జ్ఞానాన్ని సన్మార్గ, దుర్మార్గములలో దేన్నయినా ఎంచు కొని ఆచరించే ఎంపిక అధికారాన్ని ఇచ్చాడు. దాని ప్రకారమే పరలోకంలో మానవుల లెక్క తీసుకుంటాడు. మన ఈ చెడు నిర్ణయాలకి మనమే బాధ్యులమని గమనించాలి.

## ముస్లిం విశ్వాస ప్రమాణాలు - కల్మా

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం

### 1. అవ్వల్ కలిమా తయ్యిబ్

**'లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్ రసూలుల్లాహ్' (స.అ.స)**

తర్జుమా: అల్లాహ్ కే సివాయ్ కోయి ఇబాదత్‌కే లాఇఖ్ నహీ ముహమ్మద్ (సఅసం) అల్లాహ్‌కే రసూల్ హై.

తెలుగు: అల్లాహ్ తప్ప మరెవ్వరూ ఆరాధనకు అర్హులు కారు, ముహమ్మద్ (సఅస) అల్లాహ్ యొక్క ప్రవక్త.

**2. దువ్వం కలిమా షహాదత్**

**'అష్హదు అన్-లా-ఇలాహ, ఇల్లల్లాహు**
**వహ్దహు లా షరీక లహు,**
**వ, అష్హదు అన్న,**
**ముహమ్మదన్ అబ్దుహు, వ రసూలుహు'**

**తర్జుమా:** గవాహీ దేతాహు, మై, కె, అల్లాహ్ కె సివాయ్ కోయీ మాబూద్ నహీ-వొ అకేలా హై-వుస్కా కోయీ షరీక్ నహీ-ఔర్ గవాహీ దేతాహు మై కె ముహమ్మద్ (సఅసం) అల్లాహ్‌కె బందె, ఔర్ వుస్కే రసూల్ హై.
**తెలుగు:** అల్లాహ్ తప్ప మరెవ్వరూ ఆరాధనకు అర్హులు కారు, అల్లాహ్ ఒక్కడే. అతనికి ఎవ్వరూ సాటిలేరు అని నేను సాక్ష్యమిచ్చుచున్నాను. మరియు ముహమ్మద్ (సఅసం) అల్లాహ్ యొక్క దాసుడు మరియు అల్లాహ్ యొక్క ప్రవక్తయని సాక్ష్యమిచ్చుచున్నాను.

**3. సువ్వం కలిమ, తంజీద్**

**'సుబ్హానల్లాహి, వల్హందు లిల్లాహి**
**వలా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్-**
**వలాహౌల, వలా ఖువ్వత, ఇల్లా బిల్లాహిల్**
**అలీయ్యిల్ అజీం.'**

**తర్జుమా:** పాక్‌హై అల్లాహ్ ఔర్ సబ్ తారీఫ్ అల్లాహ్ కెలియే హై అల్లాహ్‌కె సివా కోయి ఇబాదత్‌కే లాఇఖ్ నహీ, ఔర్ అల్లాహ్ సబ్‌సె బడాహై ఔర్ గునాహోంసె బచ్నేకి తాఖత్, ఔర్ నేక్‌కామ్ కర్నెకి ఖువ్వత్, అల్లాహ్ హీకె తరఫ్‌సె హై; జొ ఆలీషాన్ ఔర్ అజ్‌మత్‌వాలా హై.

తెలుగు: అల్లాహ్ మిక్కిలి పవిత్రుడు - మరియు సమస్త స్తోత్రములు అల్లాహ్‌కే చెల్లును-అల్లాహ్ తప్ప మరెవ్వరూ ఆరాధనకు అర్హులు కారు-అల్లాహ్ అందరి కన్నా గొప్పవాడు. పాపకార్యముల నుండి దూరమగుటకు, మంచి కార్యములు చేయుటకు కావలసిన శక్తి అల్లాహ్‌యే ఇస్తాడు. అల్లాహ్ గొప్ప ఠీవి, ఘనత గలవాడు.

**4. చహరుం కలిమా తౌహీద్:**

**'లా ఇలాహ ఇల్లల్లాహు, వహ్దహు,**
**లాషరీకలహు లహుల్ ముల్కు, వ, లహుల్ హందు,**

**యుహ్ఈ - వ యుమీతు. బి యదిహిల్ ఖైర్-**

**వ హువ అలాకుల్లి షైయ్యిన్ ఖదీర్'**

**తర్జుమా:** కోయీ, ఇబాదత్‌కే లాఇఖ్ నహీ, సివాయె అల్లాహ్‌కె - వొ ఏక్‌హై కోయి వుస్కా షరీక్ నహీ - వుసీకి బాద్ షాహీ హై - ఔర్ వుసీకెలియే తమాం తారీఫ్‌హై - వహి జిలాతా హై - ఔర్‌మార్తాహై - వుసీకే హాత్మే, ఖైర్, వో, బర్కత్ హై ఔర్ వో హర్ చీజ్ పర్ ఖాదిర్ హై.

**తెలుగు:** అల్లాహ్ తప్ప మరెవ్వరూ ఆరాధనకు అర్హులు కారు, అల్లాహ్ ఒక్కడే. అల్లాహ్‌కు ఎవ్వరూ సాటిలేరు. అల్లాహ్ సర్వలోకాలకు ఏకఛత్రాధిపతి, సర్వ స్తోత్రములు అల్లాహ్‌కే చెల్లును. జీవన్మరణములు అల్లాహ్ చేతులలోనే ఉన్నవి. అల్లాహ్ చేతులలోనే శుభశ్రేయములున్నవి. అల్లాహ్ అద్వితీయుడు, విజ్ఞాని.

## 5. పంజుం కలిమయె రద్దె కుఫ్ర్:

**'అల్లాహుమ్మ ఇన్నీ, అవూజు బిక, మిన్ అన్ వుష్రిక,**

**బిక షైఅఅవ్ం, వ అన ఆలము, బిహీ వ అస్తగ్ఫిరుక,**

**లిమా లా ఆలము-బిహీ తుబ్‌తు-అన్హు**

**వ తబర్రాతు మినల్ కుఫ్రి, వష్షిర్కి; వల్ మఆసి,**

**కుల్లిహా - వ అస్లంతు - వ ఆమంతు వ అఖూలు-**

**లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్ రసూలుల్లాహ్'**

తర్జుమా: యా అల్లాహ్ మై తేరా పనాహ్ మాంగ్తాహూ కుఫ్ర్ ఔర్ షిర్క్ సె ఔర్ మై మాఫీ మాంగ్తాహూ తుజ్‌సె, తోబాకి మై ఔర్ బాజ్ ఆయా కుఫ్ర్ ఔర్ షిర్క్ సె, ఔర్ గునాహోంసె, ఔర్ హర్‌ఖిసంకీ నా ఫర్మా నియోంసె-ఔర్‌మై ఈమాన్‌లాయా-ఔర్‌మై కహెతాహు అల్లాహ్‌కె సివాయ్ కోయీ మాబూద్ నహీ ముహమ్మద్ (సఅసం) అల్లాహ్‌కె రసూల్ హై.

తెలుగు: ఓ అల్లాహ్! కుఫ్ర్ మరియు షిర్క్‌లకు, దూరంగా ఉండుటకు నేను నీ శరణు కోరుతున్నాను! కుఫ్ర్ మరియు షిర్క్‌ల నుండి, అపరాధాల నుండి అన్ని విధములైన కృతఘ్నుతల నుండి దూరంగా ఉండుటకుగాను నేను పశ్చాత్తాపంతో క్షమాపణ కోరుకొనుచున్నాను - మరియు నేను నిన్నే విశ్వసించాను. అల్లాహ్ తప్ప మరెవ్వరూ పూజార్హులు కారని, ముహమ్మద్ (సఅసం) అల్లాహ్ యొక్క ప్రవక్తయని, నేను నొక్కి వక్కాణించుచున్నాను.

## 2వ అధ్యాయము

# అల్లాహ్‌యే సృష్టికర్త, ఆరాధ్యదైవము

I) అల్లాహ్ మనిషికి ఉన్నత తెలివి, బుద్ధి, జ్ఞానము - అన్నిటికన్నా మిన్నగా ఆత్మ పరిజ్ఞానము ప్రసాదించెను. ఈ పరిజ్ఞానము ద్వారానే తాను, తన సృష్టికర్తను గుర్తించే శక్తి నొసగెను. ఈ పరిజ్ఞానమే మానవునకు హలాల్‌ను ఆమోదించి, హరాంను బహిష్కరించే జ్ఞానము కలుగచేసినది. ఈ పరిజ్ఞానమే ప్రకృతి అద్భుత రహస్యములను, వింతలను, దైవత్వమును గ్రహించగలిగే శక్తి ఇచ్చినది. ఈ జ్ఞానముతో పాటు సృష్టి కర్తను స్మరించుటకు ఏ జీవికి ప్రసాదించని మాట్లాడు, విను, చూచే శక్తి మానవునికి అల్లాహ్‌యే ఇచ్చెనుగదా!

నీ సృష్టి గురించిగాని, నీ శరీరము గురించిగాని నీకు ప్రసాదించిన అవయవములు, వాటి పనితనం గురించిగాని ఎప్పుడైనా ఆలోచించావా. ప్రతి అవయవము ఎక్కడ వుండాలో అక్కడే చక్కగా అమర్చబడినది. గుండె, మెదడు, ముక్కు, నేత్రములు చెవులు మొ॥ వాటి చర్య, జీర్ణక్రియ, శ్వాసక్రియ, రక్త ప్రసరణము వంటి అమోఘమైన క్రమ పద్ధతులు అల్లాహ్ తప్ప ఏ మానవుడు గాని, మరే శక్తులైనా జరిపించగలరా? రేయింబవళ్ళు, సూర్యచంద్రాదులు మరియు తదితర గ్రహములు తమ తమ నిర్ణీత కక్ష్యలో క్రమబద్ధముగా నడిపించునది ఆ మహాశక్తి, సృష్టికర్త అల్లాహ్ కదా. మానవ జ్ఞాన పరిధిలోలేని ఆకాశము ఏ విధమైన స్తంభాలు లేకుండా ఎట్లా పరిచి నిలపబడినదో, నీవు త్రాగే పాలు ఎచ్చట నుండి వచ్చుచున్నవని ఎప్పుడైనా గమనించావా? ఇది పశువు యొక్క కడుపులోని రెండు వేర్వేరు రక్త నాళముల మధ్య నుండి ఊరు శ్రేష్ఠమైన పోషక ఆహారము; ఏమిటి? ఈ సృష్టి వింత విచిత్రము. అల్లాహ్ యొక్క అద్భుత విషయాలు అవగాహన చేసుకొనుటకు ఇవి చాలవా? ఇటువంటి కోటానుకోట్ల దృష్టాంతాలు మన జీవితములో చూచుచునేయున్నాము.

## II) విశ్వసృష్టిలో అల్లాహ్ అద్భుత నియమావళి

భూమ్యాకాశాల సృష్టిలో, రేయింబవళ్ళ (నిరంతర) మార్పిడిలో, ప్రజలకు లాభం చేకూర్చే వస్తువులను మోసుకుంటూ సముద్రాలలో నడిచే ఓడలలో, ఆకాశం నుంచి అల్లాహ్ వర్షపు నీటిని కురిపించి మృతభూమిని బ్రతికించటంలో ఇంకా అందులో అన్ని రకాల ప్రాణులను వ్యాపింప జేయటంలో, వీచే పవనాల దిశలు మార్చటంలో, భూమ్యాకాశాల మధ్య (దేవుని) నియమ నిబంధనలకు కట్టుబడి మసలుకుంటున్న మేఘాలలో బుద్ధిమంతులకు (దేవుని శక్తి సామర్థ్యాలకు సంబంధించిన) ఎన్నో సూచనలున్నాయి (ది.ఖు.2.164).

**వ్యాఖ్యానము:-** ఈ ఆయతు ఎంతో సమగ్రమైనది. విశ్వవ్యవస్థ నిర్మాణానికి, దాని నిర్వహణకు, ప్రణాళికకు సంబంధించిన ఏడు ముఖ్యాంశాలు ఇందులో ఒకేచోట చేర్చబడ్డాయి. మరే ఆయతులోనూ ఇన్ని ప్రధానాంశాలు రాలేదు. 1. భూమ్యాకాశాల నిర్మాణం, వాటి వైశాల్యం, ఔన్నత్యం గురించి వర్ణించటం ఎవరితరమూ కాదు. 2. రేయింబవళ్ళు ఒకదాన్ని తరుముకుంటూ ఇంకొకటి రావటం, పగటి వెలుగు, రాత్రి చీకటి మానవుల కార్యక్రమాలను, విశ్రాంతి సమయాన్ని నిర్ధారించుకోవటంలో ఎంతగానో దోహదపడుతున్నాయి. పగలు సుదీర్ఘంగా ఉన్నప్పుడు రాత్రి కుదించబడటం, రేయి పెరిగినప్పుడు పగలు తరగటం-ఇదంతా ఒక ప్రణాళిక ప్రకారం ఏర్పరచబడింది. 3. సముద్రాలలో పయనించే ఓడలు, వాటి ద్వారా టన్నుల కొద్దీ వర్తక సామగ్రి ఒక ప్రాంతం నుంచి వేరొక ప్రాంతానికి తరలించబడుతుంది. 4. భూమి సస్యశ్యామలంగా, పైరుపచ్చగా ఉండటానికి ఆకాశం నుంచి వర్షాలు కురవటం ఎంతో అవసరం. అల్లాహ్యే గనుక ఆ కారుణ్య జల్లును కురిపించకపోతే నేల బీటలు వారుతుంది. అన్నపానీయాలు లేకుండా పోతాయి. అనావృష్టి వల్ల కరువు కాటకాలు సంభవిస్తాయి. పశుగ్రాసం లేకుండా పోతుంది. దేవుని ఈ ఆగ్రహోదగ్రస్థితికి మానవుడు తట్టుకోలేడు. కాబట్టి ఇంగిత జ్ఞానమున్నవారు ఆకాశం నుంచి కురిసే ఈ వర్షం గురించి ఆలోచించాలి. 5. ధరణిలో నలువైపులా వ్యాపించి ఉన్న

ప్రాణుల్లో సయితం సూచనలున్నాయి. పశువుల పుట్టుక, ఎగుమతి దిగుమతుల్లో వాటి ఉపయోగం, వ్యవసాయం కోసం అవి ఉపయోగపడుతున్న తీరు, యుద్ధాలు ప్రయాణాల కోసం కూడా వాటిని వాడుకోవటం, పాల ఉత్పత్తి, మాంసాహార సేకరణ - ఇన్ని విధాలుగా పశువులు మానవ జాతికి ఉపయోగ బడుతున్నాయి. 6. ఇక గాలులనే చూడండి - చల్లని గాలులు, వేడి గాలులు, రుతుపవనాలు, ఫలప్రదం కాని పవనాలు, అతి శీతల వాయువులు - నలు దిక్కుల నుంచీ వీస్తూ మానవ మనుగడకు దోహదపడుతున్నాయి. 7. ఇక కురిసే మేఘాలు. వాటిని అల్లాహ్ తాను కోరిన ప్రదేశాలలో కురుపిస్తాడు. ఇదంతా ఒక్కడైన ఆ దేవుని అద్భుత శక్తికి ప్రతీక కాదా? ఇవన్నీ ఆయన నిదర్శనాలు కావా?? ఈ సృష్టి ప్రక్రియలోగానీ, ఈ వ్యూహ రచనలోగానీ, ఈ కార్యనిర్వహణలోగానీ వేరొకరెవరైనా భాగస్వాములుగా ఉన్నారా? లేరు. ముమ్మాటికీ లేరు. అలాంటప్పుడు ఆ దైవాన్ని వదిలిపెట్టి ఇతరులను తమ అక్కరలు తీర్చేవారుగా భావించటం ఎంతవరకు సమంజసం? ఇది వివేకవంత మైన పనేనా? - ఆలోచించండి!

III) సప్త సముద్రాలు సిరాగాను, లోకములోని వృక్షములన్ని కలము లుగా చేసి అల్లాహ్ కీర్తి, ఘనత వ్రాయుట మొదలుపెట్టిన, సముద్రపు నీరు అయిపోయినను, కలములు అరిగిపోయినను గాని ఆ అల్లాహ్ మహిమా ప్రభావములను వ్రాయనలవిగాదు. ఇంకా మిగిలిపోవును. దివ్య ఖుర్ఆన్‌లో పలుచోట్ల “ఇత్తఖుల్లా” (అల్లాహ్‌కు భయపడుడు) అని హెచ్చరించబడినది.

IV) అల్లాహ్‌చే సృష్టించబడిన మానవుడు కేవలము ఒక మట్టి బొమ్మ. ఇతని జీవన్మరణములు అల్లాహ్ చేతిలోనే వున్నవి. మానవుడుఎన్ని మహిమల కొత్త విషయములు ప్రదర్శించినా అవి అన్నియు అల్లాహ్ యొక్క అనుజ్ఞ ప్రకారమే జరుగును. మానవుడు ఎప్పుడు ఏక్షణంలో చనిపోతాడో తెలియదు. అది అల్లాహ్ ముందుగా వ్రాసిపెట్టిన తఖ్‌ధీర్ (విధినిర్ణయం)ప్రకారమే జరుగును. దానిని ఏ శక్తి ఆపజాలదు.

దయామయుడైన అల్లాహ్ ఈ విశ్వమును మానవులను కాలక్షేపము నకు, విలాసమునకు వృధాగా సృష్టించలేదు. ఈ సృష్టి వెనుక సుదీర్ఘమైన అంత రార్థము, ఒక పరీక్ష ఉన్నది. అల్లాహ్ మానవులను, జిన్నాతులు మొదలగువారిని కేవలం తన ఆరాధన కొరకు మాత్రమే సృష్టించెను. మానవుని సృష్టించి సర్వసౌకర్యములు అందజేసిన తర్వాత తనకు విధించిన కర్తవ్య నిర్వహణయే అతని పరీక్ష, మనము మరణించు లోపున (అది ఎప్పుడు వస్తుందో మనకు తెలియదు) అల్లాహ్ మనకిచ్చిన జీవిత సమయము, ఆయన ఆజ్ఞ అనుసరించి సాఫల్యం పొందవలెను. సాఫల్యం పొందిన మోమిన్ స్వర్గమునకు అర్హుడు. అల్లాహ్ తనకు అందజేసిన అసంఖ్యాకమైన వరాలకుగాను కృతజ్ఞత చూపుటకు బదులు తిరస్కార భావము చూపి పాపములు చేసిన నరకాగ్నిలో సదా కాలుచు అనేక హింసలు పడుదురు.

### V) అనేక దేవుళ్ళను పూజించటం (షిర్క్)

మానవుల ఆరాధనలు కేవలం అల్లాహ్‌కు మాత్రమే అంకితం కావాలి. ఆరాధనల్లో వేరెవ్వరికీ భాగస్వామ్యం కల్పించరాదు. ఒకవేళ కల్పిస్తే షిర్క్ చేసి నట్లవుతుంది. షిర్క్ ఘోరాతి ఘోరమైన పాపం. అల్లాహ్ ఏ పాపాన్నైనా క్షమిస్తాడు కాని 'షిర్క్'ను మాత్రం తౌబా చేసుకోనంతవరకూ క్షమించడు.

**"అల్లాహ్ క్షమించనిది కేవలం షిర్క్ మాత్రమే. అది తప్ప తాను తలచుకున్న వారి ఏ పాపాన్ని అయినా ఆయన క్షమిస్తాడు."** ***(ది.ఖు.4 : 48)***

**"వారిలో అల్లాహ్‌ను విశ్వసించేవారు ఎంతోమంది ఉన్నారు, కాని వారు ఆయనతోపాటు ఇతరులను కూడా భాగస్వాములుగా నిలబెడుతూ ఉంటారు."** ***(ది.ఖు. 12 : 106)***

**"నా అనుచర సమాజంలోని కొన్ని తెగలు బహుదైవారాధకుల్లో కలిసి పోనంత వరకూ, మళ్లీ (ముస్లింల చేత) విగ్రహాలు పూజించబడనంత వరకూ ప్రళయం సంభవించదు."** ***(తిర్మిజీ)***

# 3వ అధ్యాయము

# పరిశుభ్రత

నమాజ్‌కు ముందు పాటించవలసిన ముఖ్య విషయములు:

1. తహారత్ 2. వుజూ 3. గుసుల్

## తహారత్

తహారత్ అనగా శుచీశుభ్రత. మూత్రము, మూత్రపు చినుకులు దేహంపై గాని, తను ధరించిన బట్టపై గాని పడిన చాలా అపవిత్రంగా భావింతుము. అందుచే మూత్ర విసర్జన చేయునప్పుడు, చాలా జాగ్రత్తగా ఆఖరి బొట్టు వరకు విసర్జన చేసి, మూత్ర స్థలమును శుభ్రమైన నీటితోగాని, శుభ్రమైన ఇటుక ముక్కతోగాని శుభ్రము చేసుకోవలెను. దేహంపై గాని, తాను ధరించిన వస్త్రము లపైగాని ఎటువంటి మలినము,(గిలాజత్) లేకుండా కాపాడుకోవలెను. నిస్సందేహంగా చెడుకు దూరంగా వుండి, పరిశుభ్రతను పాటించే వారిని అల్లాహ్ ప్రేమిస్తాడు(ఖుర్ఆన్ 2-222). ఒకవేళ ఏదైనా మలినము శరీరముపైగాని, బట్టలపై గాని పడినట్లయితే నీళ్ళతో కడిగి శుభ్రము చేసుకోవలెను. ఈ శుభ్రతలు 3 విధాలు.

1. దేహ శుభ్రతకు 'తహారతె జిసం' అంటారు.
2. తాను ధరించిన వస్త్రములు శుభ్రంగా ఉంచుకొనుటకు 'తహారతె లిబాస్' అంటారు.
3. తాను నమాజ్ చదివే స్థలమును శుభ్రంగా ఉంచుకొనుటకు 'తహారతె ముఖాం' అంటారు.

పై శుభ్రతలే కాకుండా మనసును పవిత్రంగా, ఎటువంటి కల్మషము లేకుండా నిర్మలముగా ఉంచుకొనుట ముఖ్యము.

దీనిని 'తహారతె ఖల్బ్' అంటారు. ఈమాన్‌తో ఉన్నటువంటి ప్రతీ ముస్లిం

యొక్క హృదయము నిర్మలముగా ఉండును. కాబట్టి దీనిని పై మూడు శుభ్రతలలో చేర్చలేదు. ఈ మూడు శుభ్రతలు నమాజ్‌కు ముందు ముఖ్యము.

## వుజూ (ది.ఖు. 4 : 43; 5 :6)

వుజూ అనగా దేహపరిశుభ్రత. ఆత్మపరిశుభ్రత. నమాజ్ చదివినప్పుడు, పవిత్ర ఖుర్ఆన్ గ్రంథ పఠనము చేయునప్పుడు వుజూ తప్పనిసరిగా ఉండవలెను. వుజూ లేకుండా చేసిన నమాజ్, నమాజ్‌గా స్వీకరించబడదు.

## వుజూ చేయు విధానము

వుజూ చేయుటకు ముందు నియ్యత్ చేయవలెను. వుజూ చేయు స్థలము మలినం లేకుండా శుభ్రముగా ఉండవలెను.

**నియ్యత్:** 'బిస్మిల్లాహిర్రహ్మా నిర్రహీం'

**ఉర్దూ:** యా అల్లాహ్ మై నియ్యత్ కర్తహు వుజూ కి, నా పాకీ దూర్ హోనేకెలియె.

**తెలుగు:** ఓ అల్లాహ్! నాలో ఉన్న అపరిశుభ్రత దూరమగుటకై వుజూ చేయుటకు సంకల్పించుకొనుచున్నాను.

**'బిస్మిల్లాహిల్ అలీయ్యిల్ అజీం**

**వల్‌హందు లిల్లాహి అలాదీనిల్ ఇస్లాం**

**వల్ ఇస్లాం హఖ్ఖున్ బాతినున్ వన్నూర్'**

**ఉర్దూ :** అల్లాహ్‌కె నామ్‌సె షురూ కర్తాహు. జొ బులంద్ ఔర్ బుజుర్గ్‌హై, షుకర్‌హై అల్లాహ్‌కా మై దీనె ఇస్లాం పర్‌హు. ఔర్ ఇస్లాం హీ సచ్‌హై ఫిత్‌రీ, హఖీఖీ, ఔర్ రోష్‌నీ.

**తెలుగు:** ఖ్యాతిగల వాడైన, ఘనుడైన అల్లాహ్ పవిత్రనామంతో ప్రారంభించుచున్నాను. దైవానుగ్రహం వల్ల నేను ఇస్లాం ధర్మంలో వున్నాను. మరియు ఇస్లామే సర్వస్వం. అదే సహజమైనది మరియు ప్రకాశవంతమైనది.

నియ్యత్ చేసిన తర్వాత ఈ క్రింది విధముగా వుజూ చేయవలెను.

1. మణికట్టు వరకు రెండు చేతులు మూడుసార్లు కడగవలెను. వ్రేళ్ళ మధ్య,

గోళ్ళలో మలినముంటే శుభ్రం చేసుకోవలెను.

2. మిస్వాక్ చేయవలెను అనగా పళ్ళు తోముకొని 3 సార్లు గరగరా చేయవలెను. (పుక్కిలించవలెను)

3. 3 సార్లు ముక్కు రంధ్రములు నీటితో శుభ్రపరచుకోవలెను.

4. 3 సార్లు, రెండు చేతులతో ముఖము పూర్తిగా కడుగవలెను. (నుదురు పై భాగము నుండి గడ్డము క్రింది భాగము వరకు చెవులతో సహా)

5. 3 సార్లు మోచేతుల వరకు చేతులు పూర్తిగా కడుగవలెను. (ముందు 3 సార్లు కుడిచేయి తర్వాత 3 సార్లు ఎడమ చేయి)

6. సర్‌కా మసా చేయవలెను. అనగా తడి చేతి వ్రేళ్ళతో నుదుటి నుండి శిరస్సుపై భాగం వరకు శుభ్రం చేయవలెను. తర్వాత చేతి వ్రేళ్ళతో చెవి లోపలి భాగం, చెవి వెలుపలి, వెనుక భాగం శుభ్రం చేయవలెను. తర్వాత రెండు చేతులు తడి వ్రేళ్ళతో (వ్రేళ్ళ వెనుక భాగము నుండి) మెడకు రెండు ప్రక్కలా మసా చేయవలెను. (శుభ్రపరచవలెను)

7. 3 సార్లు చీలమండలం వరకు కాళ్ళు కడుగవలెను. (మొదట కుడి కాలు తర్వాత ఎడమ కాలు)

**ముఖ్య గమనిక:** వుజూ చేసినప్పుడు, వుజూ చేసిన భాగము రవ్వంత కూడా పొడిగా ఉండరాదు. (బాల్ బరాబర్ బి సూఖా నహీ రహెనా)

వుజూ పూర్తి అయిన తర్వాత కలిమా షహాదత్ చదవవలెను.

## వుజూ టూట్‌జానెవాలి చీజ్: వుజూ భంగమయ్యే పరిస్థితులు:

1. మూత్ర ద్వారము నుండి మూత్రము, మల ద్వారము నుండి గాలి గాని, మలముగాని ఏదైనా బయటకు వచ్చినచో. 2. చీము గాని, నెత్తురు గాని దేహము నుండి కారిన ఎడల 3. స్పృహ తప్పిన ఎడల 4. వాంతి అయిన ఎడల 5. తలకింద దిండుతో నిద్ర పోయినప్పుడు 6. మలినము, గిలాజ్ ఎక్కువగా దేహముపై తగిలిన వుజూ వుండదు. 7. ఒంటె మాంసం తిన్నప్పుడు (ముస్లిమ్). ఇటువంటి సమయాలలో మలినము శుభ్రపరచి, మరలా వుజూ చేయవలసి ఉంటుంది.

## గుసుల్ (స్నానం) (ది.ఖు. 4 : 43; 5 :6)

మీరు అపరిశుద్ధులుగా ఉంటే స్నానం చేసి పరిశుద్ధులు అవ్వండి.
(దివ్యఖుర్ఆన్ 5 : 6)

ఈ క్రింద ఉదహరించిన పరిస్థితులలో గుసుల్ చేయుట తప్పనిసరి అగును.

1. భార్యాభర్తలు కలియుట వల్ల వీర్య స్ఖలనం అయినా, అవ్వకపోయినా (గుసులె జనాబత్)
2. స్త్రీ పురుషులకు నిద్రలో గాని, మరి ఇతర సమయాలలో స్ఖలనము అవుట వల్ల (గుసులె ఎహ్‌తెలాం) (బుఖారీ ముస్లిం)
3. ఆడవాళ్ళ ఋతుస్రావ కాలము తర్వాత (గుసులె హైజ్)
4. ప్రసవించిన 40 రోజుల తర్వాత (గుసులె నిఫాస్)

**గుసుల్‌కి నియ్యత్ :** బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం పఠించి యా అల్లాహ్ మై నియ్యత్ కర్తాహు గుసుల్‌కి, నాపాకీ దూర్ హోనెకెలియే. (పాక్ కెలియే)

తెలుగు: అల్లాహ్! నాలో వున్న అపరిశుభ్రతను దూరం చేసి, శుభ్రత పొందుట కొరకు ఈ గుసుల్ చేయుచున్నాను.

**గుసుల్ చేసే విధానము:** గుసుల్ చేయుటకు ముందే మూత్ర విసర్జన చేయుట మంచిది.

1. మొదట మణికట్టు వరకు 3 సార్లు కడుగవలెను.
2. తర్వాత మూత్ర స్థలము, మల విసర్జన స్థలము శుభ్రము చేసుకోవలెను.
3. తర్వాత దేహముపై గాని, తాను ధరించిన వస్త్రములపైగాని మలినము ఉంటే శుభ్రముగా కడుగవలెను.
4. 3 సార్లు గరగరా చేయవలెను. గొంతు లోపలి భాగము వరకు నీళ్ళు పోనిచ్చి గరగరా చేయవలెను. (పుక్కిలించవలెను).
5. ముక్కు రంధ్రములు నీళ్ళతో శుభ్రపరచుకోవలెను. (3 సార్లు)

6. శిరస్సుపై, వెంట్రుకల చివర భాగము వరకు పూర్తిగా తడిసేటట్లు నీళ్ళు పోసుకోవలెను.

7. శరీరమంతా శుభ్రముగా చేసుకొని స్నానము చేయవలెను.

గమనిక: స్నానము చేసినప్పుడు శరరీపు భాగము రవ్వంతయైనను పొడిగా ఉండరాదు.

గుసుల్ అయిన తర్వాత :'అల్లాహుమ్మజ్ అల్నీ మినత్తవ్వాబీన వజ్అల్నీ మినల్ ముతతహ్హిరీన్' అనవలెను.

అర్థం: ఓ అల్లాహ్! తమ దోషములపై పశ్చాత్తాపము చెందు వారిలో నన్ను కూడా ఒకనిగా చెయ్యుము. మరియు పవిత్రతతో ఉన్న వారిలో నన్ను కూడా ఒకనిగా చెయ్యుము. (బుఖారి ముస్లిం)

## గుసుల్లో 3 ముఖ్య విధులు :

1. గొంతు లోపలి భాగము వరకు నీళ్ళు పోనిచ్చి గరగరా చేయుట.

2. ముక్కు రంధ్రములను నీళ్ళతో శుభ్రము చేయుట

3. దేహము, శిరస్సు యొక్క ప్రతి భాగము పూర్తిగా తడిసినట్లు శుభ్రముగా స్నానము చేయుట. అంటే తల వెంట్రుకల నుండి కాలి గోటి వరకు తడిచే లాగున జాగ్రత్త వహించాలి. (బుఖారి, ముస్లిం)(అబూదావూద్, షరీఫ్)

# తయమ్ముమ్

ఈ క్రింద ఉదహరించిన పరిస్థితులలో, వుజూ, గుసుల్కు బదులు, తయమ్ముమ్ చేసిన నమాజ్ చేయవచ్చునని, షరీఅత్ తాకీదు చేసినది.

## తయమ్ముమ్ షరతులు

1. వుజూ చేయుటకు నీరు దొరకనిచో (దివ్యఖుర్ఆన్ మాయిదా5-6)

2. అనారోగ్యముగా ఉండి, నీళ్ళతో వుజూ చేసిన ఆరోగ్యము చెడునన్న అనుమానము కలిగినప్పుడు (దివ్యఖుర్ఆన్ అల్ మాయిద 5 -6)

3. బావి నుండి నీరు తోడుటకు పరికరములు ఏమియూ లేనప్పుడు.
4. ప్రయాణములో నీటి సౌకర్యము లేనప్పుడు.
5. జనాజా నమాజ్‌కు, జమాఅత్ నిలబడి, వుజూ చేయుటకు సమయము లేనప్పుడు.
6. శత్రువులు తరుముకొని వచ్చునన్న భీతియున్నప్పుడు.

**తయమ్ముమ్ చేయు విధానము:** (మిష్కాత్ షరీఫ్ 1 : 47)

తయమ్ముమ్ చేయుటకు ముందు నియ్యత్ ప్రధానము. నియ్యత్ చేయుట ఫర్జ్ నియ్యత్ చేయనిదే తయమ్ముమ్ కాదు.

**నియ్యత్:** బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం, యా అల్లాహ్! మై నియ్యత్ కర్తాహు తయమ్ముమ్‌కి నాపాకీ దూర్ హోనెకెలియె ఔర్ పాక్ హోనె కె లియె.

తెలుగు: అల్లాహ్! నాలో ఉన్న అపరిశుభ్రతను దూరము చేసి, శుభ్రత పొందుట కొరకు తయమ్ముమ్ చేయుచున్నాను.

నియ్యత్ చేసిన తర్వాత రెండు హస్తములు శుభ్రమైన (మట్టిపై) నేలపై అద్ది చేతులకు తగిలిన మట్టిని దులిపి, చేతులు ముఖముపై స్పృశించుకోవలెను. (వుజూలో ముఖము కడుగుకున్నట్లు). మళ్లీ రెండవసారి రెండు హస్తములు భూమిపై కొట్టి (నేలపై అద్ది) మట్టి దులిపి మూడుసార్లు మోచేతుల వరకు (వుజూలో చేసినట్లుగానే) స్పృశించుకోవలెను. వ్రేళ్ళ మధ్య వ్రేళ్ళతో శుభ్రము చేసుకోవలెను. దీనిని 'ఖిలాల్' అంటారు. ఈ విధంగా చేసిన తయమ్ముమ్ పూర్తి అవుతుంది. (బుఖారీ షరీఫ్; మిష్కాతె షరీఫ్ 1 : 54)

## తయమ్ముమ్‌లోని మూడు ముఖ్య విధులు

1. నియ్యత్ చేయుట
2. రెండు హస్తములు మట్టి మీద కొట్టి ముఖము స్పృశించుకొనుట
3. రెండు హస్తములు మట్టి మీద కొట్టి మోచేతుల వరకు స్పృశించుకొనుట 'ఖిలాల్' చేయుట. (బుఖారి, ముస్లిం)

## 4వ అధ్యాయము

# నమాజ్ - ఆరాధన (సలాత్)

1) 'నిస్సందేహంగా నేనే అల్లాహ్‌ను. నేను తప్ప మరో ఆరాధ్యుడు లేడు. కాబట్టి నువ్వు నన్నే ఆరాధించు. నా స్మృతి కోసం నమాజ్‌ను స్థాపించు' (దివ్యఖుర్‌ఆన్ 20-14)

2) 'నేను మానవుల్ని, జిన్నాతుల్ని నన్ను ఆరాధించాలన్న ఉద్దేశ్యంతోనే సృష్టించాను' (దివ్యఖుర్‌ఆన్ 51-56)

## 1. అజాన్ (ప్రార్థనా పిలుపు) (మి.ష. 1 : 63)

1. అల్లాహు అక్బర్ 4 సార్లు
2. అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహ్ - 2 సార్లు
3. అష్హదు అన్న ముహమ్మదర్ రసూలుల్లాహ్ - 2 సార్లు
4. హయ్య అలస్సలాహ్ - 2 సార్లు
   (ప్రతిసారి ముఖము కుడి భుజము వైపు త్రిప్పుకోవలెను)
5. హయ్య అల్ ఫలాహ్ - 2 సార్లు
   (ప్రతిసారి ముఖము ఎడమ భుజము వైపు త్రిప్పుకోవలెను)
6. అల్లాహు అక్బర్ - 2 సార్లు
7. లా ఇలాహ ఇల్లల్లాహ్ - 1 సారి

**గమనిక:** ఫజ్ర్ అజాన్ చెప్పినప్పుడు రెండుసార్లు 'హయ్యా అలల్ ఫలాహ్' చెప్పిన తర్వాత 'అస్సలాతు ఖైరుం మ్మినన్నౌమ్' అని రెండు సార్లు చెప్పవలెను.

తర్జుమా: నమాజ్ నీన్ద్ సే బెహతర్‌హై (అ.దా.; అహ్మద్; తిర్మిజీ,ఇబ్న్)

తెలుగు: నమాజ్ నిద్రపోవుట కంటే ఎన్నో రెట్లు మేలు. (మి.ష 1 : 63)

## అజాన్ తర్జుమా

1. **అల్లాహ్ సబ్‌సే బడా హై**

   **తెలుగు:** అల్లాహ్ అందరికన్నా గొప్పవాడు.

2. **మై గవాహీ దేతాహు కె అల్లాహ్‌కె సివా కోయి మాబూద్ నహీ**

   **తెలుగు:** అల్లాహ్‌కు ఎవ్వరూ సాటిలేరని నేను సాక్ష్యమిచ్చుచున్నాను.

3. **మై గవాహీ దేతాహు, కె ముహమ్మద్ (సఅస) అల్లాహ్‌కె రసూల్ హై**

   **తెలుగు:** ముహమ్మద్ (సఅస) అల్లాహ్ యొక్క ప్రవక్తయని నేను సాక్ష్యమిచ్చుచున్నాను.

4. **ఆవో నమాజ్‌కి తరఫ్**

   **తెలుగు:** రండి నమాజ్ చేయుటకు.

5. **ఆవో భలాయికె తరఫ్**

   **తెలుగు:** రండి శుభ సాఫల్యం వైపునకు.

6. **అల్లాహ్ సబ్‌సే బడా హై**

   **తెలుగు:** అల్లాహ్ అందరికంటే గొప్పవాడు.

7. **అల్లాహ్‌కె సివా కోయీ మాబూద్ నహి**

   **తెలుగు:** అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యదైవం లేడు.

   అజాన్ తరువాత దరూద్ పఠించమని ప్రవక్త (స) చెప్పారు.

(బుఖారి, ముస్లిం)

## అజాన్ తర్వాత చదువు దుఆ

**'అల్లాహుమ్మ రబ్బ, హాజి హిద్ద అవతిత్తామ్మతి. వస్సలాతిల్ ఖాయిమతి ఆతి, ముహమ్మదనిల్ వసీలత వల్ ఫజిలత, వద్దర జతర్రఫీఅత వబ్ అస్‌హు, మఖామం మహ్మూదనిల్లజీ వ అత్తహు, వర్జుఖ్‌నా, షఫాఅతహు యౌమల్ ఖియామతి, ఇన్నక, లా తుఖ్‌లిఫుల్ మీ ఆద్' (ముస్లిం)**

**తర్జుమా:** అయ్ అల్లాహ్! ఇస్ పూరీ పుకార్‌కె పర్‌వర్ది గార్ ఔర్ ఖాయమ్ హోనే వాలి నమాజ్‌కె పర్‌వర్దిగార్ ముహమ్మద్ (సఅస) కు వసీలా ఔర్ ఫజీలత్ అతాఫర్మా ఔర్ వుస్కొ మఖామె మహ్మూద్ పర్, పహుంచా, జిస్కా తూనే వాదా కియా, ఔర్ నసీబ్ కర్ హంకో, షఫాఅత్ వున్‌కి ఖియామత్‌కే దిన్ సచ్‌ముచ్ తూ వాదా ఖిలాఫ్ నహీ కర్తా.

**తెలుగు:** ఓ అల్లాహ్! నీవు ఈ పవిత్ర పిలుపుకు ప్రభువువి. మరియు స్థాపితమయ్యే ఈ నమాజ్ యొక్క ప్రభువువి. ముహమ్మద్ (సఅస) కు నీ ఆదరణ ఒసగు మరియు వారికి ఘనతను ప్రసాదించు. మరియు నీ వాగ్దానము ప్రకారము వారిని, ఉన్నత స్థానముపై ప్రతిష్టింపజేయుము. మా అందరినీ ఆ ప్రళయ దినమున రక్షించు. యదార్థంగా, నీవు వాగ్దాన భంగము చేయువాడవు కావు.

## 2. ఇఖామత్

| | |
|---|---|
| అల్లాహు అక్బర్ | 4 సార్లు |
| అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహ్ | 2 సార్లు |
| అష్హదు అన్న ముహమ్మదర్ రసూలుల్లాహ్ | 2 సార్లు |
| హయ్య అలస్సలాహ్ | 2 సార్లు |
| హయ్య అలల్ ఫలాహ్ | 2 సార్లు |
| ఖద్ ఖామతిస్సలాహ్ | 2 సార్లు |

అర్థము: (నమాజ్ ఖడీ హోగయీ) (నమాజ్ చదువుటకు జమాఅత్ సిద్ధముగా ఉన్నది.)

**అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్ లా ఇలాహ ఇల్లల్లాహ్**

# 3. నమాజ్ వేళలు

1. **ఫజ్ర్** : సూర్యోదయమునకు సుమారు గంట ముందు నుండి, సూర్యోదయము ప్రారంభానికి ముందు వరకు. (ముస్లిం)

2. **జుహర్** : సూర్యుడు నడినెత్తి నుండి వాలిన తర్వాత నీడ దానికి రెండు వంతులు ఉన్నంత వరకు (సుమారు మధ్యాహ్నము 1 గంట నుండి 3-30 వరకు) (బుఖారి)

3. **అస్ర్:** ప్రతి వస్తువు నీడ దానికి రెండు వంతులు దాటినప్పటి నుండి ప్రారంభించి సూర్యాస్తమయానికి ముందు వరకు. (ముస్లిం)

4. **మగరిబ్:** సూర్యాస్తమయం తర్వాత చీకటి అలుముకునే వరకు. (ముస్లిం)

5. **ఇషా:** ఇషా వేళ సూర్యాస్తమయానికి గంటన్నర తరువాత ప్రారంభమై జాము రాత్రి వరకు. కాని, అర్ధ రాత్రి తర్వాత ఇషా నమాజ్ చదువుట కంటె అర్ధరాత్రికి ముందుగానే ఇషా నమాజ్ చదువుట ఉత్తమం.(ముస్లిం)

# 4. నమాజ్ చదవకూడని వేళలు

1. సూర్యోదయపు వేళ, 2. మిట్టమధ్యాహ్నము 3. సూర్యుడు అస్తమించు వేళ. ఈ నిషేధపు వేళలలో తిలావతె సజ్దా కూడా చేయరాదు.

   **గమనిక:** 1 నమాజ్ వేళల ఆఖరి ఘడియ వరకు ఆగుట కన్నా నమాజ్ తొలి ఘడియలోనే చదువుట ఉత్తమము.

2. ఫజ్ర్ నమాజ్ వేళ దాటిపోయిన తర్వాత మరల సూర్యోదయము అయ్యే వరకు చదువరాదు.

3. అస్ర్ నమాజ్ వేళ దాటిపోయిన తర్వాత సూర్యాస్తమయం వేళ నమాజ్ చదువరాదు. (ముస్లిం)

# 5. ఐదు పూటల నమాజ్‌లు, రకాతులు

5 పూటల నమాజ్‌లలో ఎన్ని రకాతులుగా ప్రార్థన చేయవలనో తెలుపు పట్టిక.

| నమాజ్ | ఫర్జ్‌కు ముందు సున్నతులు | ఫర్జ్ రకాతులు | ఫర్జ్ తరువాత సున్నత్‌లు | నఫిల్ |
|---|---|---|---|---|
| ఫజ్ర్ | 2 | 2 | లేవు | లేవు |
| జుహర్ | 4 | 4 | 2 | 2 |
| అస్ర్ | 4 | 4 | లేవు | లేవు |
| మగ్రిబ్ | - | 3 | 2 | 2 |
| ఇషా | 4 | 4 | 2 | 2<br>3 వాజిబుల్ విత్ర్<br>2 |
| జుమా | 2 తహియ్యతుల్‌మస్జిద్<br>4 సున్నత్‌లు | 2 | 4<br>2 | 2 |

# 6. రకాతుల నిర్వచనము

1. **ఫర్జ్:** ఇది అల్లాహ్ యొక్క ఆజ్ఞ. ప్రతి ముస్లిం దీనిని తప్పక అమలు చేసి తీరవలసిందే. అమలు జరుపని ముస్లిం శిక్షార్హుడు అగును.
2. **వాజిబ్ :** ఇది కూడా అల్లాహ్ ఆజ్ఞ. అయితే ఫర్జ్ తర్వాతనే దీని ప్రాముఖ్యత.
3. **సున్నత్ :** ఖుర్‌ఆన్‌లో పలు చోట్ల **"వ అతీ వుల్లాహ్, వ అతీ వుర్రసూల్"** అని ఆజ్ఞాపించబడినది.

**(భావము)** "అల్లాహ్ పట్ల ఏ విధముగా విధేయత చూపుదువో, అదే విధముగా ప్రవక్త యెడల కూడా విధేయత చూపుము" ముహమ్మద్ (సఅస) చేసిన ప్రార్థనలు మనకు సంక్రమించినవి. మనము ఫర్జ్‌తో పాటు సున్నత్‌ను కూడా విధిగా అమలు జరుపవలసినదే.

4. **నఫిల్ (ముస్తహబ్):** ముహమ్మద్ (సఅస) సమయానుకూలముగా ఆచరించిన ప్రార్థనలు. కాని వీటిని తప్పక ఆచరించవలసినదని ఆదేశించ లేదు. మనము వీటిని ఆచరించిన పుణ్యము. పాటించకపోయిన శిక్షార్హు లము కాము. ఇది తమ తమ ఇష్టము.

ఫర్జ్ నమాజ్ జమాఅత్‌తో ఇమాం వెనుక చదవవలెను. ఒకవేళ ఇమాం వెనుక చదువుటకు వీలుపడక, తనంతట తాను చదివినప్పుడు, ఫజ్ర్ మగ్‌రిబ్, ఇషాలోని ఫర్జ్ మొదటి రెండు రకాతులు బిగ్గరగా గాని, నెమ్మదిగా గాని చదువ వచ్చును. జుహర్, అస్ర్‌లోని ఫర్జ్ రకాతులు తనలో నెమ్మదిగా చదవవలెను. మిగతా రకాతులు అనగా సున్నత్, వాజిబ్, నఫిల్ తనలో నెమ్మదిగా చదువ వలెను. ఈ రకాతులు జమాఅత్‌తో (ఇమాం వెనుక) చదువరాదు. ఇమాం జమాఅత్‌తో ఫర్జ్ నమాజ్ మాత్రమే చదివించును. పండుగ నమాజ్‌లు (రమ జాన్‌లో వితర్) కూడా జమాఅత్‌తో చదివించును.

బిగ్గరగా ఖిరాత్‌తో చదివే నమాజ్‌ను 'జహరీ నమాజ్' అంటారు. వినపడ కుండా తనలో తాను చదువు నమాజ్‌ను 'సిర్రీ' నమాజ్ అంటారు.

## 6ఎ) ఖజా నమాజ్

ఇమాం వెనుక జమాఅత్‌తో నమాజ్ చేయుట చాలా ఉత్తమం. దీని ఫజీలత్ చాలా ఘనంగా పొగడబడినది. ఒకవేళ మసీదులో జమాఅత్‌తో, చదువుటకు వీలుపడనప్పుడు ఇద్దరుగాని, అంతకంటే ఎక్కువ మందితో ఎక్కడ నమాజ్ టైము అయితే అక్కడ జమాఅత్‌తో నమాజ్ చదువువచ్చును. కాని 'నాగా' చేయరాదు. వేళకు చదవకుండా నాగా చేసిన నమాజ్‌ను 'ఖజా' అంటారు. కొన్ని అనివార్య కారణాల వల్ల నమాజ్ 'ఖజా' అయినచో, ఆ ఖజా నమాజ్, సాధ్యమైనంత త్వరలో పూర్తి చేసుకోవలెను. 'ఖజా' నమాజ్ చదివినప్పుడు, ఏ పూట నమాజ్ ఖజా అయినచో ఆ పూటలోని ఫర్జ్ రకాత్‌లే చదవవలెను. సున్నత్,

నఫిల్ రకాత్‌లు చదవనవసరం లేదు. ఏ పూట ఖజా నమాజ్ చదవదలుచుకున్నామో, ఆ పూట ఖజా నమాజ్ నియ్యత్ ఈ విధంగా చేయవలెను.

నియ్యత్: యా అల్లాహ్ మై నియ్యత్ కర్తాహు ఖజా నమాజ్ ఫజ్ర్‌కి, దో రకాత్ ఫర్జ్, వాస్తె అల్లాహ్‌కె రుఖ్ మెరా కాబేకి తరఫ్' అల్లాహు అక్బర్ అని నియ్యత్ చేసి చేతులు కట్టుకోవలెను.

## 7. నమాజ్ యొక్క ప్రాముఖ్యత (దివ్యఖుర్ఆన్ 29-45)

నమాజ్ యొక్క మహిమ నమాజ్ చదివితే గాని తెలియదు. దుర్గుణములను, దుర్ వ్యసనములను నమాజ్ దరిచేరనివ్వదు. మానవుడు విశ్వసించిన తర్వాత అనగా ఈమాన్‌కు కట్టుబడియున్న తర్వాత అతని ప్రథమ విధి నమాజ్‌ను ఆచరించడం. దీని ఘనత ప్రశంసనీయమైనది. నమాజ్ చదివిన తర్వాత, ముస్లిం మానసికముగా, శారీరకముగా సంతృప్తి, సుఖము పొందును. దీని పరమార్థము ఒక్క ముస్లిమే గ్రహించి ఆనందించగలడు. ప్రళయ దినమున అల్లాహ్ ఎదుట మానవుని ప్రశ్నావళి, ప్రథమ చర్చనీయాంశము నమాజ్ గురించియే! మానవుడు, ఇహలోకంలో తాను చేసిన నమాజులలో కృతార్థుడై, పరలోకంలో సకల సౌఖ్యములతో తులతూగును. స్వర్గము అతని నిత్య నివాసమగును. మోమిన్‌కు, కాఫిర్‌కు భేదము ముస్లిం నమాజ్‌ను ఆచరించడం! కావున ప్రతి ముస్లిం తాను విధిగా నమాజ్ చదివి, తన సంతతికి, నమాజ్ నేర్పించి, నియమ నిబంధనలతో నమాజ్ ఆచరించుటకు కఠినముగా తాకీదు ఇచ్చుట మన ప్రథమ కర్తవ్యమని గుర్తించవలెను. అల్లాహ్ మనకు, మన సంతతికి నమాజ్ చదువుటకు 'నేక్ తౌఫీక్' (సద్బుద్ధి) యివ్వుగాక (ఆమీన్ సుమ్మ ఆమీన్).

నమాజ్ వేళలకు ముందు ముఅజ్జిన్ అజాన్ చెప్పును. అజాన్ విన్నప్పుడు అజాన్ పూర్తి అయ్యే వరకు నిశ్శబ్దముగా ఉండి, అజాన్ పిలుపు పదములు, లోలోన బదులు పలుకుచుండవలెను. లేదా నిశ్శబ్దముగా ఉండవలెను. ముఅజ్జిన్ 'హయ్య అలస్సలాహ్ - 2 సార్లు, హయ్య అల్ ఫలాహ్- 2 సార్లు' అనునప్పుడు మాత్రము 'లాహౌల, వలాఖువ్వత, ఇల్లా బిల్లాహిల్ అలియ్యుల్ అజీం' అనవలెను. అజాన్ పూర్తి అయిన తర్వాత అజా దుఆ చేయవలెను.

నమాజ్ చదివే ముందు, ఏ పూట నమాజ్ చదువుతున్నామో ఎన్ని రకాతుల నమాజ్ చదువుతున్నామో సంకల్పము చేసుకోవలెను. దీనిని నియ్యత్ అంటారు.

నియ్యత్ చేసి, నమాజ్‌కు నిలబడినప్పుడు అల్లాహ్ ఎదుట మనము నిలబడి నాము. అల్లాహ్ యొక్క పవిత్ర వాక్కులు మనము ఉచ్ఛరించుచున్నాము. అల్లాహ్ యొక్క పవిత్ర గుణములే స్మరించుచున్నాము. అల్లాహ్‌ను మనము చూడలేకపోయినా సర్వాంతర్యామి అగు అల్లాహ్ మనలను గమనించుచున్నాడు అన్న భక్తి విశ్వాసములతో నమాజ్ చదవవలెను. నమాజ్ చదువుచున్న ప్పుడు మనస్సు అల్లాహ్ యందే లగ్నమై యుండవలెను. మనస్సులో ఎటువంటి వేరే ఉద్దేశాలకు సంఘటనలకు తావు ఇవ్వరాదు. నమాజ్ చదువుతున్నప్పుడు, చూపులు అనగా దృష్టి అటూ ఇటూ మళ్ళించరాదు. సజ్దా చేయు స్థలము మీదనే నిఘా ఉంచవలెను. నమాజ్‌లో చదివే దైవ వాక్కులు (ఆయతులు) అర్థము చేసుకొని నెమ్మదిగా (ఆగి, ఆగి) చదవవలెను. ఇటువంటి నమాజ్‌ను 'ఖుషూఖుజూకి నమాజ్' అంటారు. ఇటువంటి నమాజ్ అల్లాహ్‌కు ప్రీతి. నమాజ్ ప్రజలను మెప్పించుటకు గాని, వారి గౌరవ మర్యాదలు, పొగడ్తలు, మన్ననలను పొందుటగాని, ప్రదర్శ నార్థమైగాని చదువుట దోషము. కేవలం అల్లాహ్ కొరకే, అల్లాహ్ యొక్క ఆజ్ఞ పాటించుటకే అని గుర్తించవలెను. నమాజ్ యొక్క ప్రాధాన్యత గ్రహించితేగాని నమాజ్ యొక్క లబ్ది పొందలేము, ఆనందించలేము. నమాజ్ చిన్న పిల్లలు అనగా నిర్ణీత వయస్సు (7 సంవత్సరముల)కు లోపల ఉన్న వారిపై, మతిస్థిమి తము లేని వారిపై బహిష్టు కాలములో ఉన్న ఆడవారిపై తప్ప, మిగిలిన ప్రతి ముస్లింపై ఫర్జ్ చేయబడినది. (బహిష్టు కాలము పూర్తికాగానే తప్పిపోయిన చేసిన నమాజ్ చదువుటకు కూడా అనుమతి ఉంది) అందుచేత ప్రతి ముస్లిం రోజుకు 5 సార్లు నిర్ణయించిన వేళలలో నమాజ్ చదువుట తప్పనిసరి. ఏవో సాకులు చెప్పి నమాజ్ మానరాదు. జబ్బుతో ఉన్న రోగి కూడా నమాజ్ చదవవలసిందే. మసీదుకు వెళ్లి జమాఅత్‌తో చదవలేకపోయినా (రోగులు) తమ తమ ఇండ్లలో, ఎక్కడ నమాజ్ వేళ అయితే అక్కడ చదువవచ్చును.

నిలబడి చదువలేకపోతే కూర్చుని చదువవచ్చు. కూర్చుని చదువలేక పోయినట్లయితే పడుకుని లేదా ఏ అవస్థలోనైనా నమాజ్ చదువమని ఆజ్ఞాపించ బడినది. ఒకవేళ నోటితో ఉచ్ఛరించలేకపోయినా మనస్సులో, లోలోపల ధ్యానించుకొని సంజ్ఞలతో నమాజ్ చదువవలసినదేగాని మానరాదు. అల్లాహ్

ఎదుట నమాజ్ చదువనివాడు 'బేనామజీ' శిక్షార్హుడగును. ముస్లిం దేశపు చక్ర వర్తులు, రాయబారులు అంతర్జాతీయ సభలలో ప్రసంగములలో పాల్గొను నప్పుడు నమాజ్ వేళ అయిన వెంటనే, తమ కర్తవ్యము పాటించుట మనము చూస్తూనే ఉన్నాము. ఈ విధంగానే, వీధులలో తిరిగి ఫలములు, కూరగాయలు మొదలగు వాటిని విక్రయించువారు కూడా నమాజ్ ఖజా చేయరు. ఎక్కడ నమాజ్ వేళ అయితే అక్కడ నమాజ్ చదువుదురు.

నమాజ్ చదువట చాలా సులభమైన పని. ఐదు, పది నిమిషముల కన్నా ఎక్కువ టైము పట్టదు. కాని మనలో చాలా మందికి నమాజ్ చదువుటకు టైము దొరకదంటే ఆశ్చర్యకరము.

## 8. నమాజ్‌లో ఆచరించు కొన్ని నియమాలు

నమాజ్, వినయ విధేయతలతో, క్రమబద్ధమైన కొన్ని ఆసనముల ద్వారా ఆచరించెదరు. ఆ చర్యలు, వాటిని చేయు విధములు ఈ క్రింద వివరించ బడినవి.

1. **తక్బీరె తహ్‌రీమా:** నమాజ్ చేయుటకు, ఖిబ్లా వైపు ముఖము చేసి నిలబడి ఏ పూట నమాజ్ చదువదలచినామో, ఎన్ని రకాతులతో చదువుతున్నామో నియ్యత్ చేసి 'అల్లాహు అక్బర్' అంటూ రెండు చెవుల తమ్మెల వరకు రెండు చేతులు ఎత్తుట.

2. **ఖియాం:** 'తక్బీరె తహ్‌రీమా' చెప్పిన తర్వాత రెండు చేతులు క్రిందికి దించి, బొడ్డు క్రింద ఎడమ హస్తముపై కుడి హస్తము వేసి, చేతులు కుట్టకుని నిలబడుట.

3. **రుకూ:** 'ఖియాం'లో 'అల్‌హం', మరియొక్క సూరా చదివి ముందుకు వంగుట. వంగునపుడు వీపు, తల సమతలములో ఉండవలెను.

4. **ఖౌమ:** రుకూ నుండి నిలబడుట

5. **సజ్దా:** (ఒక విధమైన సాష్టాంగము) ఖౌమ నుండి మోకాళ్ళ మీద కూర్చుని, ముందుకు వంగి, హస్తములు భూమిపై ఆనించి, నుదురు భూమి మీద హస్తముల మధ్య ఉండునట్లు సాష్టాంగము చేయుట.

   సజ్దా చేయునప్పుడు మోకాళ్ళు, కాలివేళ్ళు, రెండు హస్తములు, నుదురు

ముక్కుకొన భూమికి అద్దుకున్నట్లు ఉండవలెను. హస్తములు మాత్రమే భూమికి ఆన్చవలెను. మో చేతులు భూమికి తగలరాదు. ఉదరమునకు, భూమికి మధ్య ఖాళీ ఉండవలెను.

6. **జల్సా :** సజ్దాకు, సజ్దాకు మధ్య వ్యవధి ఉండవలెను. అనగా కంగారుగా త్వరితముగా సజ్దాలు చేయరాదు. మొదటి సజ్దాకు రెండవ సజ్దాకు మధ్య ఆగి కూర్చొను వ్యవధిని జల్సా అంటారు.

7. **ఖాయిదా:** రెండు సజ్దాలు చేసిన తరువాత కూర్చొనుట ఖాయిదా అందురు. ఖాయిదాలో అత్తహియ్యాత్ చదువవలెను.

**ఖాయిదాలో కూర్చొను విధము:** రెండు హస్తములు తొడలపై ఉంచి ఎడమ పాదముపై కూర్చుని, కుడి పాదపు వ్రేళ్ళు భూమిపై నిలబెట్టవలెను.

8. **సలాం:** ఖాయిదాలో అత్తహియ్యాత్, దరూదె ఇబ్రాహీమ్, దుఆ పూర్తిగా చదివి 'అస్సలాము అలైకుం వ రహ్మతుల్లాహ్' అంటూ ముఖము కుడి భుజముపై అలాగే 'అస్సలాము అలైకుం వ రహ్మతుల్లాహ్' అంటూ ఎడమ భుజము వైపు త్రిప్పి సలాం చేయాలి.

## 9. నమాజ్ చేయు పద్ధతి

మనలో కొందరు నమాజ్ చేయుట తెలియక, మరికొందరు నమాజ్ చేయుటకు చాలా టైము పడుతుందని, తమ పనులకు ఆటంకం కలుగుతుందనే అపోహతో, మరికొంత మంది చదువుట తెలియదని చెప్పుకొనుటకు సిగ్గుతో, ఇంకా కొందరు నిర్లక్ష్యంతో నమాజ్ చేయరు. కాని నమాజ్ చేయుటకు ఐదు, పది నిమిషముల కన్నా ఎక్కువ టైము పట్టదు. మరియు చాలా సులభము. అతి సునాయాసంగా అభ్యసించు పద్ధతి ఈ క్రింద విరించబడినది. ప్రప్రథమంగా ఈ విధంగా అలవాటు చేసుకుంటే చాలు. మొదటిలోనే అన్నీ ఒకేసారి తెలుసుకోవాలని కంగారు పడనవసరం లేదు. క్రమేణా అనుభవమును బట్టి పూర్తి వివరములు తెలుసుకోవచ్చు. అల్లాహ్ మన నియ్యత్ గుర్తించి పుణ్యము కలుగజేయును. ఒకవేళ ఆచరణలో, ఉఛ్ఛారణలో ఏవైనా పొరపాట్లు, తప్పులున్నా అల్లాహ్ మన సహృదయమును గమనించి, తప్పులున్నా మన్నించును. నియమించిన వేళలో రోజుకు 5 పూటల

నమాజ్ ఆచరించిన వానికి దోషము, నేరము, పాపము చేయుటకు తీరికే దొరకదు. ఒకవేళ చెడు కార్యములు చేయుటకు తలపెట్టిన, అతనిలోని ప్రతి రోమము, శరీరములోని ప్రతి అణువు 'నీవు నమాజ్ చదివినది ఈ పాపపు కార్యము చేయుటకేనా అని, అల్లాహ్ ఆగ్రహమునకు గురి అవుదువు' అని నమాజ్ హెచ్చరిస్తూ ఉండును. కావున ఈ క్షణమే ఈ క్రింద ఉదహరించిన ప్రకారం నమాజ్ చదువుట మొదలుపెట్టి దైవప్రీతిపాత్రులు కావలెనని నా మనవి.

## రెండు రకాఅత్‌ల నమాజ్ చేయు విధానము:

వుజూ చేసి నమాజ్ చదువుటకు నిలబడి నియ్యత్ చేసే ముందు ఈ క్రింద వ్రాసిన ఆయత్ చదవవలెను.

**'ఇన్నీ, వజ్‌జ్జహ్‌తు, వజ్ హియ, లిల్లజీ,**
**ఫతరస్సమావాతి, వల్‌అర్‌జ**
**హనీఫం వ్వమా అనమినల్ ముష్రికీన్ (ముస్లిం)**

**తర్జుమా:** మైనె, సారి మఖ్ లూఖ్‌సె, ఎక్సూహోకర్, అప్నారుఖ్ వుస్‌హస్తికె తరఫ్ కర్లియా జిస్నే జమీన్ ఆస్మాన్‌కు పైదాకియాహై ఔర్ మై హర్ గిజ్ షిర్క్ కర్నెవాలో మె సె నహీ హు.

**తెలుగు:** నేను సమస్త ప్రజలతో ఎడబాటై నా ముఖమును, భూమ్యాకాశాలను సృష్టించిన ఆ ప్రభువు వైపుకు త్రిప్పుకున్నాను. మరియు నేను ఏ మాత్రము బహుదైవారాధన చేసే వారిలో లేను.

### ఇప్పుడు నియ్యత్ (సంకల్పము) చేయవలెను.

**నియ్యత్:** యా అల్లాహ్ మై నియ్యత్ కర్తాహు 2 రకాఅత్ ఫరజ్ నమాజ్ పఢ్నేకె, ఫజ్ర్ కె, వాస్తె అల్లాహ్‌కె రుఖ్ మెరా కాబేకె తరఫ్ 'అల్లాహు అక్బర్' (తక్బీరె తహ్‌రీమా) అంటూ రెండు హస్తములు రెండు చెవుల తమ్మెల వరకు ఎత్తవలెను. తర్వాత చేతులు క్రిందికి దించి బొడ్డు క్రింద ఎడమ చేతిపై కుడి చేయి వేసి నిబ్బరముగా నిలబడవలెను. దీనినే ఖియాం అంటారు.

### తరువాత ఇప్పుడు సనా చదువవలెను.

**సనా: సుబ్‌హానకల్లా హుమ్మ, వబిహందిక, వతబార కస్‌ముక, వత ఆలా**

**జద్దుక, వలా ఇలాహ గైరుక. (తిర్మిజి)**

**తర్జుమా:** అయ్ అల్లాహ్! హం తేరి పాకీకె ఇఖ్‌రార్ కర్తేహై. ఔర్ తేరా నాం బహుత్ బర్కత్ వాలా హై. ఔర్ తేరి బుజుర్గీ బహుత్ బెహత్తర్‌హై. ఔర్ తేరె సివా కోయి ఇబాదత్‌కె లాఇఖ్ నహీ.

**తెలుగు:** ఓ అల్లాహ్! నీవు అత్యంత పరిశుద్ధుడవు. స్తోత్రం నీకే చెల్లును. మరియు నీ పవిత్ర నామము శుభప్రదమైనది. నీ ఘనత అత్యుత్తమమైనది. మరియు నీవు తప్ప ఆరాధనకు మరెవ్వరు అర్హులు కారు.

సనా చదివిన తర్వాత **అవూజు బిల్లాహి మినష్షయితాన్ నిర్రజీం బిస్మిల్లా....** చదివి, అల్‌హం సూరా మరొక సూరా చదివి 'అల్లాహు అక్బర్' అంటూ రెండు హస్తములు రెండు మోకాలి చిప్పలకు ఆన్చి రుకూలో వెళ్ళవలెను.

రుకూలో తస్బీ 3/5/7 సార్లు **'సుబ్‌హాన రబ్బియల్ అజీం'** అనవలెను.

తర్జుమా: పాక్ ఔర్ బుజురుగ్ హై మేరా పర్వర్ దిగార్.

తెలుగు: మహోన్నతుడయిన నా ప్రభువు పరిశుద్ధుడు. 3/5/7 సార్లు రుకూలో తస్బీ చెప్పిన తర్వాత నెమ్మదిగా 'సమి అల్లాహూ లిమన్ హమిదహ్' అంటూ రుకూ నుండి నిలబడిన (ఖౌమ) తరువాత 'రబ్బనా లకల్ హమ్ద్' అన వలెను.

తర్జుమా: అల్లాహ్ అప్నె బందోకి హంద్ సున్లీ.

తెలుగు: అల్లాహ్ తన దాసుల ఆరాధన వినెను. ఖౌమా నుండి 'అల్లాహు అక్బర్' అంటూ 2 సజ్దాలు చేయవలెను. ప్రతిసారి సజ్దాలో వెళ్ళునపుడు సజ్దా నుండి తలెత్తి, కూర్చున్నప్పుడు 'అల్లాహు అక్బర్' అని తక్బీర్ చెప్పవలెను. రెండు సజ్దాలలోను నెమ్మదిగా 3/5/7 సార్లు 'సుబ్‌హాన రబ్బియల్ ఆలా' అనవలెను.

తర్జుమా: పాక్‌జాత్ అల్లాహ్ హై మేర పర్‌వర్‌దిగార్.

తెలుగు: నా ప్రభువు గుణగణములు చాలా పవిత్రమైనవి. మరియు ఆయన ఉన్నతుడు.

మొదటి రకాత్‌లో రెండు సజ్దా చేసిన తర్వాత 'అల్లాహు అక్బర్' అంటూ నిలబడవలెను. (ఖియాం)

ఖియాంలో మొదటి రకాత్ మాదిరిగానే చేతులు కట్టుకుని బిస్మిల్లా చదివి అల్‌హం మరొక సూరా చదివి, అల్లాహు అక్బర్ అంటూ రుకూలో వెళ్లి 3 సార్లు తస్బి చదివి నిలబడి (ఖౌమా) తర్వాత రెండుసజ్దాలు చేసి కూర్చుని (ఖాయిదా) అత్తహియ్యాత్, దరూదె ఇబ్రాహీ, దుఆ, చదివి ముఖము కుడి, ఎడమ భజముల వైపు త్రిప్పుకొని సలాం చేయవలెను. ఇప్పుడు రెండు చేతులు ఎత్తి అల్లాహ్ వద్ద మన కోర్కెలు కోరుకుని దుఆలు చేసుకోవలెను.

ఇంతటితో రెండు రకాత్‌ల నమాజ్ పూర్తి అయినది.

దీనిలో ఏమైనా కష్టమున్నదా! లేక తెలుసుకోలేని విషయమా! దీని ఆచరణలో ఆరాధనలో ఏమి కష్టమున్నది. దీనిలో నమాజ్ చదువుట రాదని సిగ్గుపడవలసినదేమున్నది! రెండు మూడు సార్లు మసీదులో లేదా జమాఅత్‌తో నమాజ్ చదివేవారు ఎట్లాగ చేస్తున్నారో చూచి, అవలంబించితే మనకు మనమే తెలుసుకుని సునాయాసంగా నమాజ్ చేయగలుగుతాము.

**గమనిక:** 'ఇన్నీ వజ్జహ్‌తు' సనా, అల్‌హం సూరా మరి ఏదైనా ఇంకొక చిన్న సూరా, అత్తహియ్యాత్ అర్థం చేసుకుని కంఠస్థం చేసుకుంటే నమాజ్ చదవటం వచ్చినట్టే.

ఒకవేళ, నాలుగు రకాలత్‌ల సున్నత్ నమాజ్ చదువవలసినప్పుడు, పైన చెప్పిన మాదిరిగా నమాజ్ చదివి, రెండవ రకాఅత్‌లో రెండవ సజ్దా చేసి కూర్చుని, అత్తహియ్యాత్ 'అబ్దుహు వరసూలహూ' వరకు చదివి 'అల్లాహు అక్బర్' అంటూ నిలబడి తతిమా మూడు, నాలుగు రకాఅత్‌ల నమాజ్ చదివినట్లే చదివి పూర్తి అత్తహియ్యాత్, దరూదె ఇబ్రాహీమ్, దుఆ చదివి సలాం చేయవలెను.

ఒకవేళ మూడు లేక నాలుగు రకాఅత్‌ల ఫర్జ్ నమాజ్ చదువదలచినప్పుడు రెండు రకాఅత్‌ల తర్వాత నిలబడి మూడు, నాలుగు రకాఅత్‌లలో ఒక్క అల్‌హం సూరా మాత్రమే చదువవలెను; అల్‌హంతోపాటు మరియొక సూరా చదవనవ సరం లేదు. తతిమా విషయాలు మామూలు మాదిరిగానే చదువవలెను. ఫర్జ్ నమాజ్ చదివినపుడు నియ్యత్ చేసే ముందు "ఇఖామత్" చదవవలెను.

ఫర్జ్ నమాజ్ ఇమామ్ వెనుక చదివినప్పుడు నియ్యత్ చేసి, తక్బీరె

తహ్‌రీమా చేసి సనా చదువవలెను. ఫర్జ్ నమాజ్ ఇమామ్ వెనుక చదివేటప్పుడు మనసులో చాలా నెమ్మదిగా ప్రతి రకాతులో అల్‌హం సూరా చదువవలెను (బుఖారి ముస్లిం). కాని హనఫీ సాంప్రదాయంలో సూరె ఫాతిహాగాని, ఏ ఇతర సూరాగానీ చదవనవసరంలేదు. పూర్తిగా ఇమాంను అనుసరించవలసినదే. రుకూలో తస్బీహ్, సజ్దాలో తస్బీహ్, ఖాయిదాలో అత్తహియ్యాత్ దరూదె ఇబ్రాహీమ్, దుఆ చదివి ఇమాంతోపాటు సలాం చేయవలెను. సూరె ఆరాఫ్ 204 ఆయత్ ప్రకారం ఖుర్‌ఆన్‌ను పఠించునపుడు మీపై అల్లాహ్ కరుణ కలుగుటకై నిశ్శబ్దంగా చెవియొగ్గి వినుడు అని ఆజ్ఞ. మిష్కాతె హదీస్ 762, 790 అనుసరించి ముక్తదీలు నిశ్శబ్దంగా ఉండవలెను.

## 3 రకాఅత్‌ల వాజిబుల్ వితర్ నమాజ్‌చేయు విధము

**1. నియ్యత్:** యా అల్లాహ్! మై నియ్యత్ కర్తాహు, వాజిబుల్ విత్రకె తీన్ రకాత్ నమాజ్ పడ్నే కే లియే, వాస్తే అల్లాహ్‌కె రుఖ్ మెరా కాబే కి తరఫ్ 'అల్లాహు అక్బర్' అంటూ తక్బీర్ ఎ తహ్‌రీమా చేసి చేతులు కట్టుకొని మొదటి రెండు రకాఅత్‌లు పైన చెప్పిన మాదిరిగా చదువవలెను. రెండవ రకాఅత్ ఖాయిదాలో అత్తహియ్యాత్ 'అబ్దుహు వర సూలుహూ' వరకు చదివి 'అల్లాహు అక్బర్' అంటూ నిలబడి అల్‌హం, మరియొక సూరా చదివి, 'అల్లాహు అక్బర్' అంటూ రెండు చేతులు చెవుల తమ్మెల వద్దకు తీసుకొని వెళ్ళి చేతులు కట్టుకుని 'దుఆఎ ఖునూత్' చదువవలెను. దుఆ ఎ ఖునూత్ చదివి రుకూలో వెళ్ళి, తర్వాత రెండు సజ్దాలు చేసి, ఖాయిదాలో అత్తహియ్యాత్ దరూదె ఇబ్రాహీం, దుఆ, చదివి సలాం చేయవలెను. ఈ విధంగా మూడు రకాఅత్‌ల వాజిబుల్ వితర్ నమాజ్ పూర్తి అయినది. (కబీరీ 333, పతనా అలంగిరి 1:178)

# 10. సజ్దా సహూ

నమాజ్‌లో మనము అప్పుడప్పుడు, అశ్రద్ధ వల్ల కొన్ని పొరపాట్లు కొన్ని లోపములు చేసి, నమాజ్ సరియైన విధముగా చేయకపోవుట సంభవించును. ఉదాహరణకు : రుకూలో చదవవలసిన తస్బీహ్ (స్మరణ) సజ్దాలో చదువుట, లేదా సజ్దాలో చదువవలసిన తస్బీహ్ రుకూలో చదువుట, లేదా రెండు సార్లు రుకూ చేయుట లేదా ఒకసారి గాని మూడుసార్లు గాని సజ్దా చేయుట, లేదా నమాజ్ ఆరాధనలోగాని, ఆచరణలోగాని ఏదో పొరపాటు, లోటు చేసినట్లు అనుమానము కలుగువచ్చు. ఇట్లాగే ఎన్నో పొరపాట్లు, తప్పులు జరుగు

చుండును. ఇటువంటి సమయాలలో నమాజ్ అవదు. మళ్లీ మొదటి నుండి, నియ్యత్ చేసి చదువవలసినదే. కాని పైన ఉదహరించిన, చిన్న చిన్న పొరపాట్లు, లోపములు జరిగినప్పుడు నమాజ్ మళ్లీ మొదటినుండి చదువనక్కర లేకుండా సజ్దా సహుచేసి చేసిన తప్పులు సరిదిద్దుకోవచ్చు.

## 11. సజ్దా సహు చేయు విధము:

నమాజ్ చివర రకాఅత్‌లో అనగా 'ఖాయిదా'లో అత్తహియ్యాత్ 'అబ్దుహు వ రసూలుహు' వరకు చదివి 'అస్సలాము అలై కుం వ రహ్మతుల్లాహి' అని కుడి చేతి వైపు సలామ్ చేసి తర్వాత రెండుసజ్దాలు చేసి ఖాయిదాలో కూర్చుని మళ్ళీ అత్తహియ్యాత్; దరూదె ఇబ్రాహీం, దుఆ చదివి కుడి, ఎడమ భుజముల వైపు సలాం చేయవలెను. సజ్దా సహు చేసిన నమాజ్ సక్రమమగును.

## 12. జమాఅత్ నమాజ్ (సామూహిక ప్రార్థన)

జమాఅత్ నమాజ్ మొదలు పెట్టబడినప్పుడు, ఆలస్యముగా వచ్చిన వ్యక్తి, జమాఅత్‌తో నమాజ్ చేయు విధము:

**రెండు రకాఅత్‌ల జమాఅత్ నమాజ్** : ఉదాహరణకు రెండు రకాఅత్‌ల జమాఅత్ నమాజ్ ప్రారంభమై, ఒక రకాత్ నమాజ్ అయిపోయినదనుకుందాము. అప్పుడు ఆలస్యముగా వచ్చిన వ్యక్తి రెండవ రకాత్‌లో ప్రవేశించి, ఇమాంతోపాటు నమాజ్‌లో పాల్గొని నమాజ్ చదువును. ఇమాం నమాజ్ పూర్తి చేసి సలాం చేసిన తర్వాత, ఈ వ్యక్తి సలాం చేయకుండా, నిబలడి కోల్పోయిన ఒక రకాత్ నమాజ్‌ను తాను స్వయంగా చదువవలెను.

ఇదే విధంగా మూడు రకాఅత్‌లు, నాలుగు రకాఅత్‌ల సామూహిక నమాజ్‌లలో కూడా ఇమాంతో చదివి, కోల్పోయిన రకాఅత్‌లను ఇమాం సలాం చేసిన తర్వాత, తాను సలాం చేయకుండా నిలబడి స్వయంగా పూర్తి చేసుకోవలెను.

**గమనిక:**

1. ఇమాం సలాం చేయక ముందు, చివరి రకాత్ చివరి భాగములోనైనా

సరే జమాఅత్‌తో కలిసి నమాజ్ చదివితే, ఒంటరిగా స్వయంగా నమాజ్ చదివిన దానికంటే అధిక ఫలము లభించునని గుర్తించవలెను. కాని సాధ్యమైనంత వరకు ఇమాంతోపాటు నమాజ్‌లో మొదటి నుండి పాల్గొనుట చాలా ఉత్తమము.

2. జమాత్ నమాజ్‌లో ఎప్పుడు వచ్చి చేరినా, నియ్యత్ చేసి తక్బీర్ యె తహ్‌రీమా చేసి ఇమాంను అనుసరించవలెను.

## 13. నమాజ్‌లో స్త్రీలు గమనించవలసిన ముఖ్య విషయాలు:

1. స్త్రీలు నియ్యత్ చేసిన తర్వాత 'అల్లాహు అక్బర్' అంటూ రెండు చేతులు భుజముల వరకు ఎత్తి, ఎడమ చేతిపై కుడి చేయి వేసి నిబ్బరముగా ఛాతీ మీద కట్టుకోవలెను. చేతులు బుర్ఖా నుండి పైకి తీయరాదు.
2. రుకూలో మగవారు వంగినట్లు పూర్తిగా వంగకపోయినా ఫరవాలేదు.
3. రుకూలో, సజ్దాలో చేతులు విశాలముగా చేయరాదు. చేతులు దేహమునకు అంటిపెట్టుకున్నట్లు దేహమంతా ముడుచుకున్నట్లు ఉంచవలెను.
4. సజ్దాలో మోచేతులు భూమికి ఆన్చవలెను.
5. ఖాయిదాలో, జల్సాలో రెండు పాదములు కుడివైపు మడిచి, కూర్చోవలెను.
6. చేతులు నమాజ్ వస్త్రము నుండి బయటికి తీయరాదు. వస్త్రము దేహమంతా కప్పి, చీలమండల వరకు కప్పిపుచ్చి ఉంచవలెను.
7. తలవెంట్రుకలు కనపడకుండా, నమాజ్ వస్త్రముతో పూర్తిగా కప్పుకోవలెను.
8. స్త్రీలు అజాన్, ఇఖామత్ చెప్పనవసరంలేదు. వారుజుమా నమాజ్ చదువనవసరం లేదు. ఆ పూట జుహర్‌నమాజ్ చదువవలెను.

## 14. నమాజ్ ఖస్ర్ (ప్రయాణీకుని నమాజ్) రకాఅత్‌లు:

మనము ప్రయాణములో ఉన్నప్పుడు కూడా నమాజ్ చదువవలసినదే. ఖజా చేయరాదు. అయితే ప్రయాణములో ఉన్నప్పుడు ఆ పూటలోని రకాత్‌లన్నీ చదవనవసరంలేదు. నమాజ్ ఖస్ర్ చేయవలెను. అనగా ఫర్జ్ రకాఅత్‌లోని సగము

రకాఅత్‌లే చదువవలెను. సున్నత్, నఫిల్ చదువనవసరంలేదు. కాని ఫజ్ర్ నమాజ్‌లోని 2 సున్నతులు 2 ఫర్జ్‌లు చదువవలెను. మగ్‌రిబ్ నమాజ్‌కు ఖస్ర్ లేదు. 3 రకాఅత్‌ల ఫర్జ్ నమాజ్ చదువవలెను. ఇషాలో 2 రకాఅత్‌ల ఫర్జ్ చదివి 3 రకాఅత్‌ల వాజిబుల్ వితర్ చదువవలెను.

## 15. నమాజ్ ఖస్ర్ నిబంధనలు:

1. ఒక గ్రామం నుండి మరొక గ్రామం 78 కి.మీ. గాని, అంతకు మించి ఎక్కువ దూరములో ఉన్న గ్రామమునకు 15 రోజుల కంటే ఎక్కువ కాకుండా వుండుటకు నిర్ణయించుకుని ప్రయాణం సాగించునపుడు నమాజ్ ఖస్ర్ అగును.

2. తాను ఇప్పుడు నివసించు గ్రామం నుండి తన స్వంత గ్రామానికి ప్రయాణం చేయునప్పుడు నమాజ్ ఖస్ర్ చేయరాదు. కాని తన స్వంత గ్రామంలో తనకు ఏ విధమైన ఆస్తిలేని ఎడల నమాజ్ ఖస్ర్ చేయవలెను.

3. ప్రయాణీకుడు ఇమాం వెనుక జమాఅత్‌తో నమాజ్ చదువుట సంభవించునప్పుడు ఇమాంతోపాటు అన్ని రకాత్‌లు చదవవలసిందే.

4. ప్రయాణీకుడే జమాఅత్‌కు ఇమామత్ చేసి నమాజ్ చదివించుట సంభవించినపుడు తాను ముసాఫిర్ అని, తాను నమాజ్ ఖస్ర్ చేసి చదివించుతానని ముందుగా ముక్తదీలతో అనగా నమాజ్ వెనుక చదివే వారితో విన్నవించుకోవలెను. ప్రయాణీకుడు నమాజ్ ఖస్ర్ చేసి సలాం చేస్తాడు. ముక్తదీలు మాత్రం సలాం చేయకుండా నిలబడి, మిగిలిన రకాఅత్‌లు చదువుకోవలెను. ముక్తదీలు, ప్రయాణీకులు కారు కాబట్టి వీరు పూర్తి నమాజ్ చదువవలెను.

### పీడ కల వచ్చినపుడు చేసే దుఆ

3 సార్లు **అవూజు బిల్లాహి మినష్షయితా నిర్రజీం**" చెప్పి ఈ దుఆ పఠించాలి **"అవూజు బికలిమాతిల్లాహిత్తామ్మాతి మిన్ గజబిహీ వ ఇఖాబిహీ వ షర్రి ఇబాదిహీ వ మిన్ హమజాతిష్షయాతీని వ ఐంయ్యహ్‌జురూన్"** **(తిర్మిజీ)**

## 5వ అధ్యాయము

# నమాజ్‌లో చదవవలసిన కొన్ని సూరాలు

### 1. సూరయే ఫాతిహ (సూ.నెం.1)

**అవూజుబిల్లాహి మినష్షైయితా నిర్రజీం**

**1. బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం**

**2. అల్‌హందు- లిల్లాహి - రబ్బిల్ - ఆలమీన్**

**3. అర్రహ్-మా - నిర్రహీం**

**4. మాలికి - యౌమిద్దీన్**

**5. ఇయ్యాక -న - అబుదు - వ - ఇయ్యాక - నస్త ఈన్**

**6. ఇహ్ - దినస్ - సిరాతల్ ముస్త - ఖీమ**

**7. సిరాతల్లజీన - అన్ అమ్‌త- అలై - హిం**

**గైరిల్ మగ్‌జూబి - అలైహిం -వల్ - జ్వాల్లీన్ (ఆమీన్)**

**తెలుగు భావము:**

అల్లాహ్‌చే శాపగ్రస్తుడై బహిష్కరించబడిన షైతాన్ ప్రేరేపణలో పడకుండా కాపాడమని అల్లాహ్ శరణువేడుచున్నాను.

అనంతకరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

కరుణామయుడు దయార్ద్ర హృదయుడగు అల్లాహ్ పేరుతో ప్రారంభించుచున్నాను. సమస్త స్తోత్రములు, పొగడ్తలు సర్వలోకాల రక్షకుడగు అల్లాహ్‌కే చెల్లును. అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు (అంటే ఇహలోకంలో బేధ భావాలు లేకుండా అందరికీ ఎల్లప్పుడు కరుణను పంచేవాడు. పరలోకంలో ఆయనను విశ్వసించినవారి కరుణా ప్రదాత.) అల్లాహ్ తీర్పు దినపు (సర్వాధికారి) యజమాని. ఓ అల్లాహ్! మేమునిన్నే ఆరాధించుచున్నాము. నీ సహాయం కొరకు నిన్నే వేడుకొనుచున్నాము. మాకు సన్మార్గము చూపించు. నీ యొక్క కరుణ ప్రసాదించి, నీవు అనుగ్రహించిన వారి బాట చూపించు. నీ మార్గము వదలి, తప్పుడు దారి పట్టి, నీ ఆగ్రహమునకు గురైన వారి మార్గము మాకు వద్దు. ఫాతిహ సూరా చదవటం పూర్తి అయిన తరువాత “ఆమీన్” అని పలకాలి.

## 2. సూరయే అల్ ఖద్ర్ (సూ. నెం.97)

బిస్మిల్లాహిర్రహ్మా నిర్రహీం

1. ఇన్నా - అన్ - జల్నాహు - ఫీ - లైలతిల్ - ఖద్ర్
2. వమా - అద్రాక - మా -లైలతుల్ - ఖద్ర్
3. లైలతుల్ - ఖద్రి - ఖైరుమ్ - మిన్ - అల్ఫి - షహ్రిన్
4. తనజ్ - జలుల్ - మలా - ఇకతు - వర్-రూహు - ఫీహా - బిఇజ్ని - రబ్బిహిమ్ - మిన్ - కుల్లి - అమ్రిన్
5. సలామున్ - హియ - హత్తా -మత్ - లిల్ - ఫజరి

### తెలుగు భావము:

అనంతకరుణాయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

1. నిశ్చయముగా మేము ఖుర్ఆన్ను ఘనతగల పెద్ద రాత్రి అవతరింప జేశాము. (లౌహె మహ్ఫూజ్ నుండి భూమికి దగ్గరగా వున్న ఆకాశంపై దించాము.)
2. మరి ఈ పెద్ద రాత్రి గురించి నీవేమి అనుకుంటున్నావు? (దీనినే లైలతుల్ ఖద్ర్ అని అంటారు.)
3. ఆ ఘనమైన రాత్రి వేయి రాత్రుల కంటే శ్రేష్ఠమైనది.
4. ఆ రాత్రియందు దైవదూతలును, పరిశుద్ధాత్మ (జిబ్రాయీల్) తమ ప్రభువు ఉత్తర్వులపై (ఆజ్ఞచే) సమస్త విషయాల నిర్వహణ కార్యరూపం ఇచ్చే నిమిత్తం దివి నుండి భువికి తీసుకొని దిగివత్తురు.
5. ఆ రాత్రి ఆసాంతం శాంతియుతమైనది, అది తెల్లవారే వరకుండునది

## 3. సూరయే అల్ అసర్ (సే.నెం.103)

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం

1. వల్ - అస్రి
2. ఇన్నల్ - ఇన్సాన - లఫీ - ఖుస్రిన్
3. ఇల్లల్ - లజీన - ఆమనూ - వ - అమిలుస్ - సాలిహాతి - వత-వాసౌ - బిల్ హఖ్ ఖి - వత - వాసౌ - బిస్ - సబ్రి.

### తెలుగు భావము :

అనంతకరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

1. నడిచిన కాలము యొక్క సాక్షిగా ఉదహరించి చెప్పునది.
2. నిశ్చయముగా మానవుడు చాలా నష్టములో పడియున్నాడు.
3. కాని విశ్వసించి సత్కార్యములు చేసినవారును, ఒకరికొకరు సత్యమును గూర్చి బోధించినవారును, ఒకరికొకరు సత్యధర్మంపై స్థిరముగా ఉండవలెనని బోధించిన వారును, ఏ విధమైన నష్టకష్టాలపాలు కారు.

## 4. సూరహ్ ఫీల్ సూరా నెం. 105

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

**1. అలమ్ తర కైఫ ఫఅల రబ్బుక బి అస్హాబిల్ ఫీల్,**

**2. అలమ్ యజ్అల్ కైదహుమ్ ఫీ తజ్లీల్,**

**3. వ అర్సల అలైహిమ్ తైరన్ అబాబీల్,**

**4. తర్మీహిమ్ బిహిజారతిమ్ మిన్ సిజ్జీల్.**

**5. ఫజఅలహుమ్ కఅస్ ఫిమ్ మాకూల్.**

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

ఏనుగుల వారిపట్ల నీ ప్రభువు ఎలా వ్యవహరించాడో నీవు చూడలేదా? ఆయన వారి కుట్రను భగ్నం చెయ్యలేదా? ఆయన వారిపైకి పక్షుల్ని గుంపులు గుంపులుగా పంపాడు. అవి మట్టి కాల్చగా తయారయిన కంకర రాళ్లను వారిపైకి విసరివేస్తుండేవి. చివరికి వారి స్థితిని (పశువులు) తినేసిన పొట్టు మాదిరిగా మార్చివేశాడు.

## 5. సూరయే ఖురైష్ (సూ.నె. 106)

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీం

**1. లిఈలాఫి - ఖురైషిన్**

**2. ఈ - లా -ఫి-హిమ్-రిహ్ -లతష్ - షితా - ఇ- వస్సైఫ్**

**3. ఫల్ - యఅ - బుదూ - రబ్బ- హజల్ - బైతిల్**

**4. ల్లజీ - అత-అమహుమ్- మిన్-జూఇన్-వ-ఆమన- హుమ్-మిన్-ఖౌఫ్**

**తెలుగు భావము:**

అనంతకరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

1. చూడండి ఖురైషు ప్రజలు ఎలా అలవాటు పడ్డారో!
2. చలికాలంలోనూ, ఎండాకాలములోనూ ప్రయాణమునకు అలవాటు పడి వున్నారు.
3. కాబట్టి వారు ఈ కాబా గృహము యొక్క ప్రభువును ఆరాధించ వలయును.
4. ఆ ప్రభువు వారికి ఆహారమిచ్చి ఆకలి బాధల నుండి కాపాడాడు. శాంతిని ప్రసాదించి భయం నుండి రక్షించాడు.

## 6. సూరయే అల్ కౌసర్ (సూ.నె.108)

బిస్మిల్లాహిర్రహ్మా నిర్రహీం

1. **ఇన్నా - అఅ-తైనా -కల్ - కౌసర్.**
2. **ఫసల్లి - లి - రబ్బిక - వన్ - హర్.**
3. **ఇన్న షాని - అక - హువల్ - అబ్‌తర్.**

**తెలుగు భావము:**

అనంతకరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

ఓ ప్రవక్తా! తమకు మేము సమృద్ధిగా కౌసర్ సరస్సును అనంతమైన మేళ్లను ప్రసాదించాము. ఇక తమరు కృతజ్ఞతతో అల్లాహ్ కొరకు నమాజ్ చెయ్యి, ఖుర్బానీ ఇవ్వు (తమరు దుఃఖ పడనవసరంలేదు) తమను కించపరచిన శత్రువే అనామకుడై నామరూపాలు లేకుండా పోయేవాడు.

## 7. సూరయే అల్ కాఫిరూన్ (విశ్వసించని వారి గురించి) సూ. నె.109

బిస్మిల్లాహిర్రహ్మా నిర్రహీం

1. **ఖుల్-యా-అయ్యుహల్-కాఫిరూన్**
2. **లా - అఅబుదు మా - తాబుదూన్**
3. **వలా - అన్ - తుమ్ - ఆబిదూన - మా -ఆబుద్**
4. **వలా - ఆన - ఆబిదుమ్ - మ్మా అబత్తుమ్**
5. **వలా - అన్తుమ్ -ఆబిదూన-మా అ - అబుద్**
6. **లకుమ్ - దీనుకుమ్ - వలియదీన్**

## తెలుగు భావము:

అనంతకరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

1. (ఓ ప్రవక్తా ఇట్లు పలుకుము) ఓ అవిశ్వాసులారా,
2. మీరు ఆరాధించునట్టి వాటిని నేను ఆరాధించుటలేదు.
3. మరియు నేను ఆరాధించుచున్న (అల్లాహ్‌ను) మీరు ఆరాధించుటలేదు.
4. మరియు మీరు ఆరాధించునట్టి (మీరే సృష్టించుకొన్న దైవములను) వాటిని నేను ఆరాధించువాడను కాను.
5. మరి నేను ఆరాదించు (అల్లాహ్‌ను) వానిని మీరెలాగూ ఆరాధించరు.
6. మీ మతము, ధర్మం మీకు మరియు నా మతము, ధర్మం నాకు.

## 8. సూరహ్ నస్ర్ సూరా నెం. 110

**బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్**

**1. ఇజా జాఅ నస్రుల్లాహి వల్ ఫత్‌హు**

**2. వరఐతన్నాస యద్‌ఖులూన ఫీ దీనిల్లాహి అఫ్‌వాజా.**

**3. ఫసబ్బిహ్ బిహమ్ది రబ్బిక వస్తగ్‌ఫిర్‌హు ఇన్నహూ కాన తవ్వాబా.**

*అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో*

అల్లాహ్ సహాయం వచ్చినప్పుడు, విజయ భాగ్యం లభించినప్పుడు ప్రజలు తండోప తండాలుగా అల్లాహ్ ధర్మంలో ప్రవేశించటాన్ని నీవు చూసినప్పుడు (ఓ ప్రవక్తా!) నీవు నీ ప్రభువు స్తోత్రంతో పాటు అల్లాహ్ పవిత్రతను స్మరిస్తూ ఉండు. ఇంకా అల్లాహ్ మన్నింపును వేడుకో. నిస్సందేహంగా అల్లాహ్ పశ్చాత్తాపాన్ని ఎంతగానో అంగీకరించేవాడు.

## 9. సూరహ్ లహబ్ సూరా నెం. 111

**బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్**

**1. తబ్బత్ యదా అబీ లహబిం వ్వతబ్బ,**

**2. మాఅగ్‌నా అన్‌హు మాలుహూ వమా కసబ్,**

**3. సయస్‌లా నారన్ జాత లహబ్,**

**4. వమ్రఅతుహూ హమ్మాలతల్ హతబ్,**

**5. ఫీజీదిహా హబ్లుమ్మిమ్మసద్.**

*అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో*

అబూలహబ్ చేతులు విరిగిపోయాయి! అతడు సర్వనాశనం అయి పోయాడు. అతడి ఆస్తిపాస్తులు, అతడి సంపాదన అంతా దేనికీ పనికిరాకుండా పోయింది. చివరికి అతడు తప్పకుండా భగభగమండే అగ్నిలో పడవేయబడ తాడు. అంతేకాదు (అతడితోపాటు) అతడి భార్య కూడ అందులో పడవేయబడు తుంది. ఆమె చాడీలు చెబుతూ కలహాలు రేపే స్త్రీ. ఆమె మెడలో బాగా పేనిన ఒక త్రాడు ఉంటుంది.

## 10. సూరయే ఇఖ్లాస్ (ఏకత్వము) సూ.నె.112

**బిస్మిల్లా హిర్రహ్మానిర్రహీం**

**1. ఖుల్ - హువల్లాహు-అహద్.**

**2. అల్లాహుస్ - సమద్**

**3. లమ్ - యలిద్ - వలమ్ - యూలద్**

**4. వ - లమ్ - యకుల్ -ల్లహూ - కుఫువన్ - అహద్.**

**తెలుగు భావము:**

అనంతకరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

1. ఓ ప్రవక్తా ఇట్లు పలుకుము. ఆ అల్లాహ్ అద్వితీయుడు. ఒక్కడే.
2. అల్లాహ్ ఎటువంటి అక్కరలేనివాడు నిరాపేక్షాపరుడు.
3. అల్లాహ్ బిడ్డలను కనలేదు, అంటే అల్లాహ్‌కు సంతానము లేదు. మరియు అల్లాహ్ (తల్లిదండ్రులచే)జన్మించినవాడు కాడు. అంటే అల్లాహ్ ఎవరి సంతానము కాదు.
4. మరియు అల్లాహ్‌కు ఎవరూ సరిసమానులు కారు. లేరు.

## 11. సూరయే అల్ ఫలక్ (ఉదయము) సూ.నెం.113

బిస్మిల్లా హిర్రహ్మానిర్రహీం

**1. ఖుల్ -అఊజు - బిరబ్బిల్ - ఫలఖ్**

**2. మిన్ - షర్రి - మాఖలక్**

**3. వ - మిన్ - షర్రి - గాసి -ఖిన్ - ఇజా - వఖబ్**

**4. వ - మిన్ - షర్రిన్ - నఫ్ఫాసాతి - ఫిల్ - ఉఖది.**

**5. వ - మిన్ -షర్రి -హాసిదిన్ - ఇజా హసద్.**

**తెలుగు భావము:**

అనంతకరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

1. (ఓ ప్రియ ప్రవక్తా ఇట్లు పలుకుము. నేను శరణు వేడుకొనుచున్నాను. ఉదయమునకు ప్రభువు (అయిన అల్లాహ్) ను.
2. సర్వసృష్టి యొక్క కీడు నుండి
3. క్రమ్ముకొను చీకటి రాత్రి యొక్క (షైతాను) కీడు నుండి.
4. ముడులతో (మంత్రాలు) మంత్రించి ఊదునట్టి (స్త్రీల చెడు కీడు నుండి, అంటే అర్థం చేతబడి చేసే స్త్రీ, పురుషులు అని భావం).
5. అసూయాపరుడు, అసూయ చేయునపుడు గలుగు దిష్టి - కీడు నుండి రక్షింపబడుటకై ప్రార్థించుచున్నాను.

## 12. సూరయే నాస్ జనులు (సూ.నె.114)

**బిస్మిల్లా హిర్రహ్మానిర్రహీం**

**1. కుల్ - అవూజు - బి - రబ్బిన్నాస్**

**2. మలికిన్నాస్**

**3. ఇలా - హిన్నాస్**

**4. మిన్ - షర్రిల్ - వస్వాసిల్ - ఖన్నాస్**

**5. అల్లజీ - యువస్ - విసు - ఫీ - సుదూరిన్నాస్.**

**6. మినల్ జిన్నతి వన్నాస్.**

**తెలుగు భావము:**

అనంతకరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

1. ఓ ప్రవక్తా ఇలా పలుకుము. నేను శరణు వేడుతున్నాను.
2. జనుల స్వామిని (అల్లాహ్‌ను).
3. జనుల పూజ్యుడు అగు అల్లాహ్ యొక్క శరణు కోరుతున్నాను.

4. షైతాను కీడు మరియు సందేహాలు, సంశయాలు, దుశ్శంకలు సృష్టించు వాని నుండి,
5. ఎవడైతే జనుల హృదయములలో కలతలుసృష్టించి, వెనుకకు మరలి పోవునో (అట్టి వాని నుండి రక్షణ పొందుటకై)
6. వాడు మానవుల్లోని వాడైనా, జిన్నాతుల (షైతాను)ల్లోని వాడైనా వీరిద్దరి బారి నుండి నేను శరణు కోరుతున్నాను.

ఖుర్ఆన్ నుండి కనీసము వరసగా మూడుచిన్న ఆయతులుకూడా నమాజ్‌లో అల్‌హం సూరా తర్వాత చదువవచ్చును.

ఉదాహరణకు ఈ క్రింద 3 ఆయతులు (దివ్యఖుర్ఆన్ 37 : 180, 181, 182)

**1) సుబ్‌హాన రబ్బిక రబ్బిల్ ఇజ్జతి అమ్మా యసిఫూన్**
**2) వసలామున్, అలల్ మురసలీన్**
**3) వల్‌హందు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్**

**తెలుగు భావము:**

1) గౌరవనీయుడైన నీ ప్రభువు, వారు (కాఫిర్లు) కల్పించి చెప్పే విషయాలకు అతీతుడు, పరమ పవిత్రుడు.
2) మరియు, ప్రవక్తలపై, అల్లాహ్ యొక్క కటాక్షము, శాంతి కలుగుగాక (ఆమీన్)
3) మరియు సమస్త స్తోత్రములు, సర్వలోకాల రక్షకుడైన ఆ అల్లాహ్‌కే చెల్లును.

## 1) మసీదులో ప్రవేశించునపుడు చదవవలసిన దుఆ

**'అల్లాహుమ్మఫ్ తహ్‌లీ, అబ్‌వాబ రహ్‌మతిక'**

తర్జుమా: అయ్ అల్లాహ్! మేరే లియే, అప్పే రహమత్‌కే దర్వాజె ఖోల్‌దె.
తెలుగు: ఓ అల్లాహ్! నాకై తమ కారుణ్య ద్వారములు తెరువుము.

## 2) మసీదు నుండి బయటకు వచ్చినప్పుడు చదువవలసిన దుఆ

**'అల్లాహుమ్మ, ఇన్నీ అస్‌అలుక, మిన్ ఫజ్‌లిక'**

తర్జుమా: అయ్ అల్లాహ్ ఆప్‌సె, ఆప్‌కె, ఫజల్ మాంగ్‌తాహు.

తెలుగు: ఓ అల్లాహ్! నేను, నీ కరుణకై వేడుకొనుచున్నాను.

## అత్తహియ్యాత్

తషహ్హుద్:

**'అత్తహియ్యాతు, లిల్లాహి, వస్సలవాతు**

**వత్తయ్యిబాతు, అస్సలాము అలైక**

**అయ్యు హన్న బియ్యు వ రహ్మతుల్లాహి**

**వ బరకాతుహూ అస్సలాము అలైనా**

**వ అలా ఇబాదిల్లా హిస్సాలిహీన్**

**అష్హదు అల్లా ఇలాహ, ఇల్లల్లాహు**

**వ అష్హదు అన్న ముహమ్మదన్**

**అబ్దుహూ వ రసూలుహూ' (ముస్లిం)**

గమనిక: నమాజ్ చదివేటప్పుడు, ఖాయిదాలో తషహ్హుద్ చదువుతున్నప్పుడు 'అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు' అనునప్పుడు కుడిచేతి చూపుడు వ్రేలు కాస్త పైకి ఎత్తి మరల వెంటనే క్రిందికి దించవలెను.

తర్జుమా: సబ్ జబాని, మాలి, బద్నీ ఇబాదత్ అల్లాహ్‌కె లియే హై అయ్ అల్లాహ్‌కే నబీ! తుమ్‌పర్ సలాం ఔర్ ఖుదాకి రహమత్ ఔర్ వుస్కీ బర్కత్ నాజిల్ హో, సలామత్‌హో హంపర్, ఔర్ ఖుదాకె నేక్ బందోపర్ మై గవాహీ దేతాహు కె, అల్లాహ్ కె సివా కోయి మాబూద్ నహి, ఔర్ మై గవాహీ దేతాహు కె, హజరత్ ముహమ్మద్ ముస్తఫా (సఅసం) వుస్కే నేక్ బందె ఔర్ పైగంబర్ హై.

**తెలుగు అనువాదము:**

నోటితో, శరీరావయవములతో, ధనముతో ఆరాధించు, అర్పించు ప్రతి భక్తి, సమస్త గౌరవములు అల్లాహ్ కొరకే, ఓ దైవప్రవక్తా! మీపై అల్లాహ్ కరుణ మరియు అల్లాహ్ యొక్క మెప్పు సర్వదా ఉండుగాక, మాపై మరియు సచ్ఛీలురైన దేవుని దాసులపై శాంతికలుగుగాక! అల్లాహ్ తప్ప మరెవ్వరూ

పూజార్హులు కాలేరని (హృదయపూర్వకముగా) సాక్ష్యమిచ్చుచున్నాను. మరియు ముహమ్మద్ (సఅసం) అల్లాహ్ యొక్క దాసుడు మరియు ప్రవక్తయని కూడా సాక్ష్యమిచ్చుచున్నాను.

## దరూదె ఇబ్రాహీం

**అల్లాహుమ్మ, సల్లి అలా, ముహమ్మదిన్వ్,**
**వ అలా ఆలి, ముహమ్మదిన్, కమాసల్లైత,**
**అలా ఇబ్రాహీమ వ అలా ఆలి ఇబ్రాహీమ**
**ఇన్నక హమీదుం మజీద్**
**అల్లాహుమ్మ బారిక్, అలా ముహమ్మదిన్వ్**
**వ అలా ఆలి ముహమ్మదిన్ కమా బారక్త**
**అలా ఇబ్రాహీమ, వ అలా ఆలి ఇబ్రాహీమ**
**ఇన్నక హమీదుం మజీద్ (బుఖారి)**

## దరూదె ఇబ్రాహీం (తర్జుమా)

అయ్ అల్లాహ్! హజరత్ ముహమ్మద్ (సఅసం) ఔర్ హజరత్ ముహమ్మద్ (సఅస)కి, ఆల్‌పర్ రహమత్ ఫర్మా, జిస్ తర్హా తూనె, హజరత్ ఇబ్రాహీం (అ.స.)పర్, ఔర్ హజరత్ ఇబ్రాహీం (అస) ఆల్ పర్ రహమత్ భేజీ బేషక్, తూ, తారీఫ్‌కా ముస్తహిఖ్ హై బుజురుగ్ హై అయ్ అల్లాహ్ బరకత్‌దే, హజరత్ ముహమ్మద్ (సఅసం)కి, ఆల్‌కు, జిస్ తర్హా తూనె బర్‌కత్‌దీ, హజరత్ ఇబ్రాహీం (అస)కు, ఔర్ వున్కె ఆల్‌కు బేషక్ తూ తారీఫ్‌కా ముస్తహిబ్ హై బుజురుగ్‌హై.

## దరూదె ఇబ్రాహీం తెలుగు అర్థము:

ఓ అల్లాహ్! నీవు ఏ విధముగానైతే హజరత్ ఇబ్రాహీం (అ.స.) పైన, వారి సంతతిపైన కరుణ చూపినావో, అట్టి విధముగానే, హజరత్ ముహమ్మద్ (సఅసం)పైన, వారి సంతతిపై కూడా నీ కరుణ చూపుము. యదార్థముగా నీవు స్తోత్రములకు, పొగడ్తలకు, ఆరాధనలకు అర్హుడవు. ఓ అల్లాహ్! నీవు ఏ విధంగా హజరత్ ఇబ్రాహీం (అస) పైన, వారి సంతతిపై ఆప్తులకు, సంబంధీకులకు ఉన్నతి నొసగినావో, ఆ విధంగా హజరత్ ముహమ్మద్ (సఅస)కు వారి

ఆప్తులకు, సంబంధీకులకు సంతతికి కూడా ఉన్నతిని, శుభాలను ప్రసాదింపుము.

**నమాజులో పఠించు దుఆ (ఏదైనా ఒక దుఆ చదవాలి)**

1. **అల్లాహుమ్మ ఇన్నీ జలమ్తు నఫ్సీ జుల్మన్ కసీరవ్**
**వలాయగ్ ఫి రుజ్జునూబ ఇల్లా అన్‌త ఫగ్ఫిర్లీ మగ్ఫిరతమ్**
**మిన్ ఇన్‌దిక వర్‌హమ్‌నీ ఇన్నక అన్‌తల్ గఫూరుర్రహీమ్.**

ఓ అల్లాహ్! నేను నా ఆత్మపై చాలా దౌర్జన్యం చేశాను. నీవు తప్ప నా పాపాలను మన్నించే వాడెవడు లేడు. అందుకని నీ ప్రత్యేక క్షమాభిక్షతో నన్ను మన్నించు. నన్ను కరుణించు. నిస్సందేహంగా నీవే మన్నించేవాడివి, కరుణించే వాడివి.

2. **అల్లాహుమ్మగ్ఫిర్లీ వలివాలిదయ్య**
**వలి ఉస్తాది వలి జమీయిల్ మోమినీన**
**వల్ మోమినాతి వల్ ముస్లిమీన, వల్**
**ముస్లిమాతి బి రహ్మతిక, యా**
**అర్‌హమర్రాహిమీన్.**

**తెలుగు దుఆ తర్జుమా:**

ఓ అల్లాహ్! నన్ను క్షమింపుము. మరియు నా తల్లిదండ్రులను మరియు నాకు జ్ఞానమొసగిన గురువులను మరియు అందరుముస్లిములను తీర్పు దినమున పాప పుణ్యములు లెక్కించే నాడు క్షమింపుము. కరుణచే ఓ కరుణామయుడా! నీ కరుణ అందరికన్నా గొప్పది.

**వితర్ నమాజ్‌లో చదవవలసిన 'దుఆ ఎ ఖునూత్'**

**అల్లాహుమ్మ ఇన్నా, నస్తఈనుక, వస్తగ్ఫిరుక**
**వనూ మిను బిక, వనతవక్కలు అలైక,**
**వనుస్నీ అలైకల్ ఖైర్ వ నష్కురుక**
**వలా నక్‌ఫురుక, వ నఖ్‌లవు వనత్రుకు**
**మై యఫ్‌జురుక అల్లాహుమ్మ, ఇయ్యాక నఅబుదు**
**వలక నుసల్లీ వ నస్‌జుదు వ ఇలైక నస్‌ఆ**

**వ నహ్ఫిదు వ నర్జూ రహ్మతక**
**వనఖ్షా అజాబక ఇన్న అజాబక**
**బిల్ కుఫ్ఫారి ముల్హిఖ్. (అబూదావూద్, తిర్మిజీ)**

**దుఆ ఎ ఖునూత్ తెలుగు అర్ధము:**

ఓ దేవా! మేము నీ సహాయం కోరుతున్నాము. మా పాపాలకు నీ క్షమార్పణ వేడుకొనుచున్నాము. నిన్నే విశ్వసించుచున్నాము. నిన్నే నమ్ము కున్నాము. నీ యొక్క ఉత్తమ స్తోత్రము చేయుచున్నాము. మరియు నీకు కృతజ్ఞతలర్పించుచున్నాము. మరియు నీకు ఎన్నడూ కృతఘ్నులము కాము. మరియు నీకు అవిధేయులైన వారిని వదిలివేయుచున్నాము. ఓ ప్రభూ! మేము నిన్నే ఆరాధించుచున్నాము. నిన్నే ప్రార్థించుచున్నాము. నీ కొరకే నమాజ్ చేయుచున్నాము. నీ వైపునకే పరిగిడుచున్నాము. నీ సేవకై హాజరవుచున్నాము మరియు నీ కరుణనే ఆశించుచున్నాము. మరియు నీ శిక్షకు భయకంపితు లగుచున్నాము. వాస్తవముగా నీ శిక్ష, ఆగ్రహము కాఫిర్లకు, అవిశ్వాసులకే!

## ఆయతుల్ కుర్సి (నమాజు తరువాత)

**అల్లాహు లా ఇలాహ, ఇల్లాహు వల్ హయ్యుల్ ఖయ్యూం**
**లాతా ఖుజుహు సినతుంవ్ వలా నౌమున్ లహూ**
**మాఫిస్సమావాతి, వమా ఫిల్ అర్జి, మన్జల్లజీ,**
**యస్ఫఉ, ఇన్దహూ, ఇల్లా బి ఇజ్నిహి**
**యాలము మాబైన ఐదీహిం వమా ఖల్ఫహుం**
**వలాయుహీతూన బిషైయిమ్ మిన్ ఇల్మిహీ**
**ఇల్లా బిమాషాఅ, వసిఅ కుర్సియ్యు హుస్సమావాతి**
**వల్అర్జ, వలాయవూదుహూ హిఫ్జుహుమా**
**వహువల్ అలియ్యుల్ అజీం. (దివ్యఖుర్ఆర్ఆన్ 2 : 255)**

**తర్జుమా:** వో అల్లాహ్‌హై, వుస్కె సివా కోయి, మాబూద్ నహీ, వొ జిందాహై ఖాయిం రహెనే వాలా హై న, వుస్కూ ఊంగ్ ఆతి, న, నీంద్ వుసీకా హై జో కుచ్ ఆస్మాన్‌మె హై ఔర్ జొ కుచ్ జమీన్‌మె హై, కౌన్‌హై, జొ వుస్కె ఇజాజత్ కె, బగైర్, వుస్కె పాస్ కిసీకి, షిఫారిష్ కరె. తమాం గాయిబ్ ఔర్ హాజిర్ హాలత్‌కు

వో సబ్ జాన్తాహై లోగ్, వుస్కీ ఇలంమె, కిసీ షికాయత్, నహీ కర్ సక్తే జిత్నా వో ఆప్ చాహె. వుస్కీ కుర్సీ ఆస్మాన్ ఔర్ జమీన్‌కు ఘేరాహు వాహై, ఔర్ వుస్కీ హిఫాజత్‌సె, వొ థక్తా నహీ, ఔర్ వో బడా ఆలిషాన్ ఔర్ అజ్మత్ వాలా హై.

## 'ఆయతల్ కుర్సీ' తెలుగు అర్థము:

అల్లాహ్ మాత్రమే ఆరాధ్యదైవం. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేనే లేడు. అల్లాహకు మరెవ్వరూ సాటిలేరు. అల్లాహ్ నిత్యుడు, అనంతుడు, అల్లాహ్‌కు కునుకుగాని, నిద్రగాని రాదు. నిత్య జాగరూకుడు, నిత్య కార్యశీలుడు. ఆకాశంలోనూ, భూమిలోనూ ఉన్న ప్రతి వస్తువు అల్లాహ్ సొత్తు. అన్నిటికి మూలాధారం. అల్లాహ్ అనుమతి లేనిదే ఒకరు మరొకరి గురించి సిఫార్సు చేయుటకు ఏ మాత్రం అర్హులుకారు. అల్లాహ్ మానవులకు ముందు రానున్నదియు, వారికి పూర్వం గడచినదియు సమస్తం ఎరుగును. ప్రతి అంతరార్థ విషయం, బాహ్య విషయం అల్లాహ్‌కు తెలుసు. అల్లాహ్ దివ్య జ్ఞానము మానవ గ్రహణ పరిధిలోనికి రాదు. అల్లాహ్‌పీఠము ఆకాశములోను, భూమిలోను, యావత్ ప్రవపంచలోను విస్తరించి వున్నది. అల్లాహ్ వాటి కార్యనిర్వహణలో, వాటి సంరక్షణలో ఎన్నడూ అలసట చెందడు. అల్లాహ్‌కు ఆ మొత్తమును కాపాడుట కష్టము కాదు. అల్లాహ్ గొప్పవాడు మరియు సర్వాధికారి.

*గమనిక: ఇది ఆయతుల్ కుర్సీ. దీని శ్రేష్ఠత, మహిమ గురించి ప్రామాణిక హదీసులలో వచ్చింది. ఉదాహరణకు ఈ ఆయతు దివ్యఖుర్‌ఆన్‌లోని ఘనమైన ఆయతు. దీన్ని పారాయణం చేయటం వల్ల రాత్రిపూట షైతాన్ కీడు నుంచి రక్షణ లభిస్తుంది. ప్రతి ఫర్జ్ నమాజ్ అనంతరం ఈ ఆయతుల్ కుర్సీని పఠించటం పుణ్యప్రదం (తఫ్సీర్ ఇబ్నె కసీర్). ఇది అల్లాహ్ యొక్క శాసించే గుణాన్ని, ఆయన వైభవాన్ని, శక్తియుక్తులను అభివర్ణించే ఆయతు.*

# దరూదె షరీఫ్ (నమాజ్ తరువాత)

ఖుర్‌ఆన్‌లో, హదీసులో దరూదె షరీఫ్ యొక్క (ఫజీలత్) ప్రాముఖ్యత గురించి ఎక్కువగా ప్రస్తావించబడినది.

**'ఇన్నల్లాహు, వ మలాఇ కతహు యుసల్లూన అలన్ నబియ్యి యా అయ్యు హల్లజీన, ఆమనూ సల్లూ అలైహి వసల్లిమూ తస్లీమా'** (33 : 56)

**తెలుగు:** నిశ్చయంగా అల్లాహ్, అల్లాహ్ దూతలు కూడా దైవప్రవక్త

(సఅస)పై కారుణ్యాన్ని పంపిస్తున్నారు. ఓ విశ్వాసులారా మీరు కూడా దైవప్రవక్త (సఅస)పై దరూద్ పంపండి. అత్యధికంగా దైవప్రవక్తకు 'సలాములు' పంపుతూనే ఉండండి. నిత్యము దరూదె షరీఫ్ చదివి మన ప్రవక్త ముహమ్మద్ (సఅస)పై దరూద్ పంపుతూ ఉండవలెను. ఎవరయితే ముహమ్మద్ (సఅసం)పై ఒకసారి దరూద్ పంపుతారో అట్టివారిపై అల్లాహ్ పది (10) సార్లు / శుక్రవారం అయితే (70) సార్లు (దరూద్ రహమతె)పుణ్యఫలితాల్ని ఇస్తారు. అనగా 10/70 దోషములు మన్నిస్తారు. మరియు ఎక్కువ సార్లు ఎవరైతే దరూద్ నాపై (సఅసం) పంపుతారో వారి కొరకు నేను ప్రళయ దినాన సిఫారసు చేస్తాను. వారు నాకు(సఅసం) స్వర్గంలో దగ్గరగా వుంటారు.

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం

**అల్లాహుమ్మ, సల్లి అలా, సయ్యిదినా ముహమ్మదిన్, వ అలా ఆలి సయ్యిదినా ముహమ్మదిన్వ్ వ బారిక్ వ సల్లిం "సబ్హాన రబ్బిక, రబ్బిల్ ఇజ్జతి, అమ్మా యసిఫూన్ వసలామున్ అలల్ ముర్సలీన్ వల్ హందు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్." (37 : 180-182)**

లేక

**అల్లాహుమ్మ సల్లి అలా, సయ్యిదినా ముహమ్మదిన్, వ అలా ఆలి సయ్యిదినా ముహమ్మదిన్ అదద మాఫీ ఇల్మిల్లాఇ సలాతన్ దాయిమతన్ బిదవామి ముల్కిల్లాహి**

భావము : ఓ అల్లాహ్! నీ అపారకరుణ ముహమ్మద్ (సఅస) పైన వారి కుటుంబ సభ్యులపైన నిత్యము ప్రసాదింపుము.

# నమాజ్ తర్వాత చదువవలసిన కొన్ని తస్బీహ్‌లు, దుఆలు

## ఫర్జ్ నమాజ్ తర్వాత చదువవలసిన దుఆ

1. **'అల్లాహు అక్బర్'** అని ఒకసారి చెప్పి 3సార్లు **'అస్తగ్ ఫిరుల్లాహ్'** (ఓ అల్లాహ్ నా తప్పులను క్షమించమని వేడుకొనుచున్నాను) అని పలకాలి.(బుఖారీ)
2. **'రబ్బనా, ఆతినా, ఫిద్దున్యా హసనతవ్ వఫిల్‌ఆఖిరతి హసనతవ్ వఖినా అజాబన్నార్' (దివ్యఖుర్‌ఆన్ 2-201)**

తెలుగు: ఓ అల్లాహ్! మాకు ఇహ పరలోకములలోనూ మంచిని ప్రసాదించు మరియు మమ్ములను నరకాగ్ని నుండి కాపాడు.

3. **'అల్లాహుమ్మ ఆఫీనా మిన్‌కుల్లి బలాఇద్దున్యా వ అజాబిల్ ఆఖిరతి.'**

తెలుగు: ఓ అల్లాహ్! ఈ లోకపు ఆపదలు, ప్రమాదాలు, గండముల నుండి మమ్ము కాపాడు. మరియు మరణానంతరం (ఖియామత్) ప్రళయ దినపు శిక్ష నుండి రక్షించు.

4. **'అల్లాహుమ్మ అన్‌తస్సలామ్. వ మిన్‌కస్సలామ్ తబారక్త యాజల్ జలాలి వల్ ఇక్రాం' (ముస్లిం)**

తెలుగు: ఓ అల్లాహ్! నీవు ఎలాంటి లోపమూ లేనివాడవు, శాంతి స్వభావుడవు. శాంతిభద్రతలను, శుభాలను నీవే ప్రసాదించువాడవును, పరమదాతయును.

5. **ఆయతుల్ కుర్సీ 6. దరూదె షరీఫ్**

7. **రబ్బిగ్ ఫిర్లి వలి వాలిదయ్య, వలిల్ మోమినీన యౌమ, యఖూముల్ హిసాబ్.**

తెలుగు: ఓ అల్లాహ నన్ను, నా తల్లిదండ్రులను, నిన్ను విశ్వసించిన భక్తులం దరిని తీర్పు దినమున క్షమించుము.

## ఫజ్ర్ నమాజ్ తర్వాత జపించు తస్బీహ్

1. **'అల్లాహుమ్మ అజిర్నీ మినన్నార్'**

భావము: ఓ అల్లాహ్! నన్ను నరకాగ్ని నుండి రక్షించు.

2. **'లా ఇలాహ ఇల్లల్లాహు వల్ మలికుల్ హఖ్ఖుల్ ముబీన్'**

భావము: అల్లాహ్‌కు మరెవ్వరూ సాటిలేరు. అల్లాహ్‌యే వాస్తవముగా యజమాని మరియు ప్రభువు.

## జుహర్ నమాజ్ తర్వాత జపించు తస్బీహ్

**'హస్బునల్లాహు, వనిఅమల్ వకీల్, వనిఅమల్ మౌలా, వని అమల్ నసీర్'**

భావము: నీ ఆదరణే మాకు చాలు. నీవే మాకు సర్వము, నీవే మా సంరక్షకుడవు, నీవే సహాయకారివి.

## అస్ర్ నమాజ్ తర్వాత జపించు తస్బీహ్

**ఆయతల్ కుర్సీ**

**'సుబ్‌హానల్లాహ్'** (అల్లాహ చాలా పవిత్రుడు) 33 సార్లు

**'అల్‌హందు లిల్లాహ్'** (సమస్త స్తోత్రములు అల్లాహ్‌కే చెందును)33 సార్లు
**'అల్లాహు అక్బర్'** (అల్లాహ్ అత్యంత మహోన్నతుడు) 34 సార్లు
మరియు 4వ కలిమా తౌహీద్ (బుఖారి ముస్లిం)
**'లా ఇలాహ ఇల్లల్లాహు, వహ్‌దహు, లాషరీకలహు లహుల్ ముల్కు, వ, లహుల్ హందు, యుహ్‌ఈ - వ యుమీతు. బి యదిహిల్ ఖైర్- వ హువ అలాకుల్లి షైయ్యిన్ ఖదీర్'**

**తెలుగు:** అల్లాహ్ తప్ప మరెవ్వరూ ఆరాధనకు అర్హులు కారు, అల్లాహ్ ఒక్కడే. అల్లాహ్‌కు ఎవ్వరూ సాటిలేరు. అల్లాహ్ సర్వలోకాలకు ఏకఛత్రాధిపతి, సర్వ స్తోత్రములు అల్లాహ్‌కే చెల్లును. జీవన్మరణములు అల్లాహ్ చేతులలోనే ఉన్నవి. అల్లాహ్ చేతులలోనే శుభశ్రేయములున్నవి. అల్లాహ్ అద్వితీయుడు, విజ్ఞాని. ఈ తస్బీహ్ ప్రతి ఫరజ్ నమాజ్ పిమ్మట పఠించవచ్చును. సున్నతు కూడాను.

## మగరిబ్ నమాజ్ తర్వాత జపించు తస్బీహ్

**లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్ రసూలుల్లాహ్ (సఅస)**

## ఇషా నమాజ్ తర్వాత జపించు తస్బీహ్

1. **'దరూదె ఇబ్రాహీం'**
2. **'లా ఇలాహ ఇల్లా అంత సుబ్‌హానక ఇన్నీ కుంతు మిన్ జ్వాలిమీన్'**
**(దివ్యఖుర్‌ఆన్ 21 : 87)**
3. **అల్లాహు లా ఇలాహ, ఇల్లాహు వల్ హయ్యుల్ ఖయ్యూం (ఆయతుల్‌కుర్సీ)**
4. **సువ్వం కలిమ, తంజీద్ 'సుబ్‌హానల్లాహి, వల్‌హందు లిల్లాహి, వలా ఇలాహ ఇల్లల్లాహు, వల్లాహు అక్బర్- వలాహౌల, వలా ఖువ్వత, ఇల్లా బిల్లాహిల్ అలీయ్యిల్ అజీం'.**

గమనిక: పైన ఉదహరించిన తస్బీహ్‌లు, దుఆలు తప్పకుండా, ఆయా నమాజ్‌లలోనే వాటినే చదవాలని, ఇన్ని సార్లే జపించాలని లేదు. తస్బీహ్‌లను 'యాదె ఇలాహీ' అంటారు. దైవస్మరణ తమ తమ ఇష్టానుసారం తస్బీహ్‌లు జపించుకోవచ్చు. దుఆలు తమకు తెలిసిన భాషలో కూడా చేయవచ్చు.

# దిష్టి తగలకుండా దుఆ:

**"అవూజు బికలి - మాతిల్లాహిత్తామ్మతి మిన్‌కుల్లి షైతానిన్ వ హామ్మతిన్ వ మిన్‌కుల్లి ఐనిన్ లామ్మతిన్"** (బుఖారి)

## 6వ అధ్యాయము

# జుమేకీ నమాజ్ (జుమా ప్రార్థన)

జుమా నమాజ్ చేయుట మన ఫర్జ్. ఈ దినమును 'ఈదుల్ మోమినీన్' అంటారు. ఖుర్‌ఆన్‌లో ఈ నమాజ్‌కు ప్రత్యేకత ఇవ్వబడినది. విశ్వసించిన ప్రజలారా! శుక్రవారం నమాజ్ కోసం పిలిచినపుడు, అల్లాహ్ నామస్మరణ వైపుకు పరుగెత్తండి. మీరు గ్రహించగలిగితే, ఇదే మీకు అంత్యంత శ్రేయస్కరమైనది. (దివ్యఖుర్‌ఆన్ 62: 9) ముస్లింలకు అత్యంత పవిత్రమైన రోజు శుక్రవారం. ఆ రోజున చేసే నమాజ్‌కు విశేష ఫలితం ఉంటుంది. శుక్రవారం విశిష్టతను, ఆ రోజు నమాజ్ నిర్వహించవలసిన విధి విధానాలను తెలుపుతున్నాము.

వారంలోని ఏడు రోజుల్లో శుక్రవారానికి ఒక ప్రత్యేకత ఉంది. ముస్లిం సోదరులు శుక్రవారాన్ని అమితంగా గౌరవిస్తారు. ఎందుకంటే సూర్యుడు ఉదయించే రోజుల్లో కెల్లా శుక్రవారం రోజు మహా విశిష్టమైనదని ముహమ్మద్ (సఅస) ప్రవక్త ప్రవచించారు. శుక్రవారం రోజునే ఆది మానవుడు ఆదం (అలై)ను దేవుడు సృష్టించాడు. ఆ రోజునే అల్లాహ్ ఆయనను స్వర్గంలోకి ప్రవేశపెట్టాడు. మళ్ళీ శుక్రవారం రోజునే భూలోకంలో అల్లాహ్ ఆయనను నియామకం చేశాడు. ఈ రోజునే (శుక్రవారమే) ముహర్రం నెల 10వ తారీకున భవిష్యత్తులో ప్రళయం రానుంది. (ముస్లిం)

### పాపాలను హరించే నమాజ్

దైవ ప్రతినిధులుగా మానవులు ఈ భూప్రపంచంలో నిర్వర్తించవలసిన బాధ్యతల గురించి,సామాజిక జీవితంలో వారు పోషించవలసిన పాత్రను గురించి, మానవుడు పుట్టింది మొదలు మరణించే వరకు లభించిన జీవిత కాలంలో, జీవన సమస్త రంగాల్లో వ్యవహరించవలసిన తీరుతెన్నులను గురించి శుక్రవారం రోజున నమాజుకొరకు జరిగే ప్రత్యేక సమావేశంలో ఖుర్‌ఆన్,హదీసుల వెలుగులో ఇమాం బోధిస్తారు. మనిషిని మంచి మార్గాల వైపునకు ప్రోత్సహించి, చెడునుంచి దూరం చేయడమే శుక్రవారంనాటి ఖుత్‌బా ప్రత్యేకత. ఆ రోజు ఆచరించే నమాజ్

వారం రోజుల పాపాలను హరించేస్తుందని ముహమ్మద్(సఅస)ప్రవక్త సెల విచ్చారు. అయితే పూర్తి విశ్వాసంతో, నియమనిష్టలతో చేసినప్పుడే అది సాధ్యం. నియమనిష్టలను పాటిస్తూ చైతన్య స్ఫూర్తితో శుక్రవారం నమాజ్‌కు వెళ్లే వ్యక్తి చెడుల్లో, పాపాల్లో కూరుకుపోయే అవకాశమే లేదు. అందుకే నమాజ్ సమస్త పాపాలను దూరం చేస్తుందని ప్రకటించింది పవిత్ర దివ్యఖుర్‌ఆన్.

## దైవ స్మరణలో సాఫల్యం

శుక్రవారం అజాన్ పిలుపు వినగానే మసీదుకు వెళ్లడానికి త్వరపడాలి. వ్యాపారాలు ఇతర పనులు అన్నీ మానుకోవాలి. ఏకాగ్రతతో ఖుత్‌బా (ప్రసంగం) వినాలి. నిష్టగా నమాజ్ చేయాలి. నమాజ్ పూర్తయిన తర్వాత తిరిగి వ్యాపార కార్యకలాపాల్లో పాల్గొనవచ్చు. పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది "శుక్రవారం రోజు నమాజ్ కోసం అజాన్ పలికినప్పుడు వెంటనే మసీదుకు బయలుదేరండి. వ్యాపారాలు వదిలేసి పరుగిడండి. నమాజ్ పూర్తికాగానే మీమీ పనులకు భువిపై విస్తరించండి. దేవుని అనుగ్రహాన్ని (ఉపాధిని) అన్వేషించడంలో లీనమవ్వండి. దైవాన్ని అధికంగా స్మరించండి. మీకు సాఫల్యం ప్రాప్తమయ్యే అవకాశం ఉంది." (జుమా 9-10).

## శుక్రవారం శుభ ఘడియ

శుక్రవారం రోజున ఒక శుభ ఘడియ ఉంది. ఆ ఘడియలో దాసుడు చేసిన ప్రతి ప్రార్థన స్వీకరించబడుతుంది. (బుఖారి)

ఈ ఘడియకు సంబంధించి రెండు ఉల్లేఖనాలున్నాయి. ఒకటి - ఇమాం ఖుత్‌బా వినిపించడానికి వేదికమీదకి వచ్చినప్పటి నుంచి నమాజ్ పూర్తయ్యే వరకు, రెండు - శుక్రవారం సూర్యుడు అస్తమించే సమయం వరకు (అంటే మగ్రిబ్ వరకు). కనుక ఈ రెండు సమయాల్లో అత్యంత వినయ విధేయతలతో గడపటం ద్వారా పరలోక సాఫల్యానికి చేరువ కావచ్చు. నమాజ్‌కు ముందు ఇమాం 'ఖుద్బా' చదువును. ప్రతి జుమా నమాజ్‌కు ముందు మన పైగంబర్ (సఅసం) 'ఖుద్బా' (ప్రసంగం) ద్వారా హితోపదేశం చేసెడివారు. జుమా నమాజ్ చదివిన తర్వాత జుహర్ నమాజ్ చదవనవసరం లేదు.

## జుమా నమాజ్‌లో చదవవలసిన రకాత్‌లు

2 రకాతులు తహియ్యతుల్ మస్జిద్, 4 సున్నత్, 2 ఫర్జ్ (ఇమాం చదివించును) 4 సున్నత్, 2 సున్నత్, 2 నఫిల్. ముఅజ్జిన్ అజాన్ ఇచ్చిన తర్వాత 2 +4 రకాత్‌ల సున్నత్ నమాజ్ చదివి, నిశ్శబ్దముగా తనలో దైవస్మరణగాని, ఖుర్‌ఆన్ పఠనముగాని చేయవలెను. జుమా నమాజ్ టైము అయినపుడు ఇమాం ఖుద్బా చదువుతున్నప్పుడు ఖుర్‌ఆన్ పఠనముగాని, దైవస్మరణగాని సున్నత్ నఫిల్ నమాజ్‌లుగాని చేయరాదు. ఇమాం ఖుద్బా పూర్తి చేసిన తరువాత 2 రకాత్‌ల ఫర్జ్ నమాజ్ చదివించును.

## జుమా నమాజ్ నియ్యత్:

యా అల్లాహ్ మై నియ్యత్ కర్తాహు, జుమేకె 2 రకాత్ ఫర్జ్ నమాజ్ ఫడ్‌నేకె, వాస్తే అల్లాహ్‌కె,రుఖ్ మేరా కాబేకె తరఫ్, తాబే ఇస్, ఇమాంకె 'అల్లాహు అక్బర్' అంటూ నియ్యత్ చేసి చేతులు కట్టుకోవలెను. (ఇమాంతోపాటు) 'సనా' చదివి పూర్తిగా ఇమాంను అనుసరించవలెను. రెండు రకాత్‌ల ఫర్జ్ నమాజ్ ఇమాంతో చదివిన తర్వాత మనం 4 రకాత్‌ల సున్నత్, 2 రకాత్‌ల సున్నత్, 2 రకాత్‌ల నఫిల్ నమాజ్‌లు చదివి దుఆ చేసుకో వలెను. జుమా నమాజ్ చేయుటకు వీలుపడనప్పుడు జుహర్ నమాజ్ చదువవలెను. కాని జుమా నమాజ్ ఫర్జ్‌గా నున్నది. ధర్మసమ్మతమైన కారణము లేక దానిని వదులువాడు ఫాసిక్ (పాపి) అగును. దానిని తిరస్కరించువాడు కాఫిర్ అగును.

| జుమా ప్రార్థనలకు | ఈద్ ప్రార్థనలకు తేడా |
|---|---|
| 1. జుమా ప్రార్థన ఫర్జ్ | - ఈద్ ప్రార్థన వాజిబ్ |
| 2. జుమా ప్రార్థనలకుముందు ముఅజ్జిన్ అజాన్ చెప్పును. | - ఈద్ ప్రార్థనలకు అజాన్ ఉండదు |
| 3. జుమా ప్రార్థనలకు ముందు ఇమాం- ఖుద్బా చదివి, తర్వాత 2 రకాత్‌ల ఫర్జ్ నమాజ్ చదివించును | - ఈద్ ప్రార్థనలకు ఇమాం ముందు నమాజ్ చదివించి, తర్వాత ఖుద్బా వినిపించును. |
| 4. జుమా ప్రార్థనలు మధ్యాహ్నం సుమారు 1 గంటకు అగును. | - ఈద్ ప్రార్థనలు ఉదయం సుమారు 7-11 గంటల మధ్య జరుగును |

## 7వ అధ్యాయము

# పండుగ నమాజ్‌లు

### 1. నమాజ్ ఈదుల్ ఫిత్ర్ (రమజాన్ పండుగ నమాజ్)

ఈదుల్ ఫిత్ర్ నమాజ్ చదువుటకు మస్జిద్‌కు వెళ్ళే ముందు కుటుంబం లోని ప్రతి ఒక్కరూ (స్త్రీ పురుషులు, పిల్లలు, అందరి తరఫున) ఫిత్రా బీదలకు విధిగా ఇవ్వవలెను. ఫిత్రా ఇచ్చుట వల్ల బీదలు కూడా పండుగ చేసుకుంటారు. ఈద్గాహ్‌కు వెళ్ళేటప్పుడు బిగ్గరగా తక్బీర్లు పఠిస్తూ వెళ్ళాలి. (బైహఖీ) ఒక దారిన వెళ్ళి తిరిగి వచ్చేటప్పుడు వేరొక దారి గుండా రావాలి. (బుఖారీ). అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్, లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్. అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్ద్ (ఇబ్నె అబీషైబా)

ఈదుల్ ఫిత్ర్ నమాజ్ రకాతులు : రెండు రకాతుల వాజిబ్.

**నియ్యత్: 'యా అల్లాహ్ మై నియ్యత్ కర్తాహు దోరకాత్ వాజిబ్ నమాజ్ ఈదుల్ ఫిత్ర్‌కి, జాయద్, ఛే తక్బీర్ కె సాథ్, తాబే ఇస్ ఇమాం కె, రుఖ్ మేరా, కాబే షరీఫ్ కె తరఫ్'** అని నియ్యత్‌చేసి ఇమాంతోపాటు 'అల్లాహు అక్బర్ అంటూ తక్బీర్ చెప్పి చేతులు చెవుల వద్దకు ఎత్తి వెంటనే బొడ్డు క్రింద కట్టుకుని 'సనా' చదువవలెను.

ఈ నమాజ్‌లో విశేషత మామూలుగా, నియ్యత్ చేసి, అల్లాహు అక్బర్ అంటూ తక్బీరె తహరీమా కాకుండా, అదనంగా 6 తక్బీర్లు ( 3 తక్బీర్లు మొదటి రకాత్‌లో; 3 తక్బీర్‌లు రెండవ రకాత్‌లో) చేసి నమాజ్ చేయవలసియుండును.

'సనా' చదివిన తర్వాత ఇమాం 'అల్లాహు అక్బర్' (తక్బీర్1) అంటూ రెండు చేతులు చెవుల వద్దకు తీసుకుని వెళ్ళి చేతులు వదులును. మనం కూడా ఇమాం చేసినట్లు చేయవలెను. మళ్ళీ రెండవసారి ఇమాం 'అల్లాహు అక్బర్' (తక్బీర్ 2)అంటూ రెండు చేతులు చెవుల వద్దకు తీసుకొని వెళ్ళి చేతులు వదులును. మనం కూడా అదే విధంగా చేయవలెను. మళ్ళీ ఇమాం మూడవసారి

'అల్లాహు అక్బర్' (తక్బీర్ 3) అంటూ చేతులు చెవుల వద్దకు తీసుకుని వెళ్ళి, చేతులు ప్రక్కకు వదలకుండా, చేతులు బొడ్డు క్రింద కట్టుకొనును. మనం కూడా ఇమాంను అనుసరించి చేతులు కట్టుకోవలెను. ఇప్పుడు ఇమాం ఖిరాత్ చదు వును. ఇమాం చదువుతున్న సూరాలు నిశ్శబ్దంగా వినుచుండవలెను. ఇమాం, అల్‌హం, మరొక సూరా చదివి 'అల్లాహు అక్బర్' అంటూ రుకూలో వెళ్ళును: తర్వాత రెండు సజ్దాలు చేసి నిలబడును. మనం కూడా ఇమాంను అనుసరించ వలెను. (ఇప్పటికి ఒక రకాత్ అయినది). రెండవ రకాత్ ప్రారంభంలో ఇమాం నిలబడి అల్‌హం, మరొక సూరా చదివి 'అల్లాహు అక్బర్' (తక్బీర్ 4) అంటూ చేతులు చెవుల వద్దకు తీసుకుని వెళ్ళి క్రిందకు వదులును. మనం కూడా అదే విధంగా చేయవలెను. తర్వాత ఇమాం రెండవసారి 'అల్లాహు అక్బర్' (తక్బీర్ 5) అంటూ చేతులు చెవుల వద్దకు తీసుకుని వెళ్ళి క్రిందకు వదులును. మనం కూడా ఇట్లే చేయవలెను. తర్వాత ఇమాం మూడవసారి 'అల్లాహు అక్బర్' (తక్బీర్ 6) అంటూ చేతులు చెవుల వద్దకు తీసుకుని వెళ్ళి క్రిందికి వదులను. మనం కూడా ఈ విధంగానే చేయవలెను. ఇప్పుడు ఇమాం 'అల్లాహు అక్బర్ అంటూ రుకూలో వెళ్ళి తర్వాత రెండు సజ్దాలు చేసి కూర్చుని (ఖాయిదాలో) అత్తహి య్యాత్, దరూదె ఇబ్రాహీం, దుఆ చదివి ఇమాంను అనుసరించి కుడి ఎడమ వైపు ముఖం త్రిప్పుకుని సలాం చేయవలెను. ఇంతటితో ఈద్ నమాజ్ పూర్తి అవుతుంది.

నమాజ్ అయిన తర్వాత ఇమాం ఖుద్బా చదువును. నిశ్శబ్దంగా, శ్రద్ధా భక్తులతో ఖుద్బా వినవలెను. ఖుద్బా తర్వాత ఇమాం దుఆ చేయును. మనం కూడా చేతులు ఎత్తి అల్లాహ్ వద్ద దుఆ చేసుకొనవలెను. దుఆ అయిన తర్వాత ఈద్ ముబారక్ అని అందరూ ఒకరినొకరు అభినందించుకొందురు.

## 2. ఈదుల్ అజ్‌హా (లేక) ఈదుజ్జుహా (బక్రీద్ పండుగ నమాజ్)

జిల్ హజ్ నెల 10వ తారీఖున బక్రీదు పండుగ, జిల్ హజ్ నెల 9వ తారీఖున మక్కాలో హజ్ జరుగును. ఈద్గాహ్‌కు ఏమీ తినకుండా వెళ్ళాలి (బుఖారీ ముస్లిం) బక్రీదు పండగు నమాజ్ అయిన తర్వాత ధనవంతులపైన, స్థోమత ఉన్న వారిపైన (సాహెబ్ నిసాబ్‌పై) ఖుర్బానీ ఇచ్చుట వాజిబ్ తప్పనిసరి విధి.

**ఈదుల్ అజ్‌హా రకాత్‌లు**: రెండు రకాత్‌ల వాజిబ్ నమాజ్ నియ్యత్: **'యా అల్లాహ్ మై నియ్యత్ కర్తాహు దొ రకాత్ ఈదుల్ అజ్‌హాకి వాజిబ్ నమాజ్ పఢ్‌నేకి, దొ రకాత్ వాజిబ్ ఛే తక్బీర్ కె సాత్, రుఖ్ మేరా కాబే షరీఫ్‌కే తరఫ్, తాబే ఇస్ ఇమాంకే, అల్లాహు అక్బర్'** అంటూ ఇమాంతోపాటు రెండు చేతులు చెవుల వద్దకు తీసుకొని వెళ్ళి, క్రిందికి దించి చేతులు కట్టుకుని, 'సనా' చదవ వలెను. తర్వాత ఇమాం, రమజాన్ పండుగ నమాజ్ చదివించినట్లే ఈ బక్రీద్ నమాజ్ కూడా చదువును. అనగా మొదటి రకాత్‌లో 3 తక్బీర్లు, రెండవ రాకత్‌లో 3 తక్బీర్లతో నమాజ్ చదువును. మనం కూడా అదే విధంగా ఇమాంను అనుసరించి నమాజ్ చదువవలెను.

నమాజ్ అయిన తర్వాత ఇంటికి వచ్చి ఖుర్బానీ 10, 11, 12 తారీఖులలో ఇవ్వవచ్చును. కాని 10వ తారీఖుననే ఇవ్వటం ఉత్తమం.

ఖుర్బానీ ఇవ్వదలచిన జంతువు ఏ విధమైన అంగవైకల్యం లేకుండా, ఆరోగ్యవంతమైనదిగా ఉండవలెను. కన్ను, ముక్కు, చెవి, తోక, కొమ్మలు మరి ఏ అవయవం కూడా విరగకుండా, తెగకుండా మంచి స్థితిలో ఉండవలెను. ఖుర్బానీ మాంసం సరిసమానంగా 3 భాగాలుగా చేసి, ఒక భాగం బీదలకు, రెండవ భాగం బంధుమిత్రులకు, మూడవ భాగం తమ స్వంతముకై వినియోగించుకోవలెను.

## 3. ఖుర్బానీ ప్రాముఖ్యత పరమార్థం

హజరత్ ఇబ్రాహీం (అ.స.) తన వృద్ధాప్యంలో లేక లేక కలిగిన ముద్దుల కుమారుడు హజరత్ ఇస్మాయిల్ (అ.స) ను అల్లాహ్ ఆజ్ఞననుసరించి ఖుర్బానీ చేసి, అల్లాహ్ యొక్క పరీక్షలో ఉత్తీర్ణుడై అల్లాహ్ మన్ననలను బడిసి అల్లాహ్ ప్రియమిత్రుడు 'ఖలీలుల్లా'గా పేరుగాంచెను. వారి త్యాగపు జ్ఞాపకార్థమై మనం ఈ ఖుర్బానీ చేయుదుము. దీని అంతరార్థము మనం కూడా అల్లాహ్ ఆజ్ఞలకు లోబడి, అల్లాహ్ కొరకు ఏ త్యాగమైనా చేయుటకు వెనుకాడమని, దృఢ సంకల్పం వెలిబుచ్చుట. హదీస్ షరీఫ్‌లో కూడా ఖుర్బానీ ఫజీలత్ చాలా ఘనంగా వివరించబడినది. ఖుర్బానీ ఇచ్చు జంతువు యొక్క రక్తపు బిందువు భూమిపై

పడక ముందే ఖుర్బానీ చేయు వ్యక్తికి ఖుర్బానీ జంతువుపై ఉన్న ఒక్కొక్క వెంట్రుకకు ఒక్కొక్క పుణ్యం లభించును. అల్లాహ్‌కు ఖుర్బానీ జంతువు రక్తం మాంసంతో కాదు, ఖుర్బానీ యిచ్చు వ్యక్తి యొక్క 'తఖ్వా' సంకల్పంతోనే ప్రీతి.

## ఖుర్బానీ చేయు విధానం

ఖుర్బానీ యిచ్చు జంతువును, ఖుర్బానీ ఇచ్చే ముందు నీళ్ళు త్రాగించి ముఖం ఖిబ్లా వైపు వుండునట్లు నేల మీద పరుండబెట్టి జిబహ్ చేయవలెను. ఖుర్బానీ యిచ్చునతనే స్వయంగా జిబహ్ చేయుట ఉత్తమం లేదా అతని తరపున మరెవ్వరైనా జిబహ్ చేయవచ్చును.

## ఖుర్బానీ దుఆ

**'ఇన్నీ వజ్జహ్‌తు వజ్‌హియ, లిల్లజీ ఫతరస్సమావాతి**
**వల్ అర్జ్, హనీఫంవ్ వమా అన మినల్ ముష్రికీన్**
**ఇన్న సలాతీ, వ నుసుకీ, వ మహ్‌యాయ, వ మమాతీ**
**లిల్లాహి రబ్బిల్ ఆలమీన్ లా షరీక లహూ, వ బిజాలిక**
**ఉమిర్‌తు, వ అన అవ్వలుల్ ముస్లిమీన్ అల్లాహుమ్మ**
**మిన్‌క వలక అన్'**

అని ఎవరి తరపున జిబహ్ చేస్తున్నామో వారి పేరు ఉదహరించవలెను. లేదా తానే స్వయంగా ఖుర్బానీ యిచ్చిన యెడల 'అన్' అనకుండా 'అన్ని' అని చెప్పి 'బిస్మిల్లాహి అల్లాహు అక్బర్' అంటూ పదునైన కత్తితో జిబహ్ చేయవలెను.

**తర్జుమా:** మై అప్నా రుఖ్, ఉస్ జాత్‌కి తరఫ్ కర్తాహు జిస్నే ఆస్మాన్ ఔర్ జమీన్‌కు పైదా కియా. ఔర్ మై షిర్క్ కర్నె వాలోమేసె నహీహు. బాయఖీన్ మేరి నమాజ్ ఔర్ మేరి సారి ఇబాదత్, ఔర్ మేరా మర్నా జీనా, సబ్, ఖాలిస్ అల్లాహ్‌హీకె లియే హై జొ మాలిక్ హై సారె జహాంకా. వుస్కా కోయి షరీక్ నహీ ఔర్ ముజే ఇసీకా హుకం హై; ఔర్ మై మాన్‌నెవాలోమెసె హు. అయ్ అల్లాహ్ ఏ ఖుర్బానీ తేరేహి తౌఫీఖ్ ఔర్ హుకుం సెహై- ఔర్ తేరె లియె ఖుర్బానీ కర్ రహాహూ. యా అల్లాహ్ కుబుల్ ఫర్‌మా ఇస్ ఖుర్బానికు.

**తెలుగు:** నేను నా ముఖమును, భూమ్యాకాశాలను సృష్టించిన ఆ దివ్య తేజము వైపు చేసుకొనియున్నాను. మరియు నేను ఎన్నడూ నీతోపాటు మరెవ్వరినీ

ఆరాధనలో భాగస్వాములుగా ఎంచు వారిలో లేను. వాస్తవంగా నా నమాజ్ నా సకల ఆరాధనలు మరియు జీవన్మరణాలు అన్నీ యావత్ సృష్టికి యజమాని యైన అల్లాహ్ కొరకే. ఆయనకు మరెవ్వరూ సాటిలేరు. మరియు నాకు ఈ ఆజ్ఞ యివ్వబడినది. మరియు నేను విశ్వసించు వారిలోని వాడను. ఓ అల్లాహ్! ఈ ఖుర్బానీ, నీ యొక్క ఆజ్ఞ. నీ అనుగ్రహం వల్ల మరియు ఈ ఖుర్బానీ కేవలం నీ కొరకే ఇచ్చుచున్నాను. అనుగ్రహించు ఓ అల్లాహ్. ఈ జంతువు నీవు ప్రసాదించినదే. అది నీ కోసమే సమర్పించబడుచున్నది. దయతో ఈ ఖుర్బానీని అంగీకరించు.

## జిబహ్ చేసిన తర్వాత చదువు దుఆ

**అల్లాహుమ్మ తఖబ్బల్ హు మిన్నీ కమా తఖబ్బల్ త**

**మిన్ హబీబిక ముహమ్మదిన్వ్, వఖలీలిక ఇబ్రాహీమ**

**అలైహి వస్సలాతు వస్సలాం.**

**తర్జుమా:** యా అల్లాహ్ ఖుబూల్ ఫర్మా ఇస్ ఖుర్బానీ కు. మేరే తరఫ్ సే జైసాకే ఖుబూల్ ఫర్మాయా ఆప్నే హబీబ్ ముహమ్మద్ (సఅసం) ఔర్ అప్నే ఖలీల్ ఇబ్రాహీం (అ.స) కీ తరఫ్ సె.

**తెలుగు:** ఓ అల్లాహ్ నీవు ఏ విధంగా నీ ప్రియ ప్రవక్త ముహమ్మద్ (సఅస) యొక్క ఖుర్బానీ ఆమోదించినావో మరియు హజరత్ ఇబ్రాహీం ఖలీలుల్లా (అ.స) యొక్క ఖుర్బానీ ఆమోదించినావో అదే విధంగానే, నేను ఇచ్చు ఈ ఖుర్బానీ కూడా ఆమోదించుము.

**గమనిక:** ఒకవేల జిబహ్ తాను స్వయంగా చేయకుండా, మరెవ్వరైనా తన తరపున జిబహ్ చేయునపుడు 'అల్లాహుమ్మ తఖబ్బల్ హుమిన్నీ' బదులు 'అల్లాహుమ్మ తఖబ్బల్ హుమిన్' అని, ఎవరి పేరున ఈ ఖుర్బానీ యివ్వబడు చున్నదో ఆ మనిషి పేరు చెప్పవలెను.

## 8వ అధ్యాయము

# జకాత్ - ఇస్లాం మూడవ విధి

**నమాజ్‌ను స్థాపించండి. జకాత్ చెల్లించండి. *(దివ్యాఖుర్ఆన్ 2 :43)***

***ప్రవక్తా నీవు వారి సంపద నుండి, సదఖా తీసుకుని వారిని పరిశుద్ధపరచుము. (దివ్యాఖుర్ఆన్ 9 : 103)***

## జకాత్ సారం

జకాత్ అంటే "వృద్ధి చెందటం, పరిశుద్ధత పొందటం" అని అర్థం. జకాత్ వల్ల మన సంపద పరిశుద్ధత నొందటంతోపాటు పుణ్యం కూడా వృద్ధిచెందుతూ ఉంటుంది. అందుకే దాన్ని జకాత్ అని అంటారు.

దైవమార్గంలో విధిగా చేసే దానాన్ని జకాత్ అంటారు. పవిత్ర ఖుర్ఆన్ గ్రంథంలో ఎనభై రెండు చోట్ల జకాత్ చెల్లించమని గట్టిగా తాఖీదు ఉంది. జకాత్ చెల్లించే వారినే నిజమైన విశ్వాసులుగా పవిత్ర ఖుర్ఆన్ పరిగణించింది.

దేవుడు మీకు ఏ ధనంపై అధికారం ఇచ్చాడో ఆ ధనాన్ని మీరు దైవమార్గంలో ఖర్చు పెట్టండి అంటూ ఈ ప్రపంచంలో మనిషికి ఉనికినిచ్చిన దేవుడు మనిషి ఎలా సంపాదించాలి, ఎలా ఖర్చుపెట్టాలి అనే విషయాలు తన గ్రంథంలో తెలియజేశాడు.

## నిషిద్ధ ధన ఆర్జిత మార్గాలు

1. లంచం, దౌర్జన్యం, అపహరణ మార్గాల ద్వారా (బఖర 188), 2. దొంగతనం ద్వారా (మాయిదా 38), 3. విగ్రహాల ద్వారా (మాయిదా 90), 4. కొలతల్లో, తూనికల్లో మోసం చేసి (అత్తత్‌ఫీఫ్ 1-3), 5. అనాథల సొమ్మును కాజేసి (నిసా 1), 6. జ్యోతిష్యం, పాచికలు, జ్యోస్యాల ద్వారా (మాయిద 90). 7. సారాయి వ్యాపారం ద్వారా (మాయిదా 90), 8. అసభ్యం, అశ్లీలతలను వ్యాపింపజేయడం ద్వారా (నూర్ 19), 9. వడ్డీ వ్యాపారం ద్వారా (బఖర 277), 10. వ్యభిచార వృత్తి ద్వారా (నూర్ 33),

# ధనం ఖర్చు పెట్టే మార్గాలు

ధన సహాయానికి అర్హులైన వారిని, ధనం ఖర్చుపెట్టే మార్గాలను ఖుర్ఆన్ సూచించింది. 1. బంధువులు, అనాధలు, ఇరుగు పొరుగు వారు (నిసా), 2. అర్థించేవారు, వికలాంగులు 3. అప్పు ఇవ్వడం (బఖర), 4. జకాత్ చెల్లించడం (తౌబ 6), 5. దానధర్మాలు చేయడం (బఖర 27), 6. బాటసారులను ఆదుకోవడం (తౌబా)

ధనికులు తమ సంపద నుండి జకాత్ తప్పనిసరిగా నిరుపేదలకు, అనాధలకు, వితంతువులకు, బాటసారులకు, దైవ సంస్థాపనా మార్గంలో కృషి చేస్తున్న వారికి ధార్మిక పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసేవారికి, మదర్సాలకు ఇవ్వవలసి ఉంటుంది. కనీసం ఏడున్నర తులాల బంగారం లేదా దాని విలువకు సమానమైన డబ్బు ఒక ఏడాదిపాటు కలిగి ఉన్నవారు రెండున్నర శాతం జకాత్ చెల్లించాలి. అంతకంటే తక్కువ బంగారంపై గాని, బంగారు ఆభరణాలపైగాని జకాత్ వుండదు. వెండి 594 గ్రాముల కంటే తక్కువ వున్నా జకాత్ వుండదు. 595 గ్రాముల కంటే ఎక్కువ ఉంటే జకాత్ 2 1/2 శాతం చెల్లించాలి. వ్యవసాయ రాబడి నుండి తీసే జకాత్‌ను ఉష్ర్ అంటారు. వర్షాధారంతో పండే పంట నుంచి ఇరవై శాతం, కృత్రిమ నీటిపారుదలతో పండించే పంట నుంచి పది శాతం ఉష్ర్ తీసి దైవ మార్గంలో దానం చేయాలి. ఇలా ప్రతి ధనికుడు, ప్రతి భూస్వామి తన సంపద నుండి జకాత్, ఉష్ర్ లను తీసి పేదసాదలకు అందజేయాలి. జకాత్ యివ్వటంతో మన సంపద పరిశుభ్రమగును. సమాజంలోని ఆర్థిక అసమానతలు తొలగించడానికి ఇస్లాం చూపిన శ్రేష్టమైన మార్గం ఇది.

**'వ యుఖీమూనస్సలాత, వ మిమ్మారజఖ్‌నాహుం యున్‌ఫిఖూన్'**

**తర్జుమా:** వో లోగ్ నమాజ్ ఖాయిమ్ కర్తేహై. ఔర్ జొ హంనె దియా వుస్మే సె అల్లాహ్ కే రాస్తేవె ఖర్చ్ కర్తేహై.

**తెలుగు:** వారు నమాజ్ స్థాపిస్తారు. ఇంకా మేము వారికిచ్చిన దానిలోనుండి ఖర్చు చేస్తారు.

నమాజ్ బద్‌నీ ఇబాదత్. జకాత్ మాలీ ఇబాదత్. నమాజ్ శరీరావయవాలతో చేయు ఆరాధన. జకాత్ ధనముతో సత్కార్యములు చేయు ఆరాధన. జకాత్ డబ్బు తల్లిదండ్రులకు ఇవ్వరాదు. మస్జిద్ కట్టడములకు ఉపయోగించరాదు.

## 9వ అధ్యాయము

# రోజా - ఇస్లాం నాల్గవ విధి

రమజాన్ నెలలో ఉపవాసము మీపై తప్పనిసరి చేయబడినది, ఏ విధంగా నైతే మీకు పూర్వం ప్రవక్తలననుసరించే వారిపైవిధి చేయబడినదో, దీనివల్ల బహుశా మీరు సత్ప్రవర్తనకు అలవడుదురని, అల్లాహ్‌కు భయపడుదురని. (2-183)

రంజాన్ నెలపొడుపు కనిపించగానే ఈవిధంగా ప్రార్ధనా వచనాలు ప్రవచించాలని దైవప్రవక్త బోధించారు:"అల్లాహు అక్బర్, అల్లాహుమ్మ అహిల్లాహు అలైనా బిల్ అమ్ని వల్ ఈమాని, వస్సలామతి వల్ ఇస్లామి, వత్తౌఫీఖి లిమా తుహిబ్బు వ తర్‌జా, రబ్బునా వ రబ్బుకల్లాహ్" అల్లాహ్ అందరికంటే గొప్పవాడు ఓ అల్లాహ్! ఈ నెలవంకను మాకొరకు శాంతీ విశ్వాసాలకు, ప్రశాంతం విధేయతలకు, నీవు ఇష్టపడే, నీవు ప్రసన్నుడవయ్యే మా సద్బుద్ధికి ప్రతీకగా చెయ్యి. ఓ నెలవంకా! మా ప్రభువూ, నీ ప్రభువూ అల్లాహ్‌యే.

రమజాన్ నెల అంతా మహా పవిత్రమైన నెలగా పరిగణించబడినది. ఈ నెలను 'రమజానె ముబారక్' అంటారు. రంజాన్ నెలకు ఇంకో ప్రత్యేకత వుంది. ఈ నెలలో ఒక ఘనమైన రాత్రి " లైలతుల్ ఖద్ర్" వుంది. ఈ ఒక్కరాత్రి కొన్ని వేల రాత్రుల కంటే గొప్పది. (ది॥ఖు॥సురా 97) "నిశ్చయంగా మేము దీనిని (ఈ ఖుర్ఆన్ ను) ఘనమైన రాత్రియందు అవతరింపజేశాము. ఘనమైన రాత్రి గురించి నువ్వేమనుకున్నావు? ఘనమైన రాత్రి వెయ్యి నెలల కంటే కూడా మేలైనది. ఆ రాత్రి యందు దైవదూతలు, ఆత్మ (జిబ్రయీల్) తమ ప్రభువు ఉత్తర్వుపై సమస్త విషయాల (నిర్వహణ) నిమిత్తం (దివినుంచి భువికి) దిగివస్తారు. ఆ రాత్రి ఆసాంతం శాంతియుతమైనది - తెల్లవారే వరకూ (అది వుంటుంది). ఈ నెలలో సద్గుణులకై ఎనిమిది (8) స్వర్గ ద్వారములు తెరిచి ఉండును. ఏడు (7) నరక ద్వారములు మూసివేయబడి యుండును. షైతాన్ యొక్క బీభత్స చేష్టలు ఈ నెలలో ఉపవాసముండే సద్గుణదాసుల వద్ద చెల్లవు.

ఈ నెలలో ఒక్క పుణ్య కార్యము చేసిన దానికి ఎన్నో రెట్లు అల్లాహ్ కటాక్షము లభించును. సున్నత్ నఫిల్ ప్రార్థనల పుణ్యం ఫర్జ్ ప్రార్థనలతో సమానము. నమాజ్ ఏ విధంగా ప్రతీ ముస్లిం మీద ఫర్జ్ చేయబడినదో అట్టి విధముగానే రమజాన్ నెల అంతా రోజా ఉండుట ఫర్జ్ అయినది. రోజా అనగా ఏమీ తినకుండా పస్తు ఉండటట మాత్రమే కాదు. రోజా అంటే అన్ని దురభ్యాసాలకు,, దుర్వ్యసనాలకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో కాలము గడుపుట. ఈ విధంగా జీవితం గడిపినవారు ధన్యులు.

దైవప్రవక్త (సఅస) ఈ విధంగా తెలిపారు. ''అన్న పానీయాలకు దూరంగా ఉండుటయే ఉపవాసం కాదు. వ్యర్థమైన, అశ్లీల మాటలకు దూరంగా ఉండటయూ ఉపవాసంలో అంతర్భాగమే. చెడు మాట్లాడటరాదు, వినరాదు, చూడరాదు, తలచరాదు అన్ని ఇంద్రియాలను అదుపులో ఉంచి చెడు కార్య ముల నుండి దూరంగా ఉండవలెను.'' నమాజ్ చదవకుండా, సత్కార్యములకు దూరమై రోజా ఉండుట దైవసమక్షంలో ఉపవాసముగా పరిగణించబడదు. అటువంటి వారు తమను తాము మోసం చేసుకొనువారగుదురు. కావున రోజా ఉన్న ప్రతి ముస్లిం తన ధ్యానమును అల్లాహ్‌పై లక్ష్యము చేసి, శ్రద్ధాభక్తులతో ఖుర్ఆన్ పఠనము, నమాజ్, దానము, ధర్మము మొదలగు పుణ్య కార్యములు చేసి అల్లాహ్ కటాక్షము, ప్రేమ సంపాదించుకోవాలి. రోజా మానవుని ఆత్మను పరిశుద్ధపరచును. చెడు కార్యములకు ఏ మాత్రం తావు ఇవ్వదు. రోజా ఉండి పైన ఉదాహరించిన కార్యములు చేయక ఉపవాసమును భగ్నపరిచే పనులలో నిమగ్నులైనచో 'రోజా టూట్ జాయేగా' అనగా ఉపవాసం భగ్నమగును. అటువంటి సమయాలలో 'కప్ఫారా' ఇవ్వవలసి ఉండును. కప్ఫారా అనగా రమజాన్ నెల తర్వాత రెండు నెలలు రోజా ఉండవలెను. లేదా 60 మంది బీదలకు అన్నదానం చేయవలెను. రోజేదార్ యొక్క రోజా, అతను పఠించు ఖుర్ఆన్ తీర్పు దినం నాడు అల్లాహ్ సన్నిధిలో సాక్ష్యమిచ్చును. కరుణా మయుడగు అల్లాహ్ వీరి సిఫార్సు ఆమోదించి రోజేదార్‌కు మోక్షము కలుగజేయును.

రోగగ్రస్తుడు, గర్భిణీ స్త్రీ, బాలింతరాలు రోజా ఉండునవసరం లేదు. కాని గర్భిణీ స్త్రీలు, బహిష్టు ఉన్నవారు, మరి ఏ కారణము చేతనయినా రోజా

ఉండుటకు వీలుపడనివారు వీలును బట్టి కోల్పోయిన రోజాలను తర్వాత రోజులలో పూర్తి చేసుకోవలెను. ఈ విధంగా కూడా చేయలేని వారు, తమకు బదులు తమ ఖర్చుతో బీదలచే రోజా చేయించెదరు.

ఉపవాసముండుటకు నిశ్చయించుకున్న మరుక్షణం నుండి, అనగా రోజా నియ్యత్ చేసిన వెంటనే రోజేదార్‌కు అల్లాహ్‌ను గుర్తించు శక్తి, దైవజ్ఞానం భక్తి స్వతహాగా కలుగును. దీనికి తార్కాణము నియ్యత్ చేసిన రోజేదార్ వద్ద పంచభక్ష పరమాన్నము, అమృతమున్నా రోజేదార్ ఆకలితో మలమల మాడుచున్నప్పటికీ, దప్పికతో నాలుక పిడచకట్టినప్పటికీ తినుటకు, త్రాగుటకు సాహసించడు. ఎవ్వరూ లేకుండా తానొక్కడే వున్నప్పటికి కూడా, ఆ తినుబండారముల వైపు చూడనే చూడడు. ఎవరూ చూడకపోయినా ' నీ చర్యలను అల్లాహ్ చూచు చున్నాడు. అల్లాహ్ ఆజ్ఞలను ఉల్లంఘించిన దోషి అగుదువు. నీవు రోజా భంగము చేసిన వాడగుదువు' అని అతనిలో ఉన్న ఈమాన్ అతనిని హెచ్చరించును. మనో నిగ్రహంతో ఆ రోజు, రోజా పూర్తిగా ఉండును గాని, రోజాను భంగం చేయడు. మరియు సంవత్సరపు 11 నెలలు ఇష్టానుసారం, వేళాపాళా లేక భోజన పానీ యాలు సేవించి ధర్మసమ్మతమైన సమస్త కోరికలనుభవించినను, జీవికి ఈ రమజాన్ నెల ఉపవాసములకు కట్టుబడి యుండునట్లు మనో నిగ్రహం అలవడిందంటే అది రోజా మహిమే. వీరు అల్లాహ్ కరుణతో మనో నిగ్రహమునకు అలవడి దోషములు, నేరములు చేయుటకు సాహసించరు, కోరికలన్నిటిని తమ అదుపులో ఉంచుకొందురు. కోరికలకు, దురభ్యాసాలకు బానిసలు కారు. వీరు తప్పక అల్లాహ్ మెప్పు పొందుదురు. వీరే సత్పురుషులు. ధన్యులు.

రోజాను ఐశ్వర్యవంతుడు, నిరుపేద, వృద్ధుడు, యువకుడు, స్త్రీ పురుష విచక్షణ లేకుండా అందరిపై ఫర్జ్ చేయబడినది. దీనివల్ల ఐశ్వర్యవంతులు, భోగ భాగ్యములలో నిత్యం తులతూగువారు ఆకలి బాధ చవిచూడగలరు. పేదరికము, ఓర్పు అంటే ఏమిటో అర్థమైన వారు తమ నిరుపేద సోదరుల పట్ల ఔదార్యము చూపుదురు. వారిని తమతోపాటు రోజా, ఇఫ్తార్ చేయించెదరు. బీదల పట్ల కలవారి ఔదార్యము, సానుభూతి మనం రమజాన్ నెలలో ప్రతి రోజూ సహరీలో ఇఫ్తార్‌లో చూస్తూనే ఉందుము గదా.

రోజాకు నియ్యత్ ముఖ్యం. నియ్యత్ చేయనిదే రోజా కాదు.

**రోజాకు నియ్యత్:**

**'నవైతు అన్ అసూమ గదన్; లిల్లాహి తఆల మిన్ సౌమి రమజాన్'**

లేక

**'నవైతు బిసౌమి గదిన్'**

తర్జుమా: మై రోజాకి నియ్యత్ కర్తాహు జొ రమజాన్ మహినేక దిన్ హై.

తెలుగు: ఓ అల్లాహ్! నీకై నేను ఈ రోజున రమజాన్ ఉపవాసం ఉండుటకు నిశ్చయించుకొనుచున్నాను.

**ఇఫ్తార్‌కి దుఆ:**

అల్లాహుమ్మ లక సుమ్‌తు వబిక ఆమంతు

**వఅలైక తవక్కల్‌తు వ అలా రిజ్‌ఖిక అఫ్‌తర్‌తు (ఫతఖబ్బల్ మిన్ని)**

తర్జుమా: యా అల్లాహ్ మైనే తేరే లియే రోజా రఖా ఔర్ తేరె దిఏహువె రిజఖ్‌సె, ఇఫ్తార్ కర్తాహు

తెలుగు: ఓ అల్లాహ్ నేను నీ కొరకై ఉపవాసమున్నాను మరియు నీవు ప్రసాదించిన భుక్తితోనే, ఉపవాస విరమణ చేయుచున్నాను.

**(ఉపవాస విరమణ (ఇఫ్తార్) తర్వాత**

**జహబ జమఉ వబ్‌తల్ల తిల్ ఉరూఖు వ సబతల్ అజ్‌రు ఇనషా అల్లాహ్**

**అర్థం:** దాహం తీరింది. నరాలు చెమ్మగిల్లాయి. ఇన్షాఅల్లాహ్ (దైవచిత్త మయితే) పుణ్యం రుజువయ్యింది. (అబూదావూద్)

రమజాన్ నెల అంతా పగలు రోజా వుండి రాత్రి ఇషా నమాజ్ నమాజ్ తర్వాత 'తరావీహ్' నమాజ్ రెండు రకాతుల చొప్పున 20 రకాతుల సున్నత్ నమాజ్ జమాఅత్‌తో చదవవలెను.

## 10వ అధ్యాయము

# హజ్ (మక్కా యాత్ర) - ఇస్లాం ఐదవ విధి

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు- **'ప్రజలపై అల్లాహ్‌కు ఉన్న హక్కు ఏమిటంటే ఈ గృహానికి వెళ్ళే శక్తిగలవారు హజ్‌ను విధిగా చెయ్యాలి. ఈ ఆజ్ఞను పాలించటానికి తిరస్కరించేవాడు, అల్లాహ్‌కు, ప్రపంచ ప్రజలకు అవసరం ఎంత మాత్రం లేదు అని స్పష్టంగా తెలుసుకోవాలి'** (దివ్యఖుర్‌ఆన్ 3 : 97)

దైవప్రవక్తా (సఅసం) ఇలా ప్రవచించారు 'ప్రజలారా అల్లాహ్ మీపై హజ్ యాత్ర విధిగా చేశారు. కనుక శక్తిగలవారు హజ్ యాత్ర చేయండి' బుఖారి - ముస్లిం.

ఆదిలో ఆదం అలైహిస్సలాం, జన్నత్ (స్వర్గం) నుండి, భూలోకమునకు పంపబడినప్పుడు, అల్లాహ్ ఆజ్ఞ వల్ల, జిబ్రయీల్ (అ.స) యొక్క సూచనలతో మక్కానగరములో ఇప్పుడు కాబా షరీఫ్ ఉన్న చోట ఒక చిన్న ఇబాదత్ గాహ్ (ప్రార్థనా గృహం) నిర్మించెను. కొన్ని శతాబ్దముల తర్వాత నూహ్ (అ) కాలంలో వచ్చిన పెను తుఫానులో ఈ ప్రార్థనా గృహం కూలిపోయినది. మరికొన్ని యుగాల తర్వాత ఇబ్రాహీం (అ.స) తన కుమారుడు ఇస్మాయీల్ (అ.స) తో కలిసి తమ స్వహస్తములతో ఇదే చోట అనగా మక్కా నగరములో ఇప్పుడు కాబా షరీఫ్ ఉన్న చోట పాత పునాదులపైన కాబాను పునర్నిర్మాణము చేసిరి.

## బలిదానం, కాబా నిర్మాణం

ఇబ్రాహీం (అ.స.) ఇలా వేడుకున్నాడు: ప్రభూ! ఈ (మక్కా) నగరాన్ని శాంతి నగరంగా చెయ్యి. నన్ను నా సంతానాన్ని విగ్రహారాధనా బారి నుండి కాపాడు. ప్రభూ! ఈ విగ్రహాలు అనేక మందిని దారి తప్పించాయి. (నా సంతానాన్ని కూడా దారి తప్పించే ప్రమాదముంది. కనుక వారిలో) నా విధానాన్ని అనుసరించే వారు నా వారవుతారు. నా విధానానికి వ్యతిరేకంగా నడిచేవారికి నీవే దిక్కు. నీవు క్షమించేవాడవు. కరుణించేవాడవు. (దివ్యఖుర్‌ఆన్ 14 : 35, 36)

ప్రభూ! నేను నా సంతానాన్ని ఎలాంటి చెట్టూ-పుట్టా లేని ఎడారి ప్రాంతంలో నీ ప్రతిష్ఠాలయం దగ్గరకు తీసుకొచ్చి వశింపజేశాను, (భవిష్యత్తులో) వీరు ఇక్కడ ప్రార్థనా వ్యవస్థ నెలకొల్పుతారన్న ఆశతో. కనుక వీరి పట్ల నీవు ప్రజల హృదయాల్లో ఆసక్తి అభిమానాలు కలిగించు. వీరికి తినడానికి పండ్లు ఫలాలు ప్రసాదించు, బహుశా అందుకు కృతజ్ఞులై ఉంటారు. ప్రభూ! మేము దాస్తున్నదీ, బహిర్గతం చేస్తున్నదీ అంతా నీకు తెలుసు. దేవునికి భూమ్యాకాశాల్లో ఏదీ కనుమరుగుగా లేదు. (దివ్యఖుర్‌ఆన్ 14 : 37, 38)

ఈ వృద్ధాప్యంలో నాకు ఇస్మాయీల్, ఇస్‌హాఖ్‌ల వంటి సంతానాన్ని ప్రసాదించిన దేవునికి కృతజ్ఞులు. నా ప్రభువు తప్పకుండా (నా) మొరాలకిస్తాడు. ప్రభూ! నా విజ్ఞప్తి స్వీకరించు. నా తల్లిదండ్రుల్ని, యావత్తు విశ్వాసుల కర్మల విచారణ రోజు క్షమించు. (దివ్యఖుర్‌ఆన్ 14 : 39-41)

ఇబ్రాహీం (అ.స.) దేవుణ్ణి ప్రార్థిస్తూ, 'ప్రభూ! ఈ పట్టణాన్ని శాంతి నగరంగా చెయ్యి. అక్కడ నివసించే ప్రజల్లో దైవాన్ని, పరలోకాన్ని విశ్వసించేవారికి తినేందుకు అన్ని విధాల పండ్లు ఫలాలు ప్రసాదించు' అన్నాడు.

దానికి అల్లాహ్ 'ఈ మూన్నాళ్ళ ప్రపంచంలో నన్ను విశ్వసించని వారికి కూడా ఎంతో కొంత ఉపాధినిస్తాను. అయితే ఆ తర్వాత వారిని నరకాగ్ని వైపునకు ఈడుస్తాను. అది అత్యంత ఘోరమైన ప్రదేశం' అని అన్నాడు. (ది.ఖు. 2 : 126)

ఆ బాలుడు (ఇస్మాయీల్) అతనితోపాటు పరుగెత్తే వయస్సుకు చేరుకున్న తరువాత (ఓ రోజు)ఇబ్రాహీం (అ.స.) అతనితో బాబూ నేను నిన్ను అల్లాహ్‌కు బలి ఇస్తున్నట్లు కలగన్నాను. దీనిపై నీ అభిప్రాయం ఏమిటో చెప్పు అన్నాడు.

దానికి ఆ బాలుడు (ఏ మాత్రం కంగారు పడకుండా) 'నాన్నా మీకు దేన్ని గురించి ఆజ్ఞ ఇవ్వబడిందో దాన్ని నెరవేర్చండి. దైవచిత్తమయితే మీరు నన్ను సహనశీలిగా చూస్తారు' అని అన్నాడు. (దివ్యఖుర్‌ఆన్ 37 : 102)

ఇలా వారిద్దరూ (మా ఆజ్ఞ) శిరసావహించారు. ఆ తరువాత ఇబ్రాహీం (అ.స.) తన కుమారుణ్ణి బోర్లాపడవేశాడు (బలి చేయడానికి). అప్పుడు మేము ఇబ్రాహీం (అ.స.) నీవు కలను నిజం చేసి చూపావు. సజ్జనులకు మేము

ఇలాంటి ప్రతిఫలాన్నే ఇస్తుంటాము. నిజంగా ఇది నీకొక స్పష్టమైన పరీక్ష. (అందులో నీవు నెగ్గావు) అని అన్నారు. (దివ్యఖుర్ఆన్ 37 : 103-106)

మేము (అల్లాహ్) పరిహారం క్రింద పొట్టేలును బలిదానం ఇచ్చి ఆ బాలుడ్ని కాపాడాము. అతని కీర్తి ప్రతిష్టల్ని తరువాతి తరాలలో శాశ్వతంగా వదలిపెట్టాము. ఇబ్రాహం (అ.స.)కు శాంతి కలుగుకాక. సజ్జనులకు మేము ఇలాంటి ప్రతిఫలమే ప్రసాదిస్తాం. (దివ్యఖుర్ఆన్ 37: 107, 110)

ఇబ్రాహీం (అ.స.), ఇస్మాయీల్ (అ.స.) ఇద్దరూ దైవగృహానికి పునాదులు తీసి గోడలు నిర్మిస్తూ ఇలా వేడుకున్నారు. 'ప్రభూ! మా ఈ సేవ స్వీకరించు. నీవే (అందరి మొరలు) ఆలకించేవాడవు, సర్వం తెలిసిన వాడవు. ప్రభూ మా ఇద్దర్నీ నీకు విధేయులైన దాసులుగా చెయ్యి. మా సంతతి నుండి నీకు విధేయులై వుండే ఒక జాతిని ఆవిర్భవింపజేయి. నిన్ను అర్థించే పద్ధతేమిటో మాకు తెలియ జేయి. మా పొరపాట్లు మన్నించు నిస్సందేహంగా నీవు మన్నించేవాడవు. కరుణించే వాడవు. ప్రభూ ఆ జాతి ప్రజలకు నీ సూక్తులు వినిపించే, నీ గ్రంథ జ్ఞానాన్ని, వివేకాన్ని నేర్పి వారి జీవితాలను సంస్కరించే ఒక ప్రవక్తను ఆ జాతిలో పుట్టించు. నీవు ఎంతో శక్తిమంతుడవు, వివేకవంతుడవు.' (దివ్యఖుర్ఆన్ 2 : 127-129)

ఇబ్రాహీం (అ.స) కాబాను నిర్మించినప్పుడు, నిర్మానుష్యమైన పర్వత శ్రేణుల మధ్య నీటి చుక్క కూడా లేని మండు ఎడారిలో అప్పుడు వారు చేసిన పవిత్ర దుఆల ఫలితమే నేటి సకల సంపదలతో తులతూగు 'మక్కా నగరం'. అక్కడ దైవ ప్రార్థనలకు కట్టిన కట్టడమే అల్లాహ్ యొక్క గృహము కాబా షరీఫ్. దీని రక్షణకు అల్లాహ్ బాధ్యత వహించును.

ఇక్కడ ప్రతీ సంవత్సరం జిల్‌హజ్ నెల 9వ తారీఖున హజ్ జరుగును ప్రపంచంలోని మారుమూల దేశముల నుండి లక్షలాది ముస్లిం యాత్రికులు (హాజీలు) ప్రతి సంవత్సరం ఇక్కడ యాత్రకు వచ్చెదరు. హజ్ యాత్రకు వచ్చిన యాత్రికులు మదీనా మునవ్వరాలోని 'మస్జిదె నబవీ' ని కూడా దర్శించెదరు. మరియు ఎన్నో పవిత్ర స్థలములు చూచే సౌభాగ్యము లభించును. ఇట్టి వారికి దివ్యఖుర్ఆన్‌లో అనేక చోట్ల వారి పరలోక సుఖముల గురించి శుభ సందేశ

ములు ఇవ్వబడినవి. స్థోమత వున్న ప్రతి ముస్లింపై తన జీవిత కాలంలో ఒకసారి ఈ యాత్ర ఫర్జ్ చేయబడినది. స్థోమత ఉండి, దేహ ఆరోగ్యము బాగా ఉండి అన్ని అవకాశాలున్న వారు హజ్ చేయకపోతే గునేగార్ అగును. స్థోమత లేనివారు అప్పు చేసుకొని, ఋణాలపాలై చందాలు వేసుకుని, ముష్టి ఎత్తుకుని హజ్ చేయాలని లేదు. (దివ్యఖుర్ఆన్ 2 : 196, 3 : 197)

## హజ్‌లో నిర్వర్తించవలసిన విధులు:

జిల్‌హజ్ నెల 8,9,10 తారీఖులలో హజ్ జరుగును. 8వ తారీఖుకు ముందు మక్కా చేరినవారు మక్కాకు సుమారు 6 మైళ్ల దూరం ఉండగానే హజ్ నియ్యత్ చేసి కాబాలో రాత్రింబవళ్ళు ప్రార్థనలు, నమాజ్‌లు చేసి పవిత్ర కాబా చుట్టూ 7 సార్లు ప్రదక్షిణము (తవాఫ్) సఫా, మర్వా, పర్వతాల మధ్య 7 సార్లు పరుగిడుట (సయీ) పవిత్ర జలము (ఆబె జమ్‌జమ్) త్రాగుట మొదలగు కార్యములలో నిమగ్నులై ఉందురు. ప్రపంచంలో ఏ నీరైనా ఒక పాత్రలో నిల్వ ఉంచిన చెడిపోవును. కాని ఈ జంజం నీరు ఏ మాత్రం చెడిపోదు. ఎంత పరిశోధనలు చేసినా దీని రహస్యం అంతుపట్టలేదు. ఈ నీటిని శారీరక రుగ్మతలు, మానసిక రోగములకు ఔషధముగా తీసుకొంటారు. **'లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్, లబ్బైక్ లా షరీక లక లబ్బైక్ ఇన్నల్ హంద వన్నీఅమ త లక, వల్‌ముల్క, లా షరీక లక'** అను నినాదంతో కాబా అంతా ప్రతిధ్వనించుచుండును.

తెలుగు: హాజరయ్యాను ప్రభూ! హాజరయ్యాను, నీకు సాటి మరెవ్వరూ లేరు. నేను హాజరయ్యాను దేవా! నిస్సందేహంగా సకల స్తోత్రములకు, అనుగ్రహాలకు, అర్హుడవు నీవే! ప్రతి చోట నీ ఆధిపత్యమే ఉన్నది. నీకు సహవర్తులు ఎవరూ లేరు.

8వ జిల్‌హజ్ ఉదయం మక్కాకు సుమారు 3 మైళ్ళ దూరంలో వున్న 'మినా' అను బహిరంగ స్థలానికి వెళ్లి అక్కడ నమాజ్ చేయవలెను.

9వ రోజు 'మినా' నుండి సుమారు 8 మైళ్ళ దూరంలో ఉన్న 'అరఫాత్' మైదానానికి వెళ్ళి అక్కడ నమాజులు చదువవలెను.

9వ జిల్‌హజ్ నాడే సూర్యాస్తమయం అయిన వెంటనే 'అరఫాత్' వదలి సమీపంలో ఉన్న 'ముజ్దలిఫా' మైదానంలో రాత్రి బస చేయవలెను. ఇచ్చట

కూడా నమాజ్‌లు చదవవలెను.

10వ జిల్‌హజ్ నాడు తెల్లవారు జామున 'ముజ్దలిఫా' వదలి 'మినా' చేరవలెను. ఆ రోజున 'మినా'లో జమ్రాకు చిన్న చిన్న రాళ్లు రువ్వవలెను. తర్వాత ఖుర్బానీ ఇవ్వాలి. ఖుర్బానీ ఇచ్చిన తర్వాత, తల వెంట్రుకలు తీయించుకుని, స్నానం చేసి నమాజ్ చదువవలెను. ఇప్పుడు 'మినా' నుండి, మక్కా కాబా చుట్టూ 'తవాఫ్' చేసి 'సయీ' చేసి 'మినా' తిరిగి రావలెను. దీనితో హజ్ పూర్తి అవుతుంది.

హజ్ చేయు కాలంలో హాజీలు ధరించు దుస్తులు 2 అంగ వస్త్రములు మాత్రమే! (ఒకటి నడుము నుంచి క్రిందికి, మరొకటి ఒంటి పైభాగమును కప్పిపుచ్చవలెను). రాజాధిరాజైనా, సాధారణ వ్యక్తి అయినా ఈ సాధు వైఖరిలో దాసుడై ఉండవలసినదే!

హజ్ రోజులలో లక్షలాది ప్రజలు మక్కా సందర్శించెదరు. ఈ రోజులలో వారి మధ్య ఎటువంటి వైరము గాని, సంఘర్షణగాని, కోపతాపములు గాని ఉండనే ఉండవు. నలువైపుల శాంతియే శాతి. ప్రతి వారి నోడి నుండి'సలాం సలాం' అను అభినందనలు వినబడును. హజ్ సమయంలో మనం సందర్శించు ప్రతి స్థలము ప్రత్యేకత కలిగి ఉన్నది. మనం అనుసరించు ప్రతి చర్య విశేషత కలిగి ఉన్నది. మనం ఆరాధించు ప్రత్యేక ప్రార్థనలు, దుఆలు, దైవస్మరణ, స్తోత్రము ప్రశంసనీయమైనవి. వీటి గురించి హజ్ సమయంలో విపులముగా తెలుసుకొనుటకు హైదరాబాద్‌లోని హజ్ కమిటీ నుండి హాజీలు పుస్తకములు పొందవచ్చును.

ఈ విధి యొక్క వింత, ప్రత్యేకత ఏమిటంటే ఒకసారి హజ్ చేసిన వారు మరీ మరీ చేయాలని, ఆ పుణ్య స్థలంలో ప్రాణాలర్పించి, జన్నతుల్ బఖీలోగాని, జన్నతుల్ ముఅల్లాలో గాని సమాధి అవ్వాలని విలపిస్తుంటారు. హజ్ చేయని వారు సాధ్యమైనంత త్వరలో మృత్యువు నోట పడక ముందే హజ్ చేయాలని తహతహ లాడుతుంటారు. అల్లాహ్ వారందరి కోరికలను సఫలీకృతం చేయుగాక.

ఆమీన్.

## 11వ అధ్యాయము

# కొన్ని ప్రత్యేక నఫిల్ నమాజులు

మామూలుగా, రోజుకు 5 పూటలు చదివే నమాజులు కాక, మరికొన్ని ప్రత్యేక నఫిల్ నమాజులు చదువుటకై తాకీదు చేయబడినది. అప్పుడప్పుడు మనకు వీలైనప్పుడు, లేదా వీలు కలగజేసుకుని ఈ నఫిల్ నమాజ్‌లు చదువుట వల్ల మనకు పుణ్యం, ముక్తి, మోక్షము కలుగును. ఫర్జ్, సున్నత్ నమాజ్‌లు చదివిన తర్వాతనే ఈ నఫిల్ నమాజ్‌ల ఫజీలత్. ఫరజ్, సున్నత్ నమాజ్‌లు చదవకుండా, ఖజా చేసి, ఈ నఫిల్ నమాజ్‌ల పైనే మనస్సు లగ్నం చేసి చదవాలని లేదు. ఈ క్రింద నఫిల్ నమాజ్‌లు ఉదహరించబడినవి.

## 1. నమాజ్ ఇష్రాఖ్

ఫజ్ర్ నమాజ్ చదివిన తర్వాత, సూర్యోదయం వరకు దైవ స్మరణ చేసుకొనుచూ, లేదా ఖుర్‌ఆన్ పఠనం చేసుకుని, సూర్యోదయం అయిన తర్వాత రెండు రకాత్‌ల నమాజ్ చదువుట.

## 2. నమాజ్ చాష్త్

ఈ నమాజ్ సూర్యుని కాంతి కాస్త తీక్షణముగా ఉన్న సమయంలో అనగా సుమారు పగలు 10-11 గంటలకు 2 రకాత్‌ల నఫిల్ నమాజ్ చదువుట.

## 3. నమాజ్ అవ్వాబీన్

మగ్‌రిబ్ నమాజ్ అయిన తర్వాత ఆరు రకాత్‌ల నఫిల్ నమాజ్, రెండు రకాత్‌ల చొప్పున చదువుట.

## 4. నమాజ్ షుక్రానా

అల్లాహ్ మనకు ప్రసాదించిన ప్రతి కరుణపై అల్లాహ్‌కు మన ధన్య వాదములు చెప్పుకొనుట మన ధర్మం. అందుచే మనం అల్లాహ్ ద్వారా పొందు ప్రతీ అనుగ్రహాలకు కృతజ్ఞతగా రెండు రకాత్‌ల నమాజ్ చదువుట.

## 5. నమాజె తహజ్జుద్

ఈ నమాజ్ ఫర్జ్ తరువాత అన్నిటికన్నా శ్రేష్ఠమైనది. దీని ప్రాముఖ్యత మరియు ఫజీలత్ గురించి ఖుర్ఆన్‌లో పలుచోట్ల ఉదహరించబడినది. వహీ ద్వారా ముహమ్మద్ (సఅస)కు తాకీదు ఇవ్వబడినది. ముహమ్మద్ (సఅసం) ఈ నమాజ్‌ను తరచుగా చదివెడివారు. ఈ నమాజ్ ఇషా నమాజ్ చదివి నిద్రపోయి అర్ధరాత్రిగాని, ఇంకా రాత్రిగా యున్నప్పుడు గాని, లేచి ఈ నమాజ్ చదువవలెను. ఈ నమాజ్ 2 నుండి 12 రకాత్‌ల వరకు రెండు రకాత్‌ల చొప్పున చదువవలెను. అర్ధరాత్రి తన గాఢ నిద్ర నుండి మేల్కొని, హృదయవేదనతో, కంటి తడితో చేయు ఆరాధన, దుఆలు తప్పక ఫలించును అని నిర్ధారణయైనది. అల్లాహ్ తన దాసుని భయభక్తులకు మెచ్చుకొని అతని ఆరాధనలను, ప్రార్థనలను స్వీకరించును.

## 6. నమాజె తౌబా

తాను చేసిన చెడు, పాపపు పనులకు హృదయపూర్వకముగా తన తప్పు లను ఒప్పుకొని, అల్లాహ్ ఎదుట పశ్చాత్తాపమును వెలిబుచ్చుతూ, ఇక ముందు ఎన్నడూ ఇటువంటి సహించరాని చెడు పనులు చేయనని అల్లాహ్‌కు వాగ్దాన మిచ్చుటను 'తౌబా' అంటారు. ఇటువంటి 'తౌబా' సహృదయముతో చేసిన నమాజ్ అల్లాహ్‌కు ప్రీతి. కరుణామయుడగు అల్లాహ్‌కు ఇతని పశ్చాత్తాపముతో చేసిన 'నమాజె తౌబా' సమ్మతించును. (తిర్మిజి)

## 7. సలాతె తస్బీహ్

4 రకాత్‌ల నఫిల్ నమాజ్ ఒకేసారి చదవవలెను. మానవుని భక్తి, ఏకాగ్రత అల్లాహ్ పట్ల వృద్ధి పొందుటకు ఈ నమాజ్ చేయుదురు.

ఈ నమాజ్‌లో తస్బీహ్ 300 సార్లు స్మరించబడును. ఒక్కొక్క రకాత్‌లో 75 సార్లు స్మరించవలసిన తస్బీహ్.

**'సుబ్‌హానల్లాహి, వల్‌హందు లిల్లాహి వలా ఇలాహ ఇల్లల్లాహు అల్లాహు అక్బర్'**

సులువుగా ఆచరించుటకై ఒక రకాత్ నమాజ్ చదివే విధానము ఈ క్రింద వివరించబడినది.

1. ఈ నమాజ్ చదువుటకు నియ్యత్ చేసి సనా చదివిన తర్వాత 15 సార్లు పైన చెప్పిన తస్బీహ్ చదువవలెను.
2. తర్వాత అల్‌హం, మరియొక సూరా చదివి రుకూలో వెళ్ళే ముందు 10 సార్లు ఈ తస్బీహ్ స్మరించవలెను.
3. రుకూలో మామూలుగా 3 సార్లు 'సుబ్‌హాన రబ్బియల్ అజీం' చెప్పిన తరువాత 10 సార్లు ఈ తస్బీహ్ స్మరించవలెను.
4. రుకూ నుండి నిలబడి (ఖౌమా) 10 సార్లు తస్బీహ్ స్మరించవలెను.
5. ఖౌమా నుండి సజ్దా చేసి, మొదటి సజ్దాలో 3 సార్లు 'సబ్‌హాన రబ్బియల్ ఆల' చెప్పి, సజ్దాలోనే 10 సార్లు ఈ తస్బీహ్ స్మరించవలెను.
6. మొదటి సజ్దా అయిన తర్వాత కూర్చొని (జల్సా) 10 సార్లు ఈ తస్బీహ్ స్మరించవలెను.
7. జల్సా నుండి రెండవ సజ్దా చేసి, సజ్దాలో మామూలుగా 3 సార్లు 'సుబ్‌హాన రబ్బియల్ ఆల' అని చెప్పిన తర్వాత 10 సార్లు ఈ తస్బీహ్ స్మరించవలెను.

ఇప్పటికి ఒక రకాత్ నమాజ్ తస్బీహ్ అయినది. రెండవ సజ్దాలో 10 సార్లు తస్బీహ్ స్మరించి నిలబడి, మిగిలిన 2,3,4 రకాత్‌లు పైన చెప్పిన విధముగా చదివి 4వ రకాత్ తర్వాత అత్తహియ్యాత్, దరూదె ఇబ్రాహీం, దుఆ చదివి రెండు ప్రక్కల సలాం చేయవలెను.

## 8. నమాజె హాజత్

ఏదైనా గడ్డు సమస్యచే కలవరపడినప్పుడు, ఏదైనా కష్టతరమైన పని సాధించుటలో విఫలమైనప్పుడు, మన కార్యసిద్ధికై మన కోరికల సఫలమునకు దైవ సహాయము కొరకు రెండు రకాత్‌ల నఫిల్ నమాజ్ చదివి, అల్లాహ్‌ను ప్రార్థించుకోవలెను.

రెండు రకాత్‌ల నమాజ్ చదివి సలాం చేసిన తర్వాత (అనగా నమాజ్ పూర్తి అయిన తర్వాత) సజ్దాలో వెళ్ళి

10 సార్లు దరూదె షరీఫ్

10 సార్లు మూడవ కలిమా

10 సార్లు 'రబ్బనా ఆతినా ఫిద్దున్యా హసనతవ్,

వఫిల్ ఆఖిరతి, హసనతవ్ వ్వఖినా అజాబన్నార్'

అని సజ్దా నుండి తలెత్తి, మన హాజత్ (మన అవసరము, కోరిక) మనకు దాపురించిన కష్టనష్టములు అల్లాహ్ ఎదుట విన్నవించుకోవలెను. దైవ చిత్తమైతే మనకు తప్పక కార్యసిద్ధి కలుగును.

## 9. ఇస్తిఖారా నమాజు

**(శ్రేయస్కరమైన పని కోసం చేసే నమాజు)**

ఇస్తిఖారా అంటే శ్రేయస్కరమైన పని ఏదో తెలుసుకోవటానికి దైవాన్ని సంప్రదించటమని అర్థం. ఏదయినా పని చేయాలనుకున్నప్పుడు మన కొరకు ఆ పని శ్రేయస్కరమైనదయితే అందులో శుభాన్ని ప్రసాదించమనీ, ఒకవేళ ఆ పని మనపాలిట హానికరమయినదయితే మనల్ని దాన్నుండి కాపాడి శ్రేయో శుభాలు గల పని వైపుకు మనల్ని మళ్ళించమని దైవాన్ని వేడుకోవటమే ఇస్తిఖారా.

ఇస్తిఖారా చేయదలచుకున్నప్పుడు రెండు రకాతుల నమాజ్ చేసి ఈ దుఆ పఠించాలి:

**"అల్లాహుమ్మ ఇన్నీ అస్తఖీరుక బి ఇల్మిక వ అస్తఖ్‌దిరుక బి ఖుద్‌రతిక వ అస్‌అలుక మిన్ ఫజ్లికల్ అజీమ్. ఫఇన్నక తఖ్‌దిరు వలా అఖ్‌దిరు వ తాలము వలా ఆలము వ అంత అల్లాముల్ గుయూబ్. అల్లాహుమ్మ ఇన్ కుంత తాలము అన్న హాజల్ అమ్ర ఖైరున్ లీ ఫీ దీనీ వ మఆషీ వ ఆఖిబతి అమ్రీ అవ్ ఆజిలి అమ్రీ వ ఆజిలిహీ ఫఖ్‌దుర్‌హు లీ వ యస్సిర్‌హు లీ సుమ్మ బారిక్‌లీ ఫీహి వ ఇన్‌కుంత తాలము అన్న హాజల్ అమ్ర షర్రున్ లీ ఫీ దీనీ వ మఆషీ వ ఆఖిబతి అమ్రీ అవ్ ఆజిలి అమ్రీ వ ఆజిలిహీ ఫస్‌రిఫ్‌హు అన్నీ వస్‌రిఫ్‌నీ అన్‌హు వఖ్‌దుర్‌లియల్ ఖైర హైసు కాన సుమ్మ అర్‌జినీ బిహీ.** *(బుఖారీ)*

(దేవా! నేను నీ జ్ఞాన భాగ్యంతో సాఫల్యాన్ని ప్రసాదించమని అడుగు తున్నాను. నీ అధికార సాయంతో నాకు (నా దశ దిశలను మలచుకునే) శక్తిని ప్రసాదించమని కోరుతున్నాను. మహోజ్వలమైన నీ అనుగ్రహాన్ని ప్రసాదించమని అభ్యర్థించు కుంటున్నాను. నిశ్చయంగా నీవే అధికారం కలవాడివి. నాకు ఎలాంటి అధికారమూ లేదు. నీకు అన్నీ తెలుసు. నాకు ఏమీ తెలియదు. అగోచరజ్ఞానివి నీవే. దేవా! నీ జ్ఞానం ప్రకారం ఈ పని ధార్మికంగా, ప్రాపంచికంగా, పరలోక పరిణామంరీత్యా (లేదా) త్వరగా లేక ఆలస్యంగా నాకు ఉపయోగకరమైనదయితే దాన్ని నా అదృష్టంలో ఉంచు. దాని సాధనను నా కొరకు సులభతరం చెయ్యి. దాన్ని నాకొరకు శుభప్రదమైనదిగా చెయ్యి. కాని ఒకవేళ నీ జ్ఞానం ప్రకారం ఈ పని ధార్మికంగా, ప్రాపంచికంగా, పరలోక పరిణామం రీత్యా (లేదా) త్వరగాగానీ, ఆలస్యంగా గానీ నాకు నష్టం కలిగించేదయితే దాన్ని నానుండి దూరంగా ఉంచు. దాని బారి నుండి నన్ను కాపాడు. సాఫల్యం ఎక్కడున్నా సరే దాన్ని నా అదృష్టంగా మలచు. ఆ తర్వాత దాన్ని నాకు ఆమోదయోగ్యంగా చెయ్యి.

## 10. గ్రహణ నమాజ్

దేవుడు అప్పుడప్పుడూ సూర్యచంద్రుల వెలుగును కమ్మివేస్తూ ఉంటాడు. అలాంటి సందర్భాలు వచ్చినప్పుడు పగటిపూట ఆకాశాన సూర్యుడుంటాడు కాని, దానివల్ల వెలుతురు తక్కువగా వస్తుంది లేదా కొన్ని సందర్భాల్లో అసలు రాదు. అలాగే ఆకాశాన చంద్రుడుంటాడు కాని దాని వెలుతురు కొడిగట్టుకు పోయి ఉంటుంది. దాన్నే 'గ్రహణం' అని అంటారు.

గ్రహణాలు ఏర్పడినప్పుడు ప్రజలు గతంలో తమ వల్ల జరిగిన పాపాలపై పశ్చాత్తాపం చెందాలి. దేవుణ్ణి ప్రార్థించాలి. ఆయన సన్నిధికి హాజరై విలపిస్తూ క్షమాభిక్ష పెట్టమని అర్థించాలి. దానధర్మాలు చేయాలి. అందరూ కలిసి సామూహికంగా రెండు రకాతుల నమాజ్ చేయాలి. ఆ నమాజునే 'కుసూఫ్' లేదా 'ఖుసూఫ్' నమాజ్ అని అంటారు. అంటే సూర్యగ్రహణ లేదా చంద్రగ్రహణ నమాజ్ అని అర్థం.

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: సూర్యచంద్ర గ్రహణాలు దేవుని సూచనలు. ప్రజలు వాటిని చూసి గుణపాఠం నేర్చుకోవాలని దేవుడు వాటిని ఏర్పరుస్తుంటాడు. మీకు అలాంటి సూచనలు కనిపించినప్పుడు మీరు వెంటనే ప్రార్థనలు, క్షమాభిక్ష, దైవధ్యానం (నమాజ్) వైపుకు మరలండి.*(ముస్లిం)*

1) ఖుసూఫ్, కుసూఫ్ నమాజులకు అజాన్ ఇఖామత్‌లు ఉండవు. 2) అజాన్‌కు బదులు బిగ్గరగా 'అస్సలాతు జామిఅతున్' అని ప్రకటించాలి. 3) గ్రహణాలు పట్టినప్పుడు ప్రజలందరూ సామూహికంగా రెండు రకాతుల నమాజ్ చేయాలి. ప్రతి రకాత్‌లో రెండు రుకూలు, రెండు సజ్దాలు చేయాలి. *(బుఖారీ-ముస్లిం)*

# నమాజ్ చేసే పద్ధతి

1. 'అల్లాహు అక్బర్' అని నమాజ్ మొదలెట్టాలి. ఫాతిహా సూరా తర్వాత సుదీర్ఘంగా ఖుర్‌ఆన్ పారాయణం చేయాలి. 2. తర్వాత మళ్ళీ 'అల్లాహు అక్బర్' అంటూ రుకూ చేయాలి. రుకూ కూడా సుదీర్ఘంగా చేయాలి. 3. ఆ తర్వాత రుకూ నుండి తలపైకెత్తి "సమిఅల్లాహు లిమన్ హమిదహ్", "రబ్బనా లకల్ హమ్ద్" అంటూ నిటారుగా లేచి నిలబడాలి. 4. మళ్ళీ ఫాతిహా సూరా పఠించి, సుదీర్ఘ పారాయణం చేయాలి. ఈ పారాయణం తొలిసారి చేసిన పారాయణం కన్నా కాస్త సంక్షిప్తంగా ఉండాలి. 5. ఖుర్‌ఆన్ పారాయణం తర్వాత 'అల్లాహు అక్బర్' అంటూ రుకూ చేయాలి. ఈ రుకూ మునుపటి రుకూ కన్నా సంక్షిప్తంగా ఉండాలి. 6. ఆ తర్వాత రుకూ నుండి తలపైకెత్తి "సమిఅల్లాహు లిమన్ హమిదహ్", "రబ్బనా లకల్ హమ్ద్" అంటూ నిటారుగా లేచి నిలబడాలి. 7. ఆ తర్వాత "అల్లాహు అక్బర్" అంటూ రెండు సజ్దాలు చేయాలి. 8. రెండవ రకాత్ కూడా అలాగే చేయాలి. 9. ఆ విధంగా రెండు రకాతుల్లో మొత్తం నాల్గు రుకూలు, నాలుగు సజ్దాలు అవుతాయి. *(బుఖారీ-ముస్లిం)*

## 11. ఇస్తిస్ఖా నమాజు (వర్షం కోసం చేసే నమాజు)

**"అల్లాహుమ్మ ఇస్ఖినా గైసన్ ముగీసన్ మరీఅన్ మురీఅన్ నాఫిఅన్ గైర జార్రిన్ ఆజిలన్ గైర ఆజిలిన్.**

(దేవా! దాహాన్ని తీర్చే, హానికరమైనది కాకుండా ప్రయోజనకరమైన, ఆలస్యంగా కాకుండా త్వరగా వచ్చే వర్షం ద్వారా మా దాహార్తిని తీర్చు).

**"అల్లాహుమ్మ అస్ఖి ఇబాదక వబహాయిమక వన్షుర్ రహ్మతక వఅహ్యి బలదకల్ మయ్యిత."**

(దేవా! నీ దాసులకు, (నోరులేని) నీ జంతువులకు నీళ్లు త్రాపించు. నీ కారుణ్య వర్షాన్ని అందరిపై కురిపించు. మృత భూమిని (తిరిగి) సస్యశ్యామలంగా చెయ్యి.) *(అబూదావూద్)*

## 12. వ్యాధిగ్రస్తుని నమాజు

వ్యాధిగ్రస్తుడయిన వ్యక్తి నించొని నమాజ్ చేయలేకపోతే కూర్చొని చేయాలి. కూర్చొని కూడా చేయలేకపోతే పడుకొని నమాజ్ చేయాలి.*(బుఖారీ-ముస్లిం)* రుకూ, సజ్దాలను సంజ్ఞలతో చేయాలి. రుకూలో కన్నా సజ్దాలో కాస్త ఎక్కువగా వంగాలి. ఏదయినా ఎత్తయిన వస్తువును ముందుపెట్టుకొని దాని మీద సజ్దా చేయటం సరయిన పద్ధతి కాదు *(బైహఖీ)*. వృద్ధాప్యం కారణంగా స్తంభంలాంటి వస్తువులకు ఆనుకొని నమాజ్ చేసినా తప్పులేదు.*(అబూదావూద్)*. ఇస్తిహాజా వ్యాధికి గురై ఉన్న స్త్రీ తన బహిష్టు గడువు పూర్తవగానే గుసుల్ చేసి నమాజ్ చేయటం మొదలు పెట్టాలి.*(ముస్లిం)*

### ప్రవక్త (సఅస) వ్యాధిగ్రస్తుని పరామర్శిస్తూ చేసిన దుఆ

**"అస్అలుల్లాహల్ అజీమ రబ్బల్ అర్షిల్ అజీమి అయ్యష్ఫియక"**

**అర్థం: ఘనతగలవాడైన, మహోన్నత అర్ష్ పీఠానికి యజమాని అయిన అల్లాహ్ నీకు స్వస్థత కలిగించాలని వేడుకుంటున్నాను.**

## 12వ అధ్యాయము

# జనాజా- అంత్యక్రియలు

## (అంత్యక్రియలలో పాటించవలసిన నియమాలు)

మన తోటి వారి అంత్యక్రియలలో పాల్గొనటం ముఖ్య కర్తవ్యమని గ్రహించుటం ప్రతి ముస్లిం విధి.

**'కుల్లు నఫ్సిన్ జా ఇఖతుల్ మౌత్'** **తెలుగు** : ప్రతి జీవి చావు రుచి చూడవలసినదే. **'ఇన్నా లిల్లాహి, వ ఇన్నా ఇలైహి రాజివూన్'**

**తెలుగు:** మనము అల్లాహ్‌కు చెందినవారము. మళ్ళీ మనము అల్లాహ్ వద్దకే తిరిగి వెళ్ళుట తథ్యము.

## చనిపోయిన తర్వాత చేయవలసిన అంత్యక్రియలు:

చనిపోయిన మనిషిని 'మయ్యత్' అంటారు. మయ్యత్‌ను స్నానం చేయించే ముందు ఈ క్రింది ఉదహరించిన పనులు చేయవలెను.

1. మయ్యత్‌ను వెల్లకిల పరుండబెట్టవలెను. అతని కాళ్లు చేతులు ఖిబ్లా వైపు ఉండునట్లు చేయవలెను. అతని తల కొంచెం ఎత్తుగా వుండునట్లు; అతని ముఖం ఖిబ్లా వైపు చూచునట్లు ఉంచవలెను.
2. రెండు పాదముల బొటన వ్రేళ్ళను కలిపి, గుడ్డ పీలికతో కట్టవలెను. రెండు చేతులు చంకల వద్ద రెండు వైపుల నుండి దేహమునకు దగ్గర చేయవలెను.
3. గడ్డము క్రింద నుండి నెత్తిపై వరకు గుడ్డతో కట్టవలెను, కంటి రెప్పలు మూయవలెను. మయ్యత్‌కు పూర్తిగా దుప్పటి కప్పవలెను. త్వరగా స్నానం చేయించుటకు ఏర్పాట్లు చేయవలెను.

## నమాజె జనాజా (ఫర్జ్ కిఫాయా) సామూహిక విధి

మయ్యత్ స్నానం చేయించి, కఫన్ తొడిగించి జనాజాలో ఉంచుదురు. జనాజాలో మయ్యత్ తల ఉత్తరము వైపు, కాళ్ళు దక్షిణము వైపు ఉండునట్లు పరుండబెట్టి, ఇమాం మయ్యత్ యొక్క ఛాతీ ఎదురుగా నిలబడి జనాజా నమాజ్ చదివించును ఇమాం. వెనుక 1,3,5,7 పంక్తులలో వరుసగా ఒకరి

భుజమునకు ఒకరు తాకినట్లు దగ్గిరగా నిలబడి నాలుగు తక్బీర్‌లతో నమాజ్ చేయుదురు. ఈ నమాజ్‌లో రుకూగాని, సజ్దాలుగాని ఉండవు. నిలబడి, మయ్యత్ కొరకు 'దుఆ ఎ మగ్ఫిరత్' కొరకు చేయు నమాజ్‌కు నమాజె జనాజా అంటారు.

**నియ్యత్:** 'యా అల్లాహ్ మై నియ్యత్ కర్తాహు, ఇస్ జనాజెకి నమాజ్ పఢ్‌నేకీ, చార్ తక్బీర్‌కె సాథ్, వాస్తె అల్లాహ్‌కె, ఔర్ దుఆ కర్తాహు ఇస్ మయ్యత్ కె లిఏ తాబె ఇస్ ఇమాం కె, రుఖ్ మెరా కాబ షరీఫ్ కె తరఫ్' అని, నియ్యత్ చేయవలెను. తర్వాత ఇమాం మొదటిసారి 'అల్లాహు అక్బర్' అనగా నే వెనుక ఉన్న వారు కూడా తమలో అల్లాహు అక్బర్ అని చేతులు చెవుల వద్దకు తీసుకుని వెళ్ళి నియ్యత్ చేసి చేతులు కట్టుకుని తర్వాత 'సనా' చదువవలెను.

తర్వాత ఇమాం రెండవసారి 'అల్లాహు అక్బర్ అనగానే వెనుకనున్న వారు 'దరూదె ఇబ్రాహీం' చదువవలెను. ఇమాం మూడవసారి 'అల్లాహు అక్బర్' అనగానే వెనుక ఉన్న వారు కూడ తమ లో 'అల్లాహు అక్బర్' అని ఈ క్రింది దుఆ చదువవలెను. మయ్యత్ వయసు ఉన్న స్త్రీగాని, పురుషుడుగాని అయితే

**దుఆ:**

**"అల్లాహుమ్మగ్ ఫిర్‌లి, హయ్యినా వమయ్యి తినా**
**వ షాహిదినా వ గాఇబినా వ సగీరినా వ కబీరినా వ జకరినా**
**వ వున్‌సానా-అల్లాహమ్మ మన్, అహ్ యయ్ తహూ మిన్నా ఫ అహ్ యిహీ**
**అలల్ ఇస్లాం వమన్ తవఫ్ఫై తహూ మిన్నా, ఫతవఫ్ఫహూ అలల్ ఈమాన్."**
**"అల్లాహుమ్మ లా తహ్‌రిమ్ నా అజ్రహూ వలా తఫ్‌తిన్నా బాదహు.*(ముస్లిం)***

**తెలుగు భావం:** ఓ అల్లాహ్! మా యొక్క బ్రతికియున్న వారిని, పురుషులను, స్త్రీలను, యువకులను, వృద్ధులను, ఇప్పుడు మా మధ్య ఉన్న వారిని, ముమ్ములను విడిచిపోయిన వారిని అందరినీ క్షమింపుము. ఓ అల్లాహ్! మేము ఇస్లాంలో బ్రతికి ఇస్లాంలోనే ప్రాణం వదులు భాగ్యము ప్రసాదింపుము.

i) మయ్యత్ చిన్న పిల్లవానిదైతే

**దుఆ:**

**అల్లాహుమ్మజ్ అల్‌హూ లనా ఫరతౌన్ వ్వజ్‌అల్ హూ లనా**
**అజ్‌రౌన్ వ్వజుఖ్‌రౌన్ వ్వజ్‌అల్‌హూ లనా షాఫిఅవ్ వ్వ ముషఫ్ఫఅన్**

ii) మయ్యత్ ఆడశిశువు అయితే

**దుఆ: అల్లాహుమ్మజ్ అల్‌హా లనా ఫరతౌన్ వజ్అల్‌హా లనా**
**అజ్‌రౌన్ వ్వజుఖ్‌రౌన్ వ్వజ్అల్‌హా లనా షాఫి అతౌన్ వ్వ ముషప్ప అతన్**

## మగశిశువులు, ఆడశిశువుల దుఆల తెలుగు అర్థం:

ఓ అల్లాహ్! ఇతనిని (ఈమెను) మాకు మార్గదర్శిగాను, మాకై ఒక మెప్పు గాను, నిధిగాను ఉండునట్లు చేయుము. మా తరపున మా కోసం, క్షమార్పన వేడుకునే వానిగా చేయుము.

**దుఆ:** తర్వాత ఇమాం నాల్గవసారి 'అల్లాహు అక్బర్' అని సలాం చేయును. వెనుక వున్న వారు కూడా 'అల్లాహు అక్బర్' అని ముఖం కుడి ఎడమ భుజముల వైపు త్రిప్పుకుని సలాం చేయవలెను. నమాజ్ జనాజా పూర్తి అయినది. పైన చెప్పిన దుఆలు కంఠస్థముగా వచ్చే వరకు ఇమాంను అనుసరించిన చాలు.

**దుఆ:** ఈ నమాజును 'ఫర్జ్‌కిఫాయా' అందురు (చనిపోయిన వ్యక్తి కొరకు దీవెనులు చేయు ప్రార్థన). కొన్ని కొన్ని సమయములలో, ఆ పరిసరపు ప్రాంతంలో నున్న ఏ కొందరైనా ఇటువంటి సత్ప్రవర్తన పాటించిన ఈ చర్య అందరి బాధ్యత తీర్చును.

జనాజా నమాజ్ తర్వాత చనిపోయిన వ్యక్తి కొరకు దుఆ చేయుదురు. దీనిని 'దుఆయె మగ్‌ఫిరత్' అంటారు.

ఇమాం మయ్యత్ ముందు నిలబడి ఈ క్రింది విధముగా మగ్‌ఫిరత్ దుఆ చేయును.

**చనిపోయిన వ్యక్తి పురుషుడైనట్లయితే:**

**'అల్లాహుమ్మగ్‌ఫిర్ లహూ వర్‌హమ్‌హు వఆపు అన్‌హు**
**వ అద్‌ఖిల్‌హు, వ అస్‌కిన్‌హుల్ జన్న'** (3 సార్లు)

**తెలుగు:** ఓ అల్లాహ్! ఈ శవాన్ని (మయ్యత్‌ను) క్షమించుము. ఇతనిపై కరుణ చూపుము. ఇతనిని స్వర్గములో ప్రవేశపెట్టుము.

దరూదె షరీఫ్ 1 సారి

**చనిపోయిన వ్యక్తి స్త్రీ అయినట్లయితే**

**'అల్లాహుమ్మగ్‌ఫిర్ లహా వర్‌హమ్‌హా వఆపు అన్‌హా**
**వ అద్ ఖిల్‌హా, వ అస్‌కిన్‌హల్‌జన్న'** 3 సార్లు

దరూదె షరీఫ్ 1 సారి

**తెలుగు:** ఓ అల్లాహ్! ఈ శవాన్ని (మయ్యత్‌ను) క్షమించుము. ఈమెపై కరుణ చూపుము. ఈమెను స్వర్గములో ప్రవేశపెట్టుము.

## దఫన్ కర్నేకా తరీఖా (సమాధి చేయు విధానము):

ఖబ్రస్థాన్‌కు వెళ్ళిన తర్వాత, అక్కడ ధఫన్ అయి ఉన్న వారి నుద్దేశించి 'అస్సలాము అలైకుమ్ యా అహలెఖుబూర్' అనవలెను. ఖబ్రస్థాన్ చేరిన తర్వాత మయ్యత్ జనాజాలో నుంచి నెమ్మదిగా తీసి, ఖిబ్లా వైపు నుంచి, ఇది వరకే అతని కోసం ఏర్పాటు చేయబడిన సమాధిలో జాగ్రత్తగా దించవలెను. మయ్యత్ తల ఉత్తరము వైపు ఉన్నట్లు సమాధిలో పరుండ బెట్టవలెను. మయ్యత్‌ను, సమాధిలో దించునపుడు 'బిస్మిల్లాహి, వ అలా మిల్లతి రసూలిల్లాహి' అనవలెను. షరీఅత్ ప్రకారము మయ్యత్‌ను దఫన్ చేసిన చేసిన తర్వాత ప్రతీ ఒక్కరూ తమ రెండు చేతులతో మట్టి తీసుకొని 3 సార్లు ఖబర్‌లో వేయవలెను. మొదటి సారి మట్టి వేయునప్పుడు 'మిన్‌హా ఖలఖ్‌నాకుం' అనవలెను. (అర్థముం 'ఇస్ జమీన్ సే హంనే తుంకు పైదా కియా' ఈ మట్టితోనే, మేము నిన్ను సృష్టించి నాము), రెండవసారి మట్టి వేయునప్పుడు, 'వఫీహా నుఈదుకం' అనవలెను. (అర్థము: 'ఔర్ ఇస్ జమీన్ మే తుంకు లోటాతెహై' మరియు ఈ మట్టిలోనే నిన్ను పంపుచున్నాము), మూడవసారి మట్టి పోయినప్పుడు 'వ మిన్‌హా నుఖ్‌రిజుంకు తారతన్ వుఖ్రా' అనవలెను (అర్థము: 'ఔర్ ఆఖరీ మర్తబా ఇస్ జమీన్ సే తుంకు నికాలెంగె' కడకు ఈ మట్టి నుండే నిన్ను కడసారి లేపుదుము). సమాధిపై 3 సార్లు పైవిధంగా చేసి, అందరూ కలసి **'దుఆయె మగ్‌ఫిరత్'** చేయుదురు. ఇది వరకు అక్కడ సమాధియై ఉన్న వారి గురించి కూడా వేడుకోవలెను.

## పుణ్య సమర్పణ (ఈసాలె సవాబ్)

ఇస్లామీయ షరీఅత్, ఖుర్‌ఆన్ హదీసుల్లో నిర్ణయించిన పద్ధతుల ద్వారానే మరణించిన వారికి పుణ్యప్రాప్తి జరుగుతుంది. దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు:

"మనిషి చనిపోగానే అతని ఆచరణల పరంపర కూడా ఆగిపోతుంది. అయితే ఈ మూడు మార్గాల ద్వారా అతనికి పుణ్యం చేరుతూ ఉంటుంది."

1) సదఖయె జారియా 2) ప్రయోజనకరమైన దైవ విద్య 3) సదాచార

సంపన్నులైన సంతానం చేసే దుఆలు (ముస్లిం, అబూహురైరాఅ)

ఈ క్రింది హదీసుకు అనుగుణంగా కూడా తమ మృతులకు పుణ్య సమర్పణ చేయవచ్చు. దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: విశ్వాసికి తను మరణించిన తర్వాత కూడా తన ఆచరణల, సత్కార్యాల పుణ్యం లభించే మార్గాలు ఇవి: (1) మృతుల పుణ్యసంస్మరణార్థం **ఇలాంటి పుస్తకాల్ని ప్రింటు చేసి దైవమార్గంలో పంచటం** (2)ఆయన (సఅసం) ఇతరులకు బోధించి ప్రచారం చేసిన విద్య (3) తన సంతానాన్ని సదాచార సంపన్నులుగా, ఖుర్ఆన్‌కు వారసులుగా తీర్చిదిద్దటం (4) మస్జిద్‌లు, సత్రాలు నిర్మించటం, బావులు, కాలువలు, చెరువులు త్రవ్విం చటం (5) ఆరోగ్యంగా ఉన్న కాలంలో తన ధనంలో కొంత భాగం దాన ధర్మాల కోసం ఖర్చుపెట్టడం. (ఇబ్నె మాజా) (6) చనిపోయిన వారి తరపు నుండి ఏదయినా వస్తువు దానం చేస్తే దాని పుణ్యం కూడా మృతులకు లభిస్తుంది. (బుఖారి)

## సవాలె మున్‌కిర్ నకీర్

మయ్యత్ సమాధి చేసిన తర్వాత, అతని వద్దకు, మున్‌కిర్, నకీర్ అను ఇద్దరు దైవ దూతలు వచ్చి ఈ క్రింది విధంగా ప్రశ్నింతురు.

1. మన్‌రబ్బుక (నీ పర్‌వర్ దిగార్ ఎవరు) నీ సృష్టికర్త ఎవరు?
2. వ మన్ నబియ్యుక (మరియు నీ ప్రవక్త ఎవరు?)
3. వ మా దీనుక (నీ దీన్ ఏమిటి?) నీ ధర్మము ఏమిటి?)

## మోమిన్ యొక్క సమాధానము:

1. రబ్బి అల్లాహు (నా పర్‌వర్ దిగార్ అల్లాహు తఆల)
2. వనబియ్యీ ముహమ్మదున్ (నా ప్రవక్త ముహమ్మద్ సఅస)
3. వ దీనీ అల్ ఇస్లాం (నా దీన్ ఇస్లాం)

ఈ సమాధానములకు అతనికి మోక్షము కలుగును. అతని ఖబర్ విశాల మగును. ఖియామత్ వరకు ఎటువంటి 'అజాబె ఖబర్' లేకుండా హాయిగా వుండును.

**కాఫిర్ యొక్క సమాధానము:** 'హాహు హాహు లా అద్‌రి' 'హాయ్‌హాయ్ నాకు ఏమీ తెలియదు' ఇతని ఖబర్ ఇరుకు చేయబడును. అనేక హింసలకు గురి అగును.

## 13వ అధ్యాయము

# హలాల్ హరామ్

అల్లాహ్ సమస్త జీవరాశులలో అగ్రగణ్యునిగా మానవుని రూపొందించెను. ఏ జీవరాశికీ ఇవ్వని, బుద్ధి జ్ఞానముచే మానవుని అలంకరించెను. ఇతనే 'అష్రవుల్ ముఖ్‌లూఖాత్' (సర్వోత్తమ జీవి) మానవుని సుఖ సౌఖ్యములకై సూర్య చంద్రాదులను, నక్షత్రములను, గాలి,అగ్ని, భూమ్యాకాశములు, పర్వతములు, వృక్షములు, ఫలములు, జంతువులు, వర్షము,నీరు, నదులు, సముద్రములు మొదలగు వాటిని కల్పించెను. ఇస్లాం మనము తినే తిండిపై త్రాగే పానీయాలపై కూడా పరిమితులు విదించినది. అనుమతించబడిన వస్తువులను 'హలాల్' అనియు, నిషేధించబడిన వస్తువులను 'హరామ్' అనియు అంటారు. ఖుర్ఆన్ 'హరామ్' వస్తువులను స్పష్టముగా విశదీకరించినది. మత్తు కలిగించే పానీయములు, కల్లు, సారాయి, గంజాయి మొదలగు నిషేధింపబడిన పానీయ ములుగా నిర్ధారించబడినవి. పంది మాంసం, చచ్చిపోయిన జంతువుల మాంసం, రక్తము, గోళ్ళతో చంపే, చీల్చే చిరు పక్షుల, జంతువుల మాంసం; అల్లాహ్ తప్ప ఇతర దేవుళ్ళ పేర్లతో జపించు వస్తువులు (బలి యిచ్చినవి), జిబహ్ చేయబడని పక్షిగాని, జంతువుగాని వాటి మాంసము తినుట తీవ్రంగా నిషేధించబడినది. అల్లాహ్ పేరున జిబహ్‌చేయునది హలాల్ అగును. ఇస్లాం, షరీఅత్ ప్రకారం జిబహ్ ఎలా చేయవలెనో నేర్పినది.

## జిబహ్ చేయు పద్ధతి:

కోడి యొక్క రెండు రెక్కలను రెండు కాళ్ళు కలిపి పట్టుకుని, కోడి నోటిలో నీరు పోసి 'బిస్మిల్లాహి అల్లాహు అక్బర్' అంటూ పదునైన చాకుతో కోడి మెడ నరములు తెగునట్లు, మొండెము తెగి వేరు కాకుండా జాగ్రత్తగా జిబహ్ చేయవలెను. కోడి రక్తము పూర్తిగా బయటకు పోయినప్పుడే దానిని శుభ్రపరచవలెను.

## 14వ అధ్యాయము

# షరీఅత్ ఆదేశాలు

ధరణిపై మానవ మనుగడకు ఒక్క దైవ మార్గదర్శకత్వం తప్ప మరో సరయిన పంథా లేదని, దేవుని అంతిమ సందేశహరుడు ముహమ్మద్ (స.అ.సం) ద్వారా దివ్య ఖుర్‌ఆన్ రూపంలో అది మానవాళికి ప్రసాదించబడిందని మనం తెలుసు కున్నాము. ప్రవక్తముహమ్మద్ (సఅసం) బోధించిన విశ్వాసాలు, ఆరాధన విధానాలు కూడా పరిశీలించాము. మానవ జీవనానికి సంబంధించిన సమగ్ర జీవన వ్యవస్థ తాలూకు శాసనాలను నియమాలను సూచించే "షరీఅత్" (ఇస్లామీయ శాసనాంగం) ను ఇక అధ్యయనం చేద్దాము.

## షరీఅత్ సిద్ధాంతాలు

మనం మన ఉనికిని, దాని లోతుపాతుల్ని కాస్త శ్రద్ధగా పరిశీలించామంటే మనం ప్రపంచంలోకి అనేక శక్తిసామర్థ్యాలతో వచ్చామని, ప్రతి శక్తిని స్వయంగా మనకు ప్రయోజనకరమయ్యేలా వినియోగించు కోవడమే అబిలషణీయమని అర్థమవుతుంది. మనలో వివేచన, విచక్షణ జ్ఞానాలున్నాయి. మానసిక శక్తులు ఉన్నాయి. కోరికలు కాంక్షలూ ఉన్నాయి; చూచే, వినేశక్తులున్నాయి. కాళ్ళు చేతుల బలమూ ఉంది. ద్వేషము ఉంది. ఆగ్రహావేశము ఉంది. ప్రేమాను రాగాలు ఉన్నాయి. భయము ఆశా ప్రలోభాలు ఉన్నాయి. వీటిలో ఏదీ నిరుప యోగం కాదు. మనకు వీటి ఆవశ్యకత ఉంది గనుకనే వీటిని మనకు ప్రసా దించడం జరిగింది. మన మనుగడ, దాని సాఫల్యం ఇమిడి ఉన్నాయి. అయితే దైవం మనకు ప్రసాదించిన శక్తుల్ని వినియోగించుకున్నప్పుడే అది సాధ్య మవుతుంది.

## ఈలోకం మనిషి కోసం

మనకు శక్తులివ్వడమే కాదు, వాటిని వినియోగపరచుకునే సాధనాలు సయితం ప్రసాదించటం జరిగింది. ప్రప్రథమంగా మన శరీరాన్ని తీసుకుందాము.

ఇందులో కావలిసిన అవయవాలన్నీ అమర్చబడి ఉన్నాయి. మన చుట్టుప్రక్కల నున్న ప్రపంచాన్ని చూస్తే అక్కడ కూడా రకరకాల వస్తువులు, పరికరాలున్నాయి. మన సహాయానికి స్వయంగా మనలాంటి మానవులున్నారు. మన సేవకై పశువులున్నాయి. చెట్లూ, గుట్టలు ఉన్నాయి. నింగి (ఆకాశము), నేల, నీరు, గాలి, వేడి, వెలుగు (సూర్యుడు) ఇంకా అసంఖ్యాకమయిన వనరులున్నాయి. మనం మన జీవితాన్ని సవ్యంగా గడుపుకోడానికి వీటన్నింటినీ వినియోగించు కునేందుకు, వీటి సహకారం పొందేందుకు వీటిని సృష్టించాడు అల్లాహ్.

## మంచిగా బ్రతకగోరేవారికి దైవం ప్రసాదించిన జ్ఞానం

అందుకే తన సందేశహరుని ద్వారా అల్లాహ్ మానవాళికి షరీఅత్ (ధర్మశాస నాంగం) అందచేశాడు. ఈ అవసరాన్ని తీర్చడానికే అది మానవశక్తుల్లో దేన్నీ వృధాగా పోనివ్వదు. అలాగే మానవ కోరికల్ని కూడా దేన్నీ హరించివెయ్యదు. ఏ భావాన్నీ అణిచివెయ్యదు. ఇది మానవుల్ని "ఈలోకాన్ని త్యజించండి. అడవుల్లోకి, కొండల్లోకి పోయి బ్రతకండి. పొట్టకు, తిండికి, ఒంటికి బట్టల్లేకుండా చావండి, ఆత్మపీడన ద్వారా కష్టాలు భరించండి, ప్రాపంచిక సౌఖ్యాలను, సంతోషాలను పరిత్యజించండి. అన్నింటినీ నిషేధించుకోండి" అని ఎట్టి పరిస్థితులలోను కోరలేదు.

అయితే తన అమాయకత్వం మూలానో లేక దుర్మార్గం చేతనో మనిషి తనకయినా, ఇతరులకయినా నష్టం కలిగించడాన్ని అల్లాహ్ ఇష్టపడడు. ఈ కారణంచేతనే షరీఅత్ నియమాలను మానవుల కొరకు అందజేశాడు దేవుడు. మనిషికి హానికరమయిన వాటిని షరీఅత్‌లో "హరామ్"(ధర్మసమ్మతముకానివి) గాను, ప్రయోజనకరమయిన వాటిని "హలాల్"(ధర్మసమ్మతముఅయినవి) గాను నిర్ణయించడం జరుగుతుంది. మనిషి తనకు, తోటి సోదరులకు హానికలుగజేయు పనులన్నింటినీ షరీఅత్ నిషేధించినది. మనిషికి ప్రయోజనమయిన ఇతరులెవ్వరికి నష్టకరం కాని వాటిని షరీఅత్ అనుమతించినది.

## షరీఅత్ సూత్రాలు

షరీఅత్ శాసనాలన్నీ ఒక సూత్రానికి ఆధారపడివున్నాయి. "మానవునికి

తన కోరికల్ని, అవసరాల్ని తీర్చుకోవడానికి, తన ప్రయోజన సాధనకై సకల విధాల కృషి చేయడానికి అధికారం ఉంది. కాని ఆ అధికారాన్ని వినియోగించుకొనే టప్పుడు అజ్ఞానం మూలానో లేక దుర్మార్గం చేతనో ఇతరుల హక్కుల్ని భంగ పరచకుండా, వీలైనంతవరకు ఇతరులకు సహకారం అందజేస్తూ మసలుకోవాలి అన్నదే ఆ సూత్రం. ఏ పనుల్లోనయితే ఒక విధంగా ప్రయోజనం, మరొక విధంగా నష్టం ఉంటుందో, వాటిని గురించి షరీఅత్ సూత్రమేమంటే "బృహత్తర ప్రయోజనానికై అల్పమయిన నష్టాన్ని స్వీకరించవచ్చు. అలాగే పెద్ద నష్టాన్ని నివారించడానికి చిన్న ప్రయోజనాన్ని వదులుకోవచ్చు." అని నొక్కి తెలిపింది.

ఒక్కో కాలంలోను ఒక్కో మనిషి, ఒక్కో వస్తువు, ఒక్కో పనిని గురించి అందులో లాభకరమయినదేమిటో, నష్టకరమయినదేమిటో తెలుసుకోవడం అసాధ్యం కనుక, సర్వపరిజ్ఞాని అయిన అల్లాహ్ మానవ జీవితాన్నంతటికి ఓ సరయిన నియమావళిని అనుగ్రహించాడు. ఈ నియమావళిలో ఉన్న ప్రయోజ నాలు, దాని మర్మహేతువు కొన్ని శతాబ్దాల క్రితం ప్రజలకు బోధపడక నేడు వైజ్ఞానిక అభివృద్ధి మూలంగా దానిపై ఉన్న తెరలన్నీ ఒక్కొక్కటే తొలగుతున్నాయి. అయితే వాటి సంపూర్ణ అవగాహన మాత్రం కలిగింది అని మాత్రం చెప్పలేము. ఈ విషయంలో ఒకటి మాత్రం నిజం. విజ్ఞానం ఎంత అభివృద్ధి చెందుతుందో షరీఅత్ ఆదేశాల్లోని మర్మహేతువు అంతగానే వెల్లడవుతూ ఉంటుంది. తమ అసంపూర్ణ విజ్ఞానం, అసంపూర్ణ వివేకం పట్ల గొప్పగా తప్పుడు అంచనాలు వేసుకుని అసంబద్ధమయిన నమ్మకాలకు గురయినవారు శతాబ్దాల తరబడి పొరపాట్లు చేస్తూ అగచాట్లు పడుతూ చివరికి ఈ షరీఅత్ సిద్ధాంతాలలోని ఏదో ఒకదాన్ని ఆశ్రయించవలసి వచ్చిన సందర్భాలెన్నో ఉన్నాయి. దైవసందేశ హరునిపై విశ్వాసమున్నవారు ఈ "అజ్ఞానం" వల్ల ఏర్పడే నష్టాన్ని తప్పించు కున్నారు. ఎందుచేతనంటే వారికి షరీఅత్ ఆదేశాల్లోని మర్మహేతువు బోధపడినా బోధపడక పోయినా అన్ని పరిస్థితులలోను, వారు కేవలం దైవప్రవక్తలపై గల విశ్వాసం మూలాన సత్యజ్ఞానం ఆధారంగా దైవం తరుపున నిర్మించబడిన స్వచ్ఛ మయిన నియమావళిని పాటిస్తారు. ఈ విధంగా ఇతరులు పడే కష్టాల నుండి రక్షించబడతారు.

## హక్కులు నాలుగు రకాలు

షరీఅత్ ప్రకారం ప్రతి వ్యక్తిపై నాలుగు రకాల బాధ్యతలు (ఇతరుల హక్కులు) విధించడం జరిగింది. (1) దైవం హక్కులు (2) మనిషి సొంత హక్కులు (3) తోటి మానవుల హక్కులు (4) మానవుని ఉపయోగార్థం దైవం ప్రసాదించిన వనరుల హక్కులు. ఈ నాలుగు విధాల హక్కులను గురించి పూర్తిగా తెలుసుకోవడం, వాటిని సరిగ్గా నిర్వర్తించడం నిజమైన ముస్లిం విద్యుక్త ధర్మం. షరీఅత్ ఈ నాలుగు హక్కుల్ని విడి విడిగా వివరిస్తుంది. వాటిని నెరవేర్చే విధానాలను సయితం నిర్ణయిస్తుంది. అయితే వీటిలో ఎవరి హక్కును నెర వేర్చడం లోనయినా మరొకరెవరి హక్కు భంగపడరాదని అలాగే హక్కులన్నీ సమంగా నిర్వర్తించ బడడానికి వీలుగా ఆ నియమాలను నిర్మిస్తుంది.

## 1) దైవం హక్కులు

దైవం పట్ల మానవుడు నిర్వర్తించవలిసిన మొదటి బాధ్యత- అంటే మొదటి దైవం హక్కు- ఏమిటంటే, మనిషి దైవాన్నే తన నిజ ప్రభువుగా ఎంచి ఎవరిని ఆయనకు సహవర్తులుగా, భాగస్వాములుగా భావించరాదు.''లా ఇలాహ ఇల్లల్లాహ్''ను విశ్వసించి మనిషి ఈ హక్కును నెరవేర్చుతాడు.

రెండవ హక్కు ఆయన మానవాళికై పంపిన బోధనల్ని చిత్తశుద్ధితో స్వీకరించాలి. మహా ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ను విశ్వసించి తద్వారా ఈ హక్కును నిర్వర్తిస్తాడు.

దైవం మూడో హక్కు లేక దైవం పట్ల మనిషి మూడో బాధ్యత ఏమిటంటే, మనిషి దైవం పంపిన ఆజ్ఞల్ని పాలించాలి. ఈ హక్కు దివ్య ఖుర్ఆన్, మహాప్రవక్త (సఅసం) ఆదర్శ సంప్రదాయాల్లో వివరింపబడి ఉన్న ఆదేశాలను పూర్తిగా అనుసరించడం ద్వారా నెరవేరుతుంది.

దైవం నాల్గవ హక్కు, దైవారాధన చేయడం. వెనుకటి పుటల్లో పేర్కొన్న 'విధుల్ని' పాటించడం ద్వారా ఈ హక్కును నిర్వర్తించడం సాధ్యమవుతుంది. దైవంహక్కు తతిమ్మా హక్కులన్నింటికన్నా ప్రాముఖ్యం గల హక్కు కావడంచేత దీన్ని నెరవేర్చడానికి ఇతర హక్కులు కొన్నింటిని త్యాగం చెయ్యవలసి వుంటుంది. ఉదాహరణకు నమాజ్, రోజాలాంటి విధుల్ని పాటించడానికి మనిషి స్వయంగా

తన కోరికల్ని, అనేక శారీరక హక్కుల్ని త్యజించవలసి వుంటుంది.నమాజ్ కొరకు మనిషి ప్రాతఃకాలాన లేచి చల్లని నీటితో ఉజూ చేస్తాడు. రాత్రింబవళ్ళలో అనేకసార్లు తనకు అత్యంతావశ్యకమయిన పనుల్ని, తనకు ఇష్టమయిన కాలక్షేపాల్ని, తన అభిరుచికి అనువైన కార్యక్రమాల్ని వదిలి పెడతాడు. రమజాన్ నెలలో ఆకలిదప్పుల్ని, ఇతర కోరికల్ని అణిచివేసి ఆ బాధని భరిస్తాడు. జకాత్ ధనం చెల్లిస్తూ తన ధన ప్రేమను దైవభక్తికై త్యాగం చేస్తాడు. హజ్‌లో అనేక వ్యయప్రయాసలతో కూడిన ప్రయాణం చేసి తన ధనాన్ని త్యాగం చెయ్యడమే కాక బాధల్ని సయితం భరిస్తాడు.

## నమాజ్

అయితే అల్లాహ్ తన హక్కుల నిర్వర్తింపు కొరకు కొన్ని పరిమితులు నిర్ణయించాడు. వాటి ప్రకారం, ఒక హక్కును నెరవేర్చడానికి ఇతర హక్కుల్ని ఏ మేరకు త్యాగం చెయ్యడానికి సాధ్యమవుతుందో అంతకంటే అధికంగా వాటికి భంగం వాటిల్లకూడదు. ఉదాహరణకు నమాజ్ తీసుకోండి. దైవం విధించిన ఈ నమాజ్‌ను చెయ్యడానికి అన్ని విధాల సౌకర్యాలు ఉన్నాయి. వుజూ కొరకు నీళ్ళు దొరక్కపోతే లేక మనిషి వ్యాధిగ్రస్తుడయితే తయమ్ముమ్ చేసుకోవచ్చు. ప్రయాణంలో ఉంటే, నమాజ్‌లో "కస్ర్" (తగ్గుదల) చెయ్యడం, వీలుపడక పోతే కూర్చుని, లేకపోతే పడుకుని చెయ్యడం కూడా అనుమతించడం కూడా జరిగింది. ఇంతేకాదు, నమాజ్‌లో పఠించబడేది కూడా ఎంతో అధికంగా లేదు. ఒక్కపూట నమాజ్‌లో కొన్ని నిమిషాలకంటే అధిక కాలం పట్టదు. తీరిక సమయాల్లో ఇష్టమయితే "బఖర" సూరా పఠించవచ్చు. కాని కార్యకలాపాల్లో నిమగ్నులయి ఉన్న కాలంలో సుదీర్ఘమైన నమాజ్ చెయ్యడాన్ని వారించడం జరిగింది. మనం ఫర్జు నమాజ్, సున్నత్ నమాజులు చేయాలి. అయితే అదనపు (నఫిల్) నమాజ్‌లు చెయ్యదలుచుకుంటే చెయ్యవచ్చు. అల్లాహ్ ప్రసన్నుడవుతాడు. కాని, రాత్రి పూట నిద్రను, పగటి పూట పనుల్ని అన్నింటిని మాని వెయ్యమని జీవనోపాధి సముపార్జించే కాలాన్ని ఇలా నఫిల్ నమాజ్‌ల కొరకు వెచ్చించమని లేక ఇతర దైవదాసుల హక్కులకు నష్టం కలిగిస్తూ నమాజులు చెయ్యమని దైవం కోరలేదు.

## రోజా (ఉపవాసం)

ఇలాగే రోజా (ఉపవాస) వ్రతాన్ని పాటించడంలో కూడా సకల సౌకర్యాలున్నాయి. కేవలం సంవత్సరములో ఒక్క నెలలోనే ఈ వ్రతం విధిగా నిర్ణయించబడింది. పైగా, ఆ నెలలో ప్రయాణం చెయ్యడం సంభవించినా, వ్యాధిగ్రస్తుడయిన మనిషి దాన్ని "ఖజా" చెయ్యవచ్చు. ఇంకా రోజా వ్రతాన్ని పాటించే వ్యక్తి మధ్యలో వ్యాధికి లోనయి లేక మరే కారణం చేతనయినా ప్రాణాపాయానికి గురయితే అతడు వ్రత భంగం చెయ్యడం కూడా అనుమతించబడింది. రోజా పాటించవలసిన కాలపరిమితిని మించి ఒక్క నిమిషం కూడా అధికంగా పాటించడం ధర్మసమ్మతం కాదు. సహరీ చివరి ఘడియల వరకు భుజించే అనుమతి ఉంది. ఇఫ్తార్ (రోజా విరమణ కాలం) కాగానే ఒక్క క్షణం కూడా నిరీక్షించకుండా రోజాను విరమించుకునే ఆదేశం ఇవ్వటం జరిగింది. నఫిల్ రోజాలు పాటించదలచి నట్లయితే అది దైవ ప్రసన్నతకు మార్గమే అవుతుంది.

## జకాత్

అలాగే జకాత్ పరిశీలించండి. ఇదీ దైవారాధనే. జకాత్ కొరకు కూడా కనీస ప్రమాణం నిర్ణయించడం జరిగింది. అదీ నియమానుసారం నిర్ణీత ధనపరిమాణం కంటే అధికంగా కలవారికే విధించడం జరుగుతుంది. దాన్ని మించి ఎవరయినా సదకా, దైవ మార్గంలో దానధర్మాలు చెయ్యదలిస్తే అది వారి ఎడల దేవుని ప్రసన్నతకు కారణమవుతుంది. కాని మనిషి తన సొంత హక్కుల్ని, తన ఆత్మీయుల హక్కుల్ని త్యాగం చేసివేసి అంతా దానధర్మాల్లో ఖర్చు చెయ్యడం, స్వయంగా తాను నిర్ధనుడయి, అగత్యపరుడయి చేతులు కట్టుకుని కూర్చోవడం దైవానికి ఏ మాత్రం ఇష్టముండదు. ఇందులోనూ మధ్యే మార్గాన్ని అవలంబించాలన్నదే దేవుని అభిమతం.

## హజ్

హజ్ యాత్రను గమనిస్తే తేలే అంశాలు ఇవి: మొదటిది ప్రయాణావసరాలు సమకూర్చుకోగల వారిపై, ప్రయాణంలోను కష్టాలను భరించగలవారిపై మాత్రమే హజ్ను విధిగా నిర్ణయించడం జరిగింది. అందునా జీవితం మొత్తంలో ఒక్కసారి సౌకర్యం కలిగినప్పుడు హజ్కై బయల్దేరాలి. మార్గం మధ్యలో యుద్ధం వల్ల లేక మరే కారణం చేతనయినా అశాంతి చెలరేగి వుంటే హజ్ సంకల్పాన్ని

వాయిదా వేసుకోవచ్చు. ఇంకా తల్లిదండ్రులు ముసలివారయి ఉండి, పరిచర్యలు చేసేవారు ఇతరులు లేకపోయిన పరిస్థితిలో వారికి కష్టం కలిగించకుండా, వారి అనుమతి పొందడం కూడా అవసరమని సూచించడం జరిగింది. వీటన్నింటిని గమనిస్తే దైవం తన హక్కుల పట్ల మానవుల బాధ్యతలను నిర్వర్తింపజెయ్యటంలో ఎంతో ఉదారతను కనబరచినట్లు, మానవుల హక్కుల్ని ఎంతో గౌరవించినట్లు తెలుస్తూంది.

## 2) మనిషి సొంత హక్కులు

మనిషిచేసే అత్యాచారాల్లో అన్నింటిని మించిన అత్యాచారం అతడు తన ఆత్మ పైనే చేసుకుంటాడు. మనిషికి తన సొంత సుఖ శ్రేయస్సులే అన్నింటికంటే ముఖ్యమయినవి. స్వాభిమానానికి మించినది మరొకటి లేదని అందరూ ఒప్పుకుంటారు. మనిషి తనకు తానే శత్రువని అంటే అసలు ఎవ్వరూ ఒప్పుకోరు. కాని కాస్త పరిశీలనగా గమనిస్తే యదార్థం బట్టబయలు అవుతుంది. ఎవరికయినా మద్యపాన జాడ్యం అంటుకుంటే అతడు దానికొరకు పిచ్చివాడుగా తయారవుతాడు. ఆరోగ్యం, ధనం, మానం - అన్నీ కోల్పోతాడు. భోజన ప్రియుడయిన మరో వ్యక్తి దొరికిన చెత్త చెదారమంతా తిని ప్రాణా పాయానికి గురవుతాడు. ఇంకో వ్యక్తి కామవాంఛలకులోనయి తన చెడు తిరుగుళ్ళ మూలంగా తన సర్వనాశనానికి ప్రారంభోత్సవం జరుపుకుంటాడు. మరో పెద్ద మనిషికి ఆత్మ వికాస కార్యకలాపాలంటే మక్కువ ఏర్పడుతుంది. ఆధ్యాత్మికత పేరుతో సొంత ప్రాణాలకే శత్రువయిపోతాడు. మనసులోని కోరికలన్నింటినీ అణిచివేస్తాడు. శారీరక అవసరాలను తీర్చడానికి ఒప్పుకోడు. పెండ్లి పెటాకులు వద్దంటాడు. అన్న పానీయాలు వదులుకుంటాడు. వస్త్రధారణ అవసరం లేదు - చివరికి ఉచ్ఛ్వాస నిశ్వాసలను కూడా వద్దని అంటాడు. అడవుల్లో, గుట్టల్లో కూర్చుని ఈ లోకం, దాని సకల శోభలు తన కోసం కాదను కుంటాడు. మనిషి అతివాద ప్రియత్వంలో పడి ఎలాంటి అవస్థకు లోనవుతాడో చూపడానికి కొన్ని మచ్చు తునకలు పేర్కొన్నాము. వాస్తవానికి అసంఖ్యాకమయిన ఇలాంటి అతివాద రూపాలు మనం పొద్దస్తమానం మన చుట్టు ప్రక్కల చూస్తూనే ఉంటాము.

# 3) ప్రపంచంలోని శుభాలన్నీ మనిషి కొరకే

ఇస్లామీయ షరీఅత్ మానవుల శుభ శ్రేయాలనే కోరుతుంది కాబట్టి, అది మానవునికి "లినఫ్సిక అలైక హక్కున్" అంటే, " నీపై, స్వయంగా నీ ఆత్మ హక్కును నెరవేర్చే బాధ్యత ఉంది" అని హెచ్చరిస్తుంది. అది మనిషికి హానికరమయిన వాటినన్నిటిని హరాం ( నిషిద్ధం) గా పరిగణిస్తుంది. సారాయి, కల్లు, నల్లమందు, ఇంకా ఇతర మత్తు పదార్థాలు, పంది, క్రూరమృగాలు, విష పురుగులు, అశుద్ధమయిన జంతువుల మాంసం, రక్తం, చనిపోయిన జంతువులు మొదలయినవి- ఇవి మినహా పరిశుద్ధమయిన, ప్రయోజన కరమయిన వాటిని మనిషికై హలాల్ (ధర్మసమ్మతమైనవి) గా నిర్ణయిస్తుంది. మనిషి తన శరీరానికి అపరిశుద్ధమయిన ఆహారం అందజేసి దాన్ని బాధలకు గురి చెయ్యరాదని అతనిపై తన శరీరం హక్కును నెరవేర్చే బాధ్యత ఉందని కూడా తెలుపుతుంది.

షరీఅత్ మనిషిని నగ్నంగా ఉండరాదని బోధిస్తుంది. దైవము అనుగ్రహించిన తన శరీరానికి శోభనిచ్చే దుస్తులు ధరించి లజ్జాకరమయిన శరీర భాగాలను కప్పి వెయ్యమని ఆదేశిస్తుంది.

అది మనిషిని జీవనోపాధిని సముపార్జించమని ప్రేరేపిస్తుంది. నిష్ప్రయోజనంగా కూర్చోవడం, భిక్షమెత్తడం, ఆకలితో చావటం అది సహించదు. దైవం ప్రసాదించిన శక్తుల్ని వినియోగించుకొని, భూమ్యాకాశాల్లో తన పోషణ, సంరక్షణ కొరకు సమకూర్చబడిన సాధన సామాగ్రిని ఒనరుల్ని ధర్మసమ్మతమయిన రీతిలో సంపాదించాలని ప్రోత్సహిస్తుంది.

మనిషి తన కామ వాంఛల్ని చంపుకోవడం తగదని, వాటిని సంస్కారవంతమయిన రీతిలో తీర్చుకోవాలని షరీఅత్ పెళ్ళి నియమాన్ని నిర్ణయిస్తుంది. ఆత్మపీడనను నిషేధిస్తుంది. సుఖసంతోషాలకు, ఉల్లాసవంతమయిన జీవితాన్ని పూర్తిగా త్యజించడం భావ్యంకాదని తెలుపుతుంది. ఆధ్యాత్మిక అభివృద్ధి కొరకు, దైవసాన్నిధ్యం పొందడానికి, ఆఖిరత్ (పరలోకం) లో మోక్ష సాధనకు లౌకిక జీవితాన్ని సన్యసించ వలిసిన అవసరం లేదని అంటుంది, లౌకిక వ్యవహారాల్లో పూర్తిగా నిమగ్నులయి దైవస్మరణ చెయ్యడం, ఆయన విధేయతవల్ల కలిగే దుష్పరిణామానికి భయపడటం, ఆయన అనుగ్రహించిన నియమావళిని చిత్త

శుద్ధితో అనుసరించడం - ఇవే ఇహపరాల సాఫల్యానికి సోపానాలని మేల్కొలుపుతుంది.

షరీఅత్ హత్యలను, శిశు హత్యలను, ఆత్మహత్యను నిషేధిస్తుంది. మానవ ప్రాణం దైవం సొత్తు. మానవుడు దైవం నిర్ణయించిన కాల వ్యవధి వరకు వినియోగించునేందుకు ఈ ప్రాణం అతనికి అమానతుగా అప్పగించడం జరిగింది. దానికి హాని కలుగజేసే అధికారం మనిషికి లేదు.

## 4) తోటిమానవుల హక్కులు

మానవుడు తన శరీరానికి ఉన్న హక్కుల పట్ల, తన వాంఛలకున్న హక్కుల పట్ల, తన బాధ్యతలను నెరవేర్చడానికి అతనికి ఉత్తరువు ఇచ్చి మరో వైపున ఈ బాధ్యతల నిర్వర్తనలో ఇతరుల హక్కులకు భంగం కలిగే విధానం ఏదీ అవలంబించ రాదన్న నిబంధన కూడా పెట్టింది షరీఅత్. ఎందుచేతనంటే, ఇలా ఇతరుల హక్కులను కొట్టేసి మనిషి తన వాంఛల్ని తీర్చుకోవడం మూలానా అతని ఆంతర్యము కలుషితమవుతుంది. ఇంకా ఇతరులకు రకరకాల నష్టాలు కలుగుతాయి.

కనుక దొంగతనం, దోపిడి, లంచం, మోసం, వ్యభిచారము, వడ్డీలాంటి వాటిని షరీఅత్ హరామ్ (నిషిద్ధమయినవి) గా నిర్ణయించింది. ఎందువలనంటే ఇలాంటి చర్యల వల్ల మనిషి పొందే ప్రయోజనాలన్ని ఇతరుల నష్టాల వల్ల కలిగినవే. అబద్ధం, దూషణలు, దుర్భాషలు, నిందలు, అపవాదులు, చాడీలు ఇవన్నీ నిషిద్ధాలు. ఎందుకంటే ఇవన్నీ ఇతరులకు ఏదో ఓ రూపంలో హాని కలుగజేస్తాయి. జూదం, పందెం, లాటరీ కూడా నిషేదించబడ్డాయి, ఎందుచేత నంటే వీటి ద్వారా ఒక వ్యక్తి లాభమొంది వేలాది ప్రజలు నష్టపోతారు. మోసం, వంచనల ఆధారంగా ఒక పక్షానికి లాభకరంగాను మరో పక్షానికి నష్టకరంగాను పరిణమించే వాణిజ్య వ్యవహారాలు, అలాంటి లావాదేవీలు అధర్మమయినవిగా పరిగణించ బడ్డాయి. హత్యలు, కలహాలు, కల్లోలాలు హరామ్‌గా సూచించ బడ్డాయి. ఎందుకంటే ఒక వ్యక్తికి తన స్వప్రయోజనం కొరకుగాని లేక ఏదయినా తన వాంఛను నెరవేర్చుకోవడానికిగాని ఇతరుల ప్రాణలు తీసే, ఇతరులకు నష్టం కలుగ జేసే అధికారం ఏమాత్రం లేదు. వ్యభిచారం, అసహజ సంభోగం కూడా హరామ్‌గా నిర్ణయించబడ్డాయి. ఎందువలనంటే ఈ చర్యలు స్వయంగా

అతని ఆరోగ్యం పాడుచేసి, అతని స్వభావాన్ని గుణగణాలను సయితం నాశనం చేస్తాయి. మరోవైపున సమాజంలో అశ్లీలత, నిర్లజ్జత, నీతి బాహ్యమయిన పనులు ప్రబలిపోతాయి. జుగుప్సాకరమయిన వ్యాధులు తరతరాలుగా వ్యాపించి మానవ సమాజం అంతా సర్వనాశనమయి పోతుంది. ఎన్నో ఉపద్రవాలు తలెత్తుతాయి. మానవ సంబంధాలు తెగిపోతాయి. సంస్కృతి, సభ్యతలు, నాగరికతలు అంతరించి పోతాయి.

## 5) సామూహిక బాధ్యతలు

ఇవన్నీ ఒక వ్యక్తి తన సొంత హక్కుల్ని - శారీరక, మానసిక హక్కుల్ని - నెరవేర్చడంలో ఇతరుల హక్కుల్ని భంగపరచకుండా షరీఅత్ విధించిన నిర్బంధాలు. కాని, మానవ సమాజం, సంస్కృతీ నాగరికతల వృద్ధివికాసాలు, మంగళ శ్రేయాలు కేవలం ఒక వ్యక్తి మరొక వ్యక్తి సంబంధాలతో ముడిపడి లేవు. ఒక వ్యక్తి మరొక వ్యక్తికి నష్టం కలిగించనంత మాత్రాన సమస్య పరిష్కారం కాదు. ప్రజలందరిలో పరస్పర సంబంధాలు పెంపొందింపజేసి వారంతా తోటి మనిషి మేలుకోరి పరస్పరం సహకరించుకునేలా చెయ్యడం అత్యవసరం. దీనికొరకు షరీఅత్ సూచించిన ఆదేశాలను సంక్షిప్తంగా పరిశీలిద్దాము.

## 6) కుటుంబం

మానవ సంబంధాలు కుటుంబంతోటే ప్రారంభమవుతాయి. కనుక ముందు కుటుంబ వ్యవస్థను పరిశీలిద్దాము. వాస్తవానికి భర్త, భార్య, పిల్లల సమూహానికి కుటుంబం అని పేరు. కుటుంబ వ్యవస్థకు సంబంధించిన ఇస్లామియ విధానమేమి టంటే : జీవనోపాధి, సంపాదన, కుటుంబ అవసరాలను సమకూర్చడం, భార్యాపిల్లల సంరక్షణ పురుషుని కర్తవ్యం. స్త్రీ బాధ్యతలేమిటంటే పురుషుడు సంపాదించి తెచ్చిన దానితో గృహస్థ వ్యవహారాలను చక్కబెట్టడం, వీలయినంత వరకు తన భర్తకు, పిల్లలకు సౌఖ్యం, సౌలభ్యాలు చేకూర్చడం. పిల్లల కర్తవ్యం ఏమిటంటే, వారు తమ తల్లిదండ్రులకు సేవ చెయ్యాలి. కుటుంబ వ్యవస్థను తీర్చిదిద్దడానికే ఇస్లాంలో రెండు మార్గాలు అవలంబించబడ్డాయి.

(అ) భర్త లేక తండ్రిని ఇంటి పెద్దగా నియమించడం జరిగింది. ఎందు వలనంటే ఏ విధంగానైతే ఓ గ్రామ వ్యవస్థ గ్రామ పెద్ద లేదా ఉన్నతాధికారి

లేకపోవడంచేత, ఒక పాఠశాల హెడ్‌మాస్టర్ లేకపోవడం చేత సరిగ్గా నడవజాలవో అదేవిధంగా ఇంటివ్యవస్థ కూడా ఒక అధికారి, యజమాని, పెద్ద అనేవాడు లేనిదే సవ్యంగా సాగదనీ, ఏ ఇంట్లోనయితే ప్రతి వ్యక్తి స్వేచ్ఛావర్తనుడో ఆ ఇల్లు నిష్కారణంగా అల్లకల్లోలాల పాలవుతుంది. సుఖసంతోషాలు నామ మాత్రాన కూడా మిగలవు. శ్రీవారు ఒక వైపున వెడితే శ్రీమతి మరో దారిన పడతారు, పిల్లలు మట్టిపాలవుతారు. ఈ దురవస్థను తొలగించాలంటే ఇంటికి ఒక పెద్ద ఉండాలి. ఆ యజమాని పురుషుడవడమే సముచితం. ఎందుకంటే కుటుంబ పోషణ సంరక్షణ భారం అతనిపై ఉంది.

(ఆ) ఇంటి బయటి కార్యాల భారమంతా పురుషునిపై వేసి స్త్రీ అన వసరంగా ఇంటి వెలుపలి కార్యాలభారం ఏ మాత్రం ఆమెపై పడకుండా ఏర్పరచ డానికి అసలు కారణం - ఆమె ఇంటి లోపలి కార్యాల బాధ్యతలన్నీ ప్రశాంతంగా, సవ్యంగా నిర్వర్తించాలని, ఆమె బయటికి వెళ్ళినట్లయితే గృహస్థ సుఖం, పిల్లల సంరక్షణ దెబ్బ తింటాయని - అది జరక్కూడదని మాత్రమే. అంటే స్త్రీలు పూర్తిగా ఇంటినుంచి బయటకు వెళ్ళకూడదని అర్థంకాదు. అవసరమయితే వారు బయటి పనులు చేసే అనుమతి కూడా ఉంది. కాని వారి నిజమయిన కార్యరంగం ఇల్లే. వారి శక్తి అంతా గృహస్థ జీవితాన్ని సుఖమయం చెయ్యడంలో వినియోగపడాలన్నదే షరీఅత్ అభిమతం.

(ఇ) మానవ హక్కులు, వివాహ సంబంధాలు, హరామ్-హలాల్

రక్త సంబంధాలు మరియు వివాహసంబంధాల కారణంగా కుటుంబ పరిధి విస్తృతమవుతుంది. ఈ పరిధిలో పరస్పరం బందుత్వాలు, అనుబంధాలు కలవారి మధ్యన సంబంధాలు మెరుగుపరచడానికి షరీఅత్ విభిన్న నియమాలను ఏర్పరిచింది. అవన్నీ ఎంతో వివేచనముతో కూడుకున్నవి. వాటిలో కొన్నింటిని క్రింద పేర్కొంటున్నాము.

1. పరస్పరం కలసిమెలసి జీవించడం ఎవరికయితే అనివార్యమో వారందరూ ఒకరికొకరు వివాహానికి హరామ్ అయినవారు (అధర్మమయినవారు, తగనివారు) గా నిర్ణయించడం జరిగింది. అంటే తల్లీ-కొడుకు, తండ్రీ-కూతురు, మారు కూతురు-మారు తండ్రి, సవతి తల్లీ- సవతి కొడుకు, సోదరుడు- సోదరి, ఒకే తల్లి పాలు త్రాగిన స్త్రీ, పురుషులు, బాబాయి- కూతురు, మేనత్త- మేనల్లుడు,

మేనమామ- మేనకోడలు, పినతల్లి- కొడుకు, అత్త- అల్లుడు, మామ - కోడలు, వీరంతా ఎన్నటికి పెళ్ళి చేసుకోకూడదు. ఈ సంబంధాలన్నీ శాశ్వతంగా హరామ్ చెయ్యడం మూలాన ప్రాప్తమయ్యే అనేక ప్రయోజనాల్లో ఓ ప్రయోజనమేమంటే, పైన పేర్కొన్న ఈ స్త్రీ పురుషుల సంబంధాలు అత్యంత పరిశుద్ధంగా వుంటాయి. వీరంతా నిష్కల్మషంగా అన్యోన్య ప్రేమానురాగాలతో స్వేచ్ఛగా నిర్మొహమాటంగా కలిసిమెలసి మసలుకోగలరు.

2. హరామ్ చెయ్యబడిన బంధుత్వాలు తప్ప కుటుంబంలోని ఇతర స్త్రీ పురుషుల మధ్య వివాహ సంబంధాలు ధర్మ సమ్మతమయినవిగానే నిర్ణయించడం జరిగింది. దీనివల్ల బంధుత్వాలు ఇంకా పటిష్టమవుతాయి. గుణగణాలు, లక్షణాలు, స్వభావాలు, పరస్పరం తెలిసి ఉన్న వారి మధ్యన జరిగే పెళ్ళి సంబంధాలు విజయవంతమవుతాయను కోవడంలో సందేహం లేదు. కొత్త చుట్టరికాలు నెలకొల్పుకొనడం వల్ల తరుచుగా పొంతన కుదరదు.

3. బంధువుల్లో నిరుపేదలు, శ్రీమంతులు, ఉన్నవారు, లేనివారు అన్నిరకాల వారుంటారు. ఇస్లాం ఇచ్చే ఆదేశమేమంటే ప్రతి వ్యక్తిపై ఉన్న అతని బంధువుల హక్కులు ముఖ్యమయినవి. దాన్ని షరీఅత్ పరిభాషలో 'సిల రహ్మి' అనంటారు. దాని గురించి గట్టిగా తాకీదు చెయ్యడం జరిగింది. బంధువులతో సంబంధాలను తెంచుకొని వారి పట్ల ద్రోహం చెయ్యడాన్ని 'కతారహ్మి' అనంటారు. ఇలా చెయ్యడం ఇస్లాం ప్రకారం ఘోరపాతకం. బంధువు బీదవాడయితే లేక అతనిపై ఏదయినా ఆపదవస్తే అతన్ని ఆదుకోవడం, కలవారైనా తమ బంధువులకే ప్రాధాన్యతనివ్వడం ముఖ్యం.

4. ఒక వ్యక్తి ఆస్తి వదలి మరణిస్తే అది కొద్దిపాటిదైనా, ఎక్కువయినా దాన్ని ఒకచోట నిలువ ఉండ నివ్వకుండా మరణించిన వాని వారసుల్లో అందరికి ఎంతో కొంత అందేలా వారసత్వపు చట్టాన్ని నిర్మించడం జరిగింది. కొడుకు, కూతురు, భార్య, భర్త, తల్లి, తండ్రి, సోదరుడు, సోదరి వీరంతా మనిషికి అత్యంత సమీపంలోని హక్కుదారులు. అందువల్ల వారసత్వంలో ముందు వీరి వాటాలు నిర్ణయించబడ్డాయి. వీరు లేకపోతే వీరి తరువాతి దగ్గర బంధువులకు ఆ వాటాలు లభిస్తాయి. ఈ విధంగా ఒక వ్యక్తి మరణించినా అతను వదిలిన ఆస్తి చాలా

మంది బంధువులకు ఉపయోగపడుతుంది. ఈ ఇస్లామీయ చట్టం ప్రపంచంలో అద్వితీయమయింది. ఇప్పుడు ఇతర ప్రజలు సయితం దీన్ని అనుకరిస్తున్నారు. కాని విచారకరమయిన విషయమేమిటంటే స్వయంగా ముస్లిములు మాత్రం తమ అజ్ఞానం అవివేకాల మూలంగా తరచుగా ఈ చట్టాన్ని అతిక్రమిస్తున్నారు. ముఖ్యంగా ఆడపిల్లల వాటాను కాజేసే ఆచారం భారత్ పాకిస్తాన్‌లలో చాలా వ్యాపించిపోయింది. వాస్తవానికి ఇది గొప్ప అత్యాచారం, దౌర్జన్యం. ఖుర్‌ఆన్‌లోని స్పష్టమయిన ఆదేశాలకు వ్యతిరేకం.

5) మనిషి సంబంధాల పరిధిలో కుటుంబం తరువాత అతని మిత్రులు, ఇరుగు పొరుగువారు అతని వీధిలోని వారు, అతడు నివసించే పట్టణంలోని ప్రజలు ఇంకా ఏదో ఓ విధంగా వివిధ సందర్భాలలో అతణ్ణి కలిసేవారు వస్తారు. వీరందరిపట్ల, నిజాయితీగా, న్యాయవంతముగా, సత్ప్రవర్తనతో మెలగాలని ఇస్లాం ఆదేశిస్తుంది. ఇంకా ఎవరికి కష్టం కలిగించరాదు. ఎవరి మనస్సును నొప్పించరాదు. తిట్లు, దూషణలు, దుర్భాషల దరి చేరరాదు. పరస్పర సహకారం అందచేసుకోవాలి. వ్యాధిగ్రస్తుల్ని పరామర్శించాలి. మరణించినవారి జనాజా (అంత్యక్రియ)లో పాల్గొనాలి. కష్టంలో ఉన్నవారి పట్ల సానుభూతితో మెలగాలి. నిరుపేదలు, సత్యపరులు, వికలాంగులయిన వారికి రహస్యంగా సహాయపడాలి. అనాథలు, వితంతువుల్ని ఆదుకోవాలి. ఆకలిగొన్నవారి ఆకలి తీర్చాలి. కట్టుబట్టలు లేనివారికి బట్టలిప్పించాలి. నిరుద్యోగులకు పని కల్పించాలి.

6) దైవం ధనం ప్రసాదిస్తే దాన్ని కేవలం తన సొంత సుఖవిలాసాలకే వినియోగించి వ్యయపరచరాదు. వెండి, బంగారపు పాత్రలు ఉపయోగించడం, పట్టువస్త్రాలు ధరించడం, ధనాన్ని వ్యర్థమయిన కాలక్షేపాల్లో విలాసాల్లో వ్యయపరచడం ఇస్లాంలో నిషిద్ధం. ఎందుకంటే, వేలాది ప్రజల జీవనోపాధికి మార్గం కాగల ఈ ధనాన్ని ఒక వ్యక్తి తన కోసమే ఖర్చు చెయ్యడం అన్యాయం, ఎందరి కడుపులనో నింపగల ఈ ధనం కేవలం ఒక ఆభరణం రూపంలో మీ మెడను అలంకరించడం గాని, ఒక పాత్ర రూపంలో మీ బల్లపై శోభించడంగాని, ఒక తివాసి రూపంలో మీ గది అందాన్ని పెంచడంగాని, టపాకాయల రూపంలో కాలి బూడిద అవడంగాని అన్యాయం కాదా? అత్యాచారం కాదా? ఇస్లాం, మీ

సంపదను మీ నుండి దోచుకోదలచలేదు. స్వయంగా మీరు సంపాదించినది, మీకు వారసత్వంలో ప్రాప్తమయినదీ అంతా మీ సొంతమే. మీ ధనం ద్వారా మీరు పూర్తిగా సుఖాస్వాదన పొందడానికి కూడా ఇస్లాం మీకు అధికారాన్నిస్తుంది. దైవం మీకు ప్రసాదించిన ధనం మీ వస్త్రధారణలో, మీ గృహనిర్మాణంలో, మీ వాహనంలో ప్రతిబింబించడాని క్ూడా అనుమతినిస్తుంది. అయితే దాని బోధనల ఉద్దేశ్య మేమిటంటే, మీరు ఒక నిరాడంబరమయిన మధ్యేమార్గాన్ని అవలంబించాలి. మీ అవసరాలు అవధులు దాటకుండా చూడాలి. మీ సొంత హక్కులనే కాక మీ బంధువులు, మిత్రులు, ఇరుగు పొరుగువారు దేశవాసులు తోటి మానవ సోదరుల హక్కుల్ని కూడా గుర్తుంచుకోవాలి.

7) మనిషికి సంబంధించిన ఈ దగ్గరి పరిధుల్ని దాటి సువిస్తరమయిన సంబంధాల అతి విశాలపరిధి పరికించండి. ఈ పరిధిలో ప్రపంచం మూల మూలల్లో ఉన్న ముస్లింలందరూ ఉన్నారు. ఎందువల్లనంటే ఇస్లాం స్వీకరించిన ప్రతి వ్యక్తి కేవలం ఇస్లాం ధర్మపరిధిలోనే ప్రవేశించడు, ఇస్లామీయ సమాజంలోనూ చేరిపోతాడు. ఈ సామాజిక పరిధి కొరకు షరీఅత్ కొన్ని నియమాలు, నిబంధనలు సూచిస్తుంది. వీటిలో ముస్లిములు పరస్పరం తమ మంచి కోసం సహకరించు కునేలా, చెడులు ఉత్పన్నమయ్యే కారణాలు వీలయినంతవరకు ఏర్పడకుండా చూసేలా జాగ్రత్తలు తీసుకోవడం జరిగింది. ఉదాహరణకు కొన్నింటిని పరిశీలిద్దాము.

## 7) నైతికతకు ప్రాధాన్యం

1. సంఘం నైతికతను పరిరక్షించడానికి సూచించబడిన నియమం ఇది: ఏ స్త్రీ పురుషుల మధ్య వైవాహిక సంబంధాలు హరాం (అధర్మమయినవి) గా నిర్ణయించబడలేదో వారు యధేచ్ఛగా కలివిడిగా మెలగకూడదు. స్త్రీలు అధికంగా గృహస్థ జీవితపు బాధ్యతల పట్ల శ్రద్ధవహించాలి. బయటికి వెళ్ళడం అనివార్యమే అయితే ఆభరణాలు, అలంకరణలతో వెళ్ళరాదు. నిరాడంబరంగా వెళ్ళాలి. శరీరాన్ని పూర్తిగా కప్పుకోవాలి, ముఖం చేతులు బయటికి తియ్యడం, అనివార్యమయితే తప్ప వాటిని కూడా కప్పి ఉంచాలి. ఏదయినా నిజమయిన అవసరం ఏర్పడితే ఆ అవసరానికై మాత్రం ముఖాన్ని, చేతుల్ని బయటికి

తీయగలరు. దీనితో పాటు పురుషులకు ఇవ్వబడిన ఆదేశం ఇది: పరస్త్రీలను చూడకూడదు. అకస్మాత్తుగా యాదృచ్ఛికంగా, స్త్రీలు దృష్టిలో పడితే చూపు మరల్చుకోవాలి. మరోసారి చూచే ప్రయత్నం చెయ్యడం తప్పు. వారిని కలిసి పలకరించే ప్రయత్నం చెయ్యడం మరీ పెద్ద తప్పు. స్త్రీ పురుషుల తమ నైతిక స్థితిని రక్షించుకోవడం వారి ధర్మం. తమలోని సహజమయిన లైంగిక వాంఛల్ని తీర్చుకోవడానికి దైవం నిర్ణయించిన వివాహపరిధుల్ని దాటడం అలా వుంచి దాటే కోరిక కూడా ఆంతర్యంలో జన్మించనివ్వరాదు.

2. తమ జాతీయ ఐక్యత కొరకును, జాతీయ శుభశ్రేయాల కొరకును ముస్లింలు పరస్పర విభేదాలను, విరోధాలను విడనాడాలి. ముఠాతత్వాన్ని విసర్జించాలి. ఏదయినా విషయంలో భేదాభిప్రాయం వస్తే దివ్యఖుర్ఆన్, హదీసుల ద్వారా దాన్ని పరిష్కరించు కోవడానికి ప్రయత్నించాలి. ఆ సమస్య ఎటూ తేలకపోతే పరస్పరం పోరాడుకోవడానికి బదులు దాన్ని దైవ నిర్ణయంపై వదిలివేయాలి. జాతీయ శుభశ్రేయాలకు సంబంధించిన కార్యాల్లో అన్యోన్యంగా సహకరించుకోవాలి. జాతీయ నాయకులకు విధేయులయి ఉండాలి. పరస్పరం సంఘర్షణల్లో తమ శక్తి సామర్థ్యాలను వ్యర్థపరుస్తూ జాతీయ గౌరవానికి విఘాతం కలిగించకూడదు.

3. ముస్లింమేతరుల నుండి కళల్ని, విజ్ఞానాన్ని సముపార్జించుటలో ముస్లిములకు స్వేచ్ఛ ఉంది. కాని జీవన వ్యవహారాల్లో వారిని అనుకరించడం నిషేధించబడింది. ఏ జాతి అయినా మరో జాతి ఎదుట తన హీనస్థితిని న్యూనతను అంగీకరించినప్పుడే దాన్ని అనుకరిస్తుంది. ఈ కోవకు చెందిన బానిసత్వం అత్యంత నీచమైనది. ఇది వాస్తవానికి ఆ జాతి పరాజయానికి బహిరంగ ప్రకటన. చివరికి అలా అనుకరించే జాతి తన సంస్కృతిని సర్వనాశనం చేసుకుంటుంది. అందుకే మహా ప్రవక్త (సఅసం), ఇతర జాతుల సాంఘిక విధానాలను అవలంబించడాన్ని కఠినంగా నిషేధించారు. ఒక జాతి శక్తి దాని వస్త్రధారణపై, అది జీవితం గడిపే తీరుపై ఆధారభూతమయి ఉండదని, నిజానికి దానికున్న విజ్ఞాన సంపద, అందులోనూ సువ్యవస్థ, అది అవలంబించే క్రియా శీలత్వంలోనే దాని శక్తి దాగి వున్నదని సాధారణ వివేకం ఉన్న ఏ వ్యక్తియినా గ్రహించగలడు. కనుక శక్తిని పొందదలచుకుంటే, జాతులు శక్తిని పొందే

విషయాలనే స్వీకరించాలి. జాతులు బానిసలుగా మారి చివరకు అవి ఇతరుల్లో విలీనమై తమ జాతీయ అస్తిత్వాన్నే కోల్పోయేలా పరిణమించే విషయాలను మాత్రం స్వీకరించకూడదు.

4) ముస్లిమేతరులతో వ్యవహరించే విషయంలో ముస్లిములకు సంకుచిత దృష్టిని, పక్షపాత వైఖరిని బోధించడం జరుగలేదు. వారి పెద్దలను తూలనాడటం, వారి మతాన్ని అవహేళన చెయ్యడం వంటి విషయాలు నిషేధించబడ్డాయి.

5) వారు ముస్లిమ్‌తో శాంతి సుహృద్భావాలతో వ్యవహరించడం, వ్యవహరిస్తూ ముస్లిముల హక్కుల్ని కాజెయ్యకుండా ఉంటే ముస్లిములు కూడా వారి ఎడల స్నేహభావంతో సుహృద్భావంతో, న్యాయవంతంగా మెలగాలని బోధించడం జరిగింది. ఇస్లామ్ నేర్పే సౌజన్య విధానాల రీత్యా ముస్లిములు అందరికంటే ఎక్కువగా మానవీయ సానుభూతితో, సుహృద్భావంతో, సౌజన్య వైఖరితో వ్యవహరించాలి. చెడు నడవడి, దౌర్జన్యవైఖరి, సంకుచిత మనస్తత్వం ముస్లిముల ఔన్నత్యానికి, ఉత్తమస్థాయికి తగనటువంటివి. సద్గుణం, సౌజన్యం, సదాచారాలు, మూర్తీభవించిన ఓ ఉత్తమ ఆదర్శవంతులుగా రూపొంది తమ నియమాల ద్వారా ప్రపంచంలో ముస్లిముల ఆవిర్భావం జరిగింది.

## 8) సకల సృష్టిరాసుల హక్కులు

ఇప్పుడు నాలుగవ కోవకు చెందిన హక్కుల్ని పరిశీలిద్దాము.

తన అసంఖ్యాకమయిన సృష్టిరాసులపై మనిషికి అధికారాలనిచ్చాడు దేవుడు. మనిషి వాటిని తన శక్తి ద్వారా స్వాధీనపరచుకుంటాడు. వాటిని వినియోగించు కుంటున్నాడు. వాటిద్వారా ప్రయోజనం పొందుతున్నాడు. ఆధిక్యత గల సృష్టి అవడంచేత మనిషికి అలా చేసే హక్కు పూర్తిగా ఉంది. అయితే దీనికి ప్రతిగా వాటికి కూడా మనిషిపై కొన్ని హక్కులున్నాయి. అవేమంటే, మనిషి వాటిని అకారణంగా వృధాపరచకూడదు. వాటిని అనవసరంగా నష్టపరచరాదు, కష్ట పెట్టరాదు. తన ప్రయోజనానికై అవసరమయినంతమేరకే, వాటికి వీలయినంత తక్కువ నష్టం కలిగించి వినియోగించుకోవచ్చు. వాటి వినియోగంలో సాధ్యమయి నంత ఉత్తమ విధానాలను అవలంబించాలి.

షరీఅత్‌లో ఈ హక్కుకు సంబంధించిన అనేక ఆదేశాలు పేర్కొనడం

జరిగింది. ఉదాహరణకు, జంతువుల్ని కేవలం వాటివల్ల కలిగే హాని నుండి తప్పించుకోవడానికో లేక మనిషి ఆహారం కొరకో వధించే అనుమతి ఇవ్వడం జరిగింది. కాని అనవసరంగా కేవలం కాలక్షేపానికి వాటి ప్రాణాలు తీయడం నిషిద్ధం. మనిషి తినే పశువుల్ని వధించడానికి 'జిబహ్' విధానాన్ని నియమించడం జరిగింది. ఇది పశువుల నుండి ప్రయోజనకరమయిన మాంసాన్ని సంగ్రహించే ఉత్తమమయిన విధానం. ఈ విధానం తప్ప ఇతర విధానాలు తక్కువ బాధాకర మయినవయితే వాటివల్ల మాంసంలోని విశేషాలెన్నో దెబ్బతింటాయి. అలా కాక మాంసంలో విశేష లక్షణాలను కాపాడుకునే ఇతర విధానాలు ప్రయోగిస్తే అవి జిబహ్ కంటే అధికంగా బాధాకరమయినవి. ఇస్లాం, ఈ రెండు విధానాలను కాదని మధ్యస్థ విధానాన్ని సూచిస్తుంది.

ఇస్లామ్‌లో జంతువుల్ని క్రూరంగా హింసిస్తూ చంపడం ఘోరమైన తప్పుగా పరిగణించ బడుతుంది. విష క్రిమికీటకాలను, క్రూరమృగాలను హతమార్చే అనుమతిని ఇవ్వడానికి కారణం, కేవలం మానవ ప్రాణం వాటికన్నా విలువైనది కావడమే. అయితే వాటిని కూడా హింసిస్తూ చిత్రవధ చెయ్యడం ధర్మసమ్మతం కాదు. వాహనాలుగాను, భారం మోసేందుకుగాను ఉపయోగపడే జంతువులకు సరిగ్గా వాటి ఆహారాన్ని అందించకపోవడం, వాటిని అలివికాని శ్రమకు గురిచెయ్యడం, వాటిని నిర్దయగా కొట్టడం లాంటి విషయాల్ని ఇస్లామ్ నిషేధిస్తుంది. పక్షుల్ని నిష్కారణంగా బంధించడం ఇస్లామ్ ప్రకారం గర్హనీయమయిన పని.

జంతువులే కాదు, చెట్లకు, మొక్కలకు సయితం నష్టం కలుగజేయడాన్ని ఇస్లాం నిరసిస్తుంది. వాటి పండ్లు, పువ్వులు తమ అవసరాలకుగాను కోసుకోవచ్చు. కాని, వాటిని వృథాగా నాశనం చేసే హక్కు మనుషులకు లేదంటుంది ఇస్లామ్. చెట్లయితే జీవం కలిగి ఉంటాయి. నిర్జీవమయిన వాటిని కూడా అకారణంగా వ్యర్థపరచ రాదంటుంది. చివరికి నీరు కూడా అనవసరంగా 'దుబారా' గా ఖర్చు చెయ్యడం నిషిద్ధం.

## 9) సార్వజనీనమయిన, సార్వకాలికమయిన షరీఅత్

ఇవే జగన్నాయకుడు ముహమ్మద్ (సఅసం) ద్వారా యావత్ప్రపంచానికి

చిరకాలానిగ్గాను పంపబడ్డ షరీఅత్ ఆదేశాలు, నియమాలు. వీటిలో మనిషి మనిషికి మధ్య విశ్వాసం ఆచరణలు తప్ప మరే ఇతర విషయం ఆధారంగాను ఎలాంటి తారతమ్యాన్ని పాటించడం ధర్మంకాదు. ఏ మతాల్లో, ఏ ధార్మిక నియమాల్లో, ఏ షరీఅతుల్లోనైతే కులం, తెగ, వంశం, వర్ణం, దేశం పునాదులుగా మానవుల మధ్య విభేదాన్ని పాటించడం జరుగుతుందో, ఆ మతాలు సార్వజనీన మయినవి కాజాలవు. ఎందువల్ల నంటే ఒక వంశానికి చెందిన మనిషి మరో తెగ, కులం వంశంలో ఏ విధంగాను చేరలేడు. లేదా లోకమంతా కుచించుకు పోయి ఒకే దేశంలో విలీనము కాజాలదు. అలాగే నీగ్రో ప్రజల నలుపు రంగు, చైనీయుల పసుప్పచ్చ రంగు, యూరోపియన్ల ఎర్రదనం ఎన్నటికి మారలేవు. అందువల్ల ఈవిభేధాలు ప్రాతిపదికగా ఏర్పడ్డ మతాలు, వాటి నియమాలు అనివార్యంగా ఏదో ఒక్క జాతి వరకే పరిమితమయిపోతాయి.

వీటికి భిన్నంగా ఇస్లామీయ షరీఅత్ విశ్వజనీనమయింది.

**“లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్ రసూలుల్లాహ్” (స.అ.స)**

(అల్లాహ్ తప్ప వేరే దైవం లేడు, ముహమ్మద్ దేవుని సందేశహరులు)

అన్న వచనాన్ని విశ్వసించే ప్రతి వ్యక్తి ఇస్లామీయ షరీఅత్ ఆదేశాల ప్రకారం ముస్లిం సమాజంలో సంపూర్ణంగా సమాన హక్కులతో ప్రవేశిస్తాడు. ఇక్కడ బాష, దేశం, వర్ణం, కులం, ఉపకులం, వంశం దేనికి ప్రాముఖ్యత, ప్రత్యేకత లేదు.

ఈ షరీఅత్ శాశ్వతమయిన సార్వకాలికమయిన షరీఅత్. దీని శాసనాలు, ఓ ప్రత్యేక జాతికో, ప్రత్యేక కాలానికో చెందిన ఆచారాలు, సంప్రదాయాల ఆధారంగా లేవు. మానవుడు ఏ ప్రకృతి సూత్రాల ఆధారంగా సృజించబడ్డాడో వాటి ఆధారంగానే ఏర్పడ్డ శాసనాలు సయితమూ అన్ని కాలాల్లోనూ, పరిస్థితుల న్నింటిలోను స్థిరంగానే ఉండి తీరాలి.

## 15వ అధ్యాయము

# ముస్లిములు ఆచరించవలసిన కొన్ని ముఖ్య నియమాలు

1. ఏ పని మొదలు పెట్టినా, అల్లాహ్‌ను స్మరించుకొని, 'బిస్మిల్లాహిర్రహ్మా నిర్రహీం' తరువాత షుక్ర్ అల్‌హందులిల్లాహ్ అనవలెను.
2. దేవుని ప్రతిఫలమునకు కృతజ్ఞతగా'షుక్రియా అల్లాహ్' అనవలెను.
3. ప్రతి ఒక్కరి యోగక్షేమము కోరి 'అస్సలాము అలైకుమ్' అని, ఎదుటి వానిని అభినందించవలెను. సలాము చేసిన వారికి జవాబుగా 'వఅలై కుముస్సలాం' అని తిరిగి అభినందించవలెను.
4. తల్లిదండ్రులను నిత్యము సంతోషముగా ఉంచవలెను. వారికి ఏ విధమైన బాధ కలిగించే మాటగాని, పనిగాని చేయరాదు. 'తల్లి పాదముల క్రింద స్వర్గము ఉన్నది' అని మహాప్రవక్త ప్రవచించారు. దానిని పొందుటకు ప్రయత్నించవలెను. ఈ సుభాషితము తండ్రికి కూడా వర్తించును.
5. మనకు సమీపములో నున్న వారు ఎవరైనా తుమ్మిన 'అల్‌హందు లిల్లాహ్' అని వినపడేటట్లు పలికితే దానికి జవాబుగా 'యర్‌హమ్‌కల్లాహ్' అని బుదులు పలకవలెను.
6. తనకు తెలిసిన రోగిని సందర్శించి, అతని యోగ క్షేమములు దర్యాప్తు చేసి రోగికి ధైర్యము చెప్పవలెను.
7. మయ్యత్ యొక్క అంతిమక్రియలలో పాల్గొను సమయాన సమాధులలో వున్న వారిని ఉద్దేశించి 'అస్సలాసము అలైకుం యా అలహ్‌లల్ ఖుబూర్' అనవలెను.
8. అనాథలు, బీదలు, వికలాంగులు, వృద్ధులపై కరుణ చూపి తగు సహాయము చేస్తుండవలెను. ముఖ్యంగా తన దగ్గరి బంధువులలో ఆర్థికంగా చితికిపోయిన వారిపై దయచూపి, ధనసహాయం చేయవలెను.
9. ఎల్లప్పుడూ, తహారత్‌తోను, వుజూతోను వున్న అల్లాహ్ పుణ్యము నొసంగుదురు.

10. పొరుగువారితో, అన్యోన్యతతో పరమత సహనముతో కలిసి ఉండవలెను.

11. కుఫ్ర్, షిర్క్, బిద్అత్‌ల వ్యత్యాసము గుర్తించివాటికి మనస్సులో ఏ మాత్రం వాటికితావు ఇవ్వరాదు. కుఫ్ర్ అనగా దైవధిక్కారము. తిరస్కారము. షిర్క్ అనగా అల్లాహ్‌తోపాటు ఆరాధనలో ఇతరులకు భాగస్వామ్యం కల్పించుట. బిద్అత్ అనగా ఇస్లాం ధర్మంలో లేని విషయాలను, సాంప్రదాయాలను తమకు తామే కల్పించుకొనుట.

12. తమ వ్యవహారములలో, తూనికలలో, కొలతలలో, లెక్కలలో అల్లాహ్ ఆజ్ఞ ప్రకారం నిజాయితీతో వుండవలెనని దివ్యఖుర్‌ఆన్‌లో హెచ్చరించడ మైనది.

13. జూదము, త్రాగుడు, వ్యభిచారం వంటివి నీచాతినీచమైన పనులు, వాటిని దరి చేరనీయరాదు.

14. లంచము ఇచ్చుట, లంచము పుచ్చుకొనుట, వడ్డీ పుచ్చుకొనుట, అబద్ధపు సాక్ష్యం చెప్పుట, అనాథల ధనం అపహరించుట చాలా దోషమని ఖుర్‌ఆన్‌లో హెచ్చరించబడినది.

15. భార్యాభర్తల అనురాగ దాంపత్యము పవిత్రమైనది. ఒకరి హక్కులు, బాధ్యతలు మరొకరు గ్రహించి, ఒకరిపై మరొకరు పూర్తి విశ్వాసంతో అన్యోన్యతతో సంతోషంగా, కష్టసుఖములు పంచుకుని ఆదర్శ జీవితం గడపవలెను.

16. తనకు తెలిసిన జ్ఞానం, విద్య, సద్బోధనలు ప్రజలకు నేర్పవలెను. తన ధనములో కొంత భాగం మస్జిద్‌లు, సత్రములు, ధార్మిక విద్యా సంస్థలు కట్టించుటకుఖర్చు పెట్టవలెను. తాను చేయు పుణ్య కార్యములు, దాన ధర్మము పరులకు చాటరాదు. కుడి చేతితో చేసిన ధర్మం ఎడమ చేతికి తెలియరాదని దివ్యఖుర్‌ఆన్‌లో ఆదేశించడమైనది.

17. ఎవరైనా అల్లాహ్ మార్గమున ధనము ఖర్చు పెట్టినా, దానం చేసినా మనకు ఏదైనా మేలు చేసినా 'జజాకల్లాహుఖైరన్' అనవలెను.

# 16వ అధ్యాయము

# చారిత్రక విషయాలు

## అఖీఖా

పుట్టి వెంట్రుకలు తీయు శుభకార్యమును అఖీఖా అంటారు. శిశువు పుట్టిన తరువాత (ఆ శిశువును శుభ్రంగా స్నానం చేయించి) శిశువు యొక్క కుడి చెవిలో అజాన్, ఎడమ చెవిలో ఇఖామత్ చెప్పవలెను.

తర్వాత శిశువు నోటికి రవ్వంత తేనె, 'అవూజు బిల్లాహి హినష్ షైతానిర్రజీం బిస్మిల్లా హిర్రహ్మానిర్రహీం' అంటూ నాకించవలెను.

వారం రోజుల తర్వాత అనగా 7వ రోజున అఖీఖా చేయవలెను. మన ప్రవక్త ముహమ్మద్ (సఅసం) తన మనుమలకు 7వ రోజునే అఖీఖా చేసిరి. కావున 7వ రోజునే అఖీఖా చేయుట మనపై సున్నత్ అయినది. ఆ రోజుననే నామకరణము చేయవలెను. కాని కొందరు 7వ రోజున వీలుపడకపోతే 14న, 21న లేదా తర్వాత వీలును బట్టి ఎప్పుడైనా అఖీఖా చేయుదురు. ఈ అఖీఖా శుభకార్యము నాడు మగశిశువునకు రెండు మేకలు, ఆడ శిశువునకు ఒక మేక జిబహ్ చేయవలెను. జిబహ్ చేయు జంతువు కనీసం ఒక సంవత్సరం వయసు కలిగి, బక్రీద్ నాడు ఖుర్బానీ ఇచ్చు జంతువుకు వున్న లక్షణములు గలదిగా ఉండవలెను. రెండు మేకలు ఖుర్బానీ ఇచ్చుటకు స్థోమత లేనప్పుడు తన వద్ద సొమ్ము లేనప్పుడు ఖుర్బానీ ఇవ్వనవసరం లేదు. కాని పుట్టి వెంట్రుకలు మాత్రం తీయించవలెను. బక్రీద్ నాడు ఖుర్బానీ మాంసం ఏ విధంగా 3 భాగములు చేసి బీదలకు, బంధుమిత్రులకు పంచుదుమో అట్టి విధంగానే, అఖీఖా ఖుర్బానీ మాంసం కూడా పంచవలెను. జిబహ్ శిశువు తండ్రి, సోదరులు, తాత మొదలగు దగ్గరి వారసులు చేయుట ఉత్తమము. దగ్గరి వారసులు లేనప్పుడు మరెవరైనా

ముస్లింకు అధికారమిచ్చి జిబహ్ చేయించవచ్చును. పుట్టి వెంట్రుకల బరువు తూచి అంత వెండిని ఎవరికైనా దానం చేయాలి. (తిర్మిజి)

## జిబహ్ చేయునప్పుడు చదువవలసిన దుఆ

**అఖీఖా మగ శిశువునకు చేయునపుడు**

**'అల్లాహుమ్మ, హాజిహి, అఖీఖతి (ఇబ్ని)**
(ఇక్కడ తండ్రి పేరు శిశువు పేరు చెప్పవలెను)
**దముహా బి దమిహీ-వలహ్ముహా బిలహ్మిహీ,**
**వ అజ్ముహా బి అజ్మిహీ - వజిల్దుహా బిజిల్దిహీ**
**వషఅరుహా బిషఅరిహి - అల్లాహుమ్మ తఖ్బల్హా**
**మిన్నీ - వజ్అల్హా-ఫిదాఅన్-లిబ్నీ మిన్నార్'**
**'బిస్మిల్లాహి అల్లాహు అక్బర్'** అంటూ జిబహ్ చేయవలెను.

**అఖీఖా ఆడ శిశువునకు చేయునపుడు**

**'అల్లాహుమ్మ హాజీహీ-అఖీఖతి (బిన్తి)**
(ఇక్కడ తండ్రి పేరు / శిశువు పేరు చెప్పవలెను)
**దముహా బి దమిహీ-వలహ్ముహా బిలహ్మిహ,**
**వ అజముహా బిఅజ్మిహా - వజిల్దుహా బిజిల్దిహా**
**వషఅరుహా బిషఅరిహా - త ఖబ్బల్ హామిన్నా**
**వజ్అల్హా-ఫిదాఅన్ల్లి బిన్తిహీ'**
**'బిస్మిల్లాహి అల్లాహు అక్బర్'** అంటూ జిబహ్ చేయవలెను.

తెలుగు: ఓ అల్లాహ్ ఈ అఖీఖా ఈ శిశువు తరపు నుండి ఇవ్వబడుచున్నది. ఈ ఖుర్బానీ జంతువు రక్తము, ఈ శిశువు రక్తమునకు బదులు.

ఈ ఖుర్బానీ జంతువు మాంసం ఈ శిశువు మాంసమునకు బదులు.

ఈ జంతువు ఎముకలు ఈ శిశువు ఎముకల తరపు నుండి.

ఈ జంతువు చర్మం ఈ శిశువు చర్మమునకు బదులు

ఈ జంతువు వెంట్రుకలు ఈ శిశువు వెంట్రుకలకు బదులు.

ఓ అల్లాహ్ ఈ ఖుర్బానీని నా తరపు నుండి మరియు నా శిశువు తరపు నుండి ఆమోదించు.

**ఖత్నా:**

ఖత్నా చేయించుట సున్నతె ఇబ్రాహీం. దీనిని మన ప్రవక్త (సఅస) కూడా అవలంబించారు. కావున ఇది మనపై సున్నత్ అయినది. పిల్లవానికి బాల్యములోనే ఖత్నా చేయించుట ఉత్తమం.

## సూరానీ రాతే పవిత్ర రాత్రులు

షబె మేరాజ్ (రజ్జబ్ నెల 27వ రాత్రి)

షబె బరాత్ (షాబాన్ నెల 15వ రాత్రి)

షబె ఖద్ర్ (రమజాన్ నెల 27వ రాత్రి)

**షబె మేరాజ్:**

ఈ రాత్రి ముహమ్మద్ (సఅసం) జిబ్రయీల్ (అస)తో కలసి మక్కా నుండి జరూసలెంలో నున్న మస్జిదె అఖ్సాను దర్శించి దైవ సన్నిధికి వెళ్ళి వచ్చిన యాత్ర 'మేరాజ్ యాత్ర' అంటారు. ఈ రాత్రి చాలా పవిత్ర రాత్రిగా ఎంచుతారు.

**షబె బరాత్:**

ఈ పవిత్ర రాత్రి అల్లాహ్ మన భక్తులకు, తన కృపవల్ల రానున్న సంవత్సరపు భుక్తి ప్రసాదించును. తన భక్తుని కోరికలు ఆమోదించును.

**షబె ఖద్ర్:**

ఈ పవిత్ర రాత్రి రమజాన్ నెల ఐదు బేసి రాత్రులలో ఏదో ఒక రాత్రిన వచ్చును. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఈ పవిత్ర రాత్రిని 'తాఖ్ రాత్రులలో' పొందుటకు ప్రయత్నించాలని హితోపదేశం చేసిరి. అందుచేత ఈ పవిత్ర రాత్రిని పొందుటకు రమజాన్ నెల 21, 23, 25, 27, 29 రాత్రులయందు ప్రార్థనలు, ఖుర్ఆన్ పఠనము ఎక్కువగా చేయవలెను. సాధారణంగా రమజాన్ నెల 27వ తారీఖు రాత్రి షబెఖద్ర్ జరుపుదురు. ఈ పవిత్ర రాత్రి దివ్యఖుర్ఆన్ 'లౌహె మహఫూజ్' నుండి భూలోకమునకు అవతరించబడినది.

ఈ పవిత్ర రాత్రులలో, నఫిల్ నమాజులు, ఖజా నమాజులు, ప్రార్థనలు దానం, ధర్మము, సత్కార్యములు అధికంగా చేసి రాత్రి అంతయు దైవభక్తిలో లగ్నమై ఉండవలెను. ఈ రాత్రులలో సత్ప్రవర్తనులపై అల్లాహ్ కరుణ అపారంగా ప్రసాదించుదురు. ఈ రాత్రులను ఆటపాటలయందు, వినోదములయందు వృధాపుచ్చరాదు. దేవుని అనుగ్రహం పొందుటకై తహతహలాడుచూ, భయభక్తులతో నమాజులు, దుఆలు చేసుకోవలెను. షబే మేరాజ్, షబె బరాత్ నాడు భక్తులు నఫిల్ రోజాలు ఉండి అల్లాహ్ మన్ననల కొరకు దుఆలు చేసుకొందరు.

## పవిత్ర నామములు వాటిని ఉద్దేశించు విధము

మనము, మన తల్లిదండ్రులను, గురువులను, పండిత పామరులను, పెద్దలను ఉద్దేశించునపుడు వారి పేరుకు ముందు 'జనాబ్' అని చేర్చి పిలుతురు. ఈ విధంగా ఇస్లాం మానవ జాతికి, ఈ విషయంలో కూడా సత్ప్రవర్తన (తహ్జీబ్) నేర్పనది.

ఈ క్రింద ఉదాహరించిన పవిత్ర నామములను, భక్తి, గౌరవములతో ఉద్దేశించిన వారి ఘనతకు, కీర్తికి తగు సగౌరము లభించును.

# నామము ఉద్దేశించు విధము

| నామము | ఉద్దేశించు విధము |
|---|---|
| **ప్రవక్త ముహమ్మద్** | హజరత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం |

మిగిలిన ప్రవక్తలందరినీ, వారి నామమమునకు ముందు హజరత్, వారి నామము తర్వాత అలైహిస్సలాం అనవలెను.

**ఉదాహరణకు:**

| | | | |
|---|---|---|---|
| 1) | ఆదం | = | హజరత్ ఆదం అలైహిస్సలాం |
| 2) | ఇబ్రాహీం | = | హజరత్ ఇబ్రాహీం అలైహిస్సలాం |
| 3) | మూసా | = | హజరత్ మూసా అలైహిస్సలాం |
| 4) | దావూద్ | = | హజరత్ దావూద్ అలైహిస్సలాం |
| 5) | ఈసా | = | హజరత్ ఈసా అలైహిస్సలాం |

సహాబీల పేర్లకు, మహనీయుల పేర్లకు ముందు హజరత్ అని, వారి పేరు వెనుక 'రజి అల్లాహు అన్హు' అని చేర్చి పిలుస్తారు.

ఉదాహరణకు:

| | | |
|---|---|---|
| 1. | అబూబక్ర్ సిద్దీఖ్ (1వ ఖలీఫా) | హజరత్ అబూబక్ర్ సిద్దీఖ్ రజీ అల్లాహు అన్హు (ర.అ) |
| 2. | ఉమర్ ఫారుఖ్ (2వ ఖలీఫా) | హజరత్ ఉమర్ ఫారుఖ్ రజీ అల్లాహు అన్హు (ర.అ) |
| 3. | ఉస్మాన్ ఘని (3వ ఖలీఫా) | హజరత్ ఉస్మాన్ ఘని రజీ అల్లాహు అన్హు (ర.అ) |
| 4. | హజరత్ అలీ (4వ ఖలీఫా) | హజరత్ అలీ రజీ అల్లాఅల్లాహు అన్హు (ర.అ) |
| 5. | ఖదీజా | హజరత్ ఖదీజా రజీ అల్లాహు అన్హా (ర.అ) |
| 6. | ఫాతిమా | హజరత్ ఫాతిమా రజీ అల్లాహు అన్హా (ర.అ) |

యుగపురుషులు, వలీలను ఉద్దేశించునపుడు వారి పేర్ల తర్వాత వలీవుల్లా! రహమతుల్లా అలైహి అని ఉద్దేశించవలెను.

**ఉదాహరణకు:**

**నిజాముద్దీన్ -** హజరత్ నిజాముద్దీన్ అవులియా

**ఖాజా మొయినుద్దీన్ -**హజరత్ ఖాజా మొయినుద్దీన్ చిష్తీ రహమతుల్లా అలైహి

పెద్దలకు, సత్పురుషులకు వారి పేరు ముందు 'హజరత్' అని, 'మౌలానా' అని, 'జనాబ్' అని ఉద్దేశించవలెను.

## వాహనం కొన్నప్పుడు చేసే దుఆ

**"అల్లాహుమ్మ ఇన్నీ అస్అలుక ఖైరహా వ ఖైర మా జబల్తహా అలైహి వ అవూజు బిక మిన్ షర్రిహా వ షర్రి మా జబల్తహా అలైహి.**

## 17వ అధ్యాయము

# దివ్యఖుర్ఆన్

ఆది మానవుడు ఆదం(అస) మొదలు ముహమ్మద్(సఅసం) వరకు అల్లాహ్‌చే పంపబడ్డ 1,24,000 మంది ప్రవక్తలందరూ, ముస్లిములు, పుణ్య పురుషులు, శాంతి స్వరూపులు, శాంతి దూతలు. 'తౌహీద్' వీరి సందేశం. వీరందరూ ఇస్లాం సిద్ధాంతములు ప్రచారం చేయుటకై, ప్రజలను తప్పుడు దారి నుండి సన్మార్గం వైపు పిలుచుటకై సమయానుకూలంగా భూలోకమునకు పంపబడిరి. సత్ప్రవర్తనకు అలవడి, ఇస్లాంను విశ్వసించిన వారు ముస్లిము లైనారు. అల్లాహ్ తన కృపవల్ల ఈ ప్రవక్తలలో కొందరికి తన పవిత్ర గ్రంథములను ప్రసాదించెను. ఈ గ్రంథములలో ముఖ్యమైనవి తౌరాత్, జబూర్, ఇంజీల్. ఈ గ్రంథములు ముహమ్మద్ (సఅసం)కు ముందు వచ్చిన ప్రవక్తలపై అవతరించబడినవి. కొన్ని యుగాల తర్వాత ముహమ్మద్ (సఅస) పైగంబర్ ఆఖరి జ్జమా (ఆఖరి ప్రవక్త)గా పంపబడతారని ఈ గ్రంథములు, ప్రవక్తలు కొన్ని శతాబ్దముల ముందుగానే ఈ సత్యమును వెల్లడి చేసినారు. లోకము అంధకార, అజ్ఞానములో మునిగి ఉన్నప్పుడు, విశ్వ ప్రజలకు వెలుగుబాట చూపుటకు ముహమ్మద్ (సఅసం)ను, అల్లాహ్ తన శుభ సందేశం అందజేయు టకు భూలోకమునకు పంపెను. (దివ్యఖుర్ఆన్ 4-47, 4-79, 2-97) ఈ శుభ సందేశం మొట్టమొదటి సారిగా ముహమ్మద్ (సఅసం)కు, జిబ్రయీల్ (అస) ద్వారా క్రీ.శ. 12-2-610లో రమజాన్ నెల శుక్రవారంన వహీ "ఇఖ్రా దివ్యఖుర్ఆన్ 96:1-5 పంపబడినది. పిమ్మట సమయానుకూలంగా, పరిస్థితులు ననుసరించి, మక్కాలోను, మదీనాలోను ముహమ్మద్ (సఅసం) యొక్క ప్రవక్త పదవి కాలంలో (23 సంవత్సరాలలో) పూర్తి ఖుర్ఆన్ అరబ్బీ భాషలో అవతరించ బడినది. దీనిలో 114 అధ్యాయాలు, 6,236 ఆయతులు కలవు. ఇది 30 కాండములుగా విభజింపబడినది. ఒక్కొక్క కాండంను 'పారా' అంటారు. ఈ ఖుర్ఆన్, ఇస్లామీయ సిద్ధాంతములు, సూత్రములు, ప్రార్థనలే కాక, సమస్త మానవజాతి హక్కులు,

విధులు, ధర్మములు, మరియు ఒకరి పట్ల మరొకరు చూపవలసిన ఆదరణ, ఓర్పు, సహనము, ప్రేమ, ఔదార్యము మొదలగు సాంఘిక, సామాజిక కర్తవ్యములన్నిటినీ నొక్కి వక్కాణించెను. మరియు ఇందులో సమస్త శాస్త్రముల సారాంశములు విపులంగా వివరించడమైనది. ప్రపంచపు గడ్డు సమస్యల పరిష్కారమార్గం ఈ దివ్యఖుర్‌ఆన్‌లో పొందగలుగుదుము. ఈ పవిత్ర ఖుర్‌ఆన్‌కు శతాబ్దములు ముందుగా భూలోకంలో జన్మించి, ప్రజలకు పాపభీతి, దైవభక్తి, సత్ప్రవర్తన గురించి బోధించిన ప్రవక్తలు 1. ఆదం (అ.స), 2. ఇద్రీస్ (అ.స), 3. నూహ్ (అ.స), 4. ఇబ్రాహీం (అ.స), 5. ఇస్మాయీల్ (అ.స), 6. ఇస్‌హాఖ (అ.స) 7. లూత్ (అ.స), 8. యాఖూబ్ (అ.స), 9. యూసుఫ్ (అ.స), 10. హూద్ (అ.స), 11. షుఐబ్ (అ.స), 12. సాలెహ్ (అ.స), 13. మూసా (అ.స), 14. హారూన్ (అ.స), 15. దావూద్ (అ.స), 16. సులైమాన్ (అ.స), 17. ఇల్యాస్ (అ.స), 18. అల్‌యసాఅ (అ.స), 19. అయ్యూబ్ (అ.స), 20. యూనుస్ (అ.స), 21. జుల్ కిఫ్ల్ (అ.స), 22. జకరియా (అ.స) 23.యహ్యా (అ.స), 24. మర్యమ్ (అ.స), 25. ఈసా (అ.స) 26. లుఖ్మాన్ (అ.స), 27. జుల్‌ఖర్‌నైన్ (అ.స), 28. ఉజైర్ (అ.స), 29. ముహమ్మద్ (సఅసం) మొదలగువాని ప్రస్తావించింది.

యుగయుగాలుగా, అరబ్బులు అరబ్బీ భాషలో అత్యంత పాండిత్యము సంపాదించి, పద్య, గద్య రచనలో, కవితలో వాగ్ధాటిలో ప్రసిద్ధికెక్కి ఉన్నారు. కాని దివ్యఖుర్‌ఆన్‌లోని ఒక ఆయత్‌తో సమానమైన ఆయతును రచించుట వారి తరము కాలేదు. ఈ ఖుర్‌ఆన్‌ను ఎవరూ రచించలేదు. (దివ్యఖుర్‌ఆర్ 2 -23). అల్లాహ్ యొక్క సందేశములు సరాసరి జిబ్రయీల్ (అ.స) ద్వారా ముహమ్మద్ (సఅస)పై అవతరించబడిన దివ్యవాణి. వెలువబడిన తేదీ నుండి నేటి వరకు ఈ దివ్యవాక్కులలో ఎటువంటి మార్పులు చేయుట సంభవించ లేదు. ఇక ముందు ఎన్నడూ జరగబోదు. ఈ దైవ సందేశంలోని యే ఒక అక్షరంలోని తలకట్టును కూడా తమకనుకూలంగా అర్థము వచ్చునట్లు మార్చుటకు ఎవరి తరము కాలేదు. దీని తరువాత మరే గ్రంథం వెలువడదు.

## ప్రళయ దినం మరియు కర్మల పత్రం

దైవంపై విశ్వాసమున్నప్పుడు ప్రళయంపై విశ్వాసం పరిపూర్ణం అవుతుంది. ప్రళయ దినం పట్ల విశ్వాసం మనిషి మస్తిష్కంలో నాటుకుపోతే మానవ జీవితాల్లో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకుంటాయి. ప్రళయం పట్ల విశ్వాసం

మానవుల నడవడికి, జీవన గమనానికి దైవాదేశాలకు కట్టుబడేవారుగా, సత్యధర్మ పథంలో స్థయిర్యంగా నడిచేవారుగా పవిత్రమైన దశ, దిశలను నిర్దేశిస్తుంది.

ప్రళయ దినం సంభవించిన రోజున ఈ ప్రపంచ అంతమై మరో క్రొత్త ప్రపంచం ఉనికిలోకి వస్తుంది. మానవులందరూ అక్కడ దేవుని ముందు హాజరవుతారు. మంచి పనులు చేసిన వారికి బహుమానం, చెడు పనులకు పాల్పడిన వారికి కఠిన శిక్ష విధిస్తాడు. అక్కడ శిక్షయినా బహుమానం అయినా శాశ్వతమైనవి.

ఆ దినాన ప్రతి మనిషికి అందజేసే కర్మల పత్రంలో అతను చేసిన మంచి, చెడు పనులు, పాప పుణ్యాలు రికార్డు అవుతాయి. దైవభీతితో జీవితం గడిపిన వారికి వారి కుడి చేతికి, పాపాత్ములకు ఎడమ చేతికి  కర్మల పత్రం ఇస్తారు. అందులో మీ రహస్యాలేవీ దాగి ఉండవు. మీరు చేసిన కర్మల ప్రతిఫలంగా కుడి చేతితో అందుకున్న వారు తమకు ఇష్టమైన భోగభాగ్యాలలో ఓలలాడుతూ, స్వర్గవనాల్లో విహరిస్తూ కోరుకున్నది తింటూ, హాయిగా సుఖపడతారు.

ఎడమ చేతితో కర్మల పత్రం అందుకున్న వ్యక్తి అయ్యో! ఈ కర్మల పత్రం నాకు ఇవ్వకుండా ఉంటే నా లెక్క నాకు తెలియకుండా ఉంటే ఎంత బాగుండును. నాకు ప్రాపంచిక మరణమే అంతిమం అయివుంటే ఎంత బాగుండేది. నా ఆస్తిపాస్తులు, నాకీ రోజుపనికి రాకుండా పోయాయే! నా అధికారమూ నన్ను రక్షించలేదే అని వాపోతాడు. అప్పుడు ఇలాంటి ఆజ్ఞ వస్తుంది. అతడ్ని పట్టుకుని కంఠపాశం బిగించి నరకంలోపడవేయండి. మహోన్నతుడైన అల్లాహ్‌ను ఇతడు విశ్వసించలేదు. నిరుపేదలకు అన్నం పెట్టడం కాని, పెట్టమని ప్రోత్సహించడం కాని చేసేవాడు కాదు. కాబట్టి ఇక్కడ అతడి దుఃఖాల్లో పాలు పంచుకునే స్నేహితుడు ఎవడూ లేడు. అతడికి ఇక్కడ గాయాల చీము, నెత్తురు తప్ప తినడానికి, త్రాగడానికి మరేమీ లేదు. దాన్ని పాపాత్ములు తప్ప మరెవ్వరూ తినరు. (అల్ హాఖ్ఖా 18: 38)

దివ్యఖుర్ఆన్ అవతరణ ఒక మోజిజా, దేవుని అత్యద్భుతం (MIRACLE) ది.ఖు. 15:9; 26:92-94.

## 18వ అధ్యాయము

# ప్రవక్తల పితామహుడు ఇబ్రాహీమ్ ఖలీలుల్లాహ్ (అలై)

బాబిలోనియా ప్రజలు సెమెటిక్ జాతికి చెందిన ప్రజలు. భోగభాగ్యాల జీవితం గడిపేవారు. విగ్రహాలను చెక్కి వాటిని పూజించేవారు. కనాన్ కుమారుడు నమ్రూద్ వారి పాలకుడు. పరమ స్వార్థపరుడు. నిరంకుశుడైన నియంత. ప్రజలను బెదిరించి, భయపెట్టి తన చెప్పుచేతల్లో ఉంచు కున్నాడు. తన పాలనలో ప్రజలు భోగ భాగ్యాలతో జీవిస్తున్నారన్న విషయం నమ్రూద్‌కి బాగా తెలుసు. ప్రజలు విలాసవంతమైన జీవితం తప్ప మరేదీ పట్టించుకోరన్నది కూడా అతనికి తెలుసు. ప్రజలు ఆరాధిస్తున్న విగ్రహాలకన్నా తానే గొప్పవాడినని భావించాడు. ఎందుకంటే విగ్రహాలు కనీసం చూడలేవు, వినలేవు, ఆలోచించ లేవు, అనుభూతి చెందలేవు, ఎవరికీ రక్షణ కల్పించలేవు, ఎవరినీ సంపన్ను లుగా లేదా నిరుపేదలుగా మార్చలేవు, కాని తాను ఎవరినైనా ఏమైనా చేయగల అధికారాలు కలిగిన వాడు. ఈ ఆలోచన కలిగిన వెంటనే నమ్రూద్ తానే అసలైన దేవుడినని ప్రకటించుకున్నాడు. విలాసవంతమైన జీవితం గురించి తప్ప మరి దేని గురించీ పట్టించుకోని ప్రజలు అతడు చెప్పినట్లు అతనే దేవుడని ఒప్పుకున్నారు. ఈ నేపథ్యంలో పద్దాన్ అరమ్ అనే పట్టణంలో ఇబ్రాహీమ్ (అస) జన్మించారు. అల్లాహ్ ఆయనకు ఎంతో వివేకాన్ని, విజ్ఞతను, వివేచనను ప్రసాదించాడు. ఆయనకు సత్యమార్గాన్ని చూపించాడు. ఇబ్రాహీమ్ (అస) ప్రజలకు నిజమైన దేవుడిని ఆరాధించాలని బోధించడం ప్రారంభించారు. ఏకైక దేవుడైన అల్లాహ్‌నే ఆరాధించాలనీ, విగ్రహాలను ఆరాధించడంలో విజ్ఞత లేదని ప్రచారం చేయసాగారు.

### తండ్రీ కుమారుల వాగ్వివాదం

ఇబ్రాహీమ్ (అస) తండ్రి పేరు ఆజర్. అతను విగ్రహారాధకుడు మాత్రమే కాదు, విగ్రహాలను చెక్కి అమ్మేవాడు. ఒక మంచి కుమారుడిగా తాను తన

తండ్రికి ఈ పనిలోని అనౌచిత్యం గురించి చెప్పడం తన బాధ్యతగా ఇబ్రాహీమ్ (అస) భావించారు. ఆ విధంగా తన తండ్రిని అల్లాహ్ ఆగ్రహం నుంచి కాపాడా లనుకున్నారు. కాని ఈ విషయాన్ని చాకచక్యంగా, తండ్రి బాధపడకుండా చెప్పా లనుకున్నారు. ఆయన తన తండ్రి ఆరాధిస్తున్న విగ్రహాల విషయంలో ఎగతాళి చేయలేదు. తండ్రి పట్ల తనకున్న ప్రేమను తెలియజేసి ఆ విధంగా తండ్రిలో ప్రేమాభిమానాలను ప్రేరేపించి తన మాటలను తండ్రి శ్రద్ధగా వినేలా చేసు కున్నారు. ఆ తర్వాత నెమ్మదిగా నచ్చజెప్పారు. జీవం లేని విగ్రహాలను ఎందుకు పూజిస్తున్నారని ప్రశ్నించారు. వినలేని, చూడలేని, కాపాడలేని విగ్రహాలను పూజించడం ఎందుకని అడిగారు. తండ్రికి కోపం రాకముందే, "నాన్నా! మీకు తెలియని జ్ఞానం నా వద్దకు వచ్చింది. నన్ను అనుసరించడం చిన్నతనమవు తుందని దయచేసి భావించవద్దు. మీ అనుభవం కాని, మీ వయసు కాని నాకు లేవన్న సంగతి నాకు బాగా తెలుసు. కాని షైతాన్ మానవాళికి శత్రువు, మనిషిని దారి తప్పించి దుర్మార్గానికి పాల్పడేలా చేస్తాడు" అన్నారు. కుమారుడు నిర్మొహ మాటంగా, నిక్కచ్చిగా చెబుతున్న ఈ మాటలు విని ఆ తండ్రి ఆశ్చర్యపోయాడు. కుమారుడితో మాట్లాడుతూ, "నీవు నా దేవుళ్ళను కాదంటున్నావా? ఇబ్రాహీమ్! నువ్వు అలా చేస్తే నేను నిన్ను రాళ్ళతో కొట్టిస్తాను. నా కోపం నీకు తెలుసు. ఒక తండ్రి మాదిరి దయాగుణాన్ని నువ్వు నాలో చూడలేవు. ఇక నన్ను ఒంటరిగా వదిలేయ్!" అన్నాడు. (అంటే ఇబ్రాహీమ్ (అస) తన ఇల్లు వదలి వెళ్ళిపోవాలని పరోక్షంగా సూచించాడు).

ఇబ్రాహీమ్ (అస) మౌనంగా ఊరుకున్నారు. అయితే తన తండ్రికి నచ్చజెప్పడం మానుకోలేదు. "మీకు శాంతి కలుగుగాక! మీ కోసం నా ప్రభువుతో క్షమాభిక్ష అర్థిస్తాను. అల్లాహ్ అనంత కరుణామయుడు. మీకూ, మీరు ఆరాధిస్తున్న వాటికి నేను దూరంగా వెళ్ళక తప్పదు" అన్నారు. తన తండ్రికి వీడ్కోలు చెప్పి భారమైన మనసుతో ఇల్లు వదలి వెళ్ళిపోయారు.

## సంవాదం

తండ్రి కఠినంగా నివారించినా ఇబ్రాహీమ్ (అస) తన సత్యసందేశ ప్రచారాన్ని మానుకోలేదు. ప్రజలు ప్రాణం లేని విగ్రహాల ముందు సాష్టాంగ పడడం చూసి ఆయన చాలా బాధపడేవారు. ఈ ఆచారాన్ని మానిపించాలని

ఆయన తీర్మానించుకున్నారు. ఈ విషయమై ప్రజలతో వాదించడానికి సిద్ధపడ్డారు. ఇలాంటి వాదనల వల్ల తనకు ప్రమాదమని తెలిసినా ఆయన వెనుదీయలేదు.

ఒక వైద్యుడు తగిన చికిత్స సూచించడానికి రోగనిర్ధారణకు పరీక్షలు చేసినట్లుగా, ఒక న్యాయమూర్తి నిందితుడిని ప్రశ్నించి సత్యాన్ని రాబట్టడానికి ప్రయత్నించినట్లుగా ఇబ్రాహీమ్ (అస) ప్రజలను ప్రశ్నించారు. "మీరు సాష్టాంగ పడినప్పుడు ఈ విగ్రహాలు మిమ్మల్ని చూస్తాయా? మీకు ఏ విధంగా నయినా ఇవి ప్రయోజనం కలిగిస్తాయా?" అని అనేవారు.

ప్రజలు ఆయనకు జవాబిస్తూ, విగ్రహాలకు ప్రాణం లేదన్న వాస్తవం తమకు కూడా బాగా తెలుసనీ, కాని తమ తాతముత్తాతలు వాటిని పూజించారనీ, విగ్రహాల శక్తిసామర్థ్యాలకు ఇంతకన్నా రుజువు ఏంకావాలని అన్నారు.

మీ తాతముత్తాతలు తప్పు చేశారని ఇబ్రాహీమ్ (అస) వారికి నచ్చజెప్ప డానికి ప్రయత్నించారు. ఈ మాటలు విన్న ప్రజలు ఆగ్రహంతో మండిపడ్డారు. "నువ్వు మా దేవుళ్ళను, మా తాతముత్తాతలను నిందిస్తున్నావా? లేక పరిహాసానికి చెబుతున్నావా?" అని నిలదీశారు. ఇబ్రాహీమ్ (అస) ఎలాంటి సంకోచం లేకుండా తాను పరిహాసం చేయడం లేదనీ, సత్యం చెబుతున్నాననీ, తాను ఒక సత్యమైన ధర్మం తీసుకువచ్చాననీ, అందరి ప్రభువైన అల్లాహ్ తనకు మార్గదర్శకత్వాన్ని ఇచ్చి పంపాడనీ, అల్లాహ్ ఒక్కడే ఏకైక దేవుడనీ, ఆయనే సృష్టికర్త అనీ, భూమ్యా కాశాలను సృష్టించింది ఆయనేననీ, ఆయనే జీవన వ్యవహారాలన్నీ నడుపుతున్నా డనీ, కేవలం కలప, రాళ్ళతో చేసిన ఈ విగ్రహాలు కాదని నిర్మొహమాటంగా చెప్పారు. ఈ విగ్రహాలు తనకు ఎలాంటి హాని చేయలేవని వారికి నచ్చజెప్పడానికి ఆయన వారితో సవాలు చేశారు. "నేను విగ్రహాలను బాహాటంగా విమర్శించాను. వాటికి నిజంగా శక్తి ఉంటే ఈ పాటికి అవి నాకు హాని కలిగించి ఉండేవి" అన్నారు.

అల్లాహ్ సృష్టిలోని సౌందర్యాన్ని ఇబ్రాహీమ్ (అస) వారికి వివరించారు. అల్లాహ్ శక్తి సామర్థ్యాలను, అల్లాహ్ వివేకవిజ్ఞతలను తెలియజేశారు. విగ్రహా రాధనను అల్లాహ్ ఏవగించుకుంటాడనీ, ఈ సమస్త విశ్వానికి అల్లాహ్ మాత్రమే నిజమైన ప్రభువనీ, ఆయన తనను సృష్టించాడనీ, తనకు మార్గదర్శకత్వాన్ని

ఇచ్చాడనీ, తనకు అన్నపానీయాలు కల్పిస్తున్నాడనీ, జబ్బు పడినప్పుడు స్వస్థత ఇస్తున్నాడనీ, ఆయనే మృత్యువును ఇస్తాడనీ, తర్వాత మళ్ళీ బ్రతికించి లేపుతాడని వివరించారు. తాను ఆయన్నే ఆరాధిస్తున్నాననీ, ఆయనే తీర్పుదినాన తన తప్పులను మన్నిస్తాడని చెప్పారు. కాని ప్రజలు ఈ వాస్తవాలను గుర్తించకుండా విగ్రహారాధన కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## విగ్రహాల యుద్ధం

పట్టణానికి బయట ఒక ఉత్సవం జరుపుకునే సంప్రదాయం వారికి ఉండేది. అయితే ఆ ఉత్సవానికి వెళ్ళే ముందు విగ్రహాలకు ప్రసాదాలు పెట్టి వాటి ఆశీర్వాదం తీసుకుని వెళ్లేవారు. ఉత్సవం నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఆ ప్రసాదాన్ని పంచుకు తినేవారు. ఇబ్రాహీమ్ (అస) వారితో పాటు ఉత్సవానికి రానన్నారు. పట్టణంలోనే ఉండిపోయారు. పూర్తి పట్టణంలోని ప్రజలందరూ ఊరి బయటకు ఉత్సవంలో పాల్గొనడానికి వెళ్ళారు. పూజారులు కూడా వెళ్ళిపోయారు. ఆ తర్వాత ఇబ్రాహీమ్ (అస) విగ్రహాలున్న ఆలయంలోకి ప్రవేశించారు. చాలా విగ్రహాల పాదాల వద్ద ఆహార పదార్థాలు ఉన్నాయి. ఇబ్రాహీమ్ (అస) విగ్రహాలను భోంచేయడం లేదేమని వ్యంగ్యంగా అడిగారు. కోపంగా ఆ విగ్రహాలన్నింటినీ విరగ్గొట్టారు. ఒక దాని తర్వాత ఒకటిగా విగ్రహాలన్నీ ముక్కలు చేసి ఒక పెద్ద విగ్రహాన్ని మాత్రం వదిలేశారు. అప్పటికి ఆయన కోపం చల్లారింది. పూజారులు, ప్రజలు తిరిగి వచ్చి విగ్రహాలన్నీ ధ్వంసమై ఉండడం చూసి నిర్ఘాంతపోయారు. ఇలాంటి పని చేసేది ఇబ్రాహీమ్ తప్ప మరెవ్వరూ కాదని నిర్ణయించారు. ఆగ్రహంతో ఇబ్రాహీమ్‌ను నిర్బంధించి విచారణ జరపాలన్నారు. ఇబ్రాహీమ్ (అస) కూడా అందుకు ఒప్పుకున్నారు. ఆయన కూడా విచారణ జరగాలనే కోరుకున్నారు. బహిరంగంగా విచారణ జరిగితే ప్రజలకు వారి మూర్ఖ ఆచారాల గురించి బాహాటంగానే వివరించవచ్చని ఆయన భావించారు.

## విచారణ

విచారణలో ఇబ్రాహీమ్ (అస)ను విగ్రహాల విధ్వంసం గురించి ప్రశ్నించారు. విగ్రహాలను విరగ్గొట్టింది నీవేనా అని అడిగారు. ఇబ్రాహీమ్ (అస) నవ్వుతూ, విరగకుండా ఉన్న పెద్ద విగ్రహాన్ని అడిగితే చెబుతుంది కదా అన్నారు.

అసలు ఆ పెద్ద విగ్రహమే మిగిలిన విగ్రహాలను విరగ్గొట్టి ఉంటుంది అని కూడా చెప్పారు. ఈ మాటలు విన్న వాళ్ళు కోపంతో, విగ్రహాలు మాట్లాడవని నీకు తెలియదా అన్నారు. ఈ జవాబు కోసమే ఎదురు చూస్తున్న ఇబ్రాహీమ్ (అస) ప్రాణం లేని వాటిని పూజించడం ఎంత నిష్ప్రయోజనకరమో వారికి వివరించారు. (దివ్యఖురాన్ 21 : 52-68; 26:69-102; 29 : 16,17 & 34)

అప్పుడు వారు ఇబ్రాహీమ్ (అస)ను తాళ్ళతో కట్టేసారు. ఆయన్ను అగ్ని గుండంలోకి విసిరివేసారు. నల్లని దట్టమైన పొగ ఆ ప్రాంతాన్ని ఆవరించుకుంది.

ఆ అగ్నిగుండం చల్లారిన తర్వాత, పొగ తగ్గిన తర్వాత వాళ్ళు అందులో చూసి దిగ్భ్రాంతి చెందారు. అందులో నుంచి ఒక వ్యక్తి ఒంటరిగా బయటకు వస్తున్నాడు. తన స్నేహితునిగా అభివర్ణించిన ఇబ్రాహీమ్ (అస)ను విశ్వప్రభువైన అల్లాహ్ కాపాడాడు. భగభగలాడే అగ్నికీలలు ఇబ్రాహీమ్ (అస)కు పూలమాలల్లా స్వాగతమిచ్చాయి. ఆయనకు కట్టి ఉన్న తాళ్ళను మాత్రమే అవి దహించాయి. ఈ మహత్యాన్ని చూసి నిరంకుశ పాలకుడు సిగ్గుపడ్డాడు. కాని వారి మనస్సులో ఉన్న ఆగ్రహజ్వాలను ఇది చల్లార్చలేకపోయింది. అయితే ఈ మహత్యాన్ని చూసిన తర్వాత చాలా మంది ఇబ్రాహీమ్ (అస) సందేశాన్ని విశ్వసించారు. అయితే తన్ను తాను దేవుడిగా ప్రకటించుకున్న నమ్రూద్ తన దైవత్వానికి ప్రమాదం వచ్చిందని భయపడ్డాడు. అదీ ఒక సాధారణ మానవుడైన, ఇబ్రాహీమ్ (అస) వల్ల ఆ ప్రమాదం ముంచుకు వస్తోందని ఆందోళన చెందాడు. ఇబ్రాహీమ్ (అస)ను తన రాజభవనానికి పిలిచి తీవ్రంగా హెచ్చరించాడు. "నువ్వు నా ప్రజల్లో అలజడి సృష్టిస్తున్నావు. నన్ను మించిన దేవుడు ఎవడూ లేడు" అన్నాడు. ఇబ్రాహీమ్ (అస) జవాబిస్తూ, "జీవన్మరణాలు ప్రసాదించేవాడే నా ప్రభువు. ఆయనే ఈ సమస్త విశ్వానికి సృష్టికర్త" అన్నారు. ఈ మాటలు విన్న నమ్రూద్ తన గొప్పదనాన్ని చూపించడానికి, "నేను కూడా జీవితాన్ని ప్రసాదిస్తాను. నేను తలచిన వారిని ప్రాణాలతో వదిలేస్తాను. నేను తలచిన వారిని చంపించగలను. కాబట్టి నీ ప్రభువు చేసే పని ప్రత్యేకమైనదేం కాదు" అన్నాడు.

ఇబ్రాహీమ్ (అస) నవ్వుతూ తలాడించారు. "నా ప్రభువు సూర్యుడిని తూర్పు నుంచి ఉదయించేలా చేస్తున్నాడు. పడమట అస్తమించేలా చేస్తున్నాడు.

నువ్వు దేవుడివైతే ఈ క్రమాన్ని మార్చి చూపించు" అన్నారు. ఈ మాటలు విన్న నమ్రూద్ నోరెళ్ళబెట్టాడు. అతడి మూర్ఖపు వాదన తేటతెల్లమైపోయింది. అందరి ముందు సిగ్గుపడే పరిస్థితి ఏర్పడింది. కాని ఇబ్రాహీమ్ (అస)ను బహిరంగంగా చంపించడానికి భయపడ్డాడు. చాలా మంది దీని వల్ల తనకు వ్యతిరేకులై పోతారనీ, తనకు శత్రువులైపోతారనీ భయపడ్డాడు. అందువల్ల ప్రజల్లోకి తన మనుష్యులను పంపించి ఇబ్రాహీమ్ (అస)ను అనుసరిస్తే వారికి తీవ్రపరిణామాలు తప్పవనీ, మరణశిక్ష విధించడం కూడా జరుగుతుందని బెదిరింపులను జారీ చేయించాడు.

## ఖగోళాలను ఆరాధించే ప్రజలు

ఇబ్రాహీమ్ (అస) అక్కడి నుంచి హర్రాన్ అనే ప్రదేశానికి వచ్చారు. ఈ ప్రదేశం పలస్తీనాకు దగ్గరగా ఉంది. అక్కడే ఆయన స్థిరపడ్డారు. అక్కడి ప్రజలు తెలివిగల వారని విన్నారు. ప్రకృతిలోని వింతలను పరిశీలించడం వారికి చాలా యిష్టమని కూడా గ్రహించారు. తన సందేశాన్ని స్వీకరించేవారు ఇక్కడ లభిస్తారని ఆశించారు. అయితే అక్కడి ప్రజలు ఖగోళాలను పూజించడం కనబడింది. కాని ఆ ప్రజలు ఆలోచించే, పరిశీలించే అలవాటు కలిగిన ప్రజలు కాబట్టి హేతుబద్ధ మైన వాదనతో వారిని మార్చవచ్చని ఆయన భావించారు. ఒక రాత్రి నక్షత్రాలు మిలమిల లాడుతున్నప్పుడు ఆయన వాటిని చూపించి, "అదే నా ప్రభువు" అని బిగ్గరగా పలికారు. కాని ఆ నక్షత్రాలు కనుమరుగైపోయిన తర్వాత, "అరె నా ప్రభువు ఎక్కడికి వెళ్ళాడు?" అని బిగ్గరగా పలికారు. ఇది విన్న ప్రజలు నక్షత్రాలు అస్తమించాయని అన్నారు. ఆ మాటలు విన్న ఇబ్రాహీమ్ (అస), "ఇలా కనుమరు గయ్యే వాడు నా దేవుడు కాదు" అన్నారు. చంద్రుడు పెద్దగా, ప్రకాశవంతంగా కనబడడాన్ని చూసి ఆయన, "ఇదే నా ప్రభువు కావచ్చు" అని బిగ్గరగా పలికారు. కాని చంద్రుడు కూడా అస్తమించాడు. ఇది చూసిన ఇబ్రాహీమ్ (అస), "నా ప్రభువు నాకు మార్గదర్శకత్వాన్ని ఇచ్చి ఉండనట్లయితే నేను కూడా దారితప్పే వాడిని" అన్నారు. ఉదయం సూర్యుడు ఉదయించాడు. సూర్యుడిని చూస్తూ ఇబ్రాహీమ్ (అస), "ఇది తప్పక నా ప్రభువు అయి ఉండాలి. ఇది చాలా పెద్దగా ఉంది. చాలా తీక్షణమైన ప్రకాశం కలిగి ఉంది. కాబట్టి మరింత ప్రయోజనకరమైనది" అన్నారు. కాని సూర్యుడు కూడా అస్తమించడాన్ని

చూసి "నిస్సం దేహంగా ఈ ఖగోళాలు అన్నీ కూడా ఒక విశ్వప్రభువు ఆదేశాల ప్రకారం నడుచుకుంటున్నాయి" అని బిగ్గరగా పలికారు. ఈ విధమైన హేతు బద్ధమైన మాటలు ప్రజల మనోమస్తిష్కాలపై పనిచేస్తాయనీ, వారు సత్యాన్ని గ్రహిస్తారనీ ఆయన ఆశించారు. కాని ఆయన ఎంత ప్రయత్నించినా వాళ్ళు ఒకే దేవుడన్న విశ్వాసానికి రాలేదు. వారు అల్లాహ్ శిక్షకు భయపడలేదు. వారి వైఖరి వారిని నరకానికి తీసుకు పోతుందని ఇబ్రాహీమ్ (అస) వారిని హెచ్చ రించారు. *(దివ్యఖుర్ఆన్: 6:74-83)*

## ఈజిప్టు యాత్ర

పలస్తీనాలో కరవు ఏర్పడింది. ఫలితంగా జీవితం దుర్భరమైంది. ఇబ్రాహీమ్ (అస) తన భార్య సారాను తీసుకుని ఈజిప్టుకు వలస వెళ్ళారు. సారా చాలా అందమైన స్త్రీ. ఆమె అద్భుత సౌందర్యరాశి అన్న విషయాన్ని రాజోద్యోగులు రాజుకు తెలియజేశారు. అలాంటి సౌందర్యరాశి తన భవనంలో ఉంటే తన ప్రతిష్ఠ చాలా పెరుగుతుందని భావించిన రాజు ఇబ్రాహీమ్ (అస)ను పిలిపించి ఆయనకు సారాతో ఉన్న బాంధవ్యం ఏమిటని ప్రశ్నించాడు. ఆమెకు తానే భర్తనని చెబితే రాజు తనను హతమార్చే ప్రమాదాన్ని పసిగట్టిన ఇబ్రాహీమ్ (అస) ఆమె తన సోదరి అని చెప్పారు. రాజు ఇబ్రాహీమ్ (అస)తో ఆమెకు పెళ్ళయ్యిందా అని ప్రశ్నించినపుడు ఆయన మౌనం వహించారు. రాజోద్యోగులు సారాను రాజప్రాసాదానికి తీసుకువెళ్ళారు.

రాజు ఆమె సమీపానికి వచ్చినప్పుడల్లా ఒక విచిత్రమైన అనుభూతి అతన్ని క్రమ్ముకునేది. ఒక విధమైన భయం ఆవరించేది. ఆమెను కనీసం తాకలేకపోయే వాడు. చివరికి రాజుకు కలలో ఆమె వివాహిత అని తెలిసింది. మరుసటి రోజు ఉత్తముడైన ఆ రాజు సారాను స్వేచ్ఛగా విడిచి పెట్టడమే కాదు, తన వద్ద ఉన్న సేవకురాలు హాజిరాను ఆమెకు కానుకగా ఇచ్చాడు. ఒక కొత్త దేశంలో ఒంటరివాడైన ఇబ్రాహీమ్(అస)గారి గౌరవమర్యాదలను ఆ విధంగా కాపాడాడు అల్లాహ్.

## పలస్తీనాకు తిరిగి రావడం

ఇబ్రాహీమ్ (అస) ఈజిప్టులో చాలా కాలం ఉన్నారు. అక్కడ ఆయన చాలా కష్టపడి పనిచేయడం వల్ల సంపన్నుడయ్యారు. అయితే జీవితంలో విజ

యాలు సాధించిన వ్యక్తికి ఇతరుల ఈర్ష్యాసూయలను కూడా ఎదుర్కోవలసి వస్తుంది. తన పట్ల ప్రజల్లో ఒక విధమైన అసూయ ఉందని గుర్తించిన ఇబ్రాహీమ్ (అస) తన భార్య సారాను, సేవకురాలు హాజిరాను తీసుకుని అక్కడి నుంచి పలస్తీనాకు తరలి వచ్చారు.

## ప్రవక్త ఇస్మాయిల్ (అస)

పలస్తీనాలో ఇబ్రాహీమ్ (అస) సందేశాన్ని కొందరు విశ్వసించారు. సత్య సందేశాన్ని స్వీకరించారు.

సారాకు సంతానం కలుగలేదు. ఆమెకు వయసుపైబడింది. పిల్లలు కలిగే వయసు దాటిపోయింది. తన భర్తకు ఒక పిల్లవాడిని ఇవ్వలేకపోయానని ఆమె బాధపడేవారు. అందువల్ల తమ సేవకురాలు హాజిరాను పెళ్ళి చేసుకోవలసిందిగా ఆమె భర్తను కోరారు. ఇబ్రాహీమ్ (అస) ఈ సలహా మన్నించారు. హాజిరాను వివాహం చేసుకున్నారు. హాజిరాకు ఒక కుమారుడు, ఇస్మాయిల్ (అస) జన్మిం చారు. ఇబ్రాహీమ్ (అస) చాలా సంతోషించారు. ఇస్మాయిల్ (అస)ను అమి తంగా ప్రేమించారు.

## సహజమైన ఈర్ష్యాసూయలు

మొదట్లో సారా కూడా ఇబ్రాహీమ్ (అస) సంతోషంలో పాలుపంచు కున్నారు. కాని తర్వాత తన భర్త కొత్తగా జన్మించిన శిశువు పట్ల, శిశువు తల్లి అయిన హాజిరా పట్ల అధిక శ్రద్ధ చూపడం ఆమెలో ఈర్ష్యాసూయలకు కారణ మయ్యింది. ఆమెలో అసూయ బుసలుకొట్టింది. వాళ్ళిద్దరిని ఎక్కడైనా దూరంగా విడిచి రావలసినదిగా ఆమె భర్తను కోరారు. సారా కోరినట్లు చేయవలసిందిగా అల్లాహ్ ఇబ్రాహీమ్(అస)కు సూచించాడు. ఆయన ఎక్కడికి వెళ్ళవలసింది దేవుడు స్వయంగా మార్గం చూపిస్తానన్నాడు. అనేక రోజులు ప్రయాణించిన తర్వాత, భయంకరమైన ఎడారిని దాటిన తర్వాత, ఒక నిర్మానుష్యమైన ప్రదేశం వద్ద వారు విడిది చేశారు. అక్కడ చెట్టుచేమ మచ్చుకు కూడా లేవు. నీటి బొట్టు కూడా దొరకని నిర్జనమైన ప్రదేశం అది. ఆ ప్రదేశంలోనే ఇబ్రాహీమ్(అస) తన భార్య, కుమారుని వదలి వెళ్ళాలని దేవుడు ఆజ్ఞాపించాడు. ఇబ్రాహీమ్(అస) తన భార్యకు కొన్ని ఎండు ఫలాలు, కొంత నీరు, ఒక గుడారం, మరికొన్ని

వస్తువులు ఇచ్చి బరువైన మనసుతో విచారంగా అక్కడి నుంచి వెనుదిరగడానికి తన ఒంటెను అధిరోహించారు. హాజిరా ఆ ఒంటెను పట్టుకుని, "ఇబ్రాహీమ్! మమ్మల్ని ఈ నిర్జన ప్రదేశంలో ఎందుకు వదిలేస్తున్నారు? మీకు నా పట్ల ఎలాంటి అభిమానం లేకపోయినా కనీసం మీ కన్నబిడ్డ గురించి ఆలోచించండి. మీ కుమారుడు ఇక్కడ ఆకలి దప్పులతో ప్రాణం వదిలేయవచ్చు. ఇక్కడ క్రూర మృగాలు మాపై దాడి చేయవచ్చు" అని వేడుకున్నారు. ఇబ్రాహీమ్ (అస) ఎడారిని చూస్తూ, సహనం వహించాలని ఆమెతో చెప్పారు. తాను తన ఇష్టప్రకారం వ్యవహరించడం లేదనీ, కేవలం అల్లాహ్ ఆదేశాలను అమలు చేస్తున్నాననీ జవాబిచ్చారు. ఆయన జవాబు ఆమెకు ఊరట కలిగించింది. కన్నీళ్ళు తుడుచు కుంటూ, "ఇది అల్లాహ్ అభీష్టమైతే ఆయన మమ్మల్ని ఒంటరిగా వదలిపెట్టడు" అన్నారు.

## ఇబ్రాహీమ్ (అస) దుఃఖం

తన కుటుంబాన్ని వదలి ఒక్కో అడుగు దూరంగా వెళుతున్న కొద్దీ ఇబ్రాహీమ్ (అస)కు దుఃఖం అధికమవసాగింది. ముసలి వయసులో తనకు అల్లాహ్ ప్రసాదించిన ఏకైక కుమారుడిని అక్కడ వదిలి వెళుతున్న ఆలోచన కూడా భరించరానిదిగా ఉందాయనకు. అయితే విశ్వప్రభువు పట్ల దృఢమైన తన నిబద్ధతను నిరూపించుకునే పరీక్షల్లో ఇదొకటని ఆయన గుర్తించారు. ఆయన అల్లాహ్‌ను ప్రార్థిస్తూ, "ఓ ప్రభూ! నీ పవిత్రమైన గృహానికి దగ్గరగా నిర్జన ప్రదేశంలో నేను నా కుటుంబీకులను వదలివచ్చాను. వారు అక్కడ దైవారాధనను స్థాపించాలని భావిస్తున్నాను. వారి పట్ల సానుభూతి, ఆదరాభిమానాలను ప్రజల్లో కలిగించు. వారికి కావలసిన సదుపాయాలు ప్రసాదించు" అని వేడుకున్నారు.

దేవునిపై భారం వేసిన హాజిరాకు విశ్వప్రభువు సహనాన్ని, ధైర్యాన్ని ప్రసాదించాడు. కొన్ని రోజులు గడచిన తర్వాత, వారి వద్ద ఉన్న ఆహారం, నీరు అయిపోయాయి. పసిబిడ్డతో సహా ఆమె ఆకలిదప్పులతో అలమటించసాగారు. బిడ్డకు పాలుపట్టడానికి ఆమె రొమ్ముల్లో పాలు కూడా రావడం లేదు. పసిబిడ్డ ఆకలితో దయనీయంగా ఏడుస్తున్నాడు. హాజిరా కన్నీరు మున్నీరయ్యింది. బిడ్డను

అక్కడే నేలమీద వదలి నీటి కోసం, ఆహారం కోసం వెదుకాడుతూ తిరగసాగారు. ఒక కొండను ఎక్కారు (ఈ కొండనే తర్వాత సఫా కొండగా పిలుస్తున్నారు). ఆ కొండ పై నుంచి ఆ లోయ మొత్తాన్ని పరిశీలించి చూశారు. మరో వైపున ఇంకో కొండ కనబడింది (దీనిని తర్వాత మర్వా కొండ అని పిలుస్తున్నారు). ఆ కొండపై నుంచి చూస్తూ నీటి జాడ కనబడుతుందన్న ఆశతో ఆ కొండపై కెక్కారు. కాని ఏమీ కనబడలేదు. ఆమె ఆందోళనతో మళ్ళీ మొదటి కొండపై కెక్కారు. ఆ విధంగా ఆమె నీటి కోసం వెదుకాడుతూ ఆ రెండు కొండల మధ్య ఏడుసార్లు పరుగులు తీశారు. (హజ్ యాత్ర సందర్భంగా సఫా మర్వా కొండల మధ్య ఏడుసార్లు పరుగెత్తుతూ చేసే 'సయీ' ఈ సంఘటన జ్ఞాపకార్థమే జరుగుతోంది.)

## జమ్‌జమ్

ఆమె నిరాశగా పసిబిడ్డ వద్దకు వచ్చారు. బిడ్డ పరిస్థితి దయనీయంగా ఉంది. "ఓ ప్రభూ! కరుణించు" అంటూ మొరపెట్టుకున్నారు. బిడ్డ పరిస్థితి క్షణ క్షణానికి దిగజారుతోంది. ఊపిరి మందగిస్తోంది. శ్వాస కష్టమవుతోంది.

బాధాతప్త హృదయంతో, తన ఏకైక సంతానం కొనప్రాణంతో పెనుగులాడడాన్ని ఆమె నిస్సహాయంగా చూడసాగారు. ఎండిపోయిన బిడ్డ గొంతు నుంచి ఎలాంటి ధ్వని రావడంలేదు. కేవలం కాళ్ళు కొట్టుకుంటున్న శబ్దం మాత్రం వినిపిస్తోంది. పసిబిడ్డ ఇస్మాయీల్ తన చిన్నారి కాళ్ళతో నేలను కొడుతున్న ప్రదేశంలో స్వచ్ఛమైన నీటి ఊట అకస్మాత్తుగా ఉబికి వచ్చింది. ఆమె తన కళ్ళను తాను నమ్మలేకపోయారు.

అల్లాహ్ పట్ల ఆమె చూపిన విధేయత, ఆమె ప్రదర్శించిన సహనాలకు అత్యుత్తమ బహుమానం లభించింది. ఎండిపోయిన నేల నుంచి స్వచ్ఛమైన జల ధార ఉబికి వచ్చేలా చేశాడాయన. తనకు నమ్మకస్తుడైన స్నేహితుడు ఇబ్రాహీమ్ (అస) కుటుంబం కష్టాల నుంచి బయటపడే దారి చూపించాడు. హాజిరా ఆ స్వచ్ఛమైన నీటిని బిడ్డ నోటిలో పోసారు. ఆ నీటితో బిడ్డ ప్రాణాలు కుదుటపడడాన్ని ఆమె ఆనందంగా వీక్షించారు. కన్నీళ్ళతో ఆమె అల్లాహ్‌కు కృతజ్ఞతలు అర్పించారు. ఆ అద్భుతమైన జలధారలే "జమ్‌జమ్" జలంగా ప్రసిద్ధి కెక్కాయి. 4000 సంవత్సరాల క్రితం నాటి ఈ జలధార నేటికి కూడా

నిరంతరం ప్రవహిస్తూనే ఉంది. లక్షలాది హజ్ యాత్రికులకు అత్యంత ఆరోగ్యప్రదమైన నీటిని అందిస్తోంది. ఒకప్పుడు నిర్జనమైన ఆ ప్రదేశంలో జీవం తొణికిసలాడేలా చేసింది ఈ జమ్‌జమ్ జలమే.

## మరిన్ని గుర్తులు

దూరదూర ప్రాంతాలకు చెందిన పక్షులు ఆ నీటిని చూసి దాహం తీర్చు కోవడానికి అక్కడ వాలడం ప్రారంభించాయి. యెమన్ నుంచి వస్తున్న ఒక అరబ్బు తెగ "జుర్‌హుమ్" దూరం నుంచి పక్షులు గుంపులుగా ఆ ప్రదేశం వైపునకు వెళ్ళడాన్ని గమనించారు. విచారించడానికి కొందరిని అక్కడికి పంపించారు. అక్కడికి వెళ్ళి వచ్చిన వారు అక్కడ నీటి వనరు ఉందని తెలిపారు. ఆ అరబ్బు తెగ ఆ ప్రదేశానికి వచ్చింది. ఆ నిర్జనప్రదేశంలో మనుష్యుల్ని చూసి హాజిరా చాలా సంతోషించారు. తనకు, తన కుమారునికి అల్లాహ్ పరిరక్షణ లభించిందనడానికి సూచనగా వారి ఆగమనాన్ని ఆమె భావించారు. ఆ ప్రజల హృదయాల్లో వారి పట్ల సానుభూతిని అల్లాహ్ జనింపజేశాడు. ఆ ప్రదేశం వైపు నకు వారు వచ్చేలా చేశాడు. ఆ విధంగా ఇబ్రాహీమ్ చేసిన ప్రార్థనను దేవుడు ఆమోదించాడు.

ఆ ప్రదేశంలో జమ్‌జమ్ నీటి ఊట బయటపడినందు వల్ల యెమన్ నుంచి అక్కడకు వచ్చిన జుర్‌హుమ్ తెగ అక్కడ విడిది చేయడానికి, ఆ నీటిని వాడు కోవడానికి హాజిరా అనుమతి కోరారు. హాజిరా సంతోషంగా వారిని స్వాగతించారు. వారిని అతిథులుగా గౌరవించారు. వారిలో కొందరు తమ కుటుం బాలను అక్కడకు పిలిపించుకున్నారు. చాలా మంది ఆ ప్రదేశం(మక్కా)నే తమ శాశ్వత నివాసంగా మార్చుకున్నారు.

## ఇబ్రాహీమ్ (అస) కోరిక

నిర్మానుష్య ప్రదేశంలో తాను వదలి వచ్చిన తన భార్యాబిడ్డల గురించి ఇబ్రాహీమ్ (అస) ఎప్పుడూ చింతిస్తూ ఉండేవారు. అప్పుడప్పుడు ఆయన అక్కడికి వెళ్ళి వారిని చూసి వచ్చేవారు. తాను కోరిన విధంగా తన కుమారుడు పెద్ద వాడవ్వడాన్ని చూసి సంతృప్తి చెందేవారు. తన కుటుంబాన్ని ఆదుకున్న విశ్వ ప్రభువుకు కృతజ్ఞతలు అర్పించేవారు. తన కుటుంబానికి

నిలువనీడ కల్పించి, వారికి కావలసిన అన్నపానీయాలు ఏర్పాటు చేసిన అల్లాహ్‌కు ధన్య వాదాలు తెలుపుకునేవారు.

## నిరుపమానమైన త్యాగం

ఇబ్రాహీమ్ (అస) జీవితం యావత్తు విశ్వప్రభువు పట్ల ఆయన నిబద్ధతను, చెక్కుచెదరని విశ్వాసాన్ని ప్రకటించే పరీక్షల సంగమం. దేవుని పట్ల నమ్మకం కలిగి ఉన్న వారు ఎన్నడూ నిరాశ చెందరు. అల్లాహ్ ఆదేశాలను ఎన్నడూ ప్రశ్నించరు. అల్లాహ్ ఎల్లప్పుడూ చెడుపై మంచికి విజయాన్ని ప్రసాదిస్తాడని ప్రగాఢంగా విశ్వసిస్తారు. ఇస్మాయీల్ (అస) చిన్నపిల్లవానిగా ఉన్నప్పుడు అల్లాహ్ మరోసారి ఇబ్రాహీమ్ (అస)ను కఠినమైన పరీక్షకు గురిచేశాడు. ఒక కల ద్వారా ఇబ్రాహీమ్ (అస) తన ఏకైక కుమారుణ్ణి అల్లాహ్‌కు బలిపెట్టాలని ఆదేశించడం జరిగింది.[s]

ఇబ్రాహీమ్ (అస) దృఢమైన విశ్వాసం కలిగినవారు. అల్లాహ్ పంపిన ప్రవక్త. అల్లాహ్ సందేశహరుడు. ఆయన తన ఏకైక పుత్రుడిని బలిపెట్టాలని అల్లాహ్ కోరితే ఇబ్రాహీమ్ (అస) దైవాదేశాన్ని ఎలా కాదనగలరు? అయితే ఎవరికైనా ఇలా చేయడం ఊహించరాని త్యాగమే అవుతుంది. ఆ కుమారుడు ఆయనకు లేకలేక ముసలి వయసులో జన్మించిన కుమారుడు. ఆయనకు వయసు ఉడిగిన సమయంలో అతడే ఆధారం. ఆయన కున్న ఏకైక ఆనందం ఆ కుమారుడే. కేవలం ఇబ్రాహీమ్ (అస) వంటి గొప్ప ప్రవక్త మాత్రమే ఇలాంటి బాధాకరమైన ఆదేశాన్ని అమలు చేయగలరు. తన సృష్టికర్త పట్ల, తన ప్రభువు పట్ల తన నిశ్చలమైన ప్రేమను ఈ విధంగా ప్రదర్శించడం ఆయనకు మాత్రమే సాధ్యం.

ఆత్మవిశ్వాసంతో ఇబ్రాహీమ్(అస) మక్కాకు బయలుదేరారు. ఈ వార్తను తన కుమారునికి చెప్పడం ఆయనకు ఒక పరీక్ష వంటిదే. అయితే ఇస్మాయీల్ (అస) కూడా తండ్రికి తగిన కుమారులు. ఆయన అనితర సాధ్యమైన ధైర్య సాహసాలు ప్రదర్శించారు. దేవుని ఆదేశాన్ని అమలు చేయాలని ఆయన నిబ్బరంగా తన తండ్రికి చెప్పారు. "నాన్నా! మీకు ఆజ్ఞాపించబడినట్లు చేయండి. అల్లాహ్ కోరిన విధంగా నేను చేయడానికి సిద్ధంగా ఉన్నాను" అని బదులిచ్చారు. ఆయన తన దుస్తులు తొలగించారు. తల్లికి సలాములు చెప్పాలని తండ్రిని

కోరారు. తన గుర్తులుగా తన దుస్తులు తల్లికి ఇవ్వాలని చెప్పారు. తాను కాళ్ళుచేతులు కొట్టుకోవడం జరిగితే తన తండ్రికి బాధ కలుగుతుందన్న ఉద్దేశ్యంతో తన కాళ్ళను చేతులను కట్టేయాలని తండ్రిని కోరారు.

ఇబ్రాహీమ్ (అస) తన కత్తికి పదును పెట్టారు. ఆ విధంగా ఇస్మాయీల్‌కు మృత్యువు బాధ లేకుండా ఉండాలని భావించారు. కుమారుడిని గట్టిగా కౌగిలించుకుని రోదించారు. తర్వాత ఇస్మాయీల్ (అస)ను పడుకోబెట్టి కాళ్ళుచేతులు కట్టేశారు. బాధాతప్త హృదయంతో కుమారుణ్ణి చివరిసారిగా చూసుకున్నారు. బరువెక్కిన హృదయంతో కత్తిని ఎత్తారు. ఇస్మాయీల్ (అస) గొంతుపై వేటు వేశారు. కాని ఆ కత్తి గొంతును కోయలేదు. తన తండ్రి తగినంత గట్టిగా కత్తిని ఉపయోగించడానికి వెనుకాడుతున్నారని భావించిన ఇస్మాయీల్ (అస) గట్టిగా కోయాలని తండ్రితో చెప్పారు. ఇబ్రాహీమ్ (అస) అలాగే చేశారు. అయినా ఆ కత్తి గొంతును కోయలేదు. ఇబ్రాహీమ్ (అస) ఆశ్చర్యపోయారు. తన బలహీనతను క్షమించవలసినదిగా ఆయన అల్లాహ్‌ను వేడుకున్నారు. అల్లాహ్ ఆయన వేడుకోలుకు బదులిచ్చాడు. "ఇబ్రాహీమ్! నీవు నిజంగా కలను సార్థకం చేశావు. మేము నీ విధేయతకు బహుమానం ప్రసాదిస్తున్నాము" అన్నాడు. ఆ తండ్రీ కొడుకులు దేవుని ఆదేశం శిరసావహించడానికి క్షణం వెనుకాడలేదు. అల్లాహ్‌కు కావలసింది బలి కాదు. తన ఆదేశాల పట్ల వారు చూపిన నిబద్ధతనే ఆయన పరీక్షించాడు. తండ్రీ కొడుకులు దేవుని కారుణ్యం పట్ల కృతజ్ఞతలు అర్పించారు. ఇస్మాయీల్(అస)కు బదులుగా బలి ఇవ్వడానికి ఆ దగ్గర్లోనే ఒక పెద్ద గొర్రె కనబడింది. అంతకు ముందు కోయడానికి మొండికేసిన కత్తి ఆ గొర్రె గొంతును ఒక్క వేటుకు కోసింది. ఈ సంఘటనను స్మరిస్తూ ప్రతి సంవత్సరం ఈదుల్ అజ్‌హా (బక్రీదు పండుగ) సందర్భంగా ఖుర్బానీ ఇవ్వడం జరుగుతుంది.

## కాబా కట్టడం

కాబా నిర్మాణం గురించి పూర్తి వివరాలకోసం హజ్ (10వ) అధ్యాయాన్ని చూడగలరు.

## 19వ అధ్యాయము

# అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స.అ.స)

ప్రవక్త ముహమ్మద్ (స.అ.స) రబీవుల్ అవ్వల్ 12వ తేదీ సోమవారం నాడు సూర్యోదయమునకు ముందే క్రీ.శ.20-4-570న, అరేబియా దేశంలో మక్కా నగరంలో పేరు ప్రతిష్టలు పొందిన కుటుంబంలో జన్మించినారు. ఈ కుటుంబం మక్కాలో ఉన్న పవిత్ర కాబాకు తరతరాలుగా సంరక్షకులు, పోషకులు. ఈ కుటుంబమునకు 'ఖురైష్' అని పేరు. ఈ కుటుంబమును యావత్ అరేబియా వాసులు అత్యంత గౌరవము, మర్యాదలతో సత్కరింతురు. వీరి తాతగారు వీరికి ముహమ్మద్ అని, తల్లిగారేమో 'అహ్మద్' అని నామకరణం చేశారు. దివ్య ఖుర్ఆన్ సూరా నె. 3, 33, 47, 48లో 4 సార్లు ముహమ్మద్ (సఅస) అని, అస్సఫ్ (61:6) సూరా 6వ ఆయత్‌లో ఒకసారి అహ్మద్ అని వచ్చినది. అప్పట్లో ఈ పేరు అరేబియాలో చెలామణిలో ఉన్న పేరు కాదు. ఆయన (సఅస)కు ఏడవ రోజు ఖత్నా (సున్తీ) చేయించారు.

వీరి తాతగారైన హజరత్ అబ్దుల్ ముత్తలిబ్‌కు 10/12 మంది సంతానం. వారిలో ఐదుగురు ప్రముఖులు. 1. హజ్రత్ అబ్దుల్లాహ్ ఈయన మన ప్రవక్త తండ్రి, 2. అబూ తాలిబ్ ఈయన మన ప్రవక్తను పోషించి పెద్ద చేసిన వారు. ఇస్లాంను స్వీకరించకపోయినా వారి జీవితాంతం మహా ప్రవక్తకు తోడు నీడగా, ఆసరాగా నిలబడ్డారు. 3. హజ్రత్ హమ్జ, 4. హజరత్ అబ్బాస్ వీరు ఇరువురు ఇస్లాం స్వీకరించి, మతాన్ని వ్యాపింపజేయుటలో ప్రముఖ పాత్ర వహించారు. ఇకపోతే 5. అబూ లహబ్ ఇతను ఇస్లాం పట్ల మరియు ప్రవక్త పట్ల పరమ శత్రువు, నరకవాసి. (ది.ఖు. సూ. నె.111)

ఖురైష్ వంశానికి చెందిన 'జహరా' తెగవాడైన వహబ్ మిన్ అబ్దె మునాఫ్ కుమార్తె 'ఆమీనా'తో హజ్రత్ అబ్దుల్లాహ్ వివాహం. వివాహానంతరం అబ్దుల్లాహ్ కొన్ని రోజులు మాత్రమే భార్యతో గడిపి వర్తకంపై సిరియా వెళ్ళి తిరుగు ప్రయాణంలో మదీనా వద్ద వ్యాధిగ్రస్థులై మరణించారు. యస్రిబ్ అనే చోట ఖననం చేశారు. అప్పుడు ఆమీనా గర్భవతి.

ముహమ్మద్ (సఅస) జననమునకు ముందు వీరి ప్రియ తండ్రి అబ్దుల్లా పరమపదించినందు వల్ల, వీరి తల్లి 'ఆమినా' వీరిని 6 సంవత్సరములు 3

నెలల వరకు ఈ  విధంగా పోషించిరి.

తండ్రిలేని ఆ పసికందుకు మొదట తల్లిగారైన ఆమినా పాలు త్రాగించారు. తరువాత అబూలహబ్ ఇంట్లో పనికత్తె అయిన సౌబియా పాలు త్రాగించే భాగ్యానికి నోచుకుంది. అరేబియాలో పట్టణవాసులు సాధారణంగా తమ పిల్లల్ని పాలు త్రాగించి పోషించడానికి దాదీలకు అప్పగించి, పల్లెవాసాలకు పంపేవారు. పల్లెల్లో సువిశాలమైన స్వేచ్ఛా వాతావరణంలో పిల్లలు ఆరోగ్య వంతంగా పెరుగుతారని అలా చెయ్యటం అక్కడి రివాజు. కొన్ని దినాల తరువాత 'హవాజున్' తెగ స్త్రీలు కొందరు పిల్లల పోషణార్థం దాదీలుగా మక్కా నగరానికి వచ్చారు. వారిలో 'హలీమా సాదియా' అనే మహిళ కూడా ఉంది. ఈమె దీనస్థితి చూసి ఎవ్వరూ తమ బిడ్డల్ని అప్పగించలేదు. అలాగే, ఆమినా తనయుడు ముహమ్మద్, అనాథ బాలుడు కాబట్టి అతణ్ణి స్వీకరించడానికి కూడా ఎవ్వరూ ముందుకు రాలేదు. ఈ విధంగా ఆ అనాథ బాలుడే హలిమాకు మిగిలాడు. దైన్యస్థితిలో ఉన్న హలీమా కుటుంబమే ఆమినా సుతుడిని స్వీకరించింది.

పాలుపట్టే కాలంలో హ్రజత్ హలీమా, దైవప్రవక్త (స) గారి వలన కలిగిన శుభాలను చూసి సంభ్రమాశ్చర్యాలకు గురైనారు. హ్రజత్ హలీమా ఇలా చెప్పారని ఇబ్నె ఇస్హాక్ ఉల్లేఖించారు. "నేను నా భర్త వెంట పాలు త్రాగే కుమారుణ్ణి ఎత్తుకొని బనూ సఅద్‌కు చెందిన కొందరు స్త్రీలతో ఊరిని వదలి పాలుత్రాగే పిల్లలను వెదుకుతూ బయలుదేరాము. అది కరువుకాలం. కరువు వల్ల ఎవరి వద్ద ఏమీ మిగల్లేదు. నేను నా తెల్ల కంచర గాడిదను ఎక్కి ఉన్నాను. వెంట ఓ ఆడ ఒంటె కూడా ఉంది. కాని అది ఓ చుక్క పాలు ఇస్తే ఒట్టు. ఇటు ఆకలికి నా పిల్లవాడు ఏడవడం వల్ల రాత్రి వేళల్లో మాకు నిదుర కూడా కరువైంది. నా వక్షస్థలంలోనూ పాల చుక్కలేదు. ఒంటె పాలిచ్చేదికాదు. మేము వర్షం కోసం ఎదురు చూస్తున్న రోజులవి. నేను నా కంచర గాడిదను ఎక్కి బయలుదేరగా అది బలహీనంగా, బక్కచిక్కి ఉండడం వలన అడుగులో అడుగు వేసుకుంటూ నీరసంగా నడవడం వలన మా బిడారం వాళ్ళందరికి చిరాకు కలుగుతోంది. ఎట్టకేలకు మేము పాలుత్రాగే పిల్లలను వెదుకుతూ మక్కా చేరాం. మాలో ప్రతి ఒక్కరికి దైవప్రవక్త (స)ను చూపడం కూడా జరిగింది. అయితే ఆయన ఓ అనాథ బాలుడని తెలియగానే మేము ఆ పిల్లవానికి తండ్రిలేనందున తగిన ప్రతిఫలం లభించదనే ఉద్దేశ్యంతో నిరాకరించి వెళ్ళిపోయాము. ఈ పిల్లవాడు అనాథ. వితంతువు అయిన ఈ బాలుని తల్లిగాని, తాతగాని మనకేమిస్తాడు

అని అనుకున్నాం. ఈ కారణం వల్లనే మాలో ఎవరూ ఈ బాలుణ్ణి తీసుకోవడానికి ముందుకు రాలేదు.

హలిమా వెంట వచ్చిన స్త్రీలందరికీ ఎవరో ఒక పిల్లవాడు లభించాడు. కేవలం ఆమెకే లభించలేదు. తిరుగు ప్రయాణం చేసే సమయం రాగానే ఆమె తన భర్తతో, "దైవసాక్షి! ఇదేం బాగాలేదు, నా స్నేహితురాళ్ళందరూ పిల్లలను ఎత్తుకుంటే పిల్లవాడు లేకుండా నేనెలా తిరిగి వెళ్ళేది? వెళ్ళి, ఆ పిల్లవాణ్ణే తీసుకువస్తానని  చెప్పాను. ఫర్వాలేదు! బహుశా అల్లాహ్ ఇందులోనే మనకు శుభం కలిగించవచ్చని ధైర్యం చెప్పాడాయన. నేను వెళ్ళి ఆ అనాథ బాలుణ్ణే ఎత్తుకున్నాను.  కేవలం మరే బాలుడు లభించకపోవడమే దానికి కారణం."

హజ్రత్ హలీమా (ర) ఇంకా ఇలా అన్నారు: "పిల్లవాణ్ణి తీసుకొని, తిరిగి నా గుడారంలోనికి వచ్చి నా ఒళ్ళో పడుకోబెట్టుకోగానే నా పాల్లిండ్లు పాలతో నిండిపోయాయి.  అతను కడుపార పాలు త్రాగాడు. తరువాత మా పిల్లవాడు కూడా కడుపార పాలు త్రాగాడు. ఆ తరువాత మేము ఆదమరచి నిద్రపోయాము. అంతకు మునుపు మేము ఎప్పుడూ మా పిల్లవానితో పాటు నింద్రించేవారమే కాదు. ఇటు నా భర్త ఒంటెపాలు పితకడానికి వెళ్ళగా దాని పొదుగు పాలతో నిండుగా ఉంది. ఆయన పితికిన 'పాలను మేము కడుపునిండా త్రాగాం. ఎంతో హాయిగా ఆ రాత్రి గడిచిపోయింది. ఉదయాన్నే నా భర్త, 'హలీమా! దైవసాక్షి! నీవు ఓ శుభంగల బాలుని పొందావు' అని అన్నాడు. నేను కూడా అదే ఆలోచిస్తున్నానప్పుడు."

హలీమా (ర) ఇంకా ఇలా అంటారు. "మా బిడారం బయలుదేరింది. నేను నా బలహీనమైన కంచర గాడిదనెక్కి కూర్చున్నాను. ఆ పిల్లవాడు కూడా నా ఒడిలోనే ఉన్నాడు. అయితే దైవసాక్షిగా చెబుతున్నాను. ఆ గాడిద బిడారం మొత్తాన్ని దాటేసి ముందుకు వెళ్ళిపోయింది. మరే గాడిద కూడా దాని గమనాన్ని అందుకోలేకపోయింది. ఇది చూసిన నా స్నేహితురాళ్ళు నన్ను పిలుస్తూ, ఓ "హలిమా! ఇదేమిటే? మమ్మల్ని కూడా కాస్త చూడు. నీవు మా వెంట వచ్చేటప్పుడు ఎక్కి వచ్చిన కంచర గాడిదేగా ఇది?' అని అరిచారు. 'ఔనౌను, దైవసాక్షి! ఇది ఆ కంచర గాడిదే సుమా!  దీనికి  ఏదో ప్రత్యేకత ఏర్పడిందమ్మా' అని బదులి చ్చాన్నేను."

బనూ సఅద్ తెగ నివాస ప్రదేశంలోని మా ఇండ్లకు మేము చేరుకున్నాం. ఆ కాలంలో మా ప్రాంతం అంతటి కటిక కరువు ప్రాంతం ఈ భూమిపై మరొకటి

ఉందన్న విషయం నాకయితే తెలియదుగాని, మేము తిరిగి వచ్చిన తరువాత నా మేకలు మేత కోసం బయటకు వెళితే కడుపునిండా మేసి నిండు పొదుగులతో తిరిగి వచ్చేవి. ఆ పాలను పితికి మేము త్రాగేవాళ్ళం. ఆ కాలంలో ఏ వ్యక్తికీ ఒక్క చుక్క పాలు లభించేవి కాదు. వారి పశువుల పొదుగులు ఎండిపోయి చుక్క పాలు కూడా లేకుండా ఉండేవి. చివరికి మా జాతి ప్రజలు తమ పశువు కాపరులతో, "మూర్ఖుల్లారా! హజ్రత్ హలీమా గారి కాపరి పశువుల్ని ఎక్కడ మేపుతున్నాడో అక్కడికే మీరు కూడా తీసుకువెళ్ళి మేపండని" చెప్పి మరీ పంపేవారు. అయినా వారి మేకలు అర్ధాకలితోనే తిరిగివచ్చేవి. వాటి పొదుగుల్లో చుక్క పాలు కూడా ఉండేవి కావు. నా మేకలు మాత్రం నిండిన పొదుగులతో ఇంటికి వచ్చేవి. ఇలా మేము అల్లాహ్ తరపున క్రమం తప్పకుండా శుభాల వృద్ధే జరుగుతున్నట్లు గమనిస్తూ పోయాం. బాలునికి రెండేళ్ళ ప్రాయం వచ్చింది. పాలు పట్టడం మానేశాను. రెండేళ్ళు పూర్తి అయ్యే లోపల ఈ బాలుడు ఇతర బాలుర్ల కంటే శారీరకంగా దృఢంగా, అంగసౌష్టవంతో పెరిగిపోయాడు. ఆ తరువాత అతణ్ణి మేము అతని తల్లి వద్దకు తీసుకువెళ్ళాం. అయితే మేము అనుభవిస్తున్న శుభాలను దృష్టిలో ఉంచుకొని, అతన్ని మా వద్దనే ఉంచుకోవాలనే కోరిక మాలో పుట్టుకు వచ్చింది. అందుకని మేము ఆమినాతో మాట్లాడాం. 'అమ్మా! ఈ పిల్లవాణ్ణి ఇంకొంత ఆరోగ్యవంతుడు, మరింత శారీరక దారుఢ్యం వచ్చే వరకు మా దగ్గరనే ఎందుకుంచరూ? మక్కాలోని వ్యాధుల గురించి మాకు భయంగా ఉంది" అని వేడుకున్నాం. మా ప్రోద్బలంపై ఆమె తిరిగి పిల్లవాణ్ణి మా వెంట పంపించేశారు."హజ్రత్ దాయి హలీమా పేదరికం పోయింది. అక్కడ మరి కొన్ని సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయని చెప్పుకునేవారు.

## షక్కె సద్ర్ (వక్షస్థలం చీల్చే) సంఘటన

ఇలా దైవప్రవక్త (స) పాలు త్రాగే గడువు పూర్తి అయిన తరువాత కూడా బనూ సఅద్ తెగలోనే ఉండిపోయారు. చివరికి ఆయన జన్మించిన నాల్గవ లేదా ఐదవ ఏట షక్కె సద్ర్ (వక్షస్థలాన్ని చీల్చే) సంఘటన జరిగింది. ఈ సంఘటన వివరాలు హజ్రత్ అనస్ (ర) ఉల్లేఖించినట్లుగా సహీ ముస్లిమ్ గ్రంథంలో ఇలా ఉన్నాయి. దైవప్రవక్త (స) వద్దకు హజ్రత్ జిబ్రీల్ (అ.స.) వచ్చినప్పుడు ఆయన పిల్లలతో ఆడుకుంటున్నారు. హజ్రత్ జిబ్రీల్ (అ.స.) ఆయన్ను పట్టుకొని క్రింద పడవేశారు. వక్షస్థలాన్ని చీల్చి గుండెకాయను బయటకు తీశారు. ఆ తరువాత గుండె నుండి ఓ భాగాన్ని తీసి "ఇది నీలోని షైతాన్ స్థావరం" అని చెప్పారు. ఆ

తరువాత ఓ పళ్లెంలో ఉంచి జమ్‌జమ్ నీటితో శుభ్రపరిచారు. గుండెను సరిచేసి దాని స్థానంలో పెట్టి వెళ్ళిపోయారు. ఇది చూసిన మిగిలిన పిల్లలంతా దాయీ హలీమా వద్దకు పరుగున వచ్చి ముహమ్మద్ (స) హత్యకు గురయ్యారని చెప్పారు. ఆ ఇంటి వారంతా పరుగెత్తుకుంటూ అక్కడికి చేరగా ప్రవక్త (స) ముఖ కవళికలు మారిపోయి ఉన్నాయి.

## మాతృ మమతానురాగాల్లో ముహమ్మద్ (స)

ఈ సంఘటన జరిగిన పిదప హలీమా (ర) ప్రమాదాన్ని శంకించారు. ఆమె ముహమ్మద్ (స)ను అతని మాతృమూర్తికి అప్పజెప్పి వచ్చేశారు. ఆయన ఆరేళ్ళ వరకు మాతృ మమతానురాగాల్లోనే పెరిగి పెద్దయ్యారు.

హజ్రత్ ఆమినాకు, యస్రిబ్‌లో ఖననం అయివున్న తన భర్త సమాధిని చూసి రావాలనే కోరిక కలిగింది. ముహమ్మద్ (స)తోపాటు తన సేవకురాలు ఉమ్మె అయిమన్‌ను వెంట పెట్టుకొని మామగారైన అబ్దుల్ ముత్తలిబ్ వెంట దాదాపు అయిదు వందల కిలోమీటర్ల దూరాన ఉన్న మదీనాకు బయలుదేరారు. అక్కడ ఓ నెల రోజులు ఉండి వెనుదిరిగారు. కాని ప్రయాణ ప్రారంభంలోనే కొంత దూరం వచ్చిన తరువాత ఆమినా వ్యాధిగ్రస్తులైపోయారు. ఈ వ్యాధి బాగా ముదిరిపోయి మక్కా మరియు మదీనాకు నడుమ గల ఓ ప్రదేశం 'అబ్వా' చేరగానే ఆమె మరణించారు. అక్కడే ఆమినా గారిని సమాధి చేశారు.

## తాతగారి కారుణ్య ఛాయలో

వృద్ధులైన అబ్దుల్ ముత్తలిబ్ తన మనుమణ్ణి వెంటబెట్టుకొని మక్కాకు వచ్చారు. ఆయన హృదయం తన అనాథ మునుమడి మమతానురాగాలతో నిండి పరితపిస్తోంది. కారణం, కోడలి మరణం మరో క్రొత్త విఘాతం. ఇది పాత గాయాల్ని తిరిగి తోడిన సంఘటన. విధి ఆ బాలుణ్ణి ఏకాంతపు ఎడారిలో తెచ్చి నిలబెట్టిన తీరును చూచి అబ్దుల్ ముత్తలిబ్ తల్లడిల్లిపోయారు. బాలుణ్ణి ఎటూ కాకుండా చేయడానికి ఆయన సిద్ధపడలేదు. తన సంతానం కంటే కూడా అమితంగా ప్రేమిస్తూ, పెద్దవారిని గౌరవించినట్లు ఆయన్ను గౌరవించేవారు. ఇబ్నె హష్షామ్ కథనం ప్రకారం, అబ్దుల్ ముత్తలిబ్ కోసం కాబా గృహం నీడన పరుపు వేసి, కుమారులంతా దాని చుట్టూ క్రింద కూర్చునేవారు. అబ్దుల్ ముత్తలిబ్ వచ్చి ఆ పరుపుపై కూర్చునేవారు. ఆయన గౌరవార్థం ఏ కుమారుడూ ఆ పరువు దగ్గరకు కూడా పోయేవారు కారు. కాని దైవప్రవక్త (స) వచ్చి ఆ పరుపుపైన్నే కూర్చునేవారు. ఆయన ఇంకా చిన్న పిల్లవాడే. పినతండ్రులు ఆయన పరుపుపై

నుండి క్రిందికి తెచ్చి కూర్చోబెట్టేవారు. అలా చేస్తూ ఉండగా అబ్దుల్ ముత్తలిబ్ కుమారుల్ని ఉద్దేశించి, "నా ఈ కుమారుణ్ణి వదిలేయండి. దైవసాక్షి! ఈయన ఘనతే వేరు." అంటూ తిరిగి పిల్లవాణ్ణి ఎత్తుకొని తన దగ్గర కూర్చుండబెట్టుకొని వీపు తట్టేవారు. అతని చేష్టలు చూసి ఆనందపడేవారు. అబ్దుల్ ముత్తలిబ్‌గారికి మూసుకుపోయిన జమ్‌జమ్ బావి జాడ గురించి కల వచ్చింది. ఆ మరుసటి ఉదయాన్నే బావి త్రవ్వకం ఆరంభమైంది. బావి తెరుచుకుంది. కలలో చూచిన విధంగానే అందు ఖడ్గాలు, కవచాలు మరియు రెండు బంగారు లేళ్ళు లభించాయి. ఖడ్గాలను, కవచాలను కరిగించి కాబా గృహ ద్వారానికి పోత పోశారు. ఆ లేళ్ళను ద్వారాలకు రెండు వైపుల బిగించారు. తదుపరి హాజీలకు జమ్‌జమ్ నీరు త్రాగించే ఏర్పాట్లు చేశారు. ఈ సంఘటన మరియు ఫీల్ సంఘటన శుభాలను దైవ ప్రవక్త (స)కు ఆపాదించబడ్డాయి.

ప్రవక్త (స) గారి వయస్సు ఇంకా ఎనిమిది సంవత్సరాల రెండు నెలల పది రోజులైందో లేదో అబ్దుల్ ముత్తలిబ్ కూడా మక్కాలో మరణించారు. మరణానికి ముందు ప్రవక్త (స) పినతండ్రి అయిన అబూ తాలిబ్‌కు సంరక్షణ బాధ్యతలను స్వీకరించమని అప్పజెప్పడం జరిగింది. ఈయన ప్రవక్త (స) గారి తండ్రి అబ్దుల్లాహ్ సొంత సోదరుడు.

అబూతాలిబ్ ఈ బాధ్యతను ఎంతో సమర్థనీయంగా నిర్వర్తించి తన తండ్రి ఆశించినట్లే ప్రవర్తించారు. అబూతాలిబ్, ముహమ్మద్ (స) తండ్రి అబ్దుల్లాహ్ ఒకే తల్లి బిడ్డలవడంచేత అబూతాలిబ్‌కు ముహమ్మద్ (స) అంటే ప్రత్యేక ప్రేమానురాగాలు, వాత్సల్యాలుండేవి. ఒక్కోసారి ఆయన ముహమ్మద్ (స) సమక్షంలో తన సొంత సంతానాన్ని కూడా ఖాతరు చేసేవారు కారు. ఆయన బయటికి ఎక్కడికి వెళ్ళినా ముహమ్మద్ (స)ను తోడుగా తీసుకెళ్ళేవారు. నిద్రపోయేటప్పుడు సయితం తనతోనే పడుకో బెట్టుకునేవారు.

పది, పన్నెండేళ్ళ వయసు రాగానే తోటి బాలురతో ముహమ్మద్ (స) గొర్రెల్ని కాయడానికి వెళ్ళేవారు. అరేబియాలో గొర్రెల్ని కాసే పని కూడా అక్కడి బాలురి శిక్షణా కార్యక్రమంలో ఒక భాగమే. దాన్నెవరూ అగౌరవంగా భావించేవారు కారు. గొప్ప వంశంలోని బాలురు కూడా ఈ తర్ఫీదును పొందవలసిందే.

అబూతాలిబ్ వ్యాపారి. ఖురైష్ నియమానుసారం సంవత్సరానికి ఒకసారి వ్యాపార నిమిత్తం సిరియాకు వెళ్ళేవారు. ముహమ్మద్ (స) వయసు సుమారు 12 ఏళ్లున్నప్పుడు అబూతాలిబ్ ఒకసారి సిరియా ప్రయాణాన్ని సంకల్పించారు.

ప్రయాణంలో ఎదురయ్యే కష్టాల దృష్ట్యా ముహమ్మద్ (స)ను తనతోపాటు తీసుకెళ్ళదలచలేదు. ప్రయాణానికి సిద్ధమవుతూ ఉన్నప్పుడు ముహమ్మద్ (స) వచ్చి తన్ను కావలించుకుని మారాము చెయ్యసాగారు. ఆయన(స)పైగల ప్రగాఢ అనురాగం చేత ఆయన బాధపడతారని తలచి ఆయన కోరికను అబూతాలిబ్ కాదనలేక పొయ్యారు. ఆయన్ని (స) తోడుగా తీసుకెళ్ళక తప్పింది కాదు.

## ప్రవక్త (స) మాధ్యమంగా వర్షం గురించి వేడుకోలు

జహ్‌లిమా బిన్ అరఫ్‌తా ఉల్లేఖనాన్ని 'ఇబ్నె అసాకర్' పొందుపరచిన విధం ఇలా ఉంది. జహ్‌లిమా ఇలా ఉల్లేఖించారు: "నేను మక్కా నగరానికి వచ్చినప్పుడు ప్రజలు కరువుతో పీడించబడుతున్నారు. ఖురైష్‌లు అబూ తాలిబ్‌తో, "అబూ తాలిబ్! మన నగరం కరువు కోరల్లో చిక్కుకొని ఉంది. చిన్నా పెద్దా అందరూ పస్తులుంటున్నారు. పదండి, వర్షం గురించి ప్రార్థిద్దాం" అని అన్నారు. అబూ తాలిబ్ ఓ పిల్లవాణ్ణి(సఅస)వెంట తీసుకొని బయలుదేరారు. ఆ పిల్లవాడు (సఅస) అప్పుడే మబ్బు వదలిన సూర్యునిలా ప్రకాశిస్తున్నాడు. ఆ బాలుని చుట్టూ ఇతర బాలురు కూడా ఉన్నారు. అబూ తాలిబ్ ఆ బాలుని చేయిపట్టుకొని కాబా గృహం వద్దకు వెళ్ళారు. అతని వీపును కాబా గృహానికి ఆనించి వ్రేలు పట్టుకొని నిలబడ్డారు. అప్పుడు ఆకాశంలో ఓ మబ్బుతునక మచ్చుకైనా కనబడలేదు. కాని చూస్తూ ఉండగానే అన్ని వైపుల నుండి మేఘాలు క్రమ్ముకో నారంభించాయి. వాన కురవటం ప్రారంభమైంది. కురిపిన కుంభవృష్టికి ఆ లోయలో వరదలు వచ్చాయి. నగరం, కొండాకోనలన్నీ జల మయమై పోయాయి. ఆ తరువాత ఓ సందర్భంగా అబూ తాలిబ్ ఈ సంఘటన గురించి చెబుతూ, ముహమ్మద్ (సఅస)ను ఇలా పొగుడుతూ ఒక గేయాన్ని కూడా వ్రాశారు.

"ఆయన అందగాడు. ఆయన ముఖారవిందం ద్వారా వర్షాన్ని కోరు కోవడం జరుగుతుంది. అనాథల ఆశ్రయం, వితంతువుల సంరక్షకుడాయన. మరొకసారి అబూ తాలిబ్ గారు ప్రియప్రవక్త (స)తో ఎడారిలో ప్రయాణం చేస్తూ దాహంతో తల్లిడిల్లిపోతూ ఓ ముహమ్మద్ నాకు చాలా దాహంగా వుంది. అల్లాహ్‌ను ప్రార్థించి నా దాహం తీర్చమనగా ప్రవక్త (స)గారు భూమిపై చేతితో కొట్టగా నీళ్ళ ధార ఉబికి పైకి రాగా అబూ తాలిబ్ వారు ఆ నీరు త్రాగి దాహాన్ని తీర్చుకొన్నారు.

## క్రైస్తవ సన్యాసి బుహైరా

అనుమానాస్పద ప్రమాణికతలు గల కొన్ని ఉల్లేఖనాల ప్రకారం, దైవ ప్రవక్త(స) గారి వయస్సు పన్నెండేళ్ళు, మరో వివరణాత్మక ఉల్లేఖనం ప్రకారం, పన్నెండేళ్ళ రెండు నెలల పది రోజులకు చేరినప్పుడు అబూ తాలిబ్ ఆయనను వెంట పెట్టుకొని సిరియాకు వ్యాపార రీత్యా ప్రయాణానికి బయలుదేరి 'బస్రా' చేరారు. 'బస్రా' సిరియా దేశానికి చెందిన 'హూరాన్'కు రాజధానిగా ఉండేది. రోమనులు ఆక్రమించుకున్న అరేబియా ద్వీపలక్ప ప్రాంతాలకు రాజధాని అది. ఆ నగరంలో 'బుహైరా' అనే బిరుదతో పిలువబడే జర్జీన్ అనే పేరుగల ఓ క్రైస్తవ సన్యాసి ఉండేవాడు. బిడారం అక్కడ విడిది చేయగానే ఆ సన్యాసి తన చర్చీ నుండి బయలుదేరి వారివద్దకు వచ్చాడు. వారినందరిని భోజనాలకు ఆహ్వానించాడు. ఇంతకుమునుపెన్నడూ ఈ సన్యాసి బయటకు వచ్చేవాడుకాదు. అతను దైవప్రవక్త (స)ను ఆయన గుణగణాలను చూసి గుర్తుపట్టాడు. ఆయన చేయి పట్టుకొని, "ఈయన విశ్వనాయకుడు. అల్లాహ్ ఈయన్ను కారుణ్య మూర్తిగా చేసి పంపిస్తాడు" అని అన్నాడు. దానికి అబూ తాలిబ్, "నీకు ఇదంతా ఎలా తెలుసు?" అని అడగగా, ఆ సన్యాసి, "మీరు ఈ లోయలో అడుగు పెట్టగానే ఇక్కడి ఏ చెట్టూ, ఏ రాయీ ఆయనకు సాష్టాంగపడకుండా లేదు. ఈ వస్తువులు ఓ ప్రవక్తకు తప్ప మరే దాని ఎదుట సాష్టాంగపడవు. అదే కాదు. నేనీయనను 'ప్రవక్త గుర్తు' ద్వారా కనుగొన్నాను. ఈ గుర్తు వీపుపై, మెడ క్రింద ఉన్న మెత్తటి ఎముకపై యాపిల్ ఆకారంలో ఉంది. ఇది మా గ్రంథాల్లో ఉన్న విషయం" అని చెప్పాడు.

ఆ తరువాత 'బుహైరా' సన్యాసి అబూ తాలిబ్‌ను ఉద్దేశించి, వెంటనే ఈయన్ను వెనక్కు పంపించేయండి. సిరియాకు తీసుకొని వెళ్ళకండి. అక్కడ యూదుల ద్వారా ప్రమాదం పొంచి ఉంది అని చెప్పగా, అబూ తాలిబ్ కొందరు బానిసల వెంట ఆయన్ను (ముహమ్మద్) మక్కాకు పంపించేశారు.

క్రమేణా వర్తక, వ్యాపార, వ్యవహార నిర్వహణలో సక్రమంగా, కపటం లేకుండా మంచి యోగ్యత గణించిన ముహమ్మద్ (స.అ.స) యొక్క నీతి, నిజాయితీ, నమ్మిక, సత్‌శీలము, అరేబియా దేశంలోనే కాకుండా, వేరువేరు దేశాలలో కూడా మారుమ్రోగసాగెను. వీరికి 'అల్‌అమీన్' 'సాధిక్' అను బిరుదముతో సత్కరించెడివారు. వ్యాపార రీత్యా ఇంత చిన్న వయస్సులో ఇంత కీర్తి లభించి పేరు ప్రఖ్యాతులు సంపాదించిన ముహమ్మద్ (స.అ.స)కు

వీరి సత్ప్రవర్తనకు, గుణగణములలో వీరికి వీరేసాటి.

బీదల యెడల దయ, అనాధల పట్ల కరుణ, వృద్ధులకు గౌరవం చూపెడి వారు. ఎటువంటి కష్ట సమయాలలోనైనా, తన ప్రాణములను ధారపోయుటకు వెనుకాడక పరులకు సహాయం, సేవ చేయుటయే వీరి కర్తవ్యం. దయార్ద్ర హృదయులు, న్యాయమూర్తి. వీరి ఘనతకు అరేబియా ప్రజలేకాక మిగిలిన దేశపు ప్రజలందరూ వేనోళ్ళ పొగడసాగిరి. వీరి యందు నిమిడియున్న, మహత్తర లక్షణములను, సద్గుణములను గుర్తించిన ఒక సౌభాగ్య కుటుంబమునకు చెందిన 'బీబీ ఖదీజా' (ర.అ) అను గొప్ప సంపన్నురాలు (వితంతువు) ముహమ్మద్ (స.అ.స)ను వివాహమాడ నిశ్చయించి, రాయబారం పంపగా ముహమ్మద్ (స.అ.స) తన అంగీకారం తెలియజేసి తన 25వ ఏట (595) 40 సంవత్సరాల వయస్సులగల 'ఖదీజా'ను వివాహమాడిరి. వీరి దాంపత్య జీవితం ఆదర్శవంత మైనది. వీరికి ఖదీజాతో ఇద్దరు కుమారులు 1. ఖాసిం. 2. అబ్దుల్లాహ్. నలుగురు కుమార్తెలు 1. జైనబ్ 2. రుఖయ్యా 3. ఉమ్మె కుల్సుమ్ 4. ఫాతిమా జహ్‌రా జన్మించిరి. వీరికి మగ సంతానముగా జన్మించిన 'ఖాసిం, అబ్దుల్లాహ్‌లు బాల్యములోనే చనిపోయారు. 3. ఇబ్రాహీం హజ్రత్ మారియా అల్ కబ్తియా (ర)కు జన్మించిన కుమారుడు. వీరు జనవరి 27 క్రీ.శ. 632న మదీనాలో మరణించారు. ముహమ్మద్ (స.అ.స) యొక్క ప్రియ కుమార్తె ముస్లిం జగత్తులో వన్నెకెక్కిన 'ఖాతూనె జన్నత్' ఫాతిమా జహ్‌రా (ర.అ), ఆఖరి కుమార్తె. ఖదీజా (ర.అ) 619లో చనిపోయినారు. హజ్రత్ ఖదీజా (ర) గారు జీవించి వున్నంత వరకు మరెవరినీ ఆయన (స) వివాహమాడలేదు. హజ్రత్ ఖదీజా (ర) తర్వాత ముహమ్మద్ (స.అ.స) వివాహమాడిన వారిలో 2. హజ్రత్ సౌదా (ర), 3. హజ్రత్ ఆయిషా' (ర.అ), 4. హజ్రత్ హఫ్సా (ర) 5. హజ్రత్ జైనబ్ (ర) 6. హజ్రత్ ఉమ్మె సల్మా (ర) 7. హజ్రత్ జువైరియా (ర) 8. హజ్రత్ ఉమ్మె హబీబా (ర), 9. హజ్రత్ సఫియ్యా (ర) 10. హజ్రత్ మైమూనా (ర), 11. హజ్రత్ మారియా అల్ కబ్తియా (ర). ఈమె ఈజిప్ట్ చక్రవర్తి కానుకగా ఇచ్చిన బానిస. ఈమె కుమారుడే హజ్రత్ ఇబ్రాహీమ్ (అలై). వారిలో ఆయిషా (ర) మొదటి ఖలీఫా మరియు ముహమ్మద్ (స.అ.స) గారి ముఖ్య సహచరులు అయిన హజ్రత్ అబూ బకర్ సిద్దీఖ్ (ర.అ) గారి ముద్దుల కుమార్తె. హజ్రత్ ఆయిషా (ర) మరియు హజ్రత్ మైమూనా(ర) గార్లతో మాత్రమే వీరికి (స) మొదటి వివాహం. మిగతా వారందరూ వితంతువులు మరియు విడాకులు పొందినవారు. బానిసలు, బందీలుగా వచ్చినవారే. హజ్రత్ జైనబ్(ర) మాత్రం విడాకులు పొందిన

వారు. వీరిని గురించి దివ్యఖుర్ఆన్‌లో 33 : 37, 40 ఆయత్‌లలో వివరించ బడింది.

అరబ్ ప్రజలు ముఖ్యంగా మక్కా నివాసులు వాస్తవంగా అతిథి సత్కా రములకు, ధైర్యసాహసములకు, వాగ్ధాటికి, కవితకు, గణిత, వైద్య శాస్త్రములలో నైపుణ్యం గలవారు. అయితే ముఖ్యంగా వీరు విగ్రహారాధకులు. కొన్ని యుగాల క్రితం ఇబ్రాహీం (అ.స) నిర్మించిన మక్కాలోని పవిత్ర కాబా గృహం విగ్రహాలకు నిలయమైనది. కాబా ఒకే ఒక అల్లాహ్ ప్రార్థనకై నిర్మించబడ్డ గృహమైనప్పటికీ, మక్కా వారు కాబాలో 365 విగ్రహాలునిర్మించి మేళతాళాలతో ఆడ, మగ నగ్నముగా కాబా చుట్టూ ప్రదక్షిణము చేసి విగ్రహారాధన జరిపెడివారు. ఈ విధంగా అజ్ఞానం, అంధకారంలో జీవనము గడుపుచుండెడివారు. దౌర్జన్యం, క్రౌర్యం, దారి దోపిడి వారికి పరిపాటి. చిన్న చిన్న కలహములపై కక్షలు పెంచు కుని పెద్ద పెద్ద పోరాటములకు దిగేవారు. తరతరాలుగా అరేబియా దేశపు ప్రజలలో ప్రబలివున్న ఈ దురాచారాలను ముహమ్మద్ (స.అ.స) సహించలేక పోయిరి. వారు చేయుచున్న అసభ్య చర్యల గురించి రాత్రింబవళ్ళు చింతించెడి వారు. వారిని చెడు కార్యముల నుండి, సత్కార్యముల వైపు మనస్సును మళ్ళిం చుటకు నిత్యం అల్లాహ్‌ను ప్రార్థించెడివారు. మక్కా సమీపంలో ఉన్న 'హిరా' అను కొండ గుహలో వెళ్లి ఎన్నో రోజులపాటు అల్లాహ్‌ను ధ్యానించెడివారు. అరబ్బుల కుటిలతపై, అజ్ఞానంపై, వారు చేయు నీచాతినీచమైన పనులపై నిత్యం కంటి తడి పెట్టెడివారు. ఒకనాడు 'హిరా' గుహలో దీర్ఘధ్యానంలో ఉండగా, జిబ్రాయీల్ (అ.స) అను దైవదూత ప్రత్యక్షమై మొదటిసారిగా అల్లాహ్ యొక్క 'వహీ' "పఠించు" అన్నారు. ఆయన "నాకు చదువురాదు" అని సమాధానమిచ్చారు. అప్పుడు జిబ్రాయీల్ మహాప్రవక్తను గట్టిగా పట్టుకుని అదిమి వదిలారు. ఇలా మూడుసార్లు పఠించమని కోరగా "నేను చదవలేను అని జవాబిచ్చారు. తరువాత మహాప్రవక్తను అదిమి, వదిలి ఇలా అన్నారు. **ఇఖ్రా బిస్మి రబ్బికల్లజిఖలక్; ఖలకల్ ఇన్‌స్సాన మిన్ అలక్. ఇఖ్రావరబ్బుకల్ అక్రముల్లజీ అల్లమబిల్ కలమి, అల్లమల్ ఇన్సాన మాలమ్ యాలమ్.** చదువు సృష్టించిన నీ ప్రభువు పేరుతో, ఆయన మనిషిని కరుడుగట్టిన రక్త బిందువుతో సృష్టించాడు. చదువు నీ ప్రభువు ఎంతో శ్రేష్ఠుడు, పునీతుడు. ఆయన కలం ద్వారా జ్ఞానం ప్రసాదించాడు. మానవునికి తెలియని విషయాలన్నీ నేర్పాడు." (ది.ఖు. 96 : 1-5) ముహమ్మద్ (స.అ.స)కు వారి నోట అల్లాహ్ వాక్కు పలికిం

చుట ఇదే మొదటిసారి. అది రమజాన్ నెల. ముహమ్మద్ (స.అ.స) ఈ అసాధారణ దృశ్యము పట్ల భయ భ్రాంతులైరి. కాని సహనమూర్తి, సద్గుణ సంపన్నురాలు అయిన ఖతీజా (ర.అ) ముహమ్మద్ (స.అ.స)ను ఓదార్చి ధైర్యం చెప్పిరి. మరియు 'వర్ఖా ఇబ్నె నౌఫిల్' అనుజ్ఞాని ద్వారా ముహమ్మద్ (స.అ.స) కు ప్రవక్త పదవి నొసంగబడుచున్నట్లుగా గుర్తింపగలిగిరి. ఆనాటి నుండియే ముహమ్మద్ (స.అ.స) ప్రవక్త అయి 'అల్లాహ్ ఒక్కడే అని, అల్లాహ్‌కు మరెవ్వరూ సాటిలేరని, అల్లాహ్ తప్ప మరెవ్వరూ పూజార్హులు కారని, దైవత్వంలో అల్లాహ్‌తో పాటు మరెవ్వరినీ భాగస్వాములుగా ఆమోదించరాదని' ప్రచారం సాగించిరి. మరియు మక్కా వాసులలోని సాంఘిక దురాచారములన్నిటిని ప్రతిఘటించ సాగిరి. వీరి ప్రచారములోనున్న సత్యమును, హేతువును గుర్తించి, విశ్వసించి ఇస్లాం స్వీకరించిన వారిలో 'ఖదీజా, అబూ బకర్ సిద్దీఖ్, హజరత్ అలీ (అతని పినతండ్రి కుమారుడు), జైద్' అను బానిస మొదటివారు. కాని మక్కా వాసులకు ఈ ప్రచారం కర్ణకఠోరంగా తోచెను. ఈ ప్రచారంతో వారిలో కల్లోలము బయలు దేరినది. వారందరూ  ముహమ్మద్ (స.అ.స)పై తిరుగుబాటు ప్రారంభించిరి. ముహమ్మద్ (స.అ.స) యొక్క గుణగణములను వేనోళ్ళ పొగిడి 'అల్ అమీన్' అను బిరుదాంకితముతో కొనియాడిన మక్కా వారు ఈ ప్రచారంతో బద్ధ విరోధులైనారు. మక్కావాసులు వీరినిపిచ్చివాడని, మాంత్రికుడని, కవి అని, హేళన చేసెడివారు. ముహమ్మద్ (స.అ.స) ప్రచారం వల్ల తరతరాలుగా తమ పూర్వీకుల నుండి, సాంప్రదాయ పూర్వకంగా వచ్చుచున్న విగ్రహారాధనను విడనాడుటకు ఖురైషీయులు సహించలేకపోయిరి. ఖురైషీయులు విగ్రహారాధ నకు స్వస్తి చెప్పిన యెడల, కాబాలో నియమించబడిన 365 విగ్రహారాధనల వల్ల, ఏటేటా జరుగు తీర్థయాత్రల వల్ల వచ్చు అర్చన, ఆదాయములు కుంటు బడును. అందుచేత వీరు ఏ మాత్రం విగ్రహారాధన విడనాడుటకు అంగీకరించ లేకపోయిరి. మరియు వీరు అరబ్ ప్రజల దృష్టిలో చులకనగుదురు. కావున వీరు ముహమ్మద్ (సఅస) యొక్క ప్రచారమును తీవ్రంగా వ్యతిరేకించి, ముహమ్మద్ (సఅస)ను మరియు వారి అనుచరులు, తిరస్కారుల దౌర్జన్యము, క్రౌర్యమునకు, ఎగతాళికి, నానా హింసలకు గురి అయినారు. ఏ అల్లాహ్ ప్రార్థన కొరకు పవిత్ర కాబా నిర్మింపబడినదో ఆ అల్లాహ్‌ను కాబాలో బహిరంగముగా ప్రార్థనలు చేయుటకు వీరికి హక్కులేదు. రహస్యముగా భయకంపితులై ప్రార్థనలు చేయవలసినదే గాని వేరే మార్గం లేదు. రోజురోజుకు మక్కావాసుల,  హింసాకాండ, ఎక్కువైనప్పటికి, ముహమ్మద్ (సఅస)వారి

అనుచరులు ఓర్పుతో తమ ప్రచారమును సాగించు చునే ఉండిరి. తిరస్కారులు వీరిని కాల్చి వాతలు వేసినప్పటికీ వీరు తమ విశ్వాసం కోల్పోలేదు. ముహమ్మద్ (సఅస) వారి అనుచరులలో ఈమాన్ మరియు వీరి అనుచరుల సంఖ్య వృద్ధి చెందుతూనే ఉండెను. 13 సంవత్సరాల కాలంలో సమయానుకూల పరిస్థితుల ననుసరించి దైవసందేశము వచ్చుచునే ఉండెను. మక్కాలో ఉన్నప్పుడు 'వహీ' ఎక్కువగా ఆఖిరత్ (ప్రళయ దినము) గురించియే వచ్చుచుండెను. ఎంత ఓర్పు, సహనము, శాంతముతో ఉన్నప్పటికీ కాఫిర్ల దౌర్జన్యం రోజు రోజుకు మితిమీరి, (సఅస) వారి అనుచరులకు మక్కాలో బ్రతుకుటకు చాలా కష్టతరమైనది.

## మహిమలు

ఒక ప్రవక్త చేసే దైవోపదేశములు నిజమని నిరూపించుటకు అల్లాహ్ తన ప్రవక్త ద్వారా చేయించే ఒకానొక అద్భుత విషయాన్ని ధార్మిక పరిభాషలో మోజిజా (మహిమ) అంటారు. ఆ మహిమ ప్రకృతి ధర్మానికి అతీతమైనదిగా వుండాలి. ఉదాహరణకు మంటకు కాల్చే గుణముంది. అయితే, అది కాల్చ కుండా వుండటమే దానికి సంబంధించిన మహిమ; అలాగే నదులు ప్రవహిస్తూ వుంటాయి, వాటి ప్రవాహం ఆగిపోవడం, చలనరహితమైన చెట్లలో చలనం కలగటం, మరణించిన జీవి సజీవమవడం, కర్రలు పాములుగా మారడం ఇత్యాది విషయాలు. విశ్వంలో జరిగే కార్యకలాపాలన్ని ఏ విధంగానయితే అన్ని పనులు అల్లాహ్ ఆదేశాల మేరకు ప్రకృతి సిద్ధాంతాలకు లోబడి జరుగుతాయో అదే విధంగా, అల్లాహ్ శక్తిసామర్థ్యాల కనుగుణంగానే ఆయన ఆదేశాల ప్రకారం కొన్ని పనులు ఈ ప్రకృతి సిద్ధాంతాలకు అతీతంగా, ప్రకృతికి భిన్నమయిన విధంగా జరగడం కూడా సంభవమే. అల్లాహ్ తలచినప్పుడు ఇలా జరుగుతూ వుంటుంది.

తరుచుగా, ప్రవక్తల దైవదౌత్య నిదర్శనంగా వాళ్ళకు దైవం తరఫున మహిమలు ప్రసాదించబడ్డాయి. కాని తిరస్కారులు విశ్వసించేందుకు, ధర్మం స్వీకరించేందుకు ఈ మహిమలు చాలా అరుదుగానే ఉపకరించాయి. మహి మలు ప్రదర్శించబడటమంటే, ఒక విధంగా, సందేశం అందజేసే వాదనను పూర్తిచెయ్యడమన్నమాట. అందువల్లనే మహిమలు చూసిన తరువాత కూడా జనులు ప్రవక్తను తిరస్కరించినప్పుడు వారు దైవాగ్రహానికి గురయ్యారు; దైవశిక్ష వారిపై వచ్చిపడింది; వారిని రూపుమాపటం కూడా జరిగింది. ఖురైష్ తిరస్కారులు

కూడా మహాప్రవక్త (సఅస)ను మహిమలు చూపమని అర్థించారు. వారి ఈ అభ్యర్థ నను చాలాకాలం వరకు దాటవెయ్యటం జరిగింది. అల్లాహ్ అవలంబించే విధానమే ఇది; జనులకు వారి అభ్యర్థనకు సమాధానంగా ఏవయినా విస్పష్ట మయిన మహిమలు చూపిస్తే ఇక వాళ్ళకు మిగిలేవి రెండే మార్గాలు, విశ్వాసం, లేకపోతే వినాశం! దైవ సంకల్పంతో ఖురైష్ ప్రజల్ని అప్పుడే అంతమొందించే ఉద్దేశం లేదు కనుక, వాళ్ళ అభ్యర్థనను ఇంతవరకు మన్నించ లేదు. దైవసందేశం వైపునకు ఆహ్వానించడం ప్రారంభించి అప్పటికి పన్నెండేళ్ళు గడిచి పొయ్యాయి. అప్పుడప్పుడు మహాప్రవక్త(స)లోనూ, ఇతర విశ్వాసుల మనస్సు లోనూ, "అల్లాహ్ తరపున ఏదయినా సూచన కనబడితే బాగుండు, దాన్ని చూసయినా జనులు విశ్వాసం గైకొనేవారు, ఇస్లామ్ సత్యాన్ని విశ్వసించే వారు" అనే తలంపు కలుగుతూ ఉండేది. అయితే ఈ కోరికకు సమాధానంగా, అల్లాహ్ ఇలా తెలిపాడు:

"తొందరపాటుతో వ్యవహరించవద్దు, ఏ విధంగానైతే సందేశాన్ని మేము పంపిస్తున్నామో దాన్ని అదే పంథాలో ఓర్పుతో కార్యాన్ని నిర్వహించాలి. చమత్కారాలూ, మహిమల ద్వారా పని వెళ్ళబుచ్చాలంటే మేమలా ఎన్నడో చేసేవారము; మేము తలిస్తే ఒక్కొక్క అవిశ్వాసి హృదయాన్ని మెత్తబడేలాచేసేవారము; అతన్ని బలవంతంగా సన్మార్గం వైపునకు నడిపించేవారము; కాని ఇది మా పద్ధతి కాదు. ఈ విధానం వల్ల మానవుని స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని పరీక్షించడానికి వీలుపడదు; విజయవంతంగా కొనసాగే సామాజిక వ్యవస్థను రూపొందించగల నైతిక విప్లవమూ రాదు. అయినప్పటికీ, ఒకవేళ జనుల తిరస్కార వైఖరి కారణంగా నీవు పరిస్థితుల్ని సహనంతో ఎదుర్కోలేకపోతే, నీకే గనక శక్తి ఉంటే చేతనయిన పని చేసుకో, భూమిలో సొరంగం వేసి దూరి, లేదా ఆకాశానికి నిచ్చెన వేసి ఎక్కి ఏదైనా మహిమను ప్రకటించు. అల్లాహ్ గనక తలిస్తే వారందరిని సన్మార్గంపై ఏకం చేసేవాడే. కనుక (ఓ ప్రవక్తా) నీవు అజ్ఞానుల్లోని వాడివి అవకు." (అల్ అన్ఆమ్ : 35)

అయితే మహాప్రవక్తకు మహిమలు ప్రసాదించబడలేదని దీని భావం కాదు. ఆయన అందజేసిన అత్యంత గొప్ప మహిమగా చెప్పుకోవడానికి **దివ్య ఖుర్ఆన్** ఒక్కటే చాలు. ఈ మహిమే కాక ఇంకా అసంఖ్యాకమైన మహిమలు ఆయన అవసరమేర్పడినప్పుడు చూపారు. వాటిలో చంద్రుడు రెండుగా చీలడం (షక్కుల్ కమర్); ఆయన గగనసీమలో సంచరించి రావడం (మేరాజ్) అత్యంత

ప్రముఖమయినవి. ఇవేకాక ఇంకా ఎన్నో భవిష్యద్వచనాలు ఆయన పలికారు. ప్రార్థనాఫలితంగా వర్షం కురియటం, ప్రజలు సన్మార్గాన్ని అవలంబించడం, అవసరం కలిగినప్పుడు స్వల్పమయిన పదార్థం అధికమవడం, వ్యాధిగ్రస్తులు స్వస్థత పొందటం, నీరు లేని చోట నీరు ప్రవహించడం, చెట్లు, జంతువులు చివరకు రాళ్లు కూడా ప్రవక్త (సఅస)తో వాటి బాధలు, కోరికలు విన్నవించు కోవటం, పరిష్కారం లాంటి అసంఖ్యాక మయిన మహిమలు అప్పుడప్పుడు అల్లాహ్ సుబ్‌హానుతఆలా ఆజ్ఞతో వెల్లడి అయ్యాయి. వాటిలో కొన్ని :

**మహిమలు నెం.1 : షక్కుల్ కమర్ (దివ్యఖుర్ఆన్ అల్ ఖమర్ సూరా నెం.54)**

మక్కా అవిశ్వాసులకు దైవసందేశం అందజేసినట్లు వాదాన్ని పూర్తిచెయ్య డానికి చూపించిన మహిమల్లో చంద్రుడు రెండుగా చీలడం చాలా ముఖ్యమైన మహిమ. మక్కావాసులు దైవ సందేశం విని విగ్రహారాధనను చేయటం మాని సృష్టికర్త అయిన అల్లాహ్‌ను ఆరాధిస్తూ ముస్లింలుగా మారగ, ఇంకా ఎక్కువ మంది అవిశ్వాసులుగానే వుంటూ, నీవే గనుక నిజమైన దైవ ప్రవక్త అని మేము నమ్మాలంటే ఈ నిండు పున్నమి (సంపూర్ణ చంద్రుని) రాత్రి చంద్రుని రెండుగా విడగొట్టుము అని పలుకుచుండిరి. అప్పుడు ప్రవక్త (స) దైవాన్ని ప్రార్థించి ఈ మహిమను చూపమని తన చూపుడు వ్రేలు చంద్రునివైపు చూపగా చంద్రుడు రెండుగా చీలి సగ భాగము 'సఫా' కొండవైపు, మరొక సగ భాగము 'కైకాన్' కొండవైపు విడిపోయెను. "అల్ బదయ్యా" ప్రాంత ప్రజలు వచ్చి సాక్ష్యమిచ్చారు. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ (ర) ఈ సంఘటనను ఇలా ఉల్లేఖించారు. ఈ ఉల్లేఖనం 'సహీహ్ బుఖారి', 'ముస్లిమ్' ఇత్యాది హదీసు గ్రంథాల్లో ఉంది. ఆయన ఈ సంఘటనకు ప్రత్యక్షసాక్షి. తన కళ్ళారా చంద్రుడు రెండుగా చీలడం ఆయన చూశారు.

"అప్పుడు మేము మహాప్రవక్త (స)తోపాటు 'మినా' అనే చోట ఉన్నాము. అకస్మాత్తుగా చంద్ర గ్రహం రెండుగా చీలిపోయింది, దాని ఒక భాగం ఒక కొండ వైపునకు జరిగింది. మహాప్రవక్త, 'మీరే సాక్షులు' అని అక్కడున్న వారితో అన్నారు".

ఇంతకు ముందే వ్రాసినట్లు మహిమ చూసిన తరువాత తిరస్కారులు తప్పక విశ్వసిస్తారన్నది సిద్ధాంతం కాదు. తిరస్కారం, ధిక్కారం మంకువైఖరి, ఎవరి అంతర్యాన్ని ఆక్రమించుకుని ఉంటాయో వారే తరచుగా మహిమల్ని కాంక్షిస్తారు. ఆనాటి మలబారు (కేరళ రాష్ట్రం) రాజు అయిన జొమిరిన్ ఈ

విషయాన్ని నాటి చరిత్ర గ్రంథాలలో రాయబడి వున్న దాన్ని చదివి ముస్లిం మతమును స్వీకరించారు.

చంద్రభేదనం (షక్కుల్ కమర్) మహిమను చూసిన తరువాత తిరస్కారులు, "ఓహో ఇది గొప్ప ఇంద్రజాలమే, మాయలూ మంత్రాల ద్వారా ఇలాంటి అద్భుతాలు ఎన్నయినా చెయ్యవచ్చు" అని కొట్టిపారేశారు. ఈ విధంగా వాళ్ళకు ఋజుమార్గం అవలంబించే మహాభాగ్యమయితే కలగలేదు. కానీ, వాళ్ళ అపరాధాల జాబితాలో మరొక ముఖ్యమయిన అపరాధం చేరిపోయింది. ఇంత ప్రస్ఫుటమయిన సూచనను వీక్షించినప్పటికీ, అల్లాహ్ ప్రవక్తను అసత్యవాది అని తిరస్కరించడం మరి మామూలు అపరాధమా?

## మహిమలు-2

హిజ్రత్ సమయంలో ప్రవక్త (స)ను హత్య చేయుటకు రాత్రివేళ అబూ జహల్ మరియు ఇతర అవిశ్వాసులు ఇంటిని చుట్టుముట్టారు. అప్పుడు ప్రవక్త (స) ప్రశాంతంగా యాసీన్ సూరా (36 : 9) పారాయణం చేస్తూ గుప్పెడు మన్ను తీసుకొని దాన్ని "షాహతిన్ వుజూహ్" అంటూ అవిశ్వాసుల వైపు విసిరారు. అప్పుడు అల్లాహ్ మహిమ వల్ల చుట్టుముట్టినవారు ఏమరుపాటుకు లోనై ప్రవక్త (స)ను వారి మధ్య నుండి పోతున్నా చూడలేకపోయారు. తరువాత ఆయన (స) హజ్రత్ అబూ బక్ర్ ఇంటికి పోయి వారిని తీసుకొని మక్కా దగ్గరలో వున్న సౌర్ గుహలో తలదాచుకున్నారు. అక్కడ అబూబకర్ రెండు రంధ్రాలను లుంగీ గుడ్డతో మూసివేశారు. ఇంకా రెండు రంధ్రాలు మిగిలి ఉన్నాయి. గుహ సొరంగాల చుట్టూ సాలిపురుగు వచ్చి వలను సంపూర్ణంగా అల్లగా అడవి పావురాలు వచ్చి సాలిగూడు వలపై గూడు కట్టి గ్రుడ్లుపెట్టి పొదుగుచున్నవి. గుహలో ప్రవక్త (స)గారు అబూ బక్ర్ (ర) తొడపై తల ఉంచి నిద్రపోగా చిన్న రంధ్రంను మూస్తూ వుంచిన అబూబకర్ కాలుపై పాము కాటు వేయగా విషంఎక్కి భరించరాని నొప్పితో బాధపడుతూ టపటపమని కన్నీళ్ళు ప్రవక్త (స) ముఖంపై పడినాయి. ఈ విషయం గ్రహించిన ప్రవక్త(స) వారి నోటి నుండి ఉమ్మిని తీసి పాము కాటు వద్ద రాయగా నొప్పి తగ్గి స్వస్థత పొందారు. అవిశ్వాసులు సౌర్ గుహ వద్దకు వచ్చి వాస్తవ పరిస్థితిని సాలిగూడు, పావురము గ్రుడ్లు చూసి గుహలో ఎవరూ ప్రవేశించలేదని నిశ్చయించి వెళ్ళిపోయారు.

గుహలో మూడు రోజులు బస చేసిన తరువాత నాల్గవ రోజున హజ్రత్ అబూ బక్ర్ (రఅ), ఒక బానిస మరియు కిరాయికి ఒంటెలు తెచ్చిన బాడుగవానితో

ప్రవక్త(స)గారు మదీనాకు ప్రయాణమయ్యారు. మార్గమధ్యమున సరాకా బిన్ జాషిమ్ అనే వాడు మహాప్రవక్త (స)ను గుర్తుపట్టాడు. వీరిరువుని పట్టి ఇచ్చిన వారికి 200 ఒంటెల బహుమానం అవిశ్వాసులు ప్రకటించి వున్నారు. కావున అతడు ఆశపడి వీరిని పట్టుకొనుటకై వెంబడించసాగాడు. అది చూసి అబూ బక్ర్ (రజి) భయపడగా అల్లాహ్ మన వెంటే ఉన్నాడు అని ప్రవక్త (స) ధైర్యం చెప్పారు. అప్పుడు వెంబడించే సరాకా బిన్ జాషిమ్ గుర్రం కాళ్ళు మోకాళ్ళ వరకు నేలలో దిగబడిపోయాయి. లేవలేని స్థితిలో వుంది. ఇది గమనించిన సరాకా భయంతో గజగజలాడుతూ ప్రవక్త(స)ను హతమార్చటం తనవల్ల కాదని తెలుసుకొని శరణుజొచ్చాడు. మహాప్రవక్త (స) అతన్ని క్షమించాడు. ఇది కూడా ఓ మహిమే.

## మహిమలు-3

మదీనా ప్రయాణ మార్గంలో ఆకలితో ఉండగా వీరికి ఒక గుడారం కాన వచ్చింది. ఈ గుడారం ఉమ్మె మెఅబద్ అనే గిరిజన మహిళది. ఆమె వచ్చిపోయే వారికి తన దగ్గర ఉన్న భోజన సామగ్రి నుండే తినిపించి, దాహం తీర్చేది. మహాప్రవక్త (స) ఆమె వద్దకు వెళ్ళి తినటానికి ఏమైనా ఉందా? అని అడిగారు. అందుకామె దైవసాక్షి! నా వద్ద ఏమీ లేదు. మేకలు కూడా దూరంలో మేయటానికి వెళ్ళాయి. ఇది కటిక కరువు కాలం అని నిస్సహాయతను వెలిబుచ్చింది. ప్రవక్త (స) దృష్టి మూలగా కట్టేసి ఉన్న బలహీనమైన మేకపై పడింది. మేక బలహీనమై మందతో నడవలేని స్థితిలో ఉన్నందున పాలు ఇవ్వదని అన్నారామె. అప్పుడు మహాప్రవక్త (స) మీరు అనుమతిస్తే పాలు పితుక్కుంటాను అని అన్నారు. మీకేమైనా ఈ మేకలో పాలు కనబడుతున్నట్లయితే తప్పకుండా పితుక్కోండి అన్నారామె. అల్లాహ్ నామం పలికి ప్రవక్త (స) పాలు పెద్దపాత్రలో పితకగా అమెతో సహా అక్కడున్నవారందరూ ఆ పాలను కడుపునిండా త్రాగారు. తర్వాతే ప్రవక్త (స) గారు కూడా త్రాగారు. ఆ తర్వాత చూస్తే తిరిగి అంతే నిండుగా ఆ పాత్రలో పాలున్నాయి. అవి ఆమెకిచ్చి వెళ్ళిపోయారు ప్రవక్త (స). తదుపరి ఆమె భర్త ఇంటికి వచ్చి ఈ పాలను చూచి ఆశ్చర్యపోయి అడిగారు. జరిగిన విషయమంతా పూసగుచ్చినట్లు చెప్పారామె. అప్పుడు ఆ ఇరువురు మదీనా వెళ్ళి ప్రవక్త (స) సమక్షంలో ముస్లిములుగా మారిపోయారు. ఇదీ అల్లాహ్ మహిమే.

## మహిమలు-4

హుదైబియా యుద్ధ సమయంలో త్రాగుటకు నీళ్ళులేక అల్లాడుచుండిరి. ప్రవక్త (స) వజూ చేసుకొనుటకు ఒక చిన్న పాత్రలో మాత్రమే నీళ్ళు ఉన్నాయి. వజూ చేసుకుని ఏమిటి విషయం అని అడగ్గా ఈ చిన్న పాత్రలో మినహా మరెక్కడా నీరు లేదని తెలిపారు. అప్పుడు ప్రవక్త (స) వారి చేతిని ఆ పాత్రలో ముంచగా ప్రకృతి సిద్ధంగా బోరుబావి నుండి నీరు ఎలా ఉబికి వస్తుందో అలా చిమ్మిస్తూ నీరు రాగా 1500 మందికి పైగా ఉన్న సైనికులు ఆ నీరు త్రాగి తరువాత వజూ చేసుకున్నారు. అయినప్పటికీ ఇంకా లక్ష మందికి పైగా సరిపడా నీరు అక్కడ నిలువ అయ్యింది. ఇదే దేవుని మహిమ.

## మహిమలు-5

ఒక అవిశ్వాసి ప్రవక్త (స) వద్దకు వచ్చి నేను మీ మహిమను చూసి ఆ తరువాతే ముస్లిం అవ్వాలనుకున్నాను అని అన్నాడు. దానికి ప్రవక్త (స) మీకు ఏ మహిమను చూపాలని అడగగా అందుకు అతను "ఆ దూరాన వున్న ద్రాక్ష చెట్టు మీ వద్దకు రావాలని కోరాడు." అందుకు ప్రవక్త (స) నీవు ఆ చెట్టు వద్దకు పోయి నేను పిలిచానని చెప్పమన్నాడు. ఆ అవిశ్వాసి అట్లాగే ఆ చెట్టు వద్దకుపోయి ప్రవక్తగారి చెప్పినట్లే చెప్పాడు. వెంటనే ఆ చెట్టు భూమిని చీల్చుకుంటూ వచ్చి "అస్సలాము అలైకుం వ రహ్మతుల్లాహ్" అని చెప్పింది. అప్పుడు ఆ అవిశ్వాసి మళ్ళీ వెనక్కు వెళ్ళాలని కోరాడు. ప్రవక్త (స) చెప్పిన మీదట అల్లాహ్ ఆజ్ఞతో యథాస్థానంలో చెట్టు వెళ్ళిపోయింది. ఆ అవిశ్వాసి ఈ మహిమను చూసి ముస్లిము అయ్యాడు. ఇలా ఎన్నో మహిమలు ప్రవక్త (స) అల్లాహ్ ఆజ్ఞతో చూపించారు.

## మేరాజ్

మక్కా జీవితానికి మదీనా జీవితానికి మధ్యలో మేరాజ్ యాత్ర చేశారు. 'మేరాజ్' అంటే అధిరోహించటం అని అర్థం. మహాప్రవక్త (స) తాను చేసిన గగన ప్రయాణాన్ని ప్రస్తావిస్తూ ఈ పదం వాడటం మూలాన అయన చేసిన గగనలోక ప్రయాణానికి "మేరాజ్" అని అంటారు. దానికే "ఇస్రా" అనే మరోపేరు కూడా వుంది. మహాప్రవక్త (స) చేసిన ఈ యాత్ర రాత్రికిరాత్రే జరగడం వల్ల దీన్ని "ఇస్రా" అని కూడా పిలుస్తారు. దివ్యఖుర్ఆన్‌లో ఈ పదాన్నే ఉపయోగించడం జరిగింది.

దైవప్రవక్తలకు (అలైహిస్సలామ్), దైవ సందేశప్రచారంలో, ధర్మ సంస్థాపనంలో తాము ప్రచారం చేసే ధర్మంపట్ల వారికి ఎంతో గట్టి నమ్మకం కావలసి వుంటుంది. అయితే మేము కనులారా చూసిన వాస్తవికతను వివరిస్తున్నాము. మీరు అశ్రయించినది "భ్రమ" మా వద్ద ఉన్నది "జ్ఞానం" అని నొక్కి వక్కాణించటానికి దైవప్రవక్తల ఎదుట దైవదూతలు ప్రత్యక్ష మయ్యారు. భూమ్యాకాశాల మహోన్నత పరిపాలనను వారికి చూపించారు; స్వర్గ నరకాలు వారి కనుల ముందు ప్రత్యక్షపరచబడ్డాయి. మరణానంతరం మానవు నికి సంభవించే పరిస్థితులు సయితం ఈ జీవితంలోనే వారికి చూపబడ్డాయి. "మేరాజ్" లేక "ఇస్రా" కూడా ఇలాంటి సంఘటనల లోనివే. ఒక విశ్వాసి తాను స్వయంగా చూడకుండానే మహాప్రవక్త (స)పై విశ్వాసంతో ఆయన చెప్పిన కారణంగా ఏ అగోచర సత్యాలను విశ్వసిస్తాడో అవన్నీ ఆ యాత్రలో మహా ప్రవక్త(స)కు చూపడం జరిగింది.

"మేరాజ్" ఏ తేదీన సంభవించిందో సూచించే ఉల్లేఖనాలు భిన్నంగా వున్నాయి. కాని వీటన్నిటినీ పరిశీలించి సమన్వయ పరచి చరిత్రకారులు తేల్చిన దానినిబట్టి ఈ సంఘటన 'హిజ్రత్'కు దాదాపు ఒక సంవత్సరం లేదా ఒకటిన్నర సంవత్సరం ముందు జరిగి వుంటుంది. బుఖారి, ముస్లిమ్ హదీసు గ్రంథాల్లో దీనికి సంబంధించిన ఉల్లేఖనాలు గమనిస్తే మొత్తంమీద వ్యక్తమయ్యే వివరాలు ఇలా వున్నాయి - ఒకనాటి ప్రొద్దున మహాప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు:

> "గత రేయి నా ప్రభువు నన్ను ఎంతో ఘనంగా గౌరవించాడు. నేను నిద్ర పోతూ ఉండగా "జిబ్రీల్" వచ్చి నన్ను మేల్కొలిపారు. నన్ను కాబా గృహానికి తీసుకు వచ్చారు. ఇక్కడ ఆయన నా రొమ్మును చీల్చారు. దాన్ని "జమ్ జమ్" నీటితో శుభ్రపరిచారు. దాన్ని విశ్వాస శక్తితోను, వివేకం విజ్ఞతలతోను నింపి మూసి వేశారు. ఆ తరువాత నేను స్వారీ చెయ్యడానికి ఒక వాహనాన్ని ఇచ్చారు. అది కంచర గాడిదకన్నా కాస్త చిన్నది; తెల్లనైనది; దాని పేరు బుర్రాక్. అది ఎంతో వేగంతో పయనిస్తుంది. నేను దాన్ని ఎక్కీ ఎక్కడంతోనే మేము 'బైతుల్ మక్దిస్' (జెరుసలేము మస్జిద్)కు చేరాము. అక్కడ 'బుర్రాక్'ని మస్జిద్ ద్వారానికి కట్టివేశాము. నేను మస్జిదే అక్సాలో రెండు రకాతుల నమాజ్ చేశాను. తదనంతరం జిబ్రీల్ నా ఎదుట రెండు పాత్రలు వుంచారు. ఒక దానిలో మధుపానం, రెండో దానిలో పాలు

న్నాయి. నేను పాలపాత్రను స్వీకరించాను. మధుపాత్రను వాపసు చేశాను. జిబ్రీల్ ఇది చూచి, "మీరు పాలపాత్రను స్వీకరించి సహజ ధర్మాన్ని ఆశ్రయించారు" అన్నారు.

అటు తరువాత ఆ అంతరిక్షయానం మొదలయింది. మేము తొలి ఆకాశాన్ని (భూమిని ఆవరించి ఉన్న ఆకాశాన్ని) చేరుకున్నప్పుడు అక్కడ ఉన్న రక్షకదూతతో, ద్వారం తెరవమని పురమాయించారు జిబ్రీల్. అతను "మీ వెంట ఉన్నదెవరు?" అని అడగ్గా, "ఈయన ముహమ్మద్ (స)" అని బదులిచ్చారు జిబ్రీల్. "ఈయన్ని ఆహ్వానించడం జరిగిందా?" మళ్ళీ అడిగాడు ద్వారపాలక దూత. "అవును ఆహ్వానించడం జరిగింది" అని సమాధాన మిచ్చారు జిబ్రీల్. "అయితే వీరికి సుస్వాగతం. శుభం, శుభం' అంటూ ద్వారం తెరిచాడా దూత.

మేము లోనికి వెళ్ళగానే హజ్రత్ ఆదమ్ (అలైహిస్సలామ్) ఎదురయ్యారు. "వీరు మీ నాన్నగారు (మానవ జాతికి ఆదిపురుషులు), ఆదమ్ (అ), మీరు వీరికి సలామ్ చెయ్యండి" అని పరిచయం చేశారు జిబ్రీల్.

నేను ఆదమ్‌కు సలామ్ చేశాను. ఆదమ్ ప్రతి సలామ్ చేస్తూ, "స్వాగతం! సజ్జనుడవయిన సుపుత్రా! సజ్జనుడవయిన ప్రవక్తా!!" అని స్వాగతం పలికారు. ఆదమ్‌కు కుడి ప్రక్క స్వర్గానికి పోయే అదృష్టవంతుల ఆత్మలు, ఎడమ ప్రక్కన నరకానికి పోయే దురదృష్టవంతుల ఆత్మలు ఉన్నట్లు అల్లాహ్ ప్రవక్త (స)కు చూపించాడు.

ఆ తరువాత రెండో ఆకాశానికి చేరుకున్నాము. ఇక్కడ కూడా మొదటి ఆకాశంలా ప్రశ్నోత్తరాలు జరిగాక ప్రవేశం లభించింది. లోనికి ప్రవేశించాక హజ్రత్ యహ్యా (యోహాను (అ.స), హజ్రత్ ఈసా (యేసుక్రీస్తు) (అ.స.)లతో భేటీ అయింది. జిబ్రీల్ వారికి పరిచయం చేసి "సలామ్ చెయ్యండి" అన్నారు. నేను సలామ్ చెయ్యగా వారిద్దరూ బదులిస్తూ "స్వాగతం, సత్పురుషుడవయిన సోదరా! సత్‌ప్రవక్తా!" అని స్వాగతం పలికారు.

ఇలాగే మూడవ ఆకాశాన్ని చేరుకున్నాము. అక్కడ హజ్రత్ యూసుఫ్ (అ) కలిశారు. మునుపటిలాగే సలామ్, ప్రతి సలామ్ జరిగింది. నాల్గవ ఆకాశాన హజ్రత్ ఇద్రీస్(అ)తోను ఐదవ ఆకాశాన హజ్రత్ హరూన్ (అ)తోను భేటీ జరిగింది. ఆరవ ఆకాశాన హజ్రత్ మూసా(అ) కలిశారు. ఏడవ ఆకాశాన హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) కలిశారు. ఆయన కూడా సలామ్‌కు బదులిస్తూ "స్వాగతం! ఓ సుపుత్రా!

ఓ సజ్జన ప్రవక్తా!” అని స్వాగత వచనాలు పలికారు.

ఆ తరువాత నన్ను “సిదరుతల్ మున్తహా” వరకు తీసుకువెళ్ళారు జిబ్రీల్. ఇది ఒక రేగిచెట్టు, (సప్తాకాశాల) అంచున వుంటుంది. దానిపైన అసంఖ్యాకంగా దూతలు మెరుపు పురుగుల్లా నిగనిగలాడుతూ ఉంటారు.

ఇక్కడ మహాప్రవక్త ముహమ్మద్ (స) ఎన్నో అగోచర యదార్థాల్ని వీక్షించారు. అల్లాహ్‌తో ప్రత్యక్షంగా మాట్లాడారు కూడా. అల్లాహ్, మహాప్రవక్త ఉమ్మత్ (అనుచర సంఘం) కొరకు రేయింబవళ్ళలో యాభై సార్లు నమాజ్ విధిగా నియమించారు. మహాప్రవక్త (స) అక్కడి నుంచి తిరిగి వస్తూవుండగా హజ్రత్ మూసా (అ) కలిశారు. ఆయన “దేవుని దివ్యసన్నిధి నుండి తెచ్చిన ఆదేశం ఏమిటో కాస్త చెప్పండి” అని అడిగారు.

“రేయింబవళ్ళలో 50 సార్లు నమాజ్” అని సమాధానమిచ్చారు మహాప్రవక్త(స). “మీ ఉమ్మత్ ఈ బాధ్యతా భారాన్ని మోయజాలదు. తిరిగి వెళ్ళండి, వాటిని తగ్గించుకోండి” అన్నారాయన.

అలాగే మహాప్రవక్త (స) తిరిగి వెళ్ళి తగ్గించేందుకు దైవసన్నిధిలో విన్నవించు కున్నారు. అప్పుడు ఒక వంతు తగ్గించడం జరిగింది. కాని హజ్రత్ మూసా ఆయన్ని మాటిమాటికీ త్రిప్పిపంపి ప్రతి పర్యాయం కొంత తగ్గింపజేశారు. చివరికి ఆ సంఖ్య తగ్గుతూ ఐదింటికి వచ్చింది. అప్పటికీ హజ్రత్ మూసా(అ)కు తృప్తి కలగలేదు. ఇంకా తగ్గించాలని సలహా ఇచ్చారు. అయితే మహాప్రవక్త (స) ఇంకా అక్కడికి వెళ్ళి నోరు తెరవడానికే సిగ్గుగా ఉందని అన్నారు. అప్పుడు అల్లాహ్ తరపున ఒక వాణి వినిపించింది:

“మేము నమాజ్‌ను యాభై సార్ల నుంచి తగ్గించి ఐదు సార్లు చేసినప్పటికీ నీ ఉమ్మత్ (అనుచర సంఘం)లో ఎవరయితే ప్రతి దినం ఐదు వేళలా నమాజ్ చేస్తారో వాళ్ళకు యాభయి వేళల ప్రతిఫలం ఇస్తాను”.

నమాజ్‌తోపాటు ఈ సందర్భంలో ఇంకా రెండు బహుమానాలు అల్లాహ్ దర్బారు నుండి అనుగ్రహించబడ్డాయి. ఒకటి, బఖరా సూరాలోని చివరి రెండు రెండు ఆయత్‌లు (2 : 285, 286). వీటిలో, ఇస్లామ్ మౌలిక విశ్వాసాలు, విశ్వాసం పరిపూర్ణత చెందే వివరాలు అభివర్ణించబడ్డాయి. ఇక కష్టకాలం సమాప్తం కావస్తోంది అనే శుభవార్త కూడా ఉంది. రెండవది, ముహమ్మద్ (స) అనుచర సంఘంలో ఎవరయితే బహుదైవారాధనకు దూరంగా ఉంటారో వారిని మన్నించి అనుగ్రహించటం జరుగుతుందనే శుభవార్త.

ఈ యాత్రలో ఆయన (స) స్వర్గ నరకాలను సయితం వీక్షించారు. మరణానంతరం జీవిత కాలంలో ఆచరణ ప్రతిఫలంగా జనులు ఏయే పరిస్థితులకు గురి అవుతారో ఆ దృశ్యాలను కూడా తిలకించారు. ఆకాశయానం నుండి తిరిగి "బైతుల్ మక్దిస్" వచ్చి చూస్తే అక్కడ ప్రవక్తలందరు సమావేశమయి ఉన్నారు. ఆయన (స) నమాజ్ చేయించారు. అందరూ ఆయన అనుకరణలో నమాజ్ చేశారు. ఆ తరువాత ఆయన (స)తన బసకు తిరిగి చేరుకున్నారు.

## మేరాజ్ ప్రాముఖ్యత

తెల్లవారిన తరువాత ఆయన ఈ సంఘటన గురించి అంతా వినిపిస్తే, కురైష్‌లోని విరోధులు ఆయన అబద్ధం పలుకుతున్నాడని తూలనాడారు. (దైవం మన్నించు గాక!) ఎవరికయితే ఆయన వాక్కుపై దృఢవిశ్వాసం ఉందో వారు ఒక్కొక్క విషయాన్నీ సత్యమని అంగీకరించారు. మహాప్రవక్త(స) సెలవిచ్చారు కాబట్టి, ఈ వివరాలన్నీ నిజమయినవేనని రూఢీ పరిచారు. ఇలా ఈ సంఘటన ఒక విధంగా ముస్లిమ్‌ల విశ్వాసానికి, మహా ప్రవక్త(స) దైవదౌత్యంపట్ల నమ్మకానికి పరీక్షగా రూపొం దింది. మరొకవైపున దాని ద్వారా మహాప్రవక్త (స)కు అసంఖ్యాకమయిన నిగూఢ సత్యాలను వీక్షించే అవకాశం కలిగింది. వీటికి తోడుగా ఇస్లామీయ ఉద్యమం రాబోవుకాలంలో ఎదుర్కోవలసి ఉన్న వ్యతిరేకత గురించి సూచన కూడా మేరాజ్ ద్వారా లభించింది. ఈ సూచన వివరాలు దివ్యఖుర్‌ఆన్‌లో బనీ ఇస్రాయీల్ సూరా నెం.17లో లభిస్తాయి. ఇందులోనే మేరాజ్ వర్ణన కూడా ఉంది.

## 1. ఇస్లామీయ సమాజానికి ప్రాతిపదికలు

ఇస్లామ్ అణిగి మణిగి వుండే కాలం సమాప్తం కావస్తోంది; ఇస్లామీయ సిద్ధాంతాల ఆధారంగా నిర్మాణం కానున్న సమాజం రూపొందబోతోంది. కాబట్టి ఇస్లామీయ జీవన వ్యవస్థకు ప్రాతిపదికలయిన సిద్ధాంతాల్ని బహూకరించడం సయితం ఈ మేరాజ్‌లోనే జరిగింది. ఈ మౌలిక సూత్రాలే ఆ తరువాత ఇస్లామీయ జీవన వ్యవస్థకు నియమావళి సూత్రాలుగా ఉపకరించాయి.

**ఆ సూత్రాలు ఇవి:**

1. అల్లాహ్‌కు సాటిగా మరే ఇతర శక్తినీ ఆరాధ్య శక్తిగా ఎంచకూడదు. ఆయన ఆరాధన, ఆయన దాస్యం, ఆయనకు విధేయత, ఆయనకు

గల పాలనా అధికారాల్లో ఇతరులెవ్వరినీ ఆయనకు సహవర్తులుగా భావించకూడదు.

2. తల్లిదండ్రుల ఎడల గౌరవం, విధేయతాభావాలు కలిగి ఉండాలి. అయితే అల్లాహ్‌కు బదులుగా ఇతరులను భాగస్వాములుగా చేయమని బల వంతం చేస్తే అలాంటి తల్లిదండ్రుల పట్ల విధేయత పాటించనవసరం లేదు.

3. బంధువులు, బాటసారులు, అనాధల పట్ల తారసిల్లే బాధ్యతల్ని నిర్వర్తించాలి. సంఘంలో ఒక మనిషి ఎడల మరొక మనిషికి గల విధ్యుక్త ధర్మం పట్ల ఉపేక్ష చూపకూడదు. వీటిని సరిగ్గా నిర్వహించాలి. లేకపోతే నాగరికత పునాదులే సవ్యంగా కుదరవు.

4. ధనం వ్యర్థంగా ఖర్చు చెయ్యకూడదు. దైవం ప్రసాదించిన అనుగ్రహాల్ని తప్పుడు మార్గాన వ్యయపరచడం షైతాను కార్యం. ఏ సమాజంలోనయితే జనులు కళ్ళు మూసుకుని వ్యయపరుస్తారో లేదా చేతులు కట్టుకుని “నిధిసర్పం”లా ధనంపై చుట్టచుట్టుకుని కూర్చుంటారో అలాంటి సమాజం ఎన్నటికీ సుభిక్షం, సుఖశ్రేయాలతో కళకళలాడుతూ మన జాలదు. ధనం వెచ్చించడంలోను, వ్యయాన్ని అదుపులో ఉంచుకోవడం లోనూ మధ్యస్త మార్గాన్ని అవలంబించాలి.

5. బీదరికం దాపురిస్తుందన్న భీతితో సంతాన హత్యకు ఒడికట్టకండి. ఉపాధిని చేకూర్చటం దేవుని బాధ్యత, అయనే దాని ఏర్పాటు చేస్తాడు. “రేపటికి వీళ్ళేం తింటారు?” అన్న సంశయంచేత సంతానాన్ని హత మార్చకూడదు.

6. వ్యభిచారం దాపుక్కూడా పోకూడదు. ఇది ఒక అభిశాపం లాంటిది, ఈ మహా పాపం నుండి దూరంగా ఉండటమే కాక దానికై పురికొలిపే ప్రేరక సాధనా లన్నింటినీ, ప్రేరణల్ని రూపుమాపాలి.

7. నిష్కారణంగా ఎవరినీ హత్య చెయ్యకూడదు. ప్రజల ప్రాణాలు సురక్షితం గాలేని సమాజం ప్రగతిని సాధించలేదు. ప్రశాంత వాతావరణం లేకుండా ఏ సంస్కృతీ వికాసమొందజాలదు. కనుక అన్నిటికంటే ముందు జనుల ధన ప్రాణాల రక్షణ అత్యవసరం.

8. అనాథల ఎడల మంచిగా మసలుకోవాలి. అధమస్థితికి లోనైనవారు, తమ హక్కుల పరిరక్షణ చేసుకోలేని వారు సహాయానికి అర్హులు. వర్గాలకు రక్షణలేని సమాజం సర్వతోముఖమైన ప్రగతిని సాధించజాలదు.
9. చేసిన వాగ్దానాలను నెరవేర్చాలి. వాగ్దానాలను గురించి ప్రశ్నించడం తథ్యం. వాగ్దానం అంటే జనులు పరస్పరం చేసుకునే వాగ్దానాలు, ఒప్పందాలు అనీ, ఒక విశ్వాసి తాను విశ్వసించినప్పుడు తన ప్రభువుతో చేసే ప్రమాణం అని కూడా భావం.
10. కొలతల్లో, తూకంలో, కొలమానాల్ని, తూనికల్ని నికార్సుగా ఉంచాలి. ఇచ్చి పుచ్చుకోవడాల్లో వ్యవహారాల సవ్యత, పరస్పర హక్కుల పరిరక్షణ సమాజ వికాసానికి, సమాజంలో శాంతి భద్రతల సుస్థాపనకు ఎంతో దోహదపడతాయి.
11. మనిషి తనకు తెలియని విషయంలో అనవసరంగా తల దూర్చకూడదు. ఏమీ తెలియని పరిస్థితిలో అలాంటి విషయాల్లో గుచ్చి గుచ్చి తెలుసుకునే ప్రయత్నం చెయ్యడం మూలాన కారణరహితంగా అనుమానాలు పుట్టే ఆస్కారం వుంది. ఊహల ఆధారంగా ఒక అభిప్రాయం కుదుర్చు కోవడం వల్ల వ్యవహారాలు పెడదారిన పడతాయి. మంచి సమాజం అన్న తరువాత అది ఈ కీడు నుండి సురక్షితంగా ఉండాలి. తన కళ్ళు, చెవులు, మనస్సు అన్నింటినీ ప్రశ్నించటం జరుగుతుందనే స్పృహతో మెలగాలి.
12. భూమిపై గర్విష్టిగా నడవకూడదు. గర్వం, అహంభావం, మనిషిని అతినీచమైన లక్షణాల్ని అలవరుచుకునేందుకు పురికొలుపుతాయి. ఈ దుర్గుణం వల్ల మనిషి సమాజానికి చీడపురుగులా పరిణమిస్తాడు. పరస్పర అనుబంధాలు సక్రమంగా సంతోషదాయకంగా ఉండాలంటే మనుషులు ఇతరుల్ని తమకన్నా నీచులుగా, అధములుగా భావించకూడదు.

## 2. హిజ్రత్ కొరకు సంసిద్ధత

ఇంతేకాక హిజ్రత్ (వలస) కొరకు విస్పష్టమయిన సూచనలు సయితం తరచుగా ఈ దశలో అవతరించిన ప్రవచనాల్లో గోచరిస్తాయి. అన్‌కబూత్ సూరా నెం.29లో ఈ విధంగా సెలవీయబడింది:

"నా దాసులారా! దాస్యభావం నాయెడల మాత్రమే కలిగి ఉండండి. నా

దాస్యం వల్ల మీస్వదేశం మీకై ఇరుకైనా దాన్ని లెక్కచెయ్యకండి, నా భూమి చాలా విశాలమయింది. అంటే ఇల్లూ వాకిలీ విడిపోయినా నా దాస్య బంధం విడిపోరాదు. ఒక ప్రాణానికి అత్యంత అపాయకరమయిన విషయమేముంది? అది ప్రాణాపాయమే కదా! అయితే ఒకటి మాత్రం బాగా తెలుసుకోవాలి. పుట్టినవాడు గిట్టడం తథ్యం. మరణించిన పిదప నా వద్దకు రావటమూ ఖాయమే. అలాంటప్పుడు నా మార్గంలోనే మృత్యువు ఎదురయితే చింత దేనికీ? ఎవరైతే విశ్వాసమూ, సదాచారాల నిధి తెస్తారో వారికొరకు ఉద్యానవనాల్లో సుఖదాయక మైన బస ఏర్పాటు చెయ్యబడుతుంది. వాటిలో సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి. వారక్కడే శాశ్వతంగా ఉంటారు. సదాచారపరాయణులయిన వారికి ఎంత మంచి ప్రతిఫలం! వీరు కఠినాతి కఠిన పరిస్థితుల్లోనూ అల్లాహ్ ధర్మమార్గాన నిలకడగా ఉన్నారు. తాము పడే ప్రతి శ్రమకూ తమ ప్రభువుపైనే భారం మోపారు.''

ఇంకా కొన్ని విషయాలు తెలుపబడ్డాయి. దైవ మార్గాన ఇల్లూ వాకిలీ వదలడంలో కలిగే మరొక సంశయం ఆర్థిక దురవస్థకి సంబంధించినది. ఈ సందర్భంలో ఉపాధికి సంబంధించిన వ్యవహారమంతా దైవం హస్తగతమై వుందనే విశ్వాసం నొక్కిచెప్పబడింది. ''భూమిపై సంచరించే ఎన్నో ప్రాణులున్నాయి. అవి తమ తమ ఆహారం తమ వెంట మోసుకువెళ్ళవు. కాని అల్లాహ్ వాటి ఉపాధిని సమకూర్చి ఇస్తాడు. వాటి ఆహారం ఏర్పాటు చేస్తాడు. అయితే మీరే ఆయన దాతృత్వం పట్ల సందేహంతో, ఉపాధి కల్పించడని నిరాశ చెందడం దేనికి?''

ఇంకా ఈ దశలో అవతరించిన ఒక సూరా నెం.17 'బనీ ఇస్రాయీల్'లో హిజ్రత్ కొరకు ప్రార్థించవలసిందిగా ఉపదేశించబడింది. ఈ విధంగా అర్థించాలని ప్రార్థన కూడా నేర్ప బడింది:

''ప్రభువా! ఉత్తమమైన ప్రదేశానికి నేను వెళ్ళే అవకాశం నాకు కల్పించు, (మక్కా నగరం నుండి) సవ్యమైన రీతిలో బయటికి చేర్చు, శత్రువుల పట్ల నీ తరఫున నాకు విజయాన్ని, సహాయాన్ని చేకూర్చు''.

''ఇంకా ఓ ప్రవక్తా! ఎలుగెత్తి చాటండి. సత్యం ప్రత్యక్షమయింది, అసత్యం సమసి పోయింది, మిథ్యకు ఏనాటికైనా తుడిచిపెట్టుకుపోవటమే దాని గతి.

ఇవి, ఇటువంటి అనేక సూచనలు అప్పుడు అవతరించిన ప్రవచనాల్లో

గోచరిస్తాయి. వీటిలో ఒకవైపున రానున్న విప్లవాన్ని గురించి సూచనలు చెయ్యబడ్డాయి. రెండోవైపున ఈ గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొనేందుకు అవశ్య మయిన తయారీ గురించి పదే పదే హెచ్చరించడం జరిగింది. మరణానంతర జీవితానికి సంబంధించిన సజీవమైన, దృఢవిశ్వాసం; ఐహిక సుఖసంపదల కాంక్షల్ని ఆంతర్యాన్నుండి వెలికితీయడం; స్వచ్ఛమైన ఏకేశ్వరభావాన్ని, అది కోరే బాధ్యతల్ని మనోజ్ఞంగా బోధపరచడం, అల్లాహ్ తప్ప మరే ఇతర ఆధారానికి హృదయంలో తావునివ్వకపోవడం; కేవలం ఆయనపైనే పరిపూర్ణంగా భారం మోపడం; అల్లాహ్ వైపు నుంచి అవతరిస్తున్న ఆదేశాలను హెచ్చుతగ్గులు లేకుండా జనులకు అందజేస్తూ ఉండటం; ఈ కార్యాలన్నింటినీ సాధించటానికి నమాజ్ వ్యవస్థ స్థాపన ద్వారా, దాన్ని దీక్షా ఏకాగ్రతలతో పాటించడంద్వారా శక్తిని పొందటం, ఇత్యాది ప్రాతిపదికలపై ముస్లిముల శిక్షణ జరుగుతూ ఉంది. దీనికి తోడుగా ఆ విషమ పరిస్థితుల్లోనూ ధర్మప్రచారానికి అవసరమైన నిర్దేశాలు ఇవ్వబడుతూనే ఉండేవి.

## హిజ్రత్

అల్లాహ్ ఆజ్ఞ వలన (సఅస)తన ఆప్త మిత్రుడు అబూ బకర్ (ర.అ)తో క్రీ.శ. 622లో మక్కా నుండి మదీనా వలస పోయిరి. దీన్నే హిజ్రత్ అంటారు. (సఅస) తన అనుచరులను తమ ఇష్టానుసారము మక్కా వదలి, అబిసీనియా, మదీనా మొదలుగు దేశములకు హిజ్రత్ చేయుటకు అనుమతి ఇచ్చిరి. ఇట్లు మక్కా నుండి మదీనాకు హిజ్రత్ చేసి వచ్చిన వారిని 'ముహాజిర్లు' అంటారు. వీరు తమ ఇల్లు వాకిలి, సంపద, పరివారం వదలి నిరాధారులై మదీనాకు వలస వచ్చిరి. మదీనాలో (సఅస)రాకకు ఎదురుచూసి వారిని ఘనంగా స్వాగతమిచ్చి సకల మర్యాదలతో ఆతిథ్యమిచ్చారు. 'అన్సారులు'. ఇక్కడి ధనికులైన అన్సారులు, ముహాజిర్లకు అనేక సదుపాయాలు కల్పించి, అన్ని విధాల సహాయపడి, వారు సుఖ జీవితము గడుపునట్లు చూచుచుండిరి. అన్సారులు తమ హృదయపూర్వకముగా ముహాజిర్ల సోద రత్వము అంగీకరించి, వారికి తమ ఆస్తులలో, పంటలలో, వస్తుసాగ్రిలో సగభాగ మిచ్చి వారికి ఏ విధమైన ఇబ్బంది, అసంతృప్తి కలగకుండా, సంతోష జీవనము గడుపుటకు ఎంతయో తోడ్పడినారు.

హిజ్రత్ చేసి మక్కా నుండి మదీనా వచ్చిన తర్వాత (సఅస) ప్రార్థనలు సలుపుటకై మట్టితో గోడలు, కర్జూరపు ఆకులతో ఇంటి కప్పు వేసి ఒక చిన్న

కుటీరం (మస్జిద్) నిర్మించిరి. అదియే ఇప్పుడు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మదీనా మునవ్వరాలోని మస్జిదె నబవీ'.

ఈ హిజ్రత్‌తో ఇస్లాం చరిత్ర నూతన రూపము దాల్చినది. హిజ్రత్ చేసిన తారీఖు నుండి హిజ్రీ క్యాలండర్ హిజ్రీ శకము, ముస్లిం రాజ్యస్థాపన ప్రారంభ మైనది. ఇక్కడ రాజ్య స్థాపన అనగా పాలనాధికారము బదలాయించుట కాదు. దండయాత్రలు చేసి రాజ్యములను కొల్లగొట్టుట అంతకన్నా కాదు. మానవ హక్కుల సంరక్షణ, సంఘసేవ, సాంఘిక కర్తవ్య నిర్వహణ, మంచిని పెంచుట, అన్యాయము, అధర్మాల స్థానంలో న్యాయాన్నీ, ధర్మాన్నీ స్థాపించటం ముస్లిం రాజ్య స్థాపనా లక్ష్యం. రాజ్యాంగ నిబంధనల ననుసరించి న్యాయస్థానములు, రాజ్యాంగ చట్టము, శాసనములు, చర్చలు, సభలు, సమావేశములు, ప్రతి పాదనలు, తీర్మానాలు, సలహాలు, తీర్పులు ఒప్పందములు, ఒడంబడికలు, రాచకార్యములు, రాయబారములు అన్నియూ సక్రమముగా ప్రజాస్వామ్య పద్ధతులపై నెలకొల్ప బడినవి. ఇస్లాం సిద్ధాంతముల ప్రకారం ఆనాడే అనగా ఇప్పటి 1424 సంవత్సరాల పూర్వమే ప్రజా రాజ్యం, రాజ్యాంగ చట్టములు అమలులోనికి వచ్చిన సంగతి విదితమగుచున్నది. ప్రజాస్వామ్య పద్ధతులపై ముహమ్మద్ (సఅస) ప్రజలకు ఇస్లామీయ జీవన విధానము (షరీఅత్ చట్టం), మానవ గౌరవము, సర్వమానవ సమానత్వము, వారసత్వపు హక్కులు, ఆడవారికి సమాజంలో గౌరవము, సమాన హక్కులు, ఆస్తిహక్కు, వివాహ నిబంధనలు మున్నగు సాంఘిక సామాజిక సమస్యలన్నిటినీ చక్కగా చట్టరూపేణా నిర్ణయించి నారు. నేరం కొద్దీ శిక్ష. విద్యకు విద్యా సంస్థలకు, గురువులకు మంచి ఆదరణ, గౌరవం ఇవ్వబడినవి. నైతిక, సామాజిక, సాంఘిక వ్యవహార, వాణిజ్య, ఆర్థిక, రాజకీయ రంగములలో విప్లవం తెచ్చిన మహామనిషి (సఅస). ఆయన గొప్ప సంఘ సంస్కర్త. రాజ నీతిజ్ఞుడు. అనాగరికత, మూర్ఖత్వములో ఉన్న వారిని చక్కటి సంస్కృతి, నాగరికత, క్రమశిక్షణ, జ్ఞానము కలుగజేసి సుప్రసిద్ధ మానవ జాతిగా తర్ఫీదు ఇచ్చిన, ఇస్లాం సిద్ధాంతములు, షరియత్ ఆదేశాలు క్లుప్తంగా ఈ పుస్తకంలో 14వ అధ్యాయంలో పొందుపరచబడినవి. ఇవి ముహమ్మద్ (సఅస) తమ స్వార్థము కొరకు చేసినవి కావు. అధికారం కోసం అసలే కాదు. తమ నోటి నుండి వెలువడిన ప్రతి వాక్కు అల్లాహ్ యొక్క ఆజ్ఞ. అల్లాహ్ సందేశము ననుసరించియే! నిత్యం ప్రజల సౌఖ్యం కొరకు అల్లాహ్‌ను వేడుకో.

**వఖురబ్బి అద్‌ఖిన్నీ - ముద్‌ఖల - సిద్‌ఖిద్ - వఅఖ్‌రిజ్‌ని - ముఖ్‌రజ - సిద్‌ఖివ్ - వజ్‌అల్లీ - మిల్లదున్‌క - సుల్‌తానన్ - నసీరా** (దివ్యఖుర్‌ఆన్ 17 : 80)

**వఖుల్ - జహల్‌హఖ్ఖు - వజహఖల్ - బాతిల్ - ఇన్నల్ బాతిల - కాన జహూఖా** (దివ్యఖుర్‌ఆన్ 17 : 81)

'(ప్రవక్తా! ఇలా వేడుకో) ప్రభూ! నీవు ఎక్కడికి తీసుకెళ్ళినా మంచి స్థితిలో తీసుకెళ్లు. ఎక్కడ్నుంచి తీసినా మంచి స్థితిలోనే తీసెయ్యి. నీదగ్గర నుండి సహాయంగా అధికార శక్తి ప్రసాదించు.

ఇలా ప్రకటించు 'సత్యం వచ్చింది. అసత్యం తుడిచి పెట్టుకు పోయింది. అసత్యం ఏనాటికైనా తుడిచిపెట్టుకుపోయేదే' దివ్యఖుర్‌ఆన్ 17:80-81) ఈ విధంగా వేడుకొనెడి వారు.

హిజ్రత్ చేసినప్పటి నుండి చివరి 10 సంవత్సరములు ప్రవక్త జీవితం దేదీప్యమానముగా వెలిగి ఇస్లాం ప్రచారం ప్రపంచపు నలుమూలల వ్యాప్తిచెంద సాగెను. ముహమ్మద్ (సఅస) యొక్క ఆశయాలు, కార్యక్రమాలు సిద్ధించి సఫలీకృతమైనవి. ఇస్లాంకు ఘన విజయం లభించినది. అరేబియా ప్రజలందరూ ఇస్లాంను స్వీకరించినారు.

మక్కా వదలి మదీనా వచ్చినప్పటికీ, తిరస్కారులు ముహమ్మద్ (సఅస)ను వెంటాడుట వదలలేదు. హిజ్రత్ చేసిన మరుసటి సంవత్సరం మక్కా వాసులు వెయ్యి మంది సైన్యంతో సత్య ప్రియులపై యుద్ధమునకు కాలుదువ్విరి. అప్పుడు ముహమ్మద్ (సఅస) వారి అనుచరులు 313 మంది మాత్రమే. వీరిలో ఎక్కువ మంది వృద్ధులు. వీరి వద్ద సామగ్రి లేదు. వీరిలో ఎవ్వరికీ యుద్ధ నైపుణ్యం లేదు. కాని పరిస్థితులను బట్టి ఆత్మరక్షణార్థమై ముహమ్మద్ (సఅస) వారి 313 మంది అనుచరులు మదీనాకు 80 మైళ్ళ దూరంలో బద్ర్ మైదానంలో దృఢకాయులైన మక్కా కాఫిర్ల సైన్యమును ఢీకొన్నారు. దైవసహాయంతోఆయన శత్రువులను చిత్తుగా ఓడించి దిగ్విజయం పొందినారు. 313 మంది బలహీనమైన సైన్యం పూర్తియుద్ధ సన్నాహాలతో తర్ఫీదు పొందిన వేలాది సైన్యమును ఓడించుట ఒక అపూర్వ విషయం. మానవుని కంటికి కనబడని ఫరిష్తాలను అల్లాహ్ ఏర్పాటు చేసెను అల్లాహ్‌చే పంపబడ్డ ఫరిష్తాలు కాఫిర్ల సైన్యమును హతమార్చి ముహమ్మద్ (సఅస)కు ఘన విజయం చేకూర్చిరి.

బద్ర్ యుద్ధం తర్వాత కూడా మక్కావాసులు మరుసటి సంవత్సరమే క్రీ.శ. 625లో ఉహద్ పర్వతము వద్ద మరల దాడి చేసినారు. ఈ యుద్ధంలో ముస్లిములకు పరాజయం కలిగినది. దీని తర్వాత కూడా, హునైన్, ఖందఖ్ యుద్ధములు మరియు చిన్న చిన్న పోరాటములు, సంఘటనలు జరిగినవి. క్రీ.శ. 630లో మక్కావాసులు, ముహమ్మద్ (సఅస)తో చేసిన ఒడంబడికలను ఉల్లంఘించుట వల్ల ముహమ్మద్ (సఅస) మక్కాపై దాడి సలిపి, ఎటువంటి రక్తపాతం లేకుండా విజయం సాధించి మక్కాను వశపర్చుకున్నారు. తిరస్కారులు ప్రతిఘటన చేయలేదు. ఈ దిగ్విజయము కూడా అద్భుత సంఘటనయే! ఇస్లాం చరిత్రలో ఈ అద్భుత విజయమునకు మరేదీ సాటిలేదు. ఈ యుద్ధంలో ఎవ్వరూ గాయపడలేదు. ఎవ్వరూ బంధింపబడలేదు ముహమ్మద్ (సఅస) యొక్క ఔదార్యము, ప్రేమ అపూర్వమైనది, శత్రువులనందరిని క్షమించిరి. మక్కా నివాసు లందరూ వీరి ఉదార స్వభావమునకు సిగ్గుతో పశ్చాత్తాపం పొంది ఇస్లాం స్వీకరించిరి. కాబాలో భద్ర పరచిన విగ్రహములన్నిటినీ స్వయంగా తీసివేసి, కాబాను తమ స్వహస్తము లతో శుభ్రపరచి పవిత్రము చేసిరి. తర్వాత ముహమ్మద్ (సఅస) మక్కా ప్రజలం దరినీ సమావేశపరచి ప్రార్థనలు సలిపిరి. మక్కాలో వీరు కొన్ని రోజులుండి, అక్కడ మక్కా వారిలో నుండియే ఒక గవర్నరును నియమించి, ఆనందంతో మదీనాకు తిరిగి వెళ్ళిరి. మదీనా వారు వీరి రాకను బ్రహ్మానందంతో స్వాగతము పలికిరి.

## అంతిమ హజ్ ప్రయాణ సూచనలు ( క్రీ.శ. 632 సం॥)

ఆయన (సఅసం) రమజాన్ నెల హిజ్రీ శకం 10 హిజ్జతుల్ విదా సందర్భ మున “బహుశా ఈ సంవత్సరం తరువాత మీ ఈ ప్రదేశంలో మీతో ఎప్పుడూ కలువనేమో” అని అన్నారు. హిజ్రత్ పదవ ఏట మహాప్రవక్త (స) హజ్జ్ చేసే సంకల్పం చేసుకున్నారు. మహాప్రవక్త (స) హజ్జ్ కొరకు ప్రయాణం కానున్నారని హి.శ. 10వ సంవత్సరం జీకఅద నెలలో ప్రకటన వెలువడింది. ఇంతటి శుభప్రదమయిన సందర్భాన మహాప్రవక్త (స)తో హజ్జ్ చేసే మహదవకాశం పొందాలని అరేబియా నలు మూలల నుంచీ జనం పెల్లుబికి వచ్చారు. జీకఅద నెల చివరి రోజుల్లో ఆయన మదీనా నుండి బయలుదేరారు. క్రీ.శ. 632 సంవత్సరంలో జిల్‌హజ్ మాసం 4వ తేదీ ఉదయాన మక్కా చేరుకున్నారు.

రావటంతోటే ముందు కాబా ప్రదక్షిణ చేశారు. తరువాత మకామె ఇబ్రాహీమ్‌లో రెండు రకాతుల నమాజ్ చేశారు. అక్కణ్ణుంచి సఫా గుట్టపైకి వెళ్ళారు. తిరిగి మర్వా గుట్టకు వచ్చారు. ఈ మధ్య ఆసాంతం దైవ స్తోత్రాన్ని కొనియాడుతూనే ఉన్నారు, ప్రార్థనలు చేస్తూనే ఉన్నారు. ప్రదక్షిణ 'సఫా' 'మర్వాల' 'సయీ' జరిపిన తరువాత ఆయన గురువారం నాడుఎనిమిదవ తారీఖున వెంటవచ్చిన ముస్లిము లందరితో 'మినా'లో మకాం వేశారు. రెండో రోజు జిల్‌హజ్ 9వ తారీఖున ప్రాతఃకాలపు (ఫజ్ర్) నమాజ్ తరువాత ఆయన మినా నుండి బయలుదేరి 'అరఫాత్' చేరారు. ఇక్కడే ఆయన తన చారిత్రాత్మకమయిన హజ్ ప్రసంగాన్ని వినిపించారు. ఈ హజ్జ్‌లోనే మహాప్రవక్త (స) హజ్జ్ సంప్రదాయాలన్నిటినీ స్వయంగా ఆచరించి హజ్జ్ ఎలా చేయాలో బోధించారు. మీరందరు హజ్జ్‌లో పాటించవలసిన పద్ధతులన్నీ ఇప్పుడు నా ద్వారా నేర్చుకోండి, నాకు తెలియదు, బహుశా నాకు మరోసారి హజ్జ్ కొరకు వచ్చే అవకాశం లభిస్తుందో లేదో!" అని సెలవిచ్చారు; అప్పుడే, "ఇప్పుడు ఇక్కడ ఉన్నవారు ఈ మాటలన్నీ ఇక్కడ లేనివారికి తెలియజేయాలి" అని కూడా అన్నారాయన.

ఈ శుభ సందర్భంలో వారు 1,25,000 యాత్రికులను ఉద్దేశించి తమ అంతిమ హజ్ ఖుత్బా (ఉపన్యాసం) అరఫాత్ మైదానంలో 9వ జిల్ హజ్జ్ రోజున ఇచ్చిరి. ఈ ఖుత్బా ప్రసంగంలో ఆయన (స)ఎన్నో ముఖ్య విషయాలు, ఉపదేశించారు. వాటిలో కొన్ని :-

## అంతిమ హజ్జ్ ప్రసంగం

"బాగా వినండి, అజ్ఞానకాలపు ఆచారాలన్నీ నా పాదాల క్రిందున్నాయి. (అంత మయిపొయ్యాయి). అరబ్బు వ్యక్తికి అరబ్బేతరునిపైగాని, అరబ్బేతరునికి అరబ్బుపైగాని ఎలాంటి ఆధిక్యత లేదు. మీరంతా ఆదమ్ సంతతిలోని వారే, ఆదమ్ మట్టితోనే సృజించ బడ్డారన్నది మరువకండి. "ముస్లిములంతా పరస్పరం సోదరులు." "మీరు బానిసలు! మీ బానిసలకు!! మీరు స్వయంగా తినే భోజనమే వారికి కూడా పెట్టండి. మీరు స్వయంగా ధరించే బట్టలే వారికి కూడా ధరించడానికి యివ్వండి.

"అజ్ఞానకాలపు హత్యాపరిహారాలన్నీ నేటితో అంతం చేయబడ్డాయి. (ఇక ఎవరికీ ఎవరి హత్య ప్రతీకారమూ తీర్చుకునే అధికారం లేదు). ప్రప్రథమంగా

నేనే నా వంశంలో రబియా బిన్ అల్ హరస్ కుమారుని హత్య ప్రతీకారాన్ని అంతం చేస్తున్నాను.

"అజ్ఞానకాలపు వడ్డీ లెక్కలన్నీ రద్దు చెయ్యబడ్డాయి. (ఇక ఎవరికీ వడ్డీని అడిగే హక్కు లేదు) ప్రప్రథమంగా నేనే నా వంశంలో అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్‌గారి వడ్డీని అంతం చేస్తున్నాను.

"మహిళల గురించి దేవునికి భయపడి మెలగండి, మీకు స్త్రీలపై ఏ విధంగా హక్కు ఉందో అదే విధంగా వారికి కూడా మీపై హక్కు వుంది.

"మీ రక్తం (ప్రాణం), మీ ధనం ప్రళయం వరకు ఒకరిదొకరికి పవిత్రం (అంటే నిషిద్ధం, వాటికి హానికాని, దోచుకోవటంకాని చేయరాదు)- ఈ రోజు, ఈ నెల, ఈ నగరం పవిత్రమైనట్టు!

"నేను మీ కొరకు ఒక వస్తువును వదిలి వెడుతున్నాను, దాన్ని మీరు దృఢంగా పట్టుకుని అనుసరించారంటే మీరు దారి తప్పరు- అదే దైవగ్రంథం దివ్యఖుర్‌ఆన్."

ఆ తరువాత మహాప్రవక్త (స) ఎన్నో షరీఅత్ ఆదేశాలు తెలిపారు. పిదప సమావేశమయిన వారిని సంబోధిస్తూ, "దైవసన్నిధిలో మిమ్మల్ని నా గురించి ప్రశ్నించి నపుడు మీరు ఏమని సమాధానమిస్తారు?" అనడిగారు.

"మీరు దేవుని సందేశం మాకు అందజేశారనీ, తమ కర్తవ్యాన్ని నిర్వర్తించారని బదులిస్తాం" అని జవాబు చెప్పారు సహాబా. దానికి ఆయన ఆకాశం వైపునకు వ్రేలెత్తి "అల్లాహ్! నీవే సాక్షి" అని మూడు పర్యాయాలు పలికారు. ఆ సందర్భంలోనే ఈ ఆయత్ అవతరించింది:

**"నేడు నేను మీ కొరకు మీ ధర్మాన్ని, జీవిత సంవిధానాన్ని పరిపూర్ణం గావించాను. నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను. మీ కొరకు ఇస్లామ్‌నే అనుసరణీయమైన ధర్మంగా సమ్మతించాను." (మాయిదా : 3)**

## అస్వస్థత

హి.శ. 11వ సంవత్సరం సఫర్ మాసం 29వ తేదీ సోమవారం ఆయన (స) ఓ జనాజా వెంట 'బకీ' నుంచి తిరిగి వచ్చేటప్పుడు దారిలోనే తలనొప్పి ప్రారంభమైంది. ఇది వారి మరణానికి ప్రారంభ సూచిక. ఆ పరిస్థితులలోనే

ఆయన పదకొండు రోజులు నమాజ్ చేయించారు. వ్యాధి కాలం మొత్తం 13 లేదా 14 రోజులు. మరణానికి 4 రోజుల (గురువారం) వరకు అన్ని నమాజులు వారే చేయించారు. చివరన చేయించింది మగ్‌రిబ్ నమాజ్. అప్పుడు ఆయనకు తల నొప్పిగా ఉండింది. తలకు తువ్వాలు చుట్టుకుని వచ్చారు. నమాజ్‌లో అల్‌ముర్సలాత్ సూరా పఠించారు. ఇషా నమాజ్ వేళకి బలహీనత అధిక మయింది. అందువల్ల ఆయన (స) నమాజ్‌కు రాలేకపొయ్యారు. అప్పుడు అబూబక్ర్ (ర)ను నమాజ్ చేయించాలని చెప్పారు. తదనుగుణంగా హజ్రత్ అబూబక్ర్ (ర) చాలా రోజుల వరకు నమాజ్ చేయించారు.

## అంతిమ నిర్దేశాలు

ఆ మధ్య ఒకరోజున ఒంట్లో కాస్త కులాసాగా ఉన్నట్లు అగుపిస్తే ఆయన స్నానం చేసి మస్జిద్‌కు విచ్చేశారు. అక్కడ ఒక ప్రసంగం చేశారు. అది ఆయన జీవితంలో చేసిన ఆఖరి ప్రసంగం, అందులో ఆయన ఇలా సెలవిచ్చారు:

"దైవం తన దాసునికి, ఇష్టమయితే ప్రాపంచిక భాగ్యాలను స్వీకరించవచ్చు లేదా దేవుని వద్ద పరలోకంలో వున్న దాన్ని స్వీకరించవచ్చు అని స్వేచ్ఛగా కోరుకునే అధికారాలనిస్తే అతను దేవుని వద్ద ఉన్నదాన్నే స్వీకరించాడు."

ఇది వినగానే, దానికి అర్థం ఏమిటో తెలుసుకున్న హజ్రత్ అబూబక్ర్ (ర) విలపించసాగారు. ఆయన (స) ఇంకా ఇలా అన్నారు:

"నేను అత్యధికంగా ఎవరి ధనానికయినా, ఎవరి మైత్రికయినా రుణపడి ఉన్నా నంటే, ఆయన అబూబక్ర్. నేను ప్రపంచంలో నా అనుచర సంఘంలోని వారిని ఎవరినయినా మిత్రునిగా ఎన్నుకోవాలంటే అది అబూబక్రే అయివుండే వాడు. కాని, మైత్రీ అనుబంధాలకు సరయిన ఆధారం ఇస్లామ్ మాత్రమే.

"ఇంకా బాగా వినండి, మీ కంటే ముందు ఉన్న సమాజాలు తమ ప్రవక్తల సమాధుల్ని, తమ మహనీయుల 'గోరీ'లను ఆరాధనాలయాలుగా మార్చు కున్నారు. జాగ్రత్త! మీరు అలా చేయకూడదు. నేను వారించి మరీ వెళుతున్నాను.

"హలాల్ (ధర్మసమ్మతమయిన), హరామ్ (అధర్మమయిన) వాటికి సంబంధించిన నిర్ణయాన్ని నాకు ఆపాదించకండి. దైవం హలాల్ చేసిన వాటినే నేనూ హలాల్ అని అన్నాను. దైవం హరామ్‌గా నిర్ణయించిన వాటినే హరామ్‌గా చెప్పాను."

ఇలా అనారోగ్యంగా ఉన్నప్పుడే ఒక రోజున తన కుటుంబం వారిని ఉద్దేశించి ఇలా చెప్పారు:

"దైవ సందేశహరుని కూతురు ఫాతిమా! దైవ సందేశహరుని అత్త సఫియా! దేవుని సన్నిధిలో మీకు పెన్నిధిగా ఉపకరించే దాన్ని ఇప్పుడే సిద్ధం చేసుకోండి. నేను మాత్రం మిమ్మల్ని దేవుని పరీక్ష నుండి తప్పించలేను."

ఒకరోజు బాధ అధికమయింది. ఆయన ఒకప్పుడు దుప్పటితో ముఖాన్ని కప్పుకుంటున్నారు, మరొకప్పుడు తీసివేస్తున్నారు. హ్రజత్ ఆయిషా (ర) గారు సూరా ఫలక్ మరియు నాస్‌లు పఠించి, దుఆలు చేసి ప్రవక్త (సఅసం)పై ఊదేవారు. శుభం స్వస్థత కలగాలనే తలంపుతో ప్రవక్త (సఅసం) వారి స్వహస్తాలనే వారి శరీరంపై నిమిరేవారు. ప్రవక్త (సఅసం) మరణానికి ఐదు రోజుల ముందు అంటే బుధవారం మస్జిద్‌లోనికి వెళ్లి మింబర్‌పై కూర్చొనే ఖుత్బా ఇచ్చారు. చుట్టు గుమికూడిన సహబా (ర)ను ఉద్దేశించి ఇలా అన్నారు:

"యూదులపై, క్రైస్తవులపై దైవాగ్రహం కలుగుగాక! వారు తమ ప్రవక్తల సమాధుల్ని ఆరాధనాలయాలుగా నిర్మించుకున్నారు." **"మీరు నా సమాధిని పూజల కోసం ఎట్టి పరిస్థితులలో కూడా ఓ విగ్రహంగా మార్చకండి."**

ఆయన ఎప్పుడో హ్రజత్ ఆయిషా వద్ద కొన్ని సవరాల బంగారం భద్రపరచి పెట్టారు. ఈ వ్యాకుల సమయంలోనే ఒకసారి అడిగారు "ఆయిషా! ఆ సవరాలెక్కడ! ముహమ్మద్ దైవంపట్ల అనుమానంలోపడి ఆయనతో కలుస్తాడా? వెళ్ళు, వెళ్ళి వాటిని దైవమార్గంలో దానం చేసివెయ్యి." తనవద్ద వున్న బానిసలందరిని స్వతంత్రులుగా చేశారు. తన వద్ద వున్న దీనారులను దానం చేశారు. కావునా మనం బ్రతికి వుండగానే దైవమార్గంలో ఖర్చు చేయటం ఉత్తమం.

## పరమోన్నత మిత్రుని వైపునకు

బాధ ఒక్కోసారి అధికమవుతోంది, ఒక్కోమారు తగ్గుతోంది. ఈ పరిస్థితుల లోనే హ్రజత్ ఫాతిమా (ర)కు "నీవు ప్రపంచ స్త్రీలకు సయ్యిదా (నాయకురాలువి) అని శుభవార్తను కూడా నిచ్చారు. అమ్మా నీ తండ్రికి ఈ రోజు తరువాత మరే బాధ ఉండదు" అని సెలవిచ్చారు. సహీ బుఖారి 2/641. దైవప్రవక్త (సఅసం) తమ ముద్దుల మనుమలను హ్రజత్ హసన్, హుస్సేన్ (ర)లను పిలిపించి

వారిని ముద్దాడారు. వారి యెడల ప్రేమగా ప్రవర్తించమని వసీయ్యత్ చేశారు. ఓ ఆయిషా (ర)'ఖైబరు'లో ఏ విషాహారాన్నయితే భుజించానో దాని బాధ ఇప్పుడు అనుభవిస్తున్నాను. దాని వలన నా ప్రాణం తెగిపోతుందని అన్నారు. సోమవారం నాడు కాస్త ప్రశాంతత ఏర్పడినట్లు గోచరించింది. కాని ప్రొద్దెక్కినకొద్దీ ఆయన మాటిమాటికీ స్పృహ కోల్పోవడం జరుగుతోంది. ఈ పరిస్థితిలో తరచుగా "దైవానుగ్రహం పొందిన వారితో" అనే మాటలు వినిపించేవి.

మరొకసారి, "అల్లాహ్! పరమోన్నత మిత్రుడు" అని.

ఇంకొకసారి. "ఎవరూ కారు ఆ పరమమిత్రుడే అవసరం" అని పలికేవారు.

చివరిసారి "రఫీకె ఆలా" (ఓ పరమ ఆప్తుడా) మూడుసార్లు పలికారు.

ఇలా పలుకుతూవుండగా పరిస్థితి విషమించింది. ఆయన పవిత్ర ఆత్మ పావన లోకాలకు పయనించింది. ఆయన (సఅసం) రఫీకె ఆలాను కలుసుకున్నారు.

అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్ బారిక్ వ సల్లమ్.

దేవా! ముహమ్మద్‌పై శాంతిని కురిపించు, శుభాలను కురిపించు.

ఆయన పరమపదించిన తేది హి.శ. 11వ సంవత్సరం రబీఉల్ అవ్వల్ మాసం సోమవారం రోజున 12వ తారీఖు అని ప్రతీతి. అప్పటికి వీరి వయస్సు 63 సంవత్సరాల నాలుగు రోజులు.

రెండవ రోజున అంత్యక్రియలు జరిగాయి. సాయంత్రానికల్లా ఆయన పరమ పవిత్ర దేహాన్ని ఆయన దివంగతులైన ఇంటి గదిలోనే (మదీనా) సమాధి చేయటం జరిగింది.

వీరు మరణించారు, మనమందరం మరణించవలసిన వారమే! **"ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్"** అల్లాహ్ వద్దకే మరలిపోవలసిందే.

ముహమ్మద్ (సఅస) జీవితం చాలా నిరాడంబరమైనది. బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన కొరత, బీదరికము సహించి సాధారణ జీవితం గడిపిరి. మహాసంపన్నురాలైన ఖదీజా (ర.అ)ను వివాహమాడినా జీవితాంతం వరకూ, కడు నిరుపేదగానే గడిపిరి. ఖదీజా సంపద, ధనం అంతయూ అల్లాహ్ మార్గంలో బీదలకు పంచిరి. మట్టి గోడల పూరి గుడిసయే వీరి నివాస గృహము. కటిక నేలపై ఖర్జూరపు చాపయే వీరి శయ్య. దీని మీదనే సమస్త రాచకార్యములు,

హితోపదేశములు. సాధారణ వస్త్రములే వీరి దుస్తులు. ఖర్జూరపు ఫలములే వీరి ఆహారం. కొన్ని రోజులపాటు పస్తు (ఉపవాసం) ఉండెడివారు. అహోరాత్రులు ప్రజల యోగక్షేమమునకై, వారి జ్ఞానోదయమునకై కంట తడితో ప్రార్థనలు చేసెడివారు.

దివ్యఖుర్ఆన్‌లో ఆదేశించిన ఆజ్ఞలను, హితోపదేశములను, తమ నిత్య జీవితంలో నిముడ్చుకుని తు.చ. తప్పక అమలు జరిపిన ముహమ్మద్ (సఅస) వారి పవిత్ర జీవితం సకల మానవకోటికి ఆదర్శనీయమైనది. ముహమ్మద్ (సఅస) తానుచేసినవి, ఆజ్ఞాపించినవి, ప్రజలకు హితోపదేశము చేసిన వాటిని 'సున్నతె రసూలుల్లా' అంటారు. వీటిని ఫర్జ్‌తోపాటు విధిగా ఆచరించవలసిన బాధ్యత ప్రతి ముస్లింపై ఉన్నది. ముహమ్మద్ (సఅస)వారి నిరంతర కృషి, ప్రచారం వల్ల యావత్ అరేబియా దేశపు ప్రజలందరూ ఇస్లాం స్వీకరించిరి. మరియు ప్రపంచంలోని మారుమూల దేశపు ప్రజలందరూ ఇస్లాం బోధనలను గ్రహించి, అందలి సత్యమును విశ్వసించి, తమంత తాము మనఃపూర్వకముగా ఇస్లాం ధర్మము స్వీకరించిరి. నేడు ఇస్లాం ప్రపంచపు మతములలో అగ్రస్థానము వహించియున్నది అంటే ఇస్లాం ధర్మం సూత్రముల ఫలితమే. ముహమ్మద్ (సఅస) ఒక ముస్లిములకే ప్రవక్తకాదు. యావత్ మానవ జాతికి మార్గదర్శి. సమస్త ప్రజలందరికీ అగ్రగణ్యులుగా, మహాప్రవక్తగా ఎంచబడి వారందరికీ ఇమామత్ చేసి నమాజ్ చదివించిన అద్భుత సంఘటనయే (మేరాజ్ యాత్రయే) ఒక తార్కాణము. వీరి ఖ్యాతి, ఘనత, గొప్పతనము, సకల సద్గుణములు వారి హదీసుల ద్వారా తేటతెల్లమగును. వెయ్యేల! అన్నిటి కన్నా ఖుర్ఆన్ గొప్పతనము ఒక నిదర్శనము. అది ఒక మోజిజా (MIRACLE).

## ముహమ్మద్ (సఅస) జీవితంలోని కొన్ని ముఖ్యమైన సంఘటనలు

1. క్రీ.శ. 570 ఈశ్వీ ముహమ్మద్ (సఅస) జననమునకు కొన్ని నెలల ముందే తండ్రిగారైన అబ్దుల్లాహ మరణము.
2. క్రీ.శ. (20-4-570 ఎ.డి.) ముహమ్మద్ (సఅస) మక్కాలో సోమవారం సూర్యోదయమునకు ముందే జన్మించిరి.
3. క్రీ.శ. 576 'తల్లి ఆమినా' కాలము చేసిరి.
4. క్రీ.శ. 595 'ఖదీజా (ర.అ)తో ముహమ్మద్ (సఅస) వివాహము.
5. 12-2-610, శుక్రవారం 'మొట్టమొదటిసారిగా దైవసందేశము'.

6. క్రీ.శ. 619 'ఖదీజా (ర.అ.)' అబూతాలిబ్‌ల మరణము
7. క్రీ.శ. 620 'ముహమ్మద్ (సఅస)' మేరాజ్ ప్రయాణం.
8. క్రీ.శ. 622 'ముహమ్మద్ (సఅస)' తన అనుచరులతో మదీనా వలస పోవుట, ముస్లిం సంవత్సర ప్రారంభం (హిజ్రీ)
9. క్రీ.శ. 624 'బద్ర్ యుద్ధం'
10. క్రీ.శ. 625 'ఉహద్' యుద్ధం.
11. క్రీ.శ. 627 'కందక' యుద్ధం
12. క్రీ.శ. 629 'ముహమ్మద్ (సఅస)' తన అనుచరుల ద్వారా, ఉత్తరముల ద్వారా, పర్షియా, యమన్, ఇథియోపియా రాజులకు, హెరాక్లియస్ చక్రవర్తికి ఇస్లాం సిద్ధాంతాలు, ఆమోదించవలసినదిగా ఆహ్వానం పంపుట.
13. 630 'ముహమ్మద్ (సఅస) మక్కాను వశపర్చుకొనుట, ఎందరో అవిశ్వాసులు, ముస్లింలు అయినారు. మక్కా ఇస్లామీయ జగత్తుకు కేంద్రంగా నిర్ణయించబడినది.
14. క్రీ.శ. 631 'అరేబియా' అంతటా ఇస్లాం సిద్ధాంతాలు అంగీకరించబడినవి.
15. క్రీ.శ. 632 'ముహమ్మద్ (సఅస)' కడసారి మక్కా యాత్ర.
16. క్రీ.శ. 632 'మక్కా యాత్ర నుండి మదీనా తిరిగి వచ్చిన తర్వాత ముహమ్మద్ (సఅస) 11వ సం. హి.శ. రబీవుల్ అవ్వల్ నెల 12వ తేదీ, సోమవారం స్వర్గస్తులైనారు.

వీరి తర్వాత ప్రపంచమునకు మరెవ్వరూ పైగంబరులు పంపబడరు. ఖుర్‌ఆన్ తర్వాత మరియే దివ్య గ్రంథము వెలువడదు. ఇంతటితో ఇస్లాం పరిపూర్ణత పొందినది. ఈ విధంగా ముహమ్మద్ (సఅస) అల్లాహ్‌చే ఏ కార్యమునకు పంపబడినారో, ఆ కార్యసిద్ధి అయినది. వారి మిషన్ వారి జీవితంలో పూర్తిగా నింపబడినది. వారు అల్లాహ్‌కు ప్రియులు (మహబూబ్) అయినారు. మనందరం వారి ఉమ్మత్ గావున వారి ఆశీర్వచనములు ద్వారా ధన్యులై నాము. మన జీవితం సఫలమైనది. "ఆమీన్."

*ఈ పుస్తకాన్ని ఖుర్‌ఆన్, హదీసు వెలుగులలో మా జ్ఞాన పరిధి మేరకు కృషిచేసి మీకు అందిస్తున్నాము. మాకు తెలియని ఏవైనా తప్పులు ఉన్నట్లయితే అల్లాహ్ మమ్మల్ని క్షమించాలని ప్రార్థిస్తున్నాను.* ***ఆమీన్.***

# 36. యాసీన్

**రుకూ : 5** **ఆయత్‌లు : 83**

## పరిచయం

ఏక దైవారాధన, ప్రవక్తల పరంపర, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం వంటి మౌలిక ధార్మిక విశ్వాసాల గురించి ఈ సూరా నొక్కి చెప్పింది. ఈ సూరా ప్రారంభ పదాన్ని దీనికి పేరుగా పెట్టడం జరిగింది. దివ్యఖుర్‌ఆన్ దేవుని వాక్కు అని ప్రమాణపూర్వకంగా చెబుతూ ఈ సూరా ప్రారంభమయ్యింది. అల్లాహ్ ప్రతి విషయాన్ని స్పష్టంగా తెలుపుతున్నాడని, హితబోధ అందిస్తున్నాడనీ, ముహమ్మద్ (సఅసం) దేవుని తరపున వచ్చిన దైవసందేశహరుడనీ, మానవాళికి ఆయన కారుణ్యం వంటివారని తెలిపింది. దివ్యఖుర్‌ఆన్‌ను బాహాటంగా వ్యతిరేకిస్తూ, విశ్వాసాన్ని పూర్తిగా తిరస్కరిస్తున్న అవిశ్వాసుల గురించి ప్రస్తావిస్తూ పరలోకంలో తీవ్రమైన శిక్ష వారికోసం వేచి ఉందని తెలిపింది. అల్లాహ్ మరణించిన వారికి మళ్ళీ జీవితం ఇస్తాడనీ, మనిషి చేసిన కర్మలన్నీ నమోదై ఉన్నాయనీ, వాటి లెక్క తీసుకోవడం జరుగుతుందనీ, తీర్పుదినాన ప్రతి ఒక్కరు తాము చేసిన పనికి జవాబు చెప్పుకోవలసి ఉంటుందనీ హెచ్చరించింది. మరణించిన తర్వాత మళ్ళీ జీవితం అన్నది లేనే లేదని వాదించే అవిశ్వాసులు, మరణించిన తర్వాత శరీరం కుళ్ళి కృశించి ఎముకలు కూడా మిగలవు కాబట్టి ఇక మళ్ళీ జీవితం అన్న ప్రశ్నే ఉండదని వాదించే అవిశ్వాసుల వాదనకు జవాబిస్తూ, మనిషిని ఒకసారి సృష్టించిన దేవుడు మళ్ళీ కుళ్ళి కృశించిపోయిన శరీరాన్ని కూడా లేపి నిలబెట్టే సామర్థ్యం కలవాడనీ, ఆయనకు సృష్టిలోని ప్రతిదీ తెలుసనీ, అల్లాహ్ ఏదైనా చేయాలనుకుంటే, కేవలం 'అయిపో' అని ఆదేశిస్తే చాలు అయిపోతుందని ఈ సూరా తెలియజేసింది. దైవదూత ఇస్రాఫీల్ శంఖం పూరించిన రోజున మరణించినవారు తమ సమాధుల్లోంచి లేచి విశ్వప్రభువు ముందు హాజరవుతారని తెలియజేసింది. అప్పుడు అవిశ్వాసులకు తాము చేసిన తప్పు తెలిసి వస్తుందనీ, అల్లాహ్ చేసిన వాగ్దానం నిజమైనదనీ, ఆయన తన ప్రవక్తల ద్వారా పంపిన సందేశం యదార్థమైనదనీ గుర్తిస్తారు. మరణించిన తర్వాత మళ్ళీ లేపి నిలబెట్టడం సత్యమని గ్రహిస్తారు.

యాసీన్ (1) వల్ ఖుర్ఆనిల్ హకీమ్ (2) ఇన్నక లమినల్ ముర్సలీన్ (3) అలా సిరాతిమ్ ముస్తఖీమ్ (4) తన్జీలల్ అజీజిర్ రహీమ్ (5) లితున్జిర ఖౌమమ్ మా ఉన్జిర ఆబాఉహుమ్ ఫహుమ్ గాఫిలూన్ (6) లఖద్ హఖ్ఖల్ ఖౌలు అలా అక్ సరిహిమ్ ఫహుమ్ లా యుఅమినూన్ (7) ఇన్నా జఅల్నా ఫీ అత్నాఖిహిమ్ అగ్లా లన్ ఫహియ ఇలల్ అజ్ఖాని ఫహుమ్ ముఖ్మహూన్ (8) వజఅల్నా మిమ్బైని ఐదీహిమ్ సద్దవ్ వమిన్ ఖల్ ఫిహిమ్ సద్దన్ ఫఅగ్ షైనాహుమ్ ఫహుమ్ లా యుబ్సిరూన్ (9) వసవా ఉన్ అలైహిమ్ అఅన్ జర్త హుమ్ అమ్లమ్ తున్జిర్హుమ్ లా యుఅమినూన్ (10) ఇన్నమాతున్ జిరు మనిత్తబఅజ్ జిక్ర వఖషియర్ రహ్మాన బిల్ గైబి ఫబష్షిర్ హు బిమగ్ఫిరతివ్ వఅజ్రిన్ కరీమ్ (11) ఇన్నా నహ్ను నుహయిల్ మౌతా వనక్తుబు మా ఖద్దమూ వ ఆసారహుమ్ వకుల్ల షైఇన్ అహ్సైనాహు ఫీ ఇమామిమ్ ముబీన్ (12) వజ్రిబ్ లహుమ్ మసలన్ అస్హాబల్ ఖర్యహ్. ఇజ్జాఅహల్ ముర్సలూన్ (13) ఇజ్ అర్సల్నా ఇలైహిముస్నైని ఫకజ్జబూహుమా ఫఅజ్ జజ్నాబి సాలిసిన్ ఫఖాలూ ఇన్నా ఇలైకుమ్ ముర్సలూన్ (14) ఖాలూమా అన్తుమ్ ఇల్లాబషరుమ్ మిస్లునా వమా అజ్జలర్ రహమాను మిన్షై ఇన్ ఇన్అన్తుమ్ ఇల్లా తక్జిబూన్ (15) ఖాలూ రబ్బునా యఅలము ఇన్నా ఇలైకుమ్ లముర్ సలూన్ (16) వమా అలైనా ఇల్లల్ బలాగుల్ ముబీన్ (17) ఖాలూ ఇన్నా తతయ్యర్నా బికుమ్ లఇల్లమ్ తన్ తహూ లనర్ జుమన్నకుమ్

వలయమస్ సన్నకుమ్ మిన్నా అజాబున్ అలీమ్ (18) ఖాలూ తాఇరుకుమ్ మఅకుమ్ అఇన్ జుక్కిరుతుమ్ బల్అన్తుమ్ ఖౌముమ్ ముస్రిఫూన్ (19) వజాఅ ఆమిన్ అఖసల్ మదీనతి రజులుయ్ యస్ఆ ఖాల యాఖౌమిత్తబిఉల్ ముర్సలీన్ (20) ఇత్తబిఊ మల్లా యస్అలుకుమ్ అజ్రవ్ వహుమ్ ముహతదూన్ (21) <u>వమాలియ లాఅఅబుదుల్లజీ ఫతరనీ వఇలైహి తుర్జఊన్</u> (22) అఅత్తఖిజు మిన్ దూనిహీ ఆలిహతన్ ఇయ్యురిద్నిర్ రహ్మాను బిజుర్రిల్ లాతుగ్ని అన్నీ షఫాఅతుహుమ్ షైఅవ్ వలా యున్ఖిజూన్ (23) ఇన్నీ ఇజల్ లఫీ జేలాలిమ్ ముబీన్ (24) ఇన్నీ ఆమన్తు బిరబ్బికుమ్ ఫస్మ మూన్ (25) ఖీలద్ ఖలిల్ జన్నహ్ ఖాల యాలైత ఖైమి యఅలమూన్ (26) బిమా గఫర లీ రబ్బీ వజఅలనీ మినల్ ముక్రమీన్ (27) వమా అన్ జేల్నా అలా ఖౌమిహీ మిమ్బఅ దహీ మిన్జున్దిమ్ మినస్ సమాఇ వమా కున్నా మున్జేలీన్ (28) ఇన్కానత్ ఇల్లా సైహతవ్ వాహిదతన్ ఫైఇజా హుమ్ ఖామిదూన్ (29) యహాస్ రతన్ అలల్ ఇబాది మా యత్తీహిమ్ మిర్రసూలిన్ ఇల్లా కానూ బిహీ యస్తహ్జేఊన్ (30) అలమ్ యరౌకమ్అహ్లక్నా ఖబ్లహుమ్ మినల్ ఖురూని అన్నహుమ్ ఇలైహిమ్ లాయర్జిఊన్ (31) వ ఇన్కుల్లుల్ లమ్మా జమీఉల్ లదైనా ముహ్ఫరూన్ *(32)* వాయతుల్ లహుముల్ అర్జుల్ మైతతు అహ్ యైనాహు వఖరజ్నా మిన్హా హబ్బన్ ఫమిన్హు యత్కులూన్ (33) వజఅల్నా ఫీహా జన్నాతిమ్ మిన్నఖీలివ్

వఅత్నా బివ్‌( వషజ్జేర్నా ఫీహా మినల్ ఉయూన్ (34) లియ త్కులూ మిన్‌సమరిహీ వమా అమిలత్‌హు ఐదీహిమ్ అఫలా యష్కురూన్ (35) సుబ్‌హానల్లజీ ఖలఖల్ అజ్‌వాజకుల్లహా మిమ్మాతుమ్‌బితుల్ అర్జు వమిన్ అన్ఫుసిహిమ్ వవిమ్మా లాయత్‌లమూన్ (36) వఆయతుల్ లహుముల్ లఖమిన్‌హున్ సహార ఫిజా హుమ్ ముజ్‌లిమూన్ (37) వష్‌షమ్‌సు తజ్‌రీలిముస్ తఖ్రిల్‌లహు జాలిక తఖ్‌దీరుల్ అజీజిల్ అలీమ్ (38) వల్‌ఖమర ఖద్దర్నాహు మనాజిల హత్తా ఆదకల్ ఉర్‌జూనిల్ ఖదీమ్ (39) లష్ షమ్‌సు యమ్‌బగీ లహా అన్‌తుద్‌రికల్ ఖమర వలల్ లైలు సాబిఖున్నహార్ వకుల్లున్ ఫీ ఫల కియ్‌(యస్‌బహూన్ (40) వ ఆయతుల్ లహుమ్ అన్నా హమల్నా జుర్రి‌య యతహూమ్ ఫీల్ ఫుల్‌కిల్ మష్‌హూన్ (41) వ ఖలఖ్‌నా లహుమ్ మిమ్ మిస్‌లిహీ మా యర్‌కబూన్ (42) వఇన్ నషత్‌నుగ్‌రిఖ్ హుమ్ ఫలా సరీఖ లహుమ్ వలాహుమ్ యున్‌జజూన్ (43) ఇల్లా రహ్‌మతమ్ మిన్నా వమతాఅన్ ఇలాహీన్ (44) వఇజా ఖీల లహుముత్ త్తఖూ మాబైన ఐదీకుమ్ వమా ఖల్‌ఫకుమ్ లఅల్లకుమ్ తుర్‌హమూన్ (45) వమా తత్‌తీహిమ్ మిన్ ఆయాతిమ్ మిన్ ఆయాతి రబ్బిహిమ్ ఇల్లా కానూ అన్‌హు ముత్‌రిజీన్ (46) వఇజా ఖిలలహుమ్ అన్‌ఫిఖూమిమ్మా రజఖ కుముల్లాహు ఖాలల్ లజీన కఫరూ లిల్లజీన ఆమనూ అనుత్ ఇముమల్ లౌయషాఉల్లాహు అత్ అమహూ ఇన్‌అన్‌తుమ్ ఇల్లా ఫీ జలాలిమ్ ముబీన్ (47) వయఖూలూన మతాహుజల్ వత్‌దుఇన్‌కున్‌తుమ్ సాదిఖీన్ (48) మా

యన్‌జురూన ఇల్లా సైహతవ్‌ వాహితదన్ తత్‌ఖుజుహుమ్ వహుమ్ ఖిస్సిమూన్ (49) ఫలా యస్‌తతీ ఊన తౌసియతవ్‌ వలా ఇలా అహ్‌లిహిమ్ యర్‌జిఊన్ (50) వనుఫీఖ ఫిస్సూరి ఫ ఫఇజాహుమ్ మినల్ అజ్‌దాసి ఇలా రబ్బిహిమ్ యన్‌సిలూన్ (51) ఖాలూ యా వైలనా మమ్ బఅ సనా మిమ్ మర్ ఖదినా. హాజామావఅదర్ రహ్‌మాను వసద ఖల్ ముర్‌సలూన్ (52) ఇన్ కానత్ ఇల్లా సైహతన్ వాహిదతన్ ఫఇజా హుమ్ జమీఉల్ లదైనా ముహ్‌జేరూన్ (53) ఫల్ యౌమ లాతుజ్‌లము నఫ్‌సున్ షైఅన్ వలాతుజ్ జౌన ఇల్లా మాకున్‌తుమ్ తత్‌మలూన్ (54) ఇన్న అస్‌హాబల్ జన్నతిల్ యౌమ ఫీ షుగులిన్ ఫాకిహూన్ (55) హుమ్ వఅజ్ వాజుహుమ్ ఫీజిలాలిన్ అలల్ అరాఇకి ముత్తకిఊన్ (56) లహుమ్ ఫీహా ఫాకిహతువ్‌ వలహుమ్ మా యద్దఊన్ (57) సలామున్ ఖౌలమ్ మిర్ రబ్బిర్ రహీమ్ (58) వమ్ తాజుల్ యౌమ అయ్యుహల్ ముజ్‌రిమూన్ (59) అలమ్ అత్‌హద్ ఇలై కుమ్ యాబనీ ఆదమ అల్‌లా తత్‌బుదుష్ షైతాన ఇన్న హూలకుమ్ అదువ్వుమ్ ముబీన్ (60) వ అనిత్ బుదూనీ హాజా సిరాతుమ్ ముస్‌తఖీమ్ (61) వలఖద్ అజల్ల మిన్‌కుమ్ జిబిల్లన్ కసీరా అఫలమ్ తకూనూ తత్‌ఖిలూన్ (62) హాజిహీ జహన్నముల్ లతీ కున్‌తుమ్ తూఆదూన్ (63) ఇస్‌లై హల్ యౌమ బిమాకున్‌తుమ్ తక్‌ఫురూన్ (64) అల్ యౌమ నఖ్‌తిము అలా అఫ్‌వాహిహిమ్ వతుకల్లిమునా ఐదీహిమ్ వతష్ హదుఅర్‌జులు హుమ్ బిమా కానూ యక్‌సిబూన్ (65) వలౌ నషా ఉలతమస్‌నా అలా

అత్‌యునిహిమ్ ఫస్‌తబఖుస్ సిరాత ఫఅన్నాయుబ్‌సిరూన్ (66) వలౌ నషాఉల మసఖ్ నాహుమ్ అలా మకా నితిహిమ్ ఫమస్ తతాఊ ముజియ్యవ్‌ వలా యర్‌జిఊన్ (67) వమన్ నుఅమ్ మిర్‌హు నునక్కిస్‌హు ఫిల్ ఖల్‌ఖి అఫలా యత్‌ఖిలూన్ (68) వమా అల్లమ్ నాహుష్ షిత్‌ర వమా యమ్‌బగీ లహూ ఇన్‌హువ ఇల్లా జిక్ రువ్‌ వఖుర్‌ఆనుమ్ ముబీన్ (69) లియున్‌జిర్ మన్ కాన య్యవ్ వయ హిఖ్ఖల్ ఖౌలు అలల్ ఖాఫిరీన్ (70) వఅవలమ్ యరౌ అన్నా ఖలఖ్‌నా లహుమ్ మిమ్మా అమిలత్ ఐదీ నా అన్‌ఆమన్ ఫహుమ్ లహా మాలికూన్ (71) వజల్ లల్నాహు లహుమ్ ఫమిన్‌హా రకూబహుమ్ వమిన్‌మా యత్‌కులూన్ (72) వలహుమ్ ఫీహా మనాఫిఉవమషారిబ్ అఫలా యష్‌కురూన్ (73) వత్తఖజూ మిన్‌దూనిల్లాహి ఆలిహతల్ లఅల్లహుమ్ యున్‌సరూన్ (74) లాయస్‌తతీ ఊనవస్‌రహుమ్ వహుమ్ లహుమ్ జున్‌దుమ్ ముహ్‌జరూన్ (75) ఫలా యుహ్‌జున్ ఖౌలుహుమ్ ఇన్నా తనత్‌లము మాయుసిర్రూన వమా యుత్‌లినూన్ (76) అవలమ్ యరల్ ఇన్‌సాను అన్నా ఖలఖ్ నాహు మిన్‌నుత్ ఫతిన్ ఫఇజా హువఖసీముమ్ ముబీన్ (77) వజరబ లనా మసలవ్‌ వవసియ ఖల్‌ఖహ్ ఖాలమయ్‌ యుహ్ ఇల్ ఇజామ వహియ రమీమ్ (78) ఖుల్ యుహ్ ~~ఈ~~ హల్ లజీఅన్ షఅహా అవ్వల మర్రహ్ వహువ బికుల్లి ఖేల్‌ఖేన్ అలీమ్ (79) అల్లజీ జఅల లకుమ్ మినష్ షజరిల్ అఖ్‌జరినారన్ ఫఇజా అన్‌తుమ్ మిన్‌హు తూఖేదూన్ (80) అవలైసల్ లజీఖలఖస్ సమావాతి వల్ అరజ బిఖాది రిన్

**అలా అయ్‌ఁ యఖ్‌లు ఖమిస్ లహుమ్ బలా వహువల్ ఖల్లా ఖుల్ అలీమ్ (81) ఇన్నమా అమ్‌రుహూ ఇజా అరాద షైఁ అన్ అయ్‌ఁయఖూల లహూకున్ ఫయకూన్ (82) ఫసుబ్‌హానల్ లజీ బియదిహీ మలకూతు కుల్లి షైఁ ఇయిన్‌ఁ వ ఇలైహి తుర్‌జఊన్ (83)**

*అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.*

1 - 6 యాసీన్. వివేక విలసితమైన ఖుర్ఆన్ సాక్షిగా! నీవు నిశ్చయముగా దైవ ప్రవక్తలలోని వాడవు; ఋజుమార్గంలో ఉన్నావు. (ఈ ఖురాన్) శక్తిమంతుడూ, కరుణామయుడూ అయినవాడు అవతరింపజేసినది; నీవు జాతి వారి తండ్రి తాతలైతే నిర్లక్ష్యానికి, అన్యాయానికి గురై ఉన్నారో వారిని హెచ్చరించే నిమిత్తం అవతరించినది.

7 - 11 వారిలో అనేకులు శిక్షా నిర్ణయానికి అర్హులయ్యే ఉన్నారు. కనుకనే వారు విశ్వసించటం లేదు. మేము వారి మెడలలో పట్టాలు వేశాము, వాటివల్ల వారు గడ్డాల వరకు బంధించబడ్డారు. అందుకని వారు తలను ఎత్తి నిలుచున్నారు. మేము వారి ముందు ఒక గోడనూ, వారి వెనుక మరొక గోడనూ నిలబెట్టాము. మేము వారిని (ఈ విధంగా) కప్పి వేశాము, ఇక వారికి ఏమీ తోచదు. నీవు వారిని హెచ్చరించినా, హెచ్చరించకపోయినా వారికి ఒక్కటే; వారు విశ్వసించరు. నీవు హితబోధను అనుసరించేవాణ్ణి, కరుణామయుడైన అల్లాహ్‌ను చూడకుండానే భయపడేవాణ్ణి మాత్రమే హెచ్చరించగలవు. అతనికి క్షమాభిక్ష, గొప్ప ప్రతిఫలమూ లభిస్తాయనే శుభవార్త అందించు.

12 మేము నిశ్చయంగా ఒక రోజున మృతులను బ్రతికిస్తాము. వారు చేసే పనులన్నింటినీ మేము నమోదు చేస్తూనే ఉన్నాము. వారు తమ వెనుక విడిచివెళ్ళిన చిహ్నాలను కూడా మేము నమోదు చేస్తూ ఉన్నాము. ప్రతి విషయాన్నీ మేము ఒక స్పష్టమైన గ్రంథంలో వ్రాసిపెట్టాము.

13 - 15 ఉదాహరణగా వారికి ఆ పట్టణవాసుల గాథను వినిపించు; అక్కడకు దైవప్రవక్తలు వచ్చినప్పటి గాథను; మేము వారివద్దకు ఇద్దరు ప్రవక్తలను పంపగా వారు ఆ ఇద్దరినీ అసత్యవాదులు అని తిరస్కరించారు. తరువాత మేము వారికి

సహాయంగా మూడో అతన్ని (ప్రవక్తను) పంపాము. వారందరూ, "మేము మీ వద్దకు దైవ ప్రవక్తలుగా పంపబడ్డాము" అని అన్నారు. దానికి ఆ నగరవాసులు ఇలా అన్నారు, "మీరు కేవలం మా వంటి మానవులే తప్ప మరేమీ కారు. కరుణామయుడైన దేవుడు ఏ సందేశాన్ని అవతరింపజేయలేదు, మీరు కేవలం అబద్ధం పలుకుతున్నారు."

16 - 19 దైవప్రవక్తలు ఇలా అన్నారు, "మేము నిశ్చయంగా మీ వద్దకు దైవప్రవక్తలుగా పంపబడిన విషయాన్ని మా ప్రభువు ఎరుగును. స్పష్టంగా సందేశాన్ని అందజేయటం తప్ప మాపైని మరొక బాధ్యత ఏదీ లేదు. పట్టణ వాసులు ఇలా అన్నారు, "మేము మిమ్మల్ని (మాకు) ఒక దుశ్శకునంగా పరిగణిస్తు న్నాము. మీరు (ఈ పనిని) మానుకోకపోతే, మేము మిమ్మల్ని రాళ్లతో కొట్టి చంపేస్తాము. మీకు మా తరపు నుండి బాధాకరమైన శిక్షపడుతుంది." దానికి దైవప్రవక్తలు ఇలా అన్నారు : "మీ దుశ్శకునం స్వయంగా మీతోనే ఉంది. మీకు హితబోధ చేయటం వల్లనే మీరు ఇలా మాట్లాడుతున్నారా? అసలు విషయం, మీరు హద్దులను అతిక్రమించిపోయిన ప్రజలు."

20 - 25 ఇంతలోనే పట్టణంలోని ఒక మారుమూల ప్రాంతం నుండి ఒక వ్యక్తి పరుగెత్తుకుంటూ వచ్చి ఇలా అన్నాడు: "నా జాతి ప్రజలారా! దైవప్రవక్తలను అనుసరించండి. మీ నుండి ఏ ప్రతిఫలమూ కోరని వీరిని, సత్యమార్గంలో ఉన్న వీరినే అనుసరించండి. ఎవరైతే నన్ను సృష్టించారో, ఎవరి వైపునకు మీరంతా మరలిపోనున్నారో, ఆయనను నేనెందుకు పూజించకూడదు? అయనను కాదని నేను ఇతరులను ఆరాధ్యులుగా చేసుకోవాలా? నిజంగా ఒకవేళ కరుణా మయుడైన దేవుడు నాకేదైనా నష్టం కలిగించదలిస్తే నాకు వారి సిఫారసూ ఏ మాత్రం ఉపయోగపడదు మరియు వారు నన్ను కాపాడనూ లేరు. ఒకవేళ నేను అలాచేస్తే, స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో పడిపోయిన వాడిని అవుతాను. నేను మీ ప్రభువువైన అల్లాహుత ఆలాను విశ్వసించాను. కనుక మీరు కూడా నా మాట వినండి." అయితే అతను ఆ జాతి వాడే. కాని ఆ జాతి వారే ఆయన్ను దేశం నుండి వెళ్ళగొట్టారు.

26 - 27 (చివరకు నగరవాసులు అతన్ని హత్య చేశారు) ఆ వ్యక్తితో, "స్వర్గంలో ప్రవే శించు" అని అనబడింది. అప్పుడు అతను ఇలా అన్నాడు: "నా ప్రభువు

ఏ విషయాన్నిబట్టి నన్ను క్షమించి, గౌరవనీయులలోకి ప్రవేశింపజేశాడో, అనేది నా జాతి వారికి తెలిస్తే ఎంత బాగుండును!"

28 - 32 మరియు ఆ తరువాత అతని జాతి మీదకు మేము ఆకాశం నుండి ఏ సైన్యాన్నీ దించలేదు. అసలు సైన్యాన్ని పంపే అవసరం మాకు లేదు. కేవలం ఒక ప్రేలుడు (పునరుత్థాన దినమున ఇస్రాఫీల్‌చే)మాత్రమే సంభవించింది. అంతే వారంతా ఒక్కసారిగా ఆరిపోయారు. దాసుల స్థితి కడు శోచనీయం. వారి వద్దకు ఏ దైవ ప్రవక్త వచ్చినా, వీరు ప్రవక్తలను ఎగతాళే చేశారు. వారికి పూర్వం మేము ఎన్నో జాతులను ఇలా నాశనం చేసిన విషయాన్ని వారు చూడలేదా? తరువాత అవి మళ్ళీ ఎన్నడూ వారి వద్దకు తిరిగి రాని విషయాన్ని కూడా వారు గమనించలేదా? వారందరూ ఒక రోజు మా ముందు హాజరు పరచబడవలసి ఉన్నది.

33 - 36 వారికి ఈ మృతభూమి ఒక సూచన. మేము దానికి వర్షంతో ప్రాణం పోశాము. దానినుండి మీరు తినే ధాన్యం ఉత్పత్తి చేశాము. మేము దానిలో ఖర్జూరం, ద్రాక్ష తోటలను పెంచాము. దానిలో నుండి నీటి ఊటలు చిమ్మేలా చేశాము, వారు (మీరు) దాని ఫలాలను తినాలని. ఇదంతా వారి (మీరు) చేతులు సృష్టించింది కాదు కదా! అలాంటప్పుడు వారు (మీరు) కృతజ్ఞతలు తెలుపరా? అన్ని రకాల జంటలను సృష్టించిన ఆయన (అల్లాహ్) పరిశుద్ధుడు. అవి భూమిలో నుండి పుట్టే వృక్షరాసులలోనివైనా సరే లేదా స్వయంగా వారి జాతి (అంటే మానవులు)లో నుండి అయినా సరే లేదా వారు అసలే ఎరుగని వస్తువులలో నుండి అయినాసరే.

37 - 40 వారికి, రాత్రి మరొక సూచన. మేము దానిపై నుండి పగలును తొలగించినప్పుడు వారిని చీకటి ఆవరిస్తుంది. ఇక సూర్యుడు - అతడు తన నిజస్థానం దిశగా పయనిస్తున్నాడు. ఇది మహా శక్తిమంతుడూ, గొప్ప జ్ఞానీ అయిన ఆఅల్లాహ్ నిర్దేశించిన నియమావళి. ఇక చంద్రుడు, అతడి కొరకు మేము దశలను నిర్దేశించాము. వాటిని దాటుకుంటూ వెళ్లి, చివరకు అతడు మళ్లీ ఎండిన ఖర్జూరపు కొమ్మ మాదిరిగా మారిపోతాడు. చంద్రుణ్ణి పట్టుకోవటం సూర్యుడి తరం కాదు. అదేవిధంగా రాత్రి, పగలును దాటి పోజాలదు. అవన్నీ వేర్వేరు కక్ష్యలలో తేలియాడుతూ ఉన్నాయి.

41 - 44 వారికి మరియొక సూచన ఏమంటే, మేము వారి సంతతిని నిండు నావలోకి ఎక్కించాము, తరువాత అటువంటి నావలనే వారికొరకు ఎన్నో సృష్టించాము. వాటిలో వారు ప్రయాణం చేస్తున్నారు. మేము తలచుకుంటే వారిని ముంచివేసేవారము. అప్పుడు వారి మొర ఆలకించేవాడెవ్వడూ ఉండడు. ఏ విధంగానూ వారు రక్షింపబడలేరు. మేము (అల్లాహ్) కరుణిస్తే తప్ప! మరియు మేము కొంతకాలము వరకు వారికి వ్యవధినిస్తే తప్ప!

45 - 47 మరియు వారితో మీకు ముందు రాబోతున్న ఇహలోక శిక్షకూ, మీ వెనుక రానున్న దానికి (పరలోక శిక్ష నుండి) మిమ్మల్ని మీరు కాపాడుకొనండి. బహుశా మీపై "అల్లాహ్ దయచూపటం జరుగవచ్చు" అని వారితో అన్నపుడు (వారు వినీ విననట్లు వెళ్లిపోతారు). వారి ముందుకు వారి ప్రభువు సూచనలలోని ఏ సూచన వచ్చినా దానిపట్ల వారు ఏమాత్రం శ్రద్ధ వహించరు. ఇంకా, అల్లాహ్, మీకు ప్రసాదించిన ఉపాధినుండి కొంత అల్లాహ్ మార్గంలో కూడా ఖర్చుపెట్టండి అని వారికి చెప్పినపుడు, తిరస్కరించేవారు విశ్వసించేవారితో, "అల్లాహ్ తలిస్తే తానే స్వయంగా ఆహారమివ్వగల వారికి మేము ఆహారమివ్వాలా? మీరు పూర్తిగా మార్గం తప్పిపోయారు" అని అంటారు.

48 - 53 వారు "ప్రళయం గురించిన ఈ బెదిరింపు అసలు ఎప్పుడు నెరవేరు తుంది? నీవు సత్యవంతుడవయితే చెప్పు?" అని అడుగుతారు. వాస్తవానికి వారు దేనికొరకు నిరీక్షిస్తున్నారో, అది కేవలం ఒక ప్రేలుడు మాత్రమే. అది వారిని అకస్మాత్తుగా పట్టుకుంటుంది; అప్పుడు వారు (తమ ప్రాపంచిక వ్యవహారాలను గురించి) వివాదపడుతూ ఉంటారు. ఆ సమయంలో వారు మరణ శాసనం సయితమూ వ్రాయలేరు. తమ కుటంబ సభ్యులను కలువటానికి ఇళ్లకు తిరిగి పోనూ లేరు. ఆ తరువాత ఒక శంఖం ఊదబడుతుంది. అప్పుడు వారు హఠాత్తుగా తమ ప్రభువు ముందు హాజరయ్యేందుకు తమ సమాధుల నుండి బయటికి వస్తారు. భయాందోళనలతో వారు "అరే, మనల్ని మన పడకల నుండి లేపి ఎవరు నిలబెట్టారు?" అని అంటారు. "ఇది దయా మయుడైన దేవుడు వాగ్దానం చేసిన విషయమే. దైవప్రవక్తల మాట పూర్తిగా నిజమే" అది భయంకరమైన ఒక ధ్వని మాత్రమే. దానితో అందరూ మా ముందు హాజరు పరచబడతారు.

54 - 64 ఆనాడు ఎవరికీ రవ్వంత అన్యాయమైనా జరగదు. మీరు చేస్తూ ఉండిన కర్మల ప్రకారమే మీకు ప్రతిఫలం ఇవ్వబడుతుంది - ఆనాడు స్వర్గవాసులు సుఖాలు అనుభవించటంలో నిమగ్నులై ఉంటారు. వారూ, వారి సతీమణులతో చల్లని నీడలలో, మెత్తని పరుపులపై దిండ్లకు ఆనుకుని విశ్రాంతి తీసుకుంటూ ఉంటారు. వారు తినటానికి పండ్లు, త్రాగటానికీ రుచికరమైన, వారు కోరుకున్న సకల పానీయాలు, తినుబండారాలు అక్కడ ఉంటాయి. వారు కోరేదల్లా వారి కొరకు సిద్ధంగా ఉంటుంది. కారుణ్య ప్రభువు తరఫు నుండి వారికి సలామ్ (శాంతి వచనం) చెప్పబడుతుంది - అపరాధులారా! ఆనాడు మీరు వేరు అయిపొండి. ఆదమ్ సంతానమా! నేను మీకు ఆదేశించలేదా, సైతానుకు దాస్యం చెయ్యవద్దని, వాడు మీకు బహిరంగ శత్రువని, నా దాస్యమే చెయ్యండి అని, ఇదే సరైన మార్గమని? కాని, ఆ తరువాత కూడా వాడు మీలోని ఒక పెద్ద వర్గాన్ని అపమార్గం పట్టించాడు. మీకు ఆలోచించే తెలివి, బుద్ధిలేకుండా పోయిందా? భయపడండి అని మీకు చెబుతూ ఉండిన నరకం ఇదే. ప్రపంచంలో మీరు పాల్పడిన అవిశ్వాసానికి ఫలితంగా ఇపుడు దీనికి ఇంధనం అయిపొండి.

65 ఈనాడు మేము వారి నోళ్లు మూయిస్తాము. వారు ప్రపంచంలో ఏమేమి సంపాదిస్తూ ఉండేవారో వారి చేతులు మాకు చెబుతాయి, వారి కాళ్లు సాక్ష్య మిస్తాయి.

66 - 68 మేము తలచుకుంటే, వారి కళ్లను కనబడకుండా (గ్రుడ్డివానిగా) చేయగలం, అప్పుడు వారిని దారివైపునకు పరుగిడి చూడమనండి. వారికి దారి ఎలా కనిపిస్తుంది? మేము తలచుకుంటే వారిని వారి స్థానంలోనే కదలకుండా ఉంచగలం. ఇక వారు ముందుకూ నడవలేరు, వెనుకకూ తిరగలేరు. అయితే మేము ఎవరికి దీర్ఘాయువు నొసంగుతామో అతని శారీరక వ్యక్తి స్వరూపాన్నే మార్చివేస్తాము. (ఈ పరిస్థితులను చూసైనా) వారికి బుద్ధి రాదేమిటి?

69 - 70 మేము అతనికి (ఈ ప్రవక్తకు) కవిత్వం నేర్పలేదు, కవిత్వం అతనికి శోభించదు కూడా. ఇది ఒక హితబోధ మాత్రమే, స్పష్టంగా పఠన గ్రంథం (ఖుర్ఆన్) మాత్రమే - అతను బ్రతికి ఉన్న ప్రతి మనిషినీ హెచ్చరించేందుకూ; తిరస్కారులకు వ్యతిరేకంగా అభియోగం స్థాపించబడేందుకు.

71 - 76 మా చేతులతో రూపకల్పన చేసిన ప్రజల సేవకై పశువులను సృజించాము, ఇపుడు వారు వాటికి యజమానులయ్యారు. వారు ఈ విషయాన్ని గమనించరా? మేము వాటిని వారికి ఇలా స్వాధీనపరిచాము - వాటిలో కొన్నిటిపై వారు స్వారీ చేస్తారు, కొన్నిటి మాంసాన్ని తింటారు. వాటిలో వారికి రకరకాల ప్రయోజనాలూ పానీయాలూ ఉన్నాయి. అయినా వారు కృతజ్ఞత చూపరేమిటి? ఇవన్నీ వాస్తవాలైనప్పటికీ వారు అల్లాహ్‌ను కాదని ఇతరులను దేవుళ్ళుగా చేసుకున్నారు. తమకు సహాయం చేయటం జరుగుతుందని వారు ఆశలు పెట్టుకున్నారు. కాని వారు వారికి ఏ సహాయమూ చేయలేరు. అయినా ప్రజలు వారి కొరకు సైన్యం మాదిరిగా సర్వ సన్నద్ధులై ఉన్నారు. సరే కానీ నీవు మాత్రం వారు కల్పిస్తున్న మాటలకు బాధపడకు. వారి రహస్య విషయాలను బహిరంగ విషయాలనూ అన్నింటినీ మేము ఎరుగుదుము.

77 - 83 మేము మానవుడిని వీర్య బిందువుతో సృజించిన విషయం అతను చూడటం లేదా? అయినా అతడు బహిరంగ ప్రత్యర్థిగా తయారయ్యాడు. ఇపుడు అతడు మాకు పోలికలు కల్పిస్తున్నాడు, తన పుట్టుకనే మరిచిపోతున్నాడు. పైగా, శిథిలమై పోయిన ఈ ఎముకలకు తిరిగి ఎవరు జీవం పోస్తారు? అని వాదిస్తున్నాడు. అతడికి ఇలా చెప్పు, "మొదట వాటిని సృష్టించిన వాడే మళ్లీ వాటికి జీవం పోస్తాడు." సృష్టికి సంబంధించిన ప్రతి విషయమూ ఆయనకు తెలుసు. మీకై ఆయనే పచ్చని వృక్షాల నుండి అగ్నిని సృష్టించాడు. మీరు దానితో కుంపట్లు రాజేసుకుంటారు. ఆకాశాలనూ భూమినీ సృష్టించగలిగినవాడు వీరిలాంటి వారిని పుట్టించలేడా? ఎందుకు చేయలేడు, ఆయన మహా నిపుణుడైన సృష్టికర్త అయినప్పుడు? ఆయన ఏదైనా చేయదలచుకున్నప్పుడు, దాన్ని కేవలం "అయిపో" అని మాత్రమే ఆజ్ఞాపిస్తాడు. అంతే అది అయిపోతుంది. ప్రతి విషయా నికి సంబంధించిన సర్వాధికారాలు తన చేతిలో ఇముడ్చుకున ఆయన ఎంతో పరిశుద్ధుడు. ఆయన సన్నిధికే మీరంతా మరలిపోవలసి ఉంది.